


రాజశేఖర చరిత్రము
రూ॥ 180/-
పేజీలు: 190
నవచేతన పబ్లిషింగ్ హౌస్
ప్రతులకు:
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ(నాగోల్),
హైదరాబాద్-68, ఫోన్: 29884454/53
Email ID: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
అబిడ్స్, బండ్లగూడ,
హిమాయత్‌నగర్ (హైదరాబాద్)
హన్మకొండ.



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★★★



చైనాతో అమెరికా వాణిజ్య ఒప్పందం
షియా ఇరాన్ చేతిలో అణ్వస్త్రంపై
పాశ్చాత్య దేశాల ఆందోళన

అత్యంత వైభవంగా పూరీ
జగన్నాథయాత్ర

లోపలి పేజీల్లో



సంపుటి 08, సంచిక: 208 | శనివారం | 28-06-2025 | ఖమ్మం Published from: Khammam, Hyderabad, Karimnagar, Mahabubnagar పేజీలు: 12+8 | వెల రూ. 5.00


# గిగ్ వర్కర్లకు భద్రతా చట్టం




- 'గిగ్, ప్లాట్‌ఫామ్ కార్మికులకు సామాజిక భద్రత, ఉపాధి, పని పరిస్థితుల భద్రత, ఆరోగ్యం, సంక్షేమమే లక్ష్యం
- చట్టం రూపకల్పనలో వేగవంతంగా ప్రభుత్వ చర్యలు

ప్రజాపక్షం/ హైదరాబాద్


"మీకు అన్నం కావాలా..? ఆర్డర్ చేస్తే పది నిమిషాల్లో మీ ఇంటికి వస్తుంది. పిల్లలకు పాలు కావాలా..?. ఆర్డర్ చేస్తే ఐదు నిమిషాల్లో మీ ముందుంటాయి". ఇలాంటి సేవల వెనుక ఎంతో మంది కార్మికుల విలువైన శ్రమ దాగి ఉంది. ఎండనకా.. వాననకా... వాహనాలపై రోడ్ల మీద తిరుగుతూ ఈ సేవలు అందించే స్విగ్గీ, జొమాటో డెలివరీ కార్మికుల (బాయ్స్)కు ఇప్పటి వరకు భద్రత లేదు. తగిన సదుపాయాలు కూడా లేవు. వారి ఆరోగ్యం గురించి పట్టించుకునే నాథుడే లేడు. వారి వల్ల లబ్ధి పొందుతున్న ఫుడ్ తదితర సంస్థలు వారి గురించి పట్టించుకున్న దాఖలాలు కూడా నామమాత్రమే. ఆహార పదార్థాలను ఆర్డర్లపై అందించే స్విగ్గీ, జొమాటో లాంటి పెద్ద సంస్థలు వారి వద్ద డెలివరీ బాయ్స్‌గా పని చేస్తున్న కార్మికులు ప్రమాదాలకు గురైతే వారి కుటుంబాలు రోడ్డు పాలవుతున్నాయి. కోవిడ్19 మహమ్మారి కాలంలో ఆహార పదార్థాలను అందించడంలో గిగ్, ప్లాట్‌ఫామ్ కార్మికులు క్రియాశీలపాత్ర పోషించినా అందుకు వారు తగిన గుర్తింపు కానీ, పరిహారం పొందలేదు. ఒక్కోసారి అత్యవసర పరిస్థితుల్లో రాజకీయ నాయకులకు, ప్రభుత్వ అధికారులకు ఆహారపదార్థాలు అవసరమైతే సరఫరా చేసేది కూడా ఈ ఫుడ్ డెలివరీ కార్మికులే. దేశ వ్యాప్తంగా లక్షల సంఖ్యలో ఉన్న ఈ గిగ్, ప్లాట్‌ఫామ్ వర్కర్ల సమస్యలను దేశంలోని ఒకటి రెండు రాష్ట్రాల ప్రభుత్వాలు తప్ప, కేంద్ర ప్రభుత్వంతో సహా ఏ రాష్ట్రమూ కూడా ఇప్పటి వరకు పెద్దగా పట్టించుకున్న దాఖలాలు లేవు.ఈ నేపథ్యంలో తమ ఉద్యోగ భద్రత, ఆరోగ్యం, హక్కులు, సదుపాయాల కోసం గిగ్ కార్మికులు చేపట్టిన ఆందోళనలు పోరాటాల ఫలితంగా కాంగ్రెస్ పార్టీ వారి సమస్యలపై దృష్టి సారించిన విషయం తెలిసిందే. ముఖ్యంగా కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ ఫుడ్ డెలివరీ కార్మికుల సమస్యలపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి, వారి సమస్యలపై గిగ్ కార్మికులతో చర్చించడంతో పాటు కాంగ్రెస్ ప్రభుత్వాలు అధికారంలో తరువాయి 2లో

### గిగ్ వర్కర్లకు ది బెస్ట్ పాలసీ తీసుకొస్తాం
### మంత్రి వివేక్ వెంకటస్వామి

"గిగ్ కార్మికులు చాలా సమస్యలు ఎదుర్కొంటున్నారు. వారికి హక్కులు కల్పించాల్సిన అవసరం ఉంది. గిగ్ వర్కర్ల క్షేమం కోసం అప్పట్లో రాజస్థాన్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం ఒక చట్టం తెచ్చింది. అదే మాదిరిగా తెలంగాణలో కూడా గిగ్ వర్కర్ల కోసం ఒక బోర్డు ఏర్పాటు చేస్తాం. రాష్ట్రంలో గిగ్ వర్కర్లకు రిజిస్ట్రేషన్ విధానం తీసుకొస్తాం. తెలంగాణలో గిగ్ వర్కర్లకు ది బెస్ట్ పాలసీ తీసుకువస్తాం. తెలంగాణ గిగ్ వర్కర్ పాలసీ' దేశానికే రోల్ మోడల్ అయ్యేలా చూస్తాం. యాజమాన్యాలు, గిగ్ వర్కర్ల నుంచి 66 సూచనలు, సలహాలు వచ్చాయి. వాటిపై ఎలాంటి సాయం చేయాలన్నదానిపై త్వరలో నిర్ణయం తీసుకుంటాం. ఇప్పటికే గిగ్ వర్కర్ల సమస్యలపై సిఎం రేవంత్ రెడ్డి వారితో చర్చించారు. గిగ్ వర్కర్ల పాలసీపై మంత్రివర్గంలో చర్చించి అసెంబ్లీలో చట్టం చేస్తాం. గిగ్ వర్కర్లకు కనీస వేతనం వచ్చేలా కృషి చేస్తాం. తెలంగాణలో ఉన్న 4.5 లక్షల మంది గిగ్ కార్మికులకు కొత్త చట్టం ఎంతో ఉపయోగపడుతుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నాం" అని రాష్ట్ర కార్మిక, ఉపాధి కల్పన శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి శుక్రవారం సచివాలయలో మీడియా సమావేశంలో ప్రకటించారు.

# క్షుణ్ణంగా పరిశీలించాకే...

- ఇంజినీరింగ్ కళాశాలల్లో ఫీజుల పెంపు యోచన
- మెరుగైన వసతులు, బోధన సిబ్బంది, ల్యాబ్‌లు, ఎఐసిటిఇ మార్గదర్శకాల ప్రాతిపదికన పెంచాలన్న భావనలో ప్రభుత్వం
- ఫీజులపై నిర్ణయం తీసుకునేందుకు కమిటీని ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయం




ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఇంజినీరింగ్ కళాశాలల్లో మెరుగైన వసతులు, బోధన సిబ్బంది, ల్యాబ్‌లు, ఏఐసిటిఇ మార్గదర్శకాల ప్రాతిపదికన ఫీజులను నిర్ణయించాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. ఇంజినీరింగ్ కళాశాలల్లో ఫీజుల నిర్ణయం పట్ల హేతుబద్ధమైన నిర్ణయం తీసుకోవాలని యోచిస్తోంది. గత విజిలెన్స్,ఎన్‌ఫోర్స్‌మెంట్ నివేదికను పరిశీలించి, ఇంజినీరింగ్ కళాశాలల్లో అందుతున్న విద్యా ప్రమాణాలను మదింపు చేసి, ఫీజులపై నిర్ణయం తీసుకునేందుకు ఒక కమిటీని నియమించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇంజనీరింగ్ కళాశాలల్లో బోధన సిబ్బంది, బోధన స్థాయి, కళాశాలల్లో ల్యాబ్‌లు, భవనాలు.. ఇతర వసతులు, ఇలా ప్రతి ఒక్క అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించి, అందుకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం ఒక నిర్ణయానికి వచ్చినట్టు సమాచారం. మారుతున్న మార్కెట్ అవసరాలకు తగినట్టుగా కళాశాలలు ప్రభుత్వంతో సంప్రదింపులు జరుపుతూ ప్రణాళికబద్ధంగా ముందుకెళ్లేలా విద్యా వ్యవస్థను రూపకల్పన చేయనుంది. కృత్రిమ మేధ (ఎఐ) వంటి కోర్సులు సాంకేతిక రంగంపై బలమైన ప్రభావం చూపుతున్న నేపథ్యంలో తెలంగాణ రాష్ట్రంలోని ఇంజినీరింగ్ కళాశాలలు ప్రపంచ స్థాయి ప్రమాణాలతో పోటీపడేలా ఉండాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి భావిస్తున్నారు. ఇందులో భాగంగానే రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఇంజినీరింగ్ కళాశాలల్లో మెరుగైన వసతులు, బోధన సిబ్బంది, ల్యాబ్‌లు,ఎఐసిటిఇ మార్గదర్శకాలకు అనుగుణంగా ఉండాలని సిఎం ఆశిస్తున్నారు. ఫీజుల నిర్ణయానికి వీటినే ప్రాతిపదిక తీసుకోవాలని, ఈ విషయమై ఇది వరకే విద్యా నిపుణులతో చర్చించినట్టు తెలుస్తోంది. ఫీజుల నిర్ణయానికి సంబంధించి ఇస్లామిక్ అకాడమీ ఆఫ్ ఎడ్యుకేషన్ వర్సెస్ కర్నాటక, పిఎ ఇనాందార్ అండ్ అదర్స్ వర్సెస్ మహారాష్ట్ర కేసులలో ఆయా కళాశాలల్లోని వసతులు, ల్యాబులను, లెక్చరర్లకు ఆ సంస్థ ఇచ్చే వేతనాలు, బోధన, బోధనేతర సిబ్బంది, కళాశాల భవిష్యత్ ప్రణాళికలు, కళాశాల ప్రమాణాల పెంపునకు తీసుకుంటున్న నిర్ణయాలను ప్రతిపాదిక చేసుకోవాలని సుప్రీంకోర్టు సూచించింది. ఫీజుల నిర్ణయంలో సుప్రీంకోర్టు తీర్పులను పరిగణనలోకి తరువాయి 2లో



## టిజిఇఎపిసెట్ కౌన్సెలింగ్ షెడ్యూల్ విడుదల

నేటి నుంచి జులై 7 వరకు స్లాట్ బుకింగ్‌కు అవకాశం

ప్రజాపక్షం/హైదరాబాద్

టిజిఇఎపిసెట్ కౌన్సెలింగ్‌ను మూడు విడతల్లో నిర్వహించనున్నారు. శనివారం నుంచి జూలై 7వరకు స్లాట్ బుకింగ్‌కు అవకాశం కల్పించారు. జూలై 6 నుంచి 10వ తేదీ వరకు వెబ్ ఆప్షన్లను నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి కార్యాలయంలో విద్యా మండలి చైర్మన్, ప్రొఫెసర్ వి.బాలకిష్టారెడ్డి, సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ ఎ.శ్రీదేవసేన తెలంగాణ ఇఎపిసెట్ కౌన్సెలింగ్ షెడ్యూల్‌ను శుక్రవారం విడుదల చేశారు. జూలై 14, 15 తేదీల్లో తొలి విడత మాక్ సీట్ల కేటాయింపు ప్రక్రియ ఉండగా, 18వ తేదీలోపు మొదటి విడత సీట్లను కేటాయిస్తారు. జూలై 25వ తేదీ నుంచి రెండో విడత కౌన్సెలింగ్ చేపట్టి, 26వ తేదీ నుంచి ధ్రువపత్రాల పరిశీలన, 26, 27 తేదీల్లో వెబ్ ఆప్షన్లకు అవకాశం కల్పిస్తారు. జూలై 30వ తేదీలోపు తరువాయి 2లో



# జూనియర్ డాక్టర్లు సమ్మెబాట


- తమ న్యాయమైన డిమాండ్ల పరిష్కారానికి ఈనెల 30 నుంచి సమ్మె చేస్తామని హెచ్చరిక
- డిఎంఇకి సమ్మె నోటీసు అందజేత

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ వైద్య కళాశాలలో తెలంగాణ జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్ (టిజుడా) సమ్మెబాట పట్టనుంది. తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించడంలో ప్రభుత్వం జాప్యం చేస్తోందని, వెంటనే తమ సమస్యలను పరిష్కరించాలని, లేదంటే ఈ నెల 30వ తేదీ నుంచి సమ్మెకు వెళ్తామని స్పష్టం చేశారు. ఈ మేరకు టిజూడా అధ్యక్షుడు డాక్టర్ జె.ఇసాక్ న్యూటన్, తరువాయి 2లో

## రాజ్యాంగాన్ని ఆర్ఎస్ఎస్ ఎప్పుడూ అంగీకరించలేదు

'సోషలిస్ట్, లౌకిక' పదాలను సమీక్షించాలనడం రాజ్యాంగ ఆత్మపై ఉద్దేశపూర్వక దాడే : కాంగ్రెస్



**న్యూఢిల్లీ :** రాజ్యాంగాన్ని ఆర్ఎస్ఎస్ ఎప్పుడూ అంగీకరించలేదని కాంగ్రెస్ ఆరోపించింది. రాజ్యాంగ ప్రవేశికలో 'సోషలిస్ట్, లౌకిక' అనే పదాలను సమీక్షించాలని పిలుపునివ్వడం బాబాసాహెబ్ అంబేద్కర్ న్యాయమైన, సమ్మిళితమైన, ప్రజాస్వామ్య భారతదేశం కోసం చేసిన దార్శనికతను కూల్చివేయడానికి చాలా కాలంగా జరుగుతున్న కుట్రలో భాగమని మండిపడింది. ఆర్ఎస్ఎస్ సూచన మన రాజ్యాంగ ఆత్మపై ఉద్దేశపూర్వక దాడి అని ప్రతిపక్ష పార్టీ పేర్కొంది. 'సోషలిస్ట్', 'లౌకిక' అనే పదాలను రాజ్యాంగ ప్రవేశికలో సమీక్షించాలని ఆర్ఎస్ఎస్ పిలుపునిచ్చిన మరుసటి రోజున కాంగ్రెస్ తీవ్రంగా మండిపడింది. వాటిని అత్యవసర పరిస్థితి సమయంలో చేర్చారని, బిఆర్ అంబేద్కర్ రూపొందించిన రాజ్యాంగంలో ఎప్పుడూ భాగం కావు అని పేర్కొంది. కాంగ్రెస్ తరువాయి 12లో

# విద్య, వైద్యం నైపుణ్యంతో సమాజంలో మార్పు

- ప్రజల ఆరోగ్యం ప్రభుత్వ బాధ్యత
- రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖమంత్రి దామోదర రాజనర్సింహ
- మంత్రులు పొన్నం , తుమ్మల, కోమటిరెడ్డితో కలిసి హుస్నాబాద్‌లో పలు అభివృద్ధి పనులు ప్రారంభం



ప్రజాపక్షం/ సిద్దిపేట ప్రతినిధి

సమాజంలో మార్పు రావాలంటే విద్య, వైద్యం, నైపుణ్యం ఉండాలని రాష్ట్ర వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. రాష్ట్ర ప్రజల ఆరోగ్యం తన బాధ్యత, ప్రభుత్వబాధ్యత అని అన్నారు. గత 18 నెలల కాలంలో హుస్నాబాద్‌ను మంత్రి పొన్నం ప్రభాకర్ అన్ని రంగాల్లో అభివృద్ధి చేశారని, తెలంగాణ గొంతుకను, తెలంగాణ హక్కును పార్లమెంట్‌లో యావత్ దేశానికి వినిపించిన ఒక గొప్ప ప్రజాప్రతినిధి పొన్నం ప్రభాకర్ అని ప్రశంసించారు. ఒకప్పుడు తాలుకా కేంద్రంగా ఉన్న హుస్నాబాద్‌లో తరువాయి 2లో




కులహింస, మానవాళిపై ప్రత్యక్ష దాడి

ఇందిరమ్మ ఇళ్లకోసం మహిళ ఆత్మహత్యాయత్నం 03


# నాపై, నాకుటుంబంపై వేధింపులు

- రెండువారాల పాటు బెంగళూరులో తలదాచుకున్నా..
- ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్‌కు సాక్ష్యం ఇచ్చిన ఎంపి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి
- గత ప్రభుత్వ హయాంలో తనను, తన కుటుంబాన్ని వేధించారని వాంగ్మూలం
- బిఆర్ఎస్ ప్రభుత్వంపై, కెసిఆర్, కెటిఆర్‌లపై సంచలన ఆరోపణలు



ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణలో సంచలనం రేకెత్తిస్తున్న ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో బాధితుడిగా ఉన్న చేవెళ్ల బిజెపి ఎంపి కొండా విశ్వేశ్వర్ రెడ్డి శుక్రవారం సిట్ అధికారుల ఎదుట హాజరై తన వాంగ్మూలాన్ని ఇచ్చారు. గంటన్నరకు పైగా సాగిన విచారణ అనంతరం ఆయన బయటకు వచ్చి, గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై, ముఖ్యంగా కెసిఆర్, కెటిఆర్‌పై సంచలన ఆరోపణలు చేశారు. కెసిఆర్ పాలనలో తనకు ఎదురైన వేధింపుల కారణంగా, ఉద్యమకారుడినైన తానే భయపడి తరువాయి 2లో




## లా కాలేజీ విద్యార్థినిపై అత్యాచారం

కోల్‌కతాలో మళ్లీ షాకింగ్ ఘటన

**న్యూఢిల్లీ :** పశ్చిమబెంగాల్ రాజధాని కోల్‌కతాలో మళ్లీ షాకింగ్ ఘటన చోటుచేసుకుంది. దక్షిణ కోల్‌కతా కస్బా ఏరియాలోని లా కాలేజీ విద్యార్థినిపై సామూహిక అత్యాచారం జరగడం సంచలనమైంది. దీంతో మరోసారి రాష్ట్రంలోని విద్యా సంస్థలలో విద్యార్థుల భద్రతపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ ఘటనకు సంబంధించి కాలేజీ మాజీ విద్యార్థితో పాటు, ప్రస్తుతం కాలేజీలో చదువుతున్న మరో ఇద్దరు విద్యార్థులను పోలీసులు అరెస్టు చేశారు. ఈనెల 25వ తేదీ రాత్రి 7.30–8.50 గంటల మధ్య కస్బా లా కాలేజీ క్యాంపస్‌లో సామూహిక అత్యాచార ఘటన చోటుచేసుకుంది. దీనిపై బాధిత విద్యార్థిని వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు ముగ్గురు అనుమానితులను కస్టడీలోకి తీసుకున్నారు. ఈ ఘటనపై విచారణను ప్రారంభించిన పోలీసులు మరింత తరువాయి 2లో

# మూడేళ్లలో ఆదాయం రూ.59,884 కోట్లు



- సరుకు రవాణాలో దక్షిణ మధ్య రైల్వే రికార్డు..
- జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్‌జైన్ స్పష్టీకరణ
- అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది సమన్వయమే కారణమని వెల్లడి



ప్రజాపక్షం/హైదరాబాద్

భారతీయ రైల్వేలలో అత్యంత సమర్థవంతమైన జోన్లలో ఒకటిగా దక్షిణ మధ్య రైల్వే నిలిచిందని.. గడిచిన మూడేళ్లలో సరుకు రవాణాలో రూ.59,884 కోట్ల ఆదాయం సాధించామని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్ పేర్కొన్నారు. రైల్వే నిలయంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. దక్షిణ మధ్య రైల్వేలో సరుకు రవాణాలో రికార్డు సాధించడం గర్వంగా ఉందన్నారు. అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది సమన్వయమే ఇందుకు ప్రధాన కారణమని అన్నారు.గడచిన మూడు సంవత్సరాలలో, దక్షిణ మధ్య రైల్వే ఆదాయం, సరుకు రవాణాలో రికార్డు గరిష్టాలను సాధించిందని తెలిపారు. స్థూల మూలాధార ఆదాయం 2022–23లో రూ.18,976 కోట్లకు తరువాయి 12లో



# అమెరికాతో అణు చర్చలు ఇప్పట్లో ఉండవు

స్పష్టం చేసిన ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్

**దుబాయ్ :** అమెరికాతో అణు చర్చలు ఇప్పట్లో ఉండబోవని ఇరాన్ విదేశాంగ శాఖ మంత్రి అబ్బాస్ అరగ్చీ స్పష్టం చేశారు. ఇరాన్‌తో అణు చర్చలు ప్రారంభమవుతాయని అమెరికా ప్రకటించిన నేపథ్యంలో, అబ్బాస్ చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. అగ్రరాజ్యం ఏకపక్షంగా వ్యవహరించి, ఇటీవల దాడులు చేసిన విషయాన్ని ఇరాన అధికారిక టీవీకి ఇచ్చిన ఇంటర్వ్యూలో అబ్బాస్ ప్రస్తావించారు. అణ్వస్త్ర తయారీ ప్రయత్నాలు, యురేనియం సేకరణ వంటి అంశాలపై చర్చలకు అమెరికా వైఖరివల్ల విఘాతం ఏర్పడిందని పేర్కొన్నారు. తపకర జరిగిన నష్టాన్ని దృష్టిలో ఉంచుకొని, అణు కార్యక్రమం పునరుద్ధరణపై నిపుణులు అధ్యయనం చేస్తున్నారని ఆయన చెప్పారు. 'చర్చల పునఃప్రారంభంపై ఎలాంటి అవగాహనకు రాలేదు. చర్చలకు సమయం కూడా ఖరారు కాలేదు. ఈ విషయంలో మేము ఎలాంటి హామీ ఇవ్వలేదు. చర్చల పునరుద్ధరణపై ఇప్పటి వరకూ అసలు మేము మాట్లాడనే లేదు' అని అబ్బాస్ తేల్చి చెప్పారు. అమెరికా జోక్యం కారణంగా పరిస్థితి గందరగోళంగా మారిందని అన్నారు. అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్, రష్యా, చైనా, జర్మనీ, ఇరాన్ మధ్య 2015లో ఉమ్మడి సమగ్ర కార్యాచరణ (జెసిపిఒఎ) ఒప్పందం కుదిరింది. ఈ ఒప్పందం తరువాయి 12లో



# ప్రపంచం
WORLD NEWS

## చర్చించి.. పరిష్కరించుకుందాం..

### అపరిష్కృత సమస్యలపై చైనాకు రాజనాథ్ సూచన



**క్వింగ్‌డావో/ న్యూఢిల్లీ:** ఇరు దేశాల మధ్య చాలాకాలంగా అపరిష్కృతంగా ఉన్న సమస్యలపై చర్చించి, వాటిని పరిష్కరించుకోవాల్సిన అవసరంఉందని చైనాకు భారత రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ సూచించారు. షాంఘై కోపరేషన్ ఆర్గనైజేషన్ (ఎస్‌సిఒ) సమావేశాల కోసం క్వింగ్‌డావో వచ్చిన ఆయన, చైనా రక్షణ మంత్రి డాంగ్ జున్‌తో కాసేపు భేటీ అయ్యారు. ఇరు దేశాల వాస్తవాధీన రేఖ (ఎల్‌ఎసి) వద్ద నెలకొన్న ఉద్రిక్తతలు, 2020లో తూర్పు లఢాఖ్‌లో చోటు చేసుకున్న ఘటనల నేపథ్యంలో వీరి సమావేశం ప్రాధాన్యతను సంతరించుకుంది. ఇద్దరు మంత్రులు అధికారికంగా ప్రకటన చేయలేదు. అయితే, రాజ్‌నాథ్ సింగ్ సోషల్ మీడియా వేదికగా చైనాతో చర్చల అంశాన్ని ప్రస్తావించారు. సరిహద్దు వెంట పలు అంశాలతో ముడిపడిన అభిప్రాయభేదాలను తొలగించుకుంటేనే, అభివృద్ధి సాధ్యమవుతుందని అభిప్రాయపడ్డారు. డాంగ్‌తో జరిపిన సంభాషణలు 'నిర్మాణాత్మకం'గా ఉన్నాయని ఆయన వ్యాఖ్యానించారు.

# చైనాతో అమెరికా వాణిజ్య ఒప్పందం

### భారత్‌తో 'బిగ్ డీల్' ఉంటుందని ప్రకటించిన ట్రంప్



బ్యాంకాక్: చైనాతో ఎంతోకాలంగా కొనసాగుతున్న వాణిజ్య యుద్ధం తీవ్రత కనీసం కొంతవరకైనా తగ్గే సూచనలు కనిపిస్తున్నాయి. చైనాతో వాణిజ్య ఒప్పందం కుదిరిందని బ్లూమ్‌బెర్గ్ టివికి ఇచ్చిన ఇంటర్వ్యూలో అమెరికా వాణిజ్య మంత్రి హోవర్డ్ లుట్నిక్ తెలిపారు. అయితే, వివరాలు వెల్లడించలేదు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సైతం చైనాతో రెండు రోజుల క్రితమే ఒప్పందం జరిగిందని వెల్లడించారు. ఆయన కూడా ఎలాంటి అదనపు సమాచారాన్ని ఇవ్వలేదు. భారత్‌తో త్వరలోనే 'బిగ్ డీల్' ఉంటుందని ట్రంప్ వ్యాఖ్యానించారు. ప్రపంచ దేశాలతో వాణిజ్య ఒప్పందాలు చేసుకుంటున్నట్టు ట్రంప్ ఇది వరకే ప్రకటించిన విషయం తెలిసిందే. చైనాతో కీలక ఒప్పందం కుదిరిందని, భారత్‌తో 'అతిపెద్ద ఒప్పందం' కుదుర్చుకోనున్నామని ట్రంప్ తెలిపారు. తమతో వాణిజ్య ఒప్పందాలు చేసుకోని దేశాలపై ట్రంప్ సర్కారు పన్నుల రూపంలో మోయలేని భారాన్ని మోపుతున్న విషయం తెలిసిందే. ఒప్పందానికి రాకపోతే, 25 శాతం లేదా 35 శాతం లేదా 45 శాతం పన్ను చెల్లించడానికి సిద్ధంగా ఉండాలంటూ ట్రంప్ ఇప్పటికే హెచ్చరికలు జారీ చేశారు. కాగా, చైనాతో కుదిరిన ఒప్పందం వివరాలు వెల్లడి కాలేదు. అయితే, అమెరిఅకు చైనా ఎంతోకాలంగా అరుదైన ఖనిజాలను సరఫరా చేస్తున్నది. గతంలో జనీవాలో కుదిరిన ఒప్పందంలోని అంశాల ఆధారంగానే తాజా వాణిజ్య ఒప్పందం కుదిరిందని అంతర్జాతీయ మీడియాలో వార్తా కథనాలు వస్తున్నాయి. కాగా, చైనా విదేశాంగ మంత్రిత్వ శాఖ శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో అమెరికాతో ఒప్పందం అంశాన్ని ప్రస్తావించింది. అమెరికాకు అవసరమైన కొన్ని ఖనిజాలు లేదా వస్తువులను సరఫరా చేయడానికి సిద్ధంగా ఉన్నట్టు పేర్కొంది. కానీ, శాస్త్రసాంకేతిత రంగాల్లో కీలకమైన కొన్ని ముఖ్య ఖనిజాలపై ఎలాంటి వివరాలు ఇవ్వలేదు. ఇలావుంటే, ట్రంప్‌ను ఈ ఏడాది ఫిబ్రవరిలో భారత ప్రధాని నరేంద్ర మోదీ కలిశారని, ఆ సందర్భంగా పలు వాణిజ్య అంశాలు ప్రస్తావనకు వచ్చాయని జాతీయ మీడియాలో వార్తలు వస్తున్నాయి. రెండు దేశాలు పరస్పర లాభదాయకమైన ఒప్పందాన్ని కుదర్చుకునే దిశగా చర్చలు జరుగుతున్నాయని భారత వాణిజ్య, పరిశ్రమల శాఖా మంత్రి పియూష్ గోయల్ ప్రకటించారు. జరగబోయే ఒప్పందం ఇరు దేశాల వ్యాపార, వాణిజ్య రంగాల్లో విస్పష్టమైన అవగాహనకు, పరస్పర సహకారానికి అనువుగా ఉంటుందని పేర్కొన్నారు.

# చైనా నావికాదళ అధిపతిపై వేటు



బీజింగ్: చైనాలో రక్షణ, భద్రతా వ్యవహారాల వ్యవస్థల్లో అవినీతికి, బాధ్యతారాహిత్యానికి పాల్పడుతున్న వారిని తొలగించే ప్రక్షాళనా కార్యక్రమం కొనసాగుతున్నది. అందులో భాగంగా చైనా నావికాదళ అధిపతితోపాటు, ఒక అగ్రశ్రేణి అణు శాస్త్రవేత్తను కూడా నేషనల్ పీపుల్స్ కాంగ్రెస్ (ఎన్‌పిసి) నుంచి బహిష్కరించారు. పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ నేవీ (పిఎల్‌ఎఎన్/ ప్లాన్) చీఫ్ ఆఫ్ స్టాఫ్ వైస్ అడ్మిరల్ లి హంజున్, చైనా నేషనల్ న్యూక్లియర్ కార్పొరేషన్ డిప్యూటీ చీఫ్ ఇంజనీర్ లియు షిపెంగ్‌లను దేశ శాసనసభ సభ్యత్వం నుండి తొలగించినట్టు హాంకాంగ్‌కు చెందిన సౌత్ చైనా మార్నింగ్ పోస్ట్ నివేదించింది. కాగా, శుక్రవారం ఇక్కడ తన సమావేశాన్ని ముగించిన ఎన్‌పిసి స్టాండింగ్ కమిటీ, అధ్యక్షుడు జి జిన్‌పింగ్ నేతృత్వంలోని చైనా సైన్య హైకమాండ్ అయిన సెంట్రల్ మిలిటరీ కమిషన్ (సిఎంసి) సభ్యత్వం నుంచి టాప్ జనరల్ మియావో హువాను తొలగించాలని ఓటు వేసిందని ప్రభుత్వ నిర్వహణలోని జిన్‌షువా వార్తా సంస్థ తెలిపింది. చైనా సైనిక సోపానక్రమంలో అతి పిన్న వయస్కుడైన జనరల్ మియావో, గత సంవత్సరం నవంబర్ నుండి తీవ్రమైన క్రమశిక్షణ ఉల్లంఘనలకు సంబంధించి విచారణలో ఉన్నారు. ఈ సంవత్సరం ఏప్రిల్‌లో ఆయనను ఎన్‌పిసి నుండి తొలగించారు. మియావో సిఎంసి పొలిటికల్ వర్క్ డిపార్ట్‌మెంట్ డైరెక్టర్‌గా కూడా ఉన్నారు. పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ (పిఎల్‌ఎ)లో కమ్యూనిస్టు పార్టీ భావజాలం, సిబ్బంది మార్పులను నిర్వహించడంలో సిఎంసి కీలక పాత్ర పోషిస్తుంది. చైనా అధ్యక్షుడిగా జిన్‌పిన్ అధికారం చేపట్టిన తర్వాత మియావో కెరీర్ గణనీయంగా అభివృద్ధి చెందింది. చైనా నేవీలో రాజకీయ కమిషనర్ స్థాయికి చేర్చింది. చివరికి పిఎల్‌ఎకు అడ్మిరల్‌గా ఎంపికైన అత్యంత పిన్నవయస్కుడిగా గుర్తింపు సంపాదించారు. మియావోపై వచ్చిన తీవ్ర స్థాయిలో వచ్చిన క్రమశిక్షణ ఉల్లంఘనల ఆరోపణలపై దర్యాప్తు జరుగుతోందని రక్షణ మంత్రిత్వ శాఖ తెలిపింది. 2012 చివరి నాటికి ఆయన అధికారాన్ని చేపట్టినప్పటి నుండి, 72 ఏళ్ల జిన్‌పింగ్ సైన్యంలో భారీ ప్రక్షాళనలు చేపట్టారు. అవినీతి, క్రమశిక్షణా రాహిత్యానికి పాల్పడిన కొంత మంది సీనియర్ జనరల్స్‌ను కూడా పదవి నుంచి తొలగించారు. నేరాలు రుజువు కావడంతో వీరిలో కొందరికి శిక్షలు కూడా పడ్డాయి. సైద్ధాంతిక నియంత్రణను బలోపేతం చేయడానికి, సైనిక సూపర్ పవర్ కావాలనే చైనా లక్ష్యానికి మద్దతు ఇవ్వడానికి పిఎల్‌ఎ అధికారులలో పార్టీ విధేయత యొక్క ప్రాముఖ్యతను జిన్‌పింగ్ పదే పదే చెప్తున్నారు.



లెబనాన్ దక్షిణ ప్రాంతంపై ఇజ్రాయెల్ శుక్రవారం తెల్లవారు జామున వైమానిక దాడులు చేసింది. హిజ్బొల్లా స్థావరాలను లక్ష్యంగా చేసుకొని ఈ దాడులు జరిపినట్టు తెలుస్తున్నది. ఇజ్రాయెల్ అధికార ప్రతినిధిని ఉటంకిస్తూ పిటిఐ కథనం ప్రకారం, హిజ్బొల్లా కీలక ఆయుధాగారాలపై ఇజ్రాయెల్ దాడులు చేసింది. సుమారు 14 నెలలు కొనసాగిన ఇజ్రాయెల్–హిజ్బొల్లా మధ్య యుద్ధానికి గత ఏడాది నవంబర్‌లో తెరపడింది. ఇరువర్గాల మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదిరింది. అయితే, తాజా దాడులతో ఇజ్రాయెల్ ఆ ఒప్పందాన్ని ఉల్లంఘించింది. హిజ్బొల్లా ఆయుధాగారాలు ఉన్నాయని పేర్కొంటూ, వైమానిక దాడులు జరిపింది. కాగా, ఇజ్రాయెల్ చర్యపై హిజ్బొల్లా, లెబనాన్ ఇంకా ఎలాంటి ప్రకటన చేయలేదు.

# కాంగో – రువాండా మధ్య శాంతి ఒప్పందం



డకర్ (సెనెగల్): డెమోక్రాటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగో (డిఆర్‌సి), రువాండా మధ్య శాంతి ఒప్పందం కుదరనుంది. అంతర్జాతీయ మీడియా కథనాల ప్రకారం, ఇప్పటికే ఈ రెండు దేశాలు వివిధ అంశాలను చర్చించుకొని, ఒక అవగాహనకు వచ్చాయి. ఒప్పందంపై సంతకాలు చేయడమే తరువాయి. గత రెండు దశాబ్దాలుగా ఈ రెండు దేశాల మధ్య ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. 1994లో రువాండాలో జరిగిన మారణహోమం తర్వాత లక్షలాది శరణార్థులు కాంగోలోకి ప్రవేశించారు. అప్పటి నుంచి అటు శరణార్థుల సమస్య, ఇటు బండా ప్రాంతాల్లోని తిరుగుబాటు గ్రూపులు వంటి సమస్యలు ఆగ్నేయ కాంగోను అస్థిరపరుస్తున్నది. ఎం23 తిరుగుబాటు గ్రూపు కూడా కాంగో ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యల్లో ఒకటి. దీనికి రువాండా మద్దతునిస్తున్నదనే ఆరోపణలు ఉన్నాయి. తమ భూభాగంలో తిరుగుబాటుదారులకు రువాండా మద్దతు ఇస్తోందని కాంగో ఆరోపిస్తున్నది. కాంగోపై రువాండా కూడా ఇలాంటి ఆరోపణలే చేయడం గమనార్హం. మొత్తం మీద గత కొన్ని దశాబ్దాలుగా లక్షలాది మంది రువాండా నుంచి కాంగోకు లేదా కాంగో నుంచి రువాండాకు చేరుకొని, శరణార్థులుగా ఉన్నారు. 2022–2023 మధ్య కాలంలో ఇరు దేశాల మధ్య ఘర్షణలు తీవ్రతరంకాగా, ఆఫ్రికన్ యూనియన్, ఐక్యరాజ్య సమితి, అమెరికా దౌత్యపర జోక్యంతో పరిస్థితి క్రమంగా మెరుగుపడుతున్నది. కాగా, ఇప్పుడు కుదరనున్న ఒప్పందంలో తక్షణ కాల్పుల విరమణ అంశం కీలకంగా మారింది. అదే విధంగా ఎం23 తిరుగుబాటు గ్రూప్ వెనక్కు వెళ్లాలని, తిరుగుబాటుదారులు ఆక్రమించిన ప్రాంతాలను ఖాళీ చేయాలని కాంగో కోరుతున్నది. కాల్పుల విరమణ ఒప్పందం అమలు పర్యవేక్షణ ఐక్య రాజ్య సమితి పర్యవేక్షణలో జరగాలన్న నిబంధన కూడా ఈ ఒప్పందంలో ఉంటుందని తెలుస్తోంది. శరణార్థులకు స్వదేశంలో రక్షణ కల్పించాలని ఒప్పందంలో పేర్కొన్నారని సమాచారం. తిరుగుబాటుదారులతో కాంగో ప్రభుత్వం చర్చలకు సిద్ధమవ్వాలన్నది కూడా ఒక కీలక అంశం.

## పారిపోయా

(మొదటి పేజీ తరువాయి)

రెండు వారాల పాటు బెంగళూరులో తలదాచుకోవాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. విచారణ సందర్భంగా సిట్ అధికారులు తనకు కొన్ని కీలక ఆధారాలను చూపించారని కొండా విశ్వేశ్వర్ రెడ్డి మీడియాకు తెలిపారు. గతంలో తాను జితేందర్ రెడ్డితో ఫోన్‌లో మాట్లాడిన సంభాషణను అప్పటి అధికారి ప్రణీ త్ రావు రికార్డ్ చేశారని, ఆ ఆడియో క్లిప్‌ను సిట్ అధికారులు తన కు వినిపించారని ఆయన వెల్లడించారు. కొన్ని ఫోన్ కాల్స్‌ను ఉద్దేశపూర్వకగా డిలీట్ చేశారని ఆరోపించారు. కేవలం తమ పదవులను కాపాడుకోవడం కోసమే కేసీఆర్, కేటీఆర్ ఇంత నీచమైన ఫోన్ ట్యాపింగ్ చర్యలకు పాల్పడ్డారని, వారికి చట్టంపైన గానీ, వ్యక్తుల గోప్యతపైన గానీ ఏమాత్రం గౌరవం లేదని ఆయన తీవ్రస్థాయి లో ధ్వజమెత్తారు. గత ఎన్నికల సమయంలో తన పై జరిగిన వేధింపులను కొం డా విశ్వేశ్వర్ రెడ్డి గుర్తుచేసుకున్నారు. 'ఎన్నికల సమయంలో ఎలాంటి సెర్చ్ వారెంట్ లేకుండా పోలీసులు నా ఇంట్లోకి చొరబడి కంప్యూటర్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను తనిఖీ చేశారు. ఎందుకు తనిఖీ చేస్తున్నారని ప్రశ్నించినందుకు, నాపైనే రివర్స్‌లో దాడి చేశానంటూ కేసు బనాయించారు. ఈ ఘటనపై బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేస్తే కేసు నమోదు చేయడానికి నిరాకరించారు. నాపై నాన్‌బెయిల బుల్ కేసులు పెట్టి, ఎన్నికల తర్వాత అరెస్టు చేయాలని కుట్ర పన్నారు' అని ఆయన వివరించారు. అప్పటి డీజీపీనే తనను అరెస్టు చేస్తారని చెప్పడంతో, భయంతో రెండు వా రాల పాటు బెంగళూరులో తలదాచుకోవాల్సి వచ్చిందని కొండా తెలిపారు. 'ఒక తెలంగాణ ఉద్యమకారుడిగా ఉన్న నాకే ఈ పరిస్థితి ఎదురైంది. నా కుటుంబ సభ్యుల ఫోన్లను కూడా ట్యాప్ చేశారు. నన్ను కలవడానికి వస్తున్న నా భా ర్య ఫోన్‌ను సైతం ట్యాప్ చేసి, ఆమెను ఫాలో చేశారు' అని ఆయన ఆరోపించారు. 2018 ఎన్నికల్లో ఓడిపోతామని ముందే గ్రహించిన కేసీఆర్, ఫోన్ ట్యాపింగ్ ద్వారా బెదిరింపులకు పాల్పడి గెలిచారని అన్నారు. ఇక భవిష్యత్తులో కేసీఆర్ మళ్లీ అధికారంలోకి రారని జోస్యం చెప్పారు. ఆంధ్రజ్యోతి దిన ప్రతిక అధిపతి రాధాకృష్ణ నుంచి కూడా సిట్ అధికారులు వాంగ్మూలం సేకరించారు.

## సమ్మెబాట

(మొదటి పేజీ తరువాయి)

ప్రధాన కార్యదర్శి డాక్టర్ డి. అజయ్‌కుమార్‌తో కూడిన ప్రతినిధి బృందం హైదరాబాద్‌లోని డిఎంఇకి శుక్రవారం సమ్మె నోటీసును అందజేశారు. స్టైఫండ్‌ను పెంచి, గ్రీన్ ఛానల్ ద్వారా సమయానికి అందజేయాలని, ప్రభుత్వ వైద్య కళాశాలలో మౌలిక సదుపాయాలను కల్పించాలని, అన్ని ప్రభుత్వ వైద్య కళాశాల మౌలిక సదుపాయాల కల్పన విషయంలో సమీక్ష సమావేశంలో విద్యార్థుల నుంచి ఒక ప్రతినిధి ఉండాలని, కేలండర్ ప్రకారం ఫ్యాకల్టీలను తీసుకోవాలని, ఎస్‌సి, ఎస్‌టి,బిసి, మైనార్టీ వైద్య విద్యార్థులకు స్కాలర్ షిప్, ఫీజురియంబర్స్‌మెంట్ సమయానికి చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై ఇది వరకే జూడా ప్రతినిధులు మంత్రి దామోదర రాజనర్సింహతో చర్చలు జరిపినప్పటికీ ఫలితం లేదని వారు వాపోయారు. మంత్రివర్గ సమావేశంలో తమ సమస్యలను చర్చించి పరిష్కరిస్తామని మంత్రి హామీనిచ్చినప్పటికీ ఎటువంటి స్పందన లేదని, అందుకే తాము సమ్మెబాట పట్టాల్సి వస్తుందని జూడాలు స్పష్టం చేశారు.

## అత్యాచారం

(మొదటి పేజీ తరువాయి)

సమాచారం కోసం కాలేజీ ఆవరణలోని సిసిటివి ఫుటేజ్‌ను పరిశీలిస్తున్నారు. కాలేజీ యాజమాన్యం ఇంతవరకూ ఎలాంటి ప్రకటన చేయకపోవడంతో వివిధ వర్గాల ప్రజల నుంచి అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కాగా, బాధితురాలి ఫిర్యాదుతో జయిబ్ అహ్మద్ (19), మనోజిత్ మిశ్రా (31) అనే ఇద్దరు కాలేజీ వి ద్యార్థులను గురువారం సాయంత్రం అరెస్టు చేశారు. వారిని విచారించిన అనంతరం ఇదే కాలేజీలో చదువుకున్న మాజీ విద్యార్థి ప్రమిత్ ముఖోపాధ్యాయ్ (20) ను పోలీసులు అతని నివాసంలో అరెస్టు చేశారు. నిందితుల నుంచి మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ప్రమిత్ ముఖోపాధ్యాయ్‌ను ఈ కేసులో కీలక నిందితుడిగా చెబుతున్నారు. బాధితురాలిని వైద్య పరీక్షల నిమిత్తం చిత్తరంజన్ మెడికల్ కాలేజీ ఆసుపత్రికి తరలించారు.

### నిందితులకు రిమాండ్

ఈ కేసులో నిందితులను అలిపోర్ అడిషనల్ చీఫ్ జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ ముందు హాజరుపరచగా, వచ్చే మంగళవారం వరకూ వారిని కోర్టు రిమాండ్‌కు పంపింది. నిందితుల్లో ఒకరైన మనోజిత్ మిశ్రా తృణ మూల్ కాంగ్రెస్ నాయకుడని చెబుతున్నారు. ఈ ఘ టనపై బిజెపి తీవ్ర విమర్శలు చేసింది. లా కాలేజీ వి ద్యార్థినిపై సామూహిక అత్యాచారం భయానకమని బిజెపి ఐటి సెల్ హెడ్ అమిత్ మాలవీయ పేర్కొన్నారు.

## భద్రత చట్టం

(మొదటి పేజీ తరువాయి)

ఉన్న రాష్ట్రాలలో గిగ్ వర్కర్లకు ప్రత్యేక చట్టం తీసుకురావాలని ఆదేశించారు. ఈ నేపథ్యంలోనే కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న కర్నాటక, రాజస్థాన్ రా ష్ట్రాలలో ఇటీవల గిగ్, ప్లాట్‌ఫామ్ వర్కర్లకు ప్రత్యేక చట్టాన్ని తీసుకువచ్చా యి. కాగా హైదరాబాద్‌లో జరిగిన 'భారత్ సమ్మిట్'లో గిగ్ వర్కర్ల సమస్యలపై రాహుల్ స్పందిస్తూ గిగ్ వర్కర్లకు న్యాయం చేయాలని తెలంగాణ ప్ర భుత్వానికి సూచించారు. దీంతో కాంగ్రెస్ ప్రభుత్వం కూడా గిగ్ వర్కర్లకు చట్టం తీసుకువచ్చే దిశగా అడుగులు వేసింది. 'గిగ్, ప్లాట్‌ఫామ్ కార్మికులకు సామాజిక భద్రత, ఉపాధి, పని పరిస్థితుల భద్రత, ఆరోగ్యం, సంక్షేమ చర్య లు' లక్ష్యంగా ''తెలంగాణ గిగ్, ప్లాట్‌ఫామ్ వర్కర్స్ (రిజిస్ట్రేషన్, సామాజిక భద్రత, సంక్షేమం) బిల్లు– 2025'' ముసాయిదాను రూపొందించి ప్రజ ల అభిప్రాయం కోసం పబ్లిక్ డోమెయిన్‌లో పెట్టింది. ''తెలంగాణ రాష్ట్రంలో గిగ్, ప్లాట్ ఫామ్ కార్మికులకు సామాజిక భద్రత, ఉపాధి, పని పరిస్థితుల భద్రత, ఆరోగ్యం, సంక్షేమ చర్యలు చేపట్టడం, గిగ్, ప్లాట్‌ఫామ్ వర్కర్ల సం క్షేమ బోర్డును స్థాపించడం, కార్మికుల కోసం సంక్షేమ నిధిని ఏర్పాటు చేయ డం, రాష్ట్రంలో గిగ్, ప్లాట్‌ఫామ్ వర్కర్స్, అగ్రిగేటర్లను నమోదు చేయడం, గిగ్, ప్లాట్‌ఫామ్ కార్మికుల హక్కులను రక్షించడం, అవసరమైతే సామాజిక భద్రత, వృత్తిపరమైన ఆరోగ్యం, భద్రతకు సంబంధించి ఆటోమేటెడ్ పర్యవేక్షణ, నిర్ణయం తీసుకునే వ్యవస్థలలో పారదర్శకత విషయంలో అగ్రిగేటర్ల (సంస్థలు)పై బాధ్యతలను ఉంచడం, వివాద పరిష్కార యంత్రాంగాలను ఏ ర్పాటు చేయడం, తీవ్ర దుర్బలత్వం, అనిశ్చిత పరిస్థితులలో పనిచేస్తున్న గి గ్, ప్లాట్‌ఫ్లామ్ కార్మికులకు తగిన పరిహారం అందించడం'' తదితర అంశాలను ఈ ముసాయిదాలో పొందుపర్చింది. ఈ ముసాయిదాపై గిగ్ వర్కర్లు, వారి సంఘాలు, ఫుడ్ డెలివరీ సంస్థల నుంచి వచ్చిన 66 సూచనలు, సమస్యలపై సంబంధిత అధికారులు, గిగ్‌వర్కర్ల సంఘాలు, ఫుడ్ డెలివరీ సంస్థ ల ప్రతినిధులతో రాష్ట్ర కార్మిక, ఉపాధి కల్పన శాఖ మంత్రి వివేక్ వెంకట్ స్వామి చర్చలు జరిపారు. తద్వారా సమగ్రమైన ''తెలంగాణ గిగ్, ప్లాట్‌ఫా మ్ వర్కర్స్ (రిజిస్ట్రేషన్, సామాజిక భద్రత, సంక్షేమం) బిల్లు– 2025'' రూపొందించే చర్యలను ప్రభుత్వం వేగవంతం చేసింది.

### గిగ్ కార్మికులందరికీ కనీస వేతన హామీ ఇవ్వాలి : టిజిపిడబ్ల్యుయు వ్యవస్థాపక అధ్యక్షులు షేక్ సలాఉద్దీన్

''తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం గిగ్, ప్లాట్‌ఫామ్ వర్కర్లకు కొత్త విధానా న్ని తీసుకురావడాన్ని స్వాగతిస్తున్నాం. అయితే డ్రైవర్లు, డెలివరీ, వర్కర్స్, హోమ్ బేస్డ్ కార్మికులు అధిక శాతం అనిశ్చిత వేతనాలు, భద్రతా సమస్యలు, ఆరోగ్యం తదితర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గిగ్ పాలసీలో వీటన్నింటికీ ప్రభుత్వం పరిష్కారాన్ని చూపాలి. గిగ్ డ్రైవర్లు, డెలివరీ వర్కర్స్, హోమ్ బేస్డ్ గిగ్ కార్మికులందరికీ కనీస వేతన హామీ ఇవ్వాలి. న్యాయబద్ధ గుర్తింపు, ప్రతి కార్మికుడి రిజిస్ట్రేషన్ తప్పనిసరి చేయాలి. ప్లాట్‌ఫామ్ కంపెనీలపై పారదర్శకత కోసం కట్టుదిట్టమైన నిబంధనలు రూపొందించాలి. బోర్డులో ప్రభుత్వ ప్రతినిధులు, కంపెనీల ప్రతినిధులతో పాటు కార్మికుల ప్రతినిధులకు సమాన ప్రాతినిధ్యం కల్పించాలి. కంపెనీలు, ప్రభుత్వ సహకారంతో సంక్షేమ నిధిని ఏర్పాటు చేయాలి. కేవలం విధానాలు రూపొందిస్తే సరిపోదు. వాస్తవమైన హక్కులు, కనీస వేతనాలు, కార్మికుల ప్రాతినిధ్యం ఆచరణలో అమలు చేయాలి'' అని తెలంగాణ గిగ్, ప్లాట్‌ఫామ్ వర్కర్స్ యూనియన్ (టిజిపిడబ్ల్యుయు) వ్యవస్థాపక అధ్యక్షులు షేక్ సలాఉద్దీన్ ''ప్రజాపక్షం''తో చెప్పారు.

## సమాజంలో మార్పు

(మొదటి పేజీ తరువాయి)



50 పడకల ఆసుపత్రి మాత్రమే ఉండేదన్నారు. ఇప్పుడు 250 పడకల ఆసుపత్రి వచ్చిందన్నారు. హుస్నాబాద్‌కు మెడికల్ పిజి కళాశాలను మంజూరు చేస్తున్నట్లు మంత్రి దామోదర రాజనర్సింహ ప్రకటించారు. ప్రతి నియోజక వర్గానికి ఒక నర్సింగ్ కళాశాలను ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పట్టణంలో 150 పడల ఆసుపత్రి శంకుస్థాపన, 50 పడకల మాతా శిశుసంక్షేమ కేంద్రాన్ని, నాలుగు వరుసల రహదారులను శుక్రవారం మంత్రులు దామోదర రాజనర్సింహ, తుమ్మల నాగేశ్వర్ రావు, పొన్నం ప్రభాకర్ , కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ కాంగ్రెస్ సర్కార్ అధికారంలోకి రాగానే 16 నర్సింగ్ కళాశాలలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వచ్చే కొద్ది రోజుల్లో మరిన్ని నర్సింగ్ కళాశాలలు వస్తాయన్నారు.. రాబోయే కాలంలో సమాజంలో సంపూర్ణ మార్పు రావాలంటే మహిళ సాధికారత రావాలన్నారు. సమాజంలో మార్పు రావాలంటే మహిళల్లో మార్పు అవశ్యమన్నారు. విద్యాధికులు రావాలని, మహిళ సాధికారత రావాలని ఆకాంక్షించారు. గత 50 ఏండ్లలో ఆసుపత్రిలో బెడ్ల సంఖ్య పెరగలేదని, ఇప్పుడు అదనంగా మాత శిశుసంక్షేమ ఆసుపత్రితో కలసి 250 పడకలు వచ్చాయన్నారు. శాతవాహన యూనివర్సిటీ 2009న వస్తే 19 ఏండ్ల తర్వాత హుస్నాబాద్ శాతవాహన యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాల వచ్చిందన్నారు. 50 సీట్లతో మెడికల్ పిజి కళాశాలను హుస్నాబాద్‌కు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. కాంగ్రెస్ సర్కార్‌ను ప్రజలు ఆదరించాలని కోరారు.

### రూ.లక్ష కోట్లతో వ్యవసాయ సంక్షేమం : తుమ్మల

రాష్ట్రం ఆర్థిక విధ్వంపం నుండి బయటపడి వికాసం వైపు పయనిస్తుందని, తెలంగాణ ప్రజల ఆకాంక్షలను నేరవేరుస్తామని , తెలంగాణ అభివృద్ధి సంక్షేమంలో ముందుకు దూసుకపోతుందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు అన్నారు. లక్ష కోట్లు వ్యవసాయ సంక్షేమం కోసం వెచ్చించినటు చెప్పారు. 40వేల కోట్లు రైతుల ఖాతాలో జమచేసినట్లు తెలిపారు. రైతుభరోసా, రుణమాఫీ, ఉచిత విద్యుత్ కోసం లక్ష కోట్లు వెచ్చించినట్లు వెల్లడించారు. నెల రోజుల్లో సిద్దిపేట జిల్లాలో ముఖ్యమంత్రి చేత అయిల్ ఫామ్ ఫ్యాక్టరీ ప్రారంభించనున్నట్లు

### సిఎం సహకారంతో హుస్నాబాద్ సమగ్రాభివృద్ధి : పొన్నం

సిఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క, కేబినేట్ మంత్రుల సహకారంతో హుస్నాబాద్‌ను అన్నిరంగాల్లో అభివృద్ధి చేసుకుంటున్నట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. చిరకాలంగా ఎదురుచూస్తున్న పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేస్తున్నట్లు చెప్పారు. శాతవాహన యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాల తరగతులను హుస్నాబాద్‌లో ఈ సంవత్సరం నుండి ప్రారంభం అవుతున్నందుకు సంతోషంగా ఉందన్నారు.రూ. 82 కోట్లతో 150 పడకల ఆసుపత్రి, 77 కోట్లతో రాజీవ్ రహదారి కొత్తపల్లి హుస్నాబాద్ రోడ్డు, రూ.11.50 కోట్లతో నిర్మించిన 50 పడకల మాతా శిశుసంక్షేమ ఆరోగ్య కేంద్రం ప్రారంభించుకున్నట్లు చెప్పారు. గౌరవెళ్లి ప్రాజెక్టు పనులు వేగంగా జరుగుతున్నాయని, తనను గెలిపించిన హుస్నాబాద్ గౌరవాన్ని మరింత పెంచుతానని మంత్రి పొన్నం హామీఇచ్చారు.

### రూ.80 కోట్లతో ఫోర్‌లేన్ జాతీయ రహదారి నిర్మాణం :కోమటిరెడ్డి

రూ.77 కోట్లతో హుస్నాబాద్ నుండి సుందరిగిరి వరకు ఫేజ్ కింద రోడ్డు విస్తరణ పనులను రెండు రోజుల్లో ప్రారంభించనున్నట్లు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి వెల్లడించారు. సుందరిగిరి నుండి కొత్తపల్లి వరకు రూ. 80 కోట్లతో నాలుగు వరుసల రహదారి వారం రోజుల్లో మంజూరు అవుతుందన్నారు. మరో 10 రోజుల్లో పనులు ప్రారంభించేలా చూస్తామన్నారు. సమావేశంలో కలెక్టర్ హైమావతి, అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్, ఎంఎల్‌ఎ కవ్వంపల్లి సత్యనారాయణ. గ్రంథాలయసంస్థ చైర్మన్ లింగమూర్తి, కాంగ్రెస్ నాయకులు తాడూరి శ్రీనివాస్, గుండేటి శ్రీనివాస్,సూర్య వర్మ, మార్కెట్ కమిటీ చైర్మన్ తదిరతులు పాల్గొన్నారు.

### ఆగస్టులో రేవంత్‌రెడ్డితో ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ ప్రారంభం

సిద్దిపేట జిల్లా నంగునూర్ మండలం నర్మెట్టలో రూ. 300 కోట్లతో నిర్మిస్తున్న అయిల్‌పామ్ ఫ్యాక్టరీని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, బిసి సంక్షేమ శాఖమంత్రి పొన్నం ప్రభాకర్, ఆర్‌అండ్‌బి శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ హైమావతిలు శుక్రవారం సాయంత్రం పరిశీలించారు. ఈసందర్భంగా మంత్రులు అయిల్ పామ్ తయారీ విధానం గురించి ఇంజనీరింగ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ ఆగస్టు మొదటివారంలోపు ఆయిల్ పామ్ ఫ్యాక్టరీని ప్రారంభిస్తామన్నారు. రాష్ట్రంలోని 31 జిల్లాల్లో అయిల్ పామ్ సాగుచేయాలన్నారు. కేంద్రం రైతాంగాన్ని నష్టపరిచే పరిస్థితి మంచిది కాదన్నారు. కేంద్రంపై వత్తిడి తెస్తున్నట్లు తెలిపారు. త్వరలోనే దక్షిణ భారత రాష్ట్రాలు అయిల్‌పామ్ పండించే రాష్ట్రాలు కేంద్ర ప్రభుత్వాన్ని కలసి ఇంపోర్టు డ్యూటీ తగ్గించేలా కృషిచేయాలన్నారు. టన్నుకు రూ.25 వేల మద్దతు ఉండాలని మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు అన్నారు. ఈకార్యక్రమంలో అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్, ఇంజనీరింగ్ తదితరులు పాల్గొన్నారు.

## షెడ్యూల్ విడుదల

(మొదటి పేజీ తరువాయి)

రెండో విడత సీట్ల కేటాయింపు చేపట్టనున్నారు. జూలై 31 నుంచి ఆగస్టు 2వ తేదీలోపు విద్యార్థులు రిపోర్టింగ్ చేసేందుకు అవకాశం కల్పించారు. ఇఎపిసెట్ పరీక్షలను ఏప్రిల్ 29, 30వ తేదీల్లో అగ్రికల్చర్, ఫార్మా ప్రవేశ పరీక్షలు పూర్తవ్వగా, మే నెల 2, 3, 4వ తేదీల్లో ఇంజినీరింగ్ ప్రవేశ పరీక్షలను పూర్తి చేశారు. ఫార్మా, అగ్రికల్చర్ విభాగంలో 81,198 మంది విద్యార్థులు పరీక్షల కు హాజరవ్వగా, ఇంజినీరింగ్ విభాగంలో 2.07 లక్షల మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. రాష్ట్రవ్యాప్తంగా 16 ప్రాంతాల్లోని 124 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించారు.

### ఆగస్టు 5 నుంచి మూడోవిడత

ఆగస్టు 5వ తేదీ నుంచి ఇఎపిసెట్ మూడో విడత కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. ఆగస్టు 6న ఇఎపిసెట్ ధృవపత్రాలను పరిశీలిస్తారు. ఆగస్టు 6,7వ తేదీల్లో తుది విడత వెబ్ ఆప్షన్లకు అవకాశం కల్పించారు. ఆగస్టు 10వ తేదీలోపు సీట్ల కేటాయింపు చేపట్టనున్నారు. ఆగస్టు 11వ తేదీ నుంచి 13వ తేదీలోపు విద్యార్థులు రిపోర్టింగ్ చేయాల్సి ఉంటుంది. ఆగస్టు 18, 19వ తేదీల్లో ఇంటర్‌నల్ స్లైడింగ్ ఆప్షన్లకు అవకాశం కల్పించారు. ఆగస్టు 22లోపు ఇఎపిసెట్ ఇంటర్నల్ స్లైడింగ్ సీట్లను కేటాయిస్తారు.

## పరిశీలించాకే...

(మొదటి పేజీ తరువాయి)

తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది.

### గత ప్రభుత్వంలో పక్కన పెట్టిన ఆ 'విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్' నివేదిక

ఇంజినీరింగ్ కళాశాలల్లో వసతులు, బోధన సిబ్బంది,ఇతర వ్యవహారాలపైన గ త ప్రభుత్వం విజిలెన్స్,ఎన్‌ఫోర్స్‌మెంట్ శాఖతో తనిఖీలు చేయించింది. ఆ శాఖ క్షేత్ర స్థాయిలో తనిఖీలు చేసి నివేదికను కూడా రూపొందించింది. కానీ గత ప్రభుత్వం ఆ నివేదికపై ఎటువంటి చర్య తీసుకోలేదు. పైగా తమకు నచ్చిన కళాశాలలకు ఫీజులు పెంచుకునే అవకాశాన్ని కల్పించి, మరి కొన్ని కళాశాలలకు మాత్రం పక్షపాత వైఖరితో మొండి చేయి చూపిందని సాక్షాత్తు అధికార వర్గాలే చెబుతున్నాయి. ఈ నేపథ్యంలో ఇంజినీరింగ్ కళాశాలలో ప్రవేశాలకు సంబంధించిన కౌన్సెలింగ్ ప్రక్రియను నిర్దేశిత సమయంలోనే పూర్తి చేయాలని రాష్ట్ర ప్ర భుత్వం నిర్ణయించింది. అయితే ఇటీవల తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యా మండ లి వైస్‌చైర్మన్ ఇటిక్యాల పురుషోత్తం పలు ఇంజనీరింగ్ కళాశాలలను ఆకస్మీకం గా తనిఖీ చేశారు. పలు కళాశాలల్లో అధ్యాపకుల కొరత, మౌలిక సదుపాయా లు లేకపోవడం, మరో కళాశాలకు తాళం వేసి ఉండడం, విద్యార్థుల హాజరు పట్టిక అందుబాటులో లేకపోవడం లాంటి అనేక డొల్లతనాలు వెలుగులోనికి వ చ్చాయి. దీంతో ఆయన చేసిన పలు సిఫార్సులు కూడా ప్రభుత్వం దృష్టికి వెళ్లినట్టు సమాచారం.



# జనరల్
STATE & REGIONAL NEWS

## 30న ఫార్మసిస్ట్ పోస్టులకు జాబ్ మేళా

ప్రజాపక్షం/హైదరాబాద్: ఉస్మానియా యూనివర్సిటీలోని ఎంప్లాయిమెంట్ బ్యూరో ఆధ్వర్యంలో అపోలో ఫార్మసీ సహకారంతో ఈ నెల 30న ఉదయం 11గంటలకు జాబ్‌మేళా నిర్వహించనుంది. ఉస్మానియా యూనివర్సిటీ, ఆర్ట్స్ కాలేజీ ఎదురుగా ఉన్న ఎంప్లాయిమెంట్ బ్యూరో కార్యాలయంలో ఈ జాబ్ మేళా నిర్వహించనున్నారు. అపోలో ఫార్మసీలోని ఫార్మాసిస్టు, అసిస్టెంట్ ఫార్మసిస్టులకు చెందిన 100పోస్టులను ఈ జాబ్ మేళా ద్వారా భర్తీ చేయనున్నారు. డి ఫారంసీ, బి ఫార్మసీ, ఎం.ఫార్మసీ, డిగ్రీ చేసిన యువతీ యువకులకు (18 నుండి 35సం.ల వయసు వారికి) మాత్రమే ఈ జాబ్ మేళాలో అవకాశం కల్పిస్తున్నట్లు యూనివర్సిటీ ఎంప్లాయిమెంట్ ఇన్ఫర్మేషన్ బ్యూరో ఒక ప్రకటనలో తెలియజేసింది. రూ. 12,000 నుండి రూ.25,000 వేలవరకు వేతనం ఉండే ఈ ఫార్మసిస్ట్ ఉద్యోగాలకు మరిన్ని వివరాలకు టి.రఘుపతి, సెల్ నెంబర్ 8247656356ను సంప్రదించాలని ఆ ప్రకటనలో కోరారు. విద్యార్హతల సర్టిఫికెట్ల జిరాక్స్‌తో ఉస్మానియా యూనివర్సిటీ ఎంప్లాయిమెంట్ బ్యూరోవద్ద హాజరు కావాలని తెలిపారు.

### ఆరోగ్యశ్రీ జాబితాలో ఉన్న ప్రైవేటు ఆస్పత్రులు

## ‘అత్యవసర వైద్యసేవలు’ అందించాల్సిందే!

**ప్రభుత్వ ఆస్పత్రులు ఇక నుంచి ‘ప్రైవేటు ఆస్పత్రులకు’ ఎక్స్ రే సిఫారసు చేయాలి**



ప్రజాపక్షం/హైదరాబాద్: అత్యవసర వైద్య సేవలను ప్రభుత్వ ఆస్పత్రులకు సిఫారసు చేయకుండా ఉచితంగా చికిత్స చేపట్టాలని ప్రైవేటు ఆస్పత్రులకు ప్రభుత్వం స్పష్టం చేసింది. బోనాల ఉత్సవాలను దృష్టిలో పెట్టుకుని హైదరాబాద్‌లోని ఆరోగ్య శ్రీ జాబితాలో ఉన్న అన్ని ప్రైవేటు ఆస్పత్రులు ఇక నుంచి అత్యవసర సేవలను ఉచితంగా అందించాల్సిందేనని ఉత్తర్వులు జారీ అయినట్టు సమాచారం. కొందరు పేషంట్ల ఆరోగ్య పరిస్థితి బాగాలేకపోతే వారిని వెంటనే సమీపంలోని ప్రభుత్వ ఆస్పత్రులకు సిఫారసు చేస్తున్నట్టు ప్రభుత్వం దృష్టికి వచ్చింది. అత్యవసర వైద్య సేవలు అందే సమయంలో పేషంట్లను ఇతర ఆస్పత్రులకు పంపించడం ద్వారా వారి ఆరోగ్య పరిస్థితి మరింత క్షీణిస్తుంది, తద్వారా వారి ప్రాణాలకు ముప్పు ఏర్పడే ప్రమాదం ఉంటుందని ఇది వరకే పలు సందర్భాల్లో వైద్యఅధికారులు తెలిపారు. ప్రస్తుత బోనాల ఉత్సవాలు జరిగే సమయంలో ఎవరైనా అత్యవసర వైద్య సహాయం అవసరమైతే వారు తమ సమీప ప్రైవేటు ఆస్పత్రులకు వస్తే అలాంటి పేషంట్లను ప్రభుత్వ ఆస్పత్రులకు సిఫారసు చేయవద్దని, అలాంటి టిబి పేషంట్లను టిబి ముక్త భారత్ అభియాన్‌లో భాగంగా చికిత్స అందజేయాలని సూచించినట్టు తెలిసిం ది. అయితే ప్రభుత్వ ఆస్పత్రుల సమీపంలోని ప్రైవేటు ఆస్పత్రులు ప్రభుత్వ వైద్యు లు సిఫారసు చేసే వారికి ఉచితంగా ‘ఎక్స్‌రే’ తీయాలని కూడా ఆదేశించినట్టు తెలిసింది. అయితే హైదరాబాద్ జిల్లా కలెక్టర్ హరిచందన్ దాసరి ఆరోగ్యశ్రీ జాబితాలో ఉన్న ప్రైవేటు ఆస్పత్రులకు సర్క్యులర్‌ను జారీ చేసినట్టు తెలిసింది.

బోనాల ఉత్సవాల సందర్భంగా అత్యవసర వైద్య సేవలకు ఎటువంటి అంతరాయం కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, రాజీవ్ ఆరోగ్య శ్రీ హెల్త్ కేర్ ట్రస్ట్‌లో ఎంపానల్ మెంట్ అయిన ఆస్పత్రులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ స్పష్టం చేశారు.

కాగా టిబి ముక్త భారత్ అభియాన్‌లో భాగంగా ప్రభుత్వ వైద్యాధికారులు గుర్తించిన లబ్ధిదారులకు ఉచితంగా ఎక్స్‌రే సేవలు అందించాలని సూచించారు. ఎక్స్‌రే అవసరమున్న పేషెంట్లను ప్రభుత్వ ఆస్పత్రులు తమ సమీపంలోని ఆరోగ్యశ్రీ జాబితాలో ఉన్న ఆస్పత్రులకు సిఫార్సు చేయాలని సూచించారు. ప్రైవేటు. ప్రభుత్వ ఆస్పత్రుల విషయంలో వైద్యాధికారులను సమన్వయకర్తలుగా బాధ్యతలను అప్పగించినట్టు తెలిసింది.

### కృష్ణ, గోదావరి నదీ జలాలలో

## న్యాయం జరిగేంత వరకు పోరాటం

**ఇరిగేషన్ శాఖపై గత పాలకుల నిర్లక్ష్యం వల్ల సంవత్సరానికి రూ.16వేల కోట్ల మిత్తి కడుతున్నాం**

**రాష్ట్ర నీటిపారుదలశాఖ, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి**



ప్రజాపక్షం/నేరేడుచర్ల(పాలకవీడు):కృష్ణా, గోదావరి జలాల పంపకంలో గత పాలకుల అశ్రద్ధ వల్ల తెలంగాణ రైతాంగానికి అన్యాయం జరిగిందని దానిని సరిచేసేందుకు మేము పోరాడుతున్నామని రాష్ట్రనీటిపారుదల శాఖ, పౌరసరఫరాలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పాలకవీడు మండలం జాన్‌పహాడ్ లిఫ్టు ఇరిగేషన్, బెట్టేతండా గ్రామంలో మూసినదిపైన నిర్మిస్తున్న బెట్టేతండా స్కీం పనులను ఎమ్మెల్సీ శంకర్‌నాయక్ తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ గత పాలకులు పదేళ్ల నిర్లక్ష్యం చేయడంతో కృష్ణానదిలో 811 టిఎంసిలలో ఆంధ్రకి 599 టియమ్ సిలు, తెలంగాణకు 299 టియంసిలకు రాత పూర్వకంగా ఒప్పుకున్నారని, కాని మేము వచ్చాక నదీ పరివాహక ప్రాంతం, ఆయకట్టు, జనాభాను పరిగణలోకి తీసుకుని నీటి కేటాయింపులు చేయుటకు పోరాడుతున్నామని అన్నారు. గత కాంగ్రెస్ ప్రభుత్వం తుమ్మిడిహట్టి వద్ద రూ.38వేల కోట్లతో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ప్రాణహిత, చేవేళ్ల ప్రాజెక్టుని ప్రారంభిస్తే కమిషన్‌లకి కక్కుర్తిపడి లక్ష కోట్ల రూపాయలతో కాళేశ్వరం పేరుతో నిర్మిస్తే మూడేళ్లకే కూలిపోయిందని, అదే తుమ్మడిహట్టి వద్ద ప్రాజెక్టు నిర్మిస్తే రూ.62వేల కోట్ల రూపాయలు మిగిలేవని, వాటితో ఎస్ఎల్‌బిసి, డిండి, పాలమూరు, రంగారెడ్డి, బీమా, నెట్టెంపాడు, కోయిలసాగర్, దేవాదుల, సీతరామసాగర్, గౌరెల్లి లాంటి ప్రాజెక్టులు పూర్తయ్యి నేడు తెలంగాణ సస్యశ్యామలం అయ్యేదని, కాని ఇరిగేషన్ శాఖపై వారు చేసిన తప్పిదాల వల్ల నేడు మేము రూ.16వేల కోట్ల రూపాయలు వడ్డీ చెల్లిస్తున్నామని తెలిపారు. పాలమూరు, రంగారెడ్డి రూ.27,500కోట్లు, సీతరామ ప్రాజెక్టు రూ.పదివేల కోట్లు ఖర్చు చేసిన ఒక ఎకరం కొత్త ఆయకట్టులోకి తీసుకొని రాలేదని అన్నారు. కొత్త ప్రభుత్వ ఏర్పాటు చేశాక ముఖ్యమంత్రి నేను నీటిపారుదల శాఖలో జరిగిన తప్పిదాలను ఒక్కొక్కటి సరి చేసుకుంటూ కాళేశ్వరం నీరు ఇవ్వకున్నా తెలంగాణలో ఖరీఫ్, రబీ సీజన్ లలో కలిపి 281 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం పండించి దేశంలోనే తెలంగాణ రాష్ట్రం అగ్రగామిగా నిలిచేందుకు ముందస్తుగా రైతులకు పెట్టుబడి కోసం 9రోజులలో రూ.9వేల కోట్ల రూపాయలు రైతు భరోసా కింద వేయడం జరిగిందని తెలిపారు. జవహర్ జాన్‌పహాడ్ లిఫ్టు ఇరిగేషన్ పనులు యుద్ధ ప్రాతిపదికన వేగవంతంగా, నాణ్యతగా పాటిస్తూ పూర్తి చేయాలని మంత్రి కాంట్రాక్టర్‌ని ఆదేశించారు. పనులు చాల నెమ్మదిగా జరుగుతున్నాయని ఇప్పటికే మూడుసార్లు సందర్శించిన పనులలో పురోగతి లేదని కాంట్రాక్టర్‌పై మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ప్రాంత ప్రజల కోసం జాన్‌పహాడ్ లిఫ్టు ఇరిగేషన్ స్కీంను రూ.302 కోట్ల రూపాయలతో నిర్మించడం జరుగుతుందని అన్నారు. దీని ద్వారా అలింగపురం, రాఘవపురం, బొత్తలపాలెం, కొమటికుంటతండా, మీగడం పాడు, చెరువుతండా, హనుమయగూడెం, పాలకవీడు, సజ్జాపురం, నాగిరెడ్డిపాలెం గ్రామాల్లోని పదివేల ఎకరాలకు సాగునీరు అలాగే జాన్‌పహాడ్ చెరువుకు నీరు అందించడం జరుగుతుందని తెలిపారు. డిజైన్‌లో ఏమైనా మార్పులుంటే సిఇ ద్వారా చేసుకోవాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. లిఫ్ట్ ఇరిగేషన్ పనులు, పైపులైన్ పనులు ఒకేసారి నిర్మించి త్వరగా పనులు చేసి అందుబాటులోకి తీసుకరావాలని సూచించారు. తదుపరి రూ.33.83 కోట్లతో నిర్మించే బెట్టేతండా లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు పనులు పరిశీలించారు. జాన్‌పహాడ్, బెట్టేతండా లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్ పూర్తయితే పాలకవీడు మండల సస్యశామలం, సర్వతోముఖాభివృద్ధి చెందుతుందని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్‌పి కె.నర్సింహా, సిడిఓసిఈ, ఆర్డీవో శ్రీనివాసులు, ఇరిగేషన్ సిఇ రమేష్‌బాబు, ఎస్ఈ శివ ధర్మతేజ, డిఈ నవికాంత్, హరికిషోర్, సతీష్ పాల్గొన్నారు.

## డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్కకు ఉద్యోగ సంఘాల జెఎసి నేతలు కృతజ్ఞతలు



ప్రజాపక్షం/ హైదరాబాద్: ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్ల మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్లుల మొత్తం రూ.180.38 కోట్లు విడుదల చేసిన సందర్భంగా డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్కకు ఉద్యోగ సంఘాల జెఎసి నేతలు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజాభవన్‌లో ఉద్యోగ సంఘాల జెఎసి నేతలు డిప్యూటీ సిఎంను మర్యాదపూర్వకంగా కలిశారు. రోజుల వ్యవధిలోనే డిఎల ఉత్తర్వులు విడుదల చేయడం, మహిళా శిశు సంక్షేమ శాఖ, ప్రణాళిక శాఖలో క్యాడర్ సంఖ్య పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు విడుదల చేయడం, ఉద్యోగులు, పెన్షనర్ల హెల్త్ ఇన్స్యూరెన్స్ పథకం, ప్రమోషన్లకు సంబంధించి వివిధ శాఖల్లో డిపిసి కమిటీలు వేగంగా పనిచేయడం పై ఉద్యోగ సంఘాల జెఎసి నేతలు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జెఎసి చైర్మన్ మారం జగదీశ్వర్, సెక్రటరీ జనరల్ ఏలూరి శ్రీనివాసరావు, వైస్ చైర్మన్ దేవరకొండ సైదులు, నాయకులు చావా రవి, సదానంద గౌడ్, కస్తూరి వెంకట్ లు పాల్గొన్నారు.

## పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫలితాలు విడుదల

హైదరాబాద్ : తెలంగాణలో పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షా ఫలితాలు విడుదలయ్యాయి. బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ ఫలితాలను ఇవాళ విడుదల చేసింది. 38,741మంది విద్యార్థులు సప్లిమెంటరీ పరీక్షలు రాశారు. వీరిలో 73.35శాతంతో 24,415మంది ఉత్తీర్ణత సాధించినట్టు ప్రభుత్వ పరీక్షల సంచాలకులు కృష్ణారావు ప్రకటించారు.

## ఇందిరమ్మ ఇళ్ళకోసం మహిళ ఆత్మహత్యాయత్నం

ప్రజాపక్షం/వైరా: ఇందిరమ్మ ఇళ్లు ఎంపిక ఓ మహిళ ప్రాణాల మీదకు తెచ్చుకొని ఆత్మహత్యా యత్నానికి పాల్పడిన సంఘటన వైరా మున్సిపాలిటీ పరిధిలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే వైరా మున్సిపాలిటీ పరిధిలోని పదో వార్డు గండగలపాడులో కొనకల్ల ఉషారాణి అనే మహిళ తనకి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కావాలని ఓ కాంగ్రేస్ నాయకుడు వద్దకు వెళితే నీకు ఇళ్లు ఇవ్వడం రాదంటూ తనను దూషించాడని మనోవేదనతో కాలం చెల్లిన మందులు టాబ్లెట్స్ మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు గ్రామస్థులు కొనకళ్ల ఉషారాణిని వైరా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యు లు చికిత్స అందించి మెరుగైన వైద్యసేవలకోసం ఖమ్మం ప్రభుత్వం ఆసుపత్రికి తరలించారు.



బాధ్యత మహిళా కనకళ్ల ఉషారాణి తెలిపిన వివరాల ప్రకారం గత కొన్ని సంవత్సరాల నుండి గ్రామంలోనే ఉంటున్నానని తనకు ఉండటానికి ఇళ్లు లేదు. అద్దెకు రేకుల ఇంట్లో ఉంటున్నానని ఈ క్రమంలో ఇందిరమ్మ ఇళ్ల ఎంపిక కార్యక్రమం జరుగుతుంది. గ్రామానికి చెందిన ఓ కాంగ్రేస్ నాయకుని ఇంటికి వెళ్లి తనకు ఇళ్లు కావాలని అడిగానని ఆ నాయకుడు నాపై దూషించి నీకెందుకు ఇళ్లు ఇవ్వాలి, నీకు ఇళ్లు రాదు మాకు నచ్చిన వారికి ఇస్తానని దూషించడంతో మనస్థాపానికి గురై మందులు మింగడం జరిగిందని ఆమె తెలిపింది.

గ్రామంలో 64 మంది ఇందిరమ్మ ఇళ్లు లబ్దిదారులుగా అర్హులుగా ఉన్నట్టు గుర్తించారు. అందులో ఇందిరమ్మ కమిటీ సభ్యులు వారికి నచ్చిన విధంగా 30 మందిని ఎంపిక చేసి అధికారులకు పంపించడం జరిగింది. వాటిలో 20 మందిని అధికారులు ఫైనల్ చేయడం జరిగింది. మహిళ ఆత్మహత్య ఎత్తడానికి ప్రయత్నించిన సంఘటనతో గండగపాడు గ్రామానికి చెందిన ప్రజలు వైరా మున్సిపాలిటీ వద్ద ఆందోళన చేపట్టి నిజమైన అర్హులకు ఇళ్లు ఇవ్వాలని వినతిపత్రం అందించారు.

### కాలుష్య నియంత్రణ మండలిలో..

## అప్పీలేట్ అథారిటీ ఏర్పాటు

ప్రజాపక్షం/హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్రంలో కాలుష్య నివారణ, నియంత్రణకు సంబంధించి ఉత్తర్వులపై అప్పీళ్ల ను విచారించటానికి నూతనంగా అప్పీలేట్ అథారిటీని రాష్ట్ర ప్రభుత్వం ఏర్పా టు చేసింది. నీటి (కాలుష్య నివారణ, నియంత్రణ)చట్టం, 1974, వాయు (కాలుష్య నివారణ, నియంత్రణ) చట్టం, 1981 ప్రకారం, పర్యావరణ అనుమతులు, కాలుష్య నియంత్రణ ఉత్తర్వులపై వచ్చిన అప్పీళ్లను పరిష్కరించేందుకు రాష్ట్ర పర్యావరణ, అటవీ, శాస్త్ర సాంకేతిక శాఖ (ఈఎఫ్ ఎస్,టి) జి.ఓనెంబర్ 48 ద్వారా గత నెల 29వ తేదీన తెలంగాణ కాలుష్య నియంత్రణ అప్పీలేట్ అథారిటీ (టిజి పిసిఎఎ)ను రెండేళ్ల కాలానికి ఏర్పాటు చేసింది. వచ్చేనెల 5వ తేదీ నుండి పూర్తిస్థాయిలో కార్యాకలాపాలు ప్రారంభించింది.


తెలంగాణ కాలుష్య నియంత్రణ మండ లి (టిజిపిసిబి) జారీ చేసిన ఉత్తర్వులపై ఎలాంటి అభ్యంతరాలు ఉన్నాయని భావించినవారు ఈ అప్పీలేట్ అథారిటీని ఆశ్రయించవచ్చు.

**సభ్యులు..**
హైకోర్టు రిటైర్డ్ జడ్జి జస్టిస్ సాంబశివరావు నాయుడు చైర్మన్‌గా, సభ్యులుగా కాకతీయ విశ్వవిద్యాలయం రిటైర్డ్ ప్రొఫెసర్ డాక్టర్ గాడె దయాకర్ వ్యవహరించ నున్నారు.

**టిజి – పిసిఎఎ కార్యాలయం..**
గగన్‌విహార్ భవనం, 1వ అంతస్తు, గాంధీభవన్ ఎదురుగా, నాంపల్లి, హైదరాబాద్.
విచారణలు అధికారం నోటీసు బోర్డుపై ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం నిర్వహించనున్నారు.
**మరింత సమాచారం కోసం:** ఇమెయిల్ :tspcaa540@gmail.com, ఫోన్: 04029300779 టిజి పిసిబి అధికారులు తెలిపారు.

## కులహింస, మానవాళిపై ప్రత్యక్ష దాడి

- ఒడిశా, యుపిల్లో బడుగులపై వివక్షకు సిపిఐ ఖండన
- దోషులపై తక్షణ చర్యల కోసం ఎన్‌హెచ్‌ఆర్‌సికి వినతిపత్రం



న్యూఢిల్లీ: కుల హింస అన్నది రాజ్యాంగంపై, మానవాళిపై ప్రత్యక్ష దాడి అని సిపిఐ పేర్కొంది. బాధితులకు సత్వర న్యాయం, హేయమైన ఘటనలు జరిగిన రాష్ట్రా ప్రభుత్వాల నుంచి జవాబుదారీతనాన్ని డిమాండ్ చేసింది. సామాజిక న్యాయం, సమానత్వం కోసం తమ పోరాటం ఆగబోదని తేల్చిచెప్పింది. ఒడిశా, ఉత్తరప్రదేశ్‌లో బలహీన వర్గాల వారిపై అగ్రకులస్తుల దాడులను అమానవీయంగా వర్ణించింది. వీటిపై తక్షణ చర్యలు కోరుతూ ఎన్‌హెచ్‌ఆర్‌సీ చైర్‌పర్సన్, జస్టిస్ వి.రామసుబ్రమణ్యన్‌కు సిపిఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఆయన వెంట పార్టీ జాతీయ కార్యదర్శి వర్గ సభ్యులు అనీరాజా, రామకృష్ణ పాండా, పల్లబ్‌సేన్ గుప్తా ఉన్నారు. ఒడిశాలోని గంజం జిల్లా, ధారకోటేలో ఇద్ద రు దళితులపై భౌతిక దాడి, బలవంతపు శిరోముండనం, గడి తినిపించడం, మురికి నీరు తాగించడం... ఉత్తరప్రదేశ్, ఇట్టావాలో ఇద్దరు ఒబిసిలకు శిరోముండనం, దాడి, వారిపై అగ్రవర్ణాల వారు మూత్రవిసర్జన చేయడంపై సిపిఐ బృందం ఆవేదన వ్యక్తంచేసింది. అవమానకర చర్యలకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించేలా ఆదేశాలివ్వాల ని కోరింది. వేర్వేరు రాష్ట్రాల్లో వేర్వేరు సామాజిక వర్గాలను ప్రభావితం చేసే హేయమైన నేరాలకు కులాధారిత ఆధిపత్యమే కారణమని పేర్కొంది. అణగారిన వర్గాల రక్షణకు తక్షణమే పటిష్ఠ చర్యలు తీసుకోవాలని విన్నవించింది. జాతీయ నేరా ల నమోదు బ్యూరో (ఎన్సీఆర్‌బీ) గణాంకాలను ప్రస్తావిస్తూ ఒక్క 2022 సంవత్సరంలో నే ఎస్సీలపై 57,571 దురాగతాల కేసులు నమోదైనట్లు రామసుబ్రమణ్యన్ దృష్టికి సిపిఐ నాయకులు తీసుకెళ్లారు. కుల హింస పెరగడం సంస్థాగత వైఫల్యమని నొక్కిచెప్పా రు. రాజ్యాంగం హామీనిచ్చే సమానత్వం, గౌరవ జీవితానికి ఇవి విరుద్ధమన్నారు. పౌర హక్కుల రక్షణ చట్టం1955, ఎస్/ఎస్‌టీ (దురాగతాల నివారణ) చట్టం సక్రమంగా అమలు కాకపోవడం, సంస్థాగత నిర్లక్ష్యం జరుగుతుండటానికి తోడుగా రాజకీయపరమైన మౌనం కూడా కుల హింసను ప్రోత్సహిస్తున్నదన్నారు. బలహీన వర్గాలపై వివక్ష, హేయమైన నేరాలు అరికట్టాలని, దోషులను నిర్దేశిత కాలంలోగా కఠినంగా శిక్షించాలని, ఇందుకోసం రాష్ట్రాల ప్రభుత్వాలకు తగు ఆదేశాలు జారీ చేయాలన్నారు. సిపిఐ నాయకుల విజ్ఞప్తికి ఎన్‌హెచ్‌ఆర్‌సీ చైర్‌పర్స న్ సానుకూలంగా స్పందించారు. తక్షణమే తగు చర్యలను కమిషన్ చేపడుతుందని హామీనిచ్చారు.

## ఫీజు బకాయిలు విడుదల చేయకుండా విద్యార్థుల జీవితాలతో చెలగాటం

**ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి ఆరోపణ**

ప్రజాపక్షం/హైదరాబాద్: ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను సకాలంలో విడుదల చేయకుండా కాంగ్రెస్ రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తూ విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతోందని ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంటరెడ్డి, ప్రధానకార్యదర్శి పుట్ట లక్ష్మ ణ్ ఆరోపించారు. 2022–23, 2023–24,2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించిన బకాయిలు ఉన్న దాదాపు రూ.6 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విద్యా సంవత్సరం పూర్తయినప్పటికీ ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల కాకపోవడంతో విద్యార్థులు సర్టిఫికెట్ల ఇబ్బందులు పడుతున్నారని, అనేక కళాశాలల యాజమాన్యాలు ఫీజులు చెల్లిస్తేనే సర్టిఫికెట్లు ఇస్తామని చెబుతున్నాయని వారు వివరించారు. కొందరు తల్లిదండ్రులు తమ విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని అప్పులు చేసి మరీ ఫీజులను చెల్లిస్తున్న పరిస్థితి నెలకొన్నదని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

సిఎం రేవంత్ రెడ్డి కూడా మాట తప్పుతున్నారని తెలిపారు. పదిరోజుల్లో రాష్ట్ర ప్రభుత్వం ఫీజు బకాయిలను విడుదల చేయకపోతే ఎఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో ఎంఎల్ఎలు, మంత్రుల ఇండ్లు ముట్టడిస్తామని మణికంఠ రెడ్డి, పుట్ట లక్ష్మ ణ్ హెచ్చరించారు.

## బిజెపి పాలకులను మించిపోయిన సిఎం రేవంత్‌రెడ్డి

**ఎఐటియుసి అధ్యక్షుడు ఎస్.బాలరాజ్**

ప్రజాపక్షం/హైదరాబాద్: కేంద్రంలోని నాలు గు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని దేశ వ్యాప్తగా సార్వత్రిక సమ్మెకు సిద్ధపడుతుంటే, తెలంగా ణ, కర్నాటక కాంగ్రెస్ ప్రభుత్వాలు మోదీ ప్రభుత్వానికి అనుకూలంగా వ్యవహరిస్తున్నాయని ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.బాలరాజ్ మండిపడ్డారు. ఉద్యోగ, కార్మికులకు 24 గంటలలో 8 గంటల పని, 8 గంటల విశ్రాంతి, 8 గంటల వినోదాన్ని నేటికి అమలు చేస్తుంటే, తెలంగాణ ముఖ్యమంత్రి, కార్మిక శాఖ మంత్రి బడా పారిశ్రామికవేత్త కావడంతో కార్మికుల పని గంటలను పెంచి బిజెపి పాలకులను మించిపోయారని ఆయన శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సిఎం రేవంత్‌రెడ్డి, కార్మిక శాఖ మంత్రి ఇద్దరూ గతంలో బిజెపితో ఉన్న తమ అనుబంధాన్ని కొనసాగిస్తున్నారన్నారు.

తెలంగాణ రాష్ట్రంలోని అన్ని కేంద్ర కార్మిక సంఘాలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, సంఘటిత అసంఘటితరంగ కార్మికులు జూలై 9న జరుగనున్న దేశ వ్యాపిత సమ్మెలో పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని బాల్‌రాజ్ కోరారు. మే 1,1886 సంవత్సరంలో కార్మికులు 8 గంట ల పనిదినం అమలు చేయాలని చేసిన మహా సమ్మె ప్రదర్శనపై పెట్టుబడిదారుల సైన్యం జరిపిన కాల్పులలో 8 మంది ప్రాణాలు కోల్పోతే, నేటికి ప్రపంచ వ్యాపితంగా మేడే కార్యక్రమం జరుగుతున్నాయని బాల్‌రాజ్ గుర్తుచేశారు. అందుకే ప్రభుత్వాలు తప్పనిసరి పరిస్థితులలో 8 గంటల పనిదినాన్ని ఆనాటి నుండి నేటికీ అమలు చేస్తున్నాయన్నారు. అనేక పోరాటాలతో సాధించుకున్న 44 కార్మి క చట్టాలను కేంద్రంలోని మోదీ ప్రభుత్వం 29 చట్టాలను సమూలంగా సవరించి, 4 కోడ్లు తీసుకురావడాన్ని వ్యతిరేకిస్తూ, భారత కార్మిక వర్గం కేంద్ర ప్రభుత్వంపై అనేక పోరాటాలు చేస్తోందని వివరించారు.

ఇప్పటికే ఉద్యమాలు, సదస్సులు, సభలు, సమావేశాలు నిర్వహించామని, 27సార్లు దేశవ్యాపిత సార్వత్రిక సమ్మెలు నిర్వహించామని బాలరాజ్ వివరించారు. దీంతో కేంద్రప్రభుత్వం లేబర్ కోడ్లను రద్దు చేయకుండా, అమలు చేయకుం డా ఉన్నదని, మరో వైపు కర్నాటక, తెలంగాణ ప్రభుత్వాలు 8 గంటల నుండి 10 గంటల పని దినాన్ని చేసే విధంగా పావులు కదపడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు.

## సాగునీటి రంగాన్ని రాజకీయం చేయవద్దు

**హరీశ్‌రావు**

ప్రజాపక్షం/హైదరాబాద్: తెలంగాణకు ప్రాణాధారమైన సాగునీటి రంగాన్ని సిఎం తన రాజకీయ అజెండాలకు బలి చేయవద్దని, మేడిగడ్డ బ్యారేజీపైన దుష్ప్రచారాన్ని ఆపేసి, ఇకనైనా ప్రాజెక్టుల నిర్వహణపై దృష్టి పెట్టాలని బిఆర్‌ఎస్ మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు సూచించారు. ఉన్న ప్రాజెక్టుల నిర్వహణ లేక, కొత్త ప్రాజెక్టుల ఆలోచన లేక, తెలంగాణ సాగునీటి రంగాన్ని కాంగ్రెస్ సంక్షోభంలోకి నెడుతున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. సిఎం రేవంత్ రెడ్డి ఇప్పటికైనా కళ్ళు తెరవాలని ఆయన శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యంతో రాష్ట్రంలో సాగు నీటి ప్రాజెక్టుల భవితవ్యం ప్రశ్నార్థకంగా మారిందన్నారు. ప్రతిపాదిత ప్రాజెక్టుల నిర్మాణ పనులు ముందుకు పోక, ఉన్న ప్రాజెక్టుల నిర్వహణ లేక, కొత్త ప్రాజెక్టుల ఆలోచన రాక, తెలంగాణ సాగు నీటిరంగం సంక్షోభంలోకి వెళ్తున్నదని ఆరోపించారు. ఏడాదిన్నర పాలనలో జరిగిన ప్రాజెక్టుల ప్రమాదాలు, కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి నిదర్శనమని చెప్పారు.

మేడిగడ్డ కుంగిన వెంటనే ఎన్‌డిఎస్ఎకు లేఖరాసిన కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, కాంగ్రెస్ హయాంలో జరుగుతున్న ప్రాజెక్టుల ప్రమాదాలు ఎందుకు కనిపించడం లేదని హరీశ్‌రావు ప్రశ్నించారు. మేడ్చల్ జిల్లా దుండిగల్ పరిధిలో జరిగిన హృదయవిదారకమైన రోడ్డు ప్రమాద ఘటన తనను తీవ్రంగా కలిచివేసిందని హరీశ్‌రావు అన్నారు. ఐదేళ్ల బాలుడు టిప్పర్ చక్రాల కింద దుర్మరణం చెందడం దారుణమన్నారు. బాబు కుటుం బ సభ్యులకు హరీశ్‌రావు తన ప్రగాఢ సానుభూతిని తెలియ జేశారు. భారీ వాహనాలను పరిమిత సమయంలోనే హైదరాబాద్ నగరంలోకి అనుమతించాలన్న నిబంధనలను కట్టుదిట్టంగా అమలు చేయాలని హరీశ్‌రావు కోరారు.


**గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్**
ఇఇ, డివిజన్-29, సికింద్రాబాద్, జిహెచ్‌ఎంసి.
NIT No. 15/EE-Div-29/SBZ/GHMC/2025-26 ‘ఇ’ ప్రొక్యూర్‌మెంట్ షార్ట్ టెండర్ ప్రకటన తేది: 26.06.2025
**పని పేరు:** (1) జిహెచ్‌ఎంసి, ఎస్‌బిజెడ్, సికింద్రాబాద్, డివిజన్ 29 లోని అన్ని వార్డులలో జూలై 2025 నుండి అక్టోబర్ 2025 వరకు సిసి రోడ్ల నిర్వహణ తుఫాను నీటి కాలువలు (క్యాచ్పిట్ మరమ్మతులు) **- 5 పనులు, అంచనా విలువ / ఇసివి:** రూ.41.50లక్షలు, **బిడ్స్ స్వీకరణకు ప్రారంభ తేది / ఆఖరి తేది & సమయం:** 27.06.2025న సా.04.00గం.ల నుండి 01.07.2025న ఉ.10.30గం.ల వరకు, **అధికారి పేరు & చిరునామా:** ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, డివిజన్-29, జిహెచ్‌ఎంసి, సికింద్రాబాద్. ఫోన్ నెం. 7995468066. మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ అనగా https://www.tender.eprocurement.gov.in లో చూడవచ్చు.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, డివిజన్-29, సికింద్రాబాద్, జిహెచ్‌ఎంసి.
DIPR R.O. No. : 4247-PP/CL/ADVT/1/2025-26, Date: 27-06-2025

**కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాయలం**
ఇ-మెయిల్: knrcmnr@rediffmail.com
No. E1/DB/MCK/8201/219/MCK/2025-26 ‘ఇ’ ప్రొక్యూర్‌మెంట్ టెండర్ ప్రకటన తేది: 27.06.2025
**కరీంనగర్ టౌన్‌లో వివిధ ప్రదేశాలలో 06 నెం.ల పనులకు అభివృద్ధి మరియు నిర్వహణ. అంచనా విలువ: వివిధ గ్రాంట్ల కింద రూ.122.50 లక్షలు,** బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడింగ్ ప్రారంభ తేది: 28.06.2025న సా.04.00గం.లకు, బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడింగ్ ఆఖరి తేది: 07.07.2025న సా.04.00గం.ల వరకు, మరిన్ని వివరాలకు వెబ్‌సైట్ www.tender.telangana.gov.inలో చూడవచ్చు.
సం/- కమిషనర్, కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్.
DIPR R.O. No. : 4257-PP/CL/ADVT/1/2025-26, Date: 27-06-2025

**గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్**
జెడ్‌సిటిఓ, చార్మినార్ జోన్.
NIT No. 07/ZCTO/CRZ/GHMC/2025-26 ‘ఇ’ ప్రొక్యూర్‌మెంట్ టెండర్ ప్రకటన తేది: 27.06.2025
**పని రకం:** మొహర్రం మరియు బోనాలు పండుగ - 2025 లను దృష్టిలో ఉంచుకుని 120 మైక్రాన్లు, 35L x 45W LLDPE బ్లాక్ పాలిథిన్ కవర్ల సేకరణ, నీటి ట్యాంకర్‌ను నిమగ్నం చేయడం మరియు పోర్టబుల్ మొబైల్ టాయిలెట్లను నిమగ్నం చేయడం. **అంచనా విలువ:** రూ.20.00లక్షలు, **బిడ్స్ స్వీకరణకు ప్రారంభ తేది / ఆఖరి తేది & సమయం: డౌన్‌లోడ్ ప్రారంభ తేది:** 28.06.2025న ఉ.11.00గం.ల నుండి, **బిడ్స్ స్వీకరణకు ఆఖరి తేది:** 01.07.2025న ఉ.11.00గం.ల వరకు, **అధికారి పేరు & చిరునామా:** జెడ్‌సిటిఓ, సిఆర్‌జెడ్, జిహెచ్‌ఎంసి, హైదరాబాద్. ఫోన్ నెం. 9849906768. మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ అనగా www.tender.telangana.gov.in లో చూడవచ్చు.
**గమనిక:** టెండర్ నోటీసు తేదీ తర్వాత 1% ఇఎండి పొందాలి.
సం/- జెడ్‌సిటిఓ, సిఆర్‌జెడ్, జిహెచ్‌ఎంసి.
DIPR R.O. No. : 4275-PP/CL/ADVT/1/2025-26, Date: 27-06-2025

ప్రజాపక్షం
శనివారం, 28 జూన్

# నాటో ఇప్పుడు గ్లోబల్ అలయెన్స్

జూన్ 24, 25 తేదీల్లో హేగ్ (నెదర్లాండ్స్)లో జరిగిన నాటో (ఉత్తర అట్లాంటిక్ కూటమి) అగ్రనాయక సమావేశం అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఆదేశాలకు లొంగుబాటు ప్రదర్శించింది. జనవరిలో ట్రంప్ అధికారంలోకి వచ్చిన రోజు నుండీ ట్రంప్–యూరప్ దేశాల మధ్య కనిపించిన ఉద్రిక్తతలు చల్లబడిపోయాయి. యూరప్ అమెరికాపై ఆధారపడి బతుకుతోందని నిందించిన ట్రంప్ ఆ మిత్ర దేశాల నుంచి అమెరికన్ దిగుమతులపై సుంకాలను భారీగా పెంచుతున్నట్లు ప్రకటించి వాటిని కృంగదీశాడు. యూరప్ రక్షణకు ఉద్దేశించిన నాటో కూటమి రక్షణ వ్యయానికి తమ వాటాను తగ్గిస్తామని హెచ్చరించాడు. వచ్చే ఐదేళ్లలో యూరప్ దేశాలు తమ రక్షణ వ్యయాన్ని తమ జిడిపిలో 5 శాతానికి పెంచాలని, లేకపోతే వాటి రక్షణను అవే చూచుకోవాలని దబాయించాడు. ఒకపక్క హెచ్చు సుంకాలతో వ్యాపార నష్టం, రెండోవైపున రక్షణ వ్యయం పెంపుదల యూరప్ దేశాలను ఉక్కిరిబిక్కిరి చేశాయి. బీరాలు పలికిన బ్రిటన్ ప్రధాని స్టార్మర్ అందరికన్నా ముందుగా చల్లబడి అమెరికాతో కొత్త వాణిజ్య ఒప్పందానికి సిద్ధమైనాడు. తర్వాత పెద్ద ఆర్థిక వ్యవస్థలైన జర్మనీ, ఫ్రాన్స్ వృద్ధిరేటు మందగించి సంక్షోభం అంచున ఉన్నప్పటికీ ట్రంప్ ఒత్తిడికి లొంగక తప్పలేదు. రక్షణ వ్యయాన్ని 2035 నాటికి జిడిపిలో 5 శాతానికి పెంచటానికి నాటో హేగ్ శిఖరాగ్ర సభ ఆమోదం తెలియజేసింది. స్లొవేకియా, స్పెయిన్ అన్యమనస్కంగా సంతకం చేశాయి. ఈ ఒప్పందం ప్రకారం వచ్చే దశాబ్దకాలంలో సైనికీకరణపై నాటో 3 ట్రిలియన్ డాలర్లు వెచ్చిస్తుంది. అంటే వాటి రక్షణ వ్యయం ఇప్పటికన్నా రెట్టింపు అవుతుంది. ఈ వనరుల సమీకరణ కోసం అవి పెన్షన్లు, ఆరోగ్య సంరక్షణ, విద్య, సామాజిక సేవలు, మౌలిక వసతులపై ఖర్చులో కోత విధిస్తాయి. ప్రపంచ యుద్ధానంతర యూరప్ చరిత్రలో సామాజిక కార్యక్రమాల్లో తీవ్రమైన కోతల విధింపునకు ఇది దారి తీస్తుంది. ఈ భారం సామాన్యులపైనే ఎక్కువగా పడుతుంది. ప్రజాస్వామ్యం, సంక్షేమం లక్ష్యాలకు తీవ్ర విఘాతం కలుగుతుంది

ఇంత భారీగా రక్షణ వ్యయం 'ఆత్మ రక్షణ' కోసం అని సమర్థించుకోవడం సాధ్యం కాదు. అమెరికా దురాక్రమణపూరిత ప్రపంచ ఆకాంక్షలకు తోడ్పాటునివ్వటమే అవుతుంది. యూరప్ రాజ్యాలు ఇప్పటికే ఉక్రేన్–రష్యా యుద్ధంలో ఉక్రేన్‌కు సంపూర్ణ సైనిక మద్దతు ఇస్తున్నాయి. ఆయుధాలు, డబ్బు కుమ్మరిస్తున్నాయి. కాగా అరుదైన భూగర్భ ఖనిజాలను ట్రంప్ కొట్టుకెళుతున్నాడు. మధ్య ప్రాచ్యం వచ్చేసరికి ఇజ్రాయెల్ దురహంకార గాజా యుద్ధాన్ని, ఇరాన్‌పై బరితెగించిన బాంబుదాడులను అమెరికాతో పాటు సమర్థిస్తున్నాయి. నాలుగేళ్ల క్రితం వరకు ఆఫ్ఘనిస్తాన్‌లో మిత్ర రాజ్యాల పేరుతో అమెరికాకు తోడుగా సైన్యాన్ని దించాయి. ఆచరణలో తేలేదేమంతో అంతర్జాతీయ వ్యవహారాల్లో–సైనిక జోక్యాలు సహా– అమెరికాను అనుసరించడం మినహా యూరప్ దేశాలకు గత్యంతరం లేదు. అటువంటప్పుడు 'ఆత్మరక్షణ' అంటూ తమ ప్రజల్ని నమ్మించాలంటే ఏదోక బూచి కావాలి. ఒకప్పుడు 'కమ్యూనిజం' బూచి. ఇప్పుడేమో రష్యా దురాక్రమణ యుద్ధ బూచి.

అసలు నాటో అవసరం ఉందా? సోవియట్ యూనియన్ సమఉజ్జీగా ఆవిర్భవించిన కాలంలో 'సోవియట్ భూతాన్ని' ఎదుర్కోవడానికి 'ఆత్మరక్షణ' పేరుతో దురాక్రమణ పూరిత నాటో కూటమిని అమెరికా ఏర్పాటు చేసింది. రెండవ ప్రపంచ యుద్ధంలో ఆర్థిక వ్యవస్థలు కుప్పకూలిన స్థితిలో తమ రక్షణను నాటో ద్వారా అమెరికాకు అప్పగించిన యూరప్ ఆర్థిక పునర్నిర్మాణంపై దృష్టి పెట్టాయి. కాల గతి మారింది. సోవియట్ యూనియన్ దాంతోపాటు వార్సా సంధి కూటమి కూలిపోయిన అనంతరం ఇక నాటో ఎందుకు? నాలుగు దశాబ్దాల నుంచి ఏ కమ్యూనిస్టు భూతం ఎదురు లేదు. అయితే ప్రపంచంపై అమెరికా ఆధిపత్య సాధనకు పావుగా నాటో ఉపయోగపడుతున్నది. కానీ అభివృద్ధి చెందుతున్న దేశాలు ప్రత్యామ్నాయ వేదికల నిర్మాణంతో ప్రపంచ జిడిపిలో ఆధిక్య స్థానంలోకి చేరుకున్నాయి. అమెరికా, యూరప్ బెదిరింపులకు లొంగిపోయే కాలం అంతరించింది. అందువల్ల నాటో కూటమి రద్దు నేటి ప్రపంచ పరిస్థితులకు అనుగుణం. అమెరికా, యూరప్ దురాక్రమణ, ఆధిక్య ఆకాంక్షలు ఇకపై చెల్లుబాటు కావు. సుంకాల పెంపుతో ప్రపంచ ఆర్థిక వ్యవస్థను కల్లోలపరిచిన ట్రంప్ నేల మీదికి దిగిరావడంలో ఇదే స్పష్టమవుతున్నది.

అయితే హేగ్ సమావేశానికి ఉక్రేన్ అధ్యక్షుడినేగాక ఆస్ట్రేలియా ప్రధాని అంటోనీ ఆల్బనీస్, జపాన్ ప్రధాని షిగెరు ఇషిబా, న్యూజిలాండ్ ప్రధాని క్రిస్టఫర్ లుక్సోన్, దక్షిణ కొరియా ప్రధాని లీజె మయూంగును ఆహ్వానించటం ద్వారా నాటో ఉత్తర అట్లాంటిక్ నుంచి విశ్వవ్యాప్త కూటమి అయింది. ఇది ప్రపంచ శాంతికి, అభివృద్ధికి అత్యంత ప్రమాదకరం.

# షియా ఇరాన్ చేతిలో అణ్వస్త్రంపై పాశ్చాత్య దేశాల ఆందోళన

**నంటూ బెనర్జీ**

ఇజ్రాయెల్, యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికా మాత్రమే ఇరాన్ అణ్వస్త్ర దేశంగా మారడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయని నమ్మడం బహుశా తప్పు కావచ్చు. అణు వ్యాప్తి, అణు స్మగ్లింగ్, అవి తప్పుడు చేతుల్లోకి వెళ్లడం గురించి ప్రపంచం మొత్తం ఆందోళన చెందుతోంది. ఇరాన్ పాలన స్వభావం ఈ ఆందోళనకు మరింత ఆజ్యం పోసింది. ప్రపంచంలో ఒక ఆధ్యాత్మిక నాయకుడి ప్రత్యక్ష నియంత్రణలో నడుస్తున్న ఏకైక ప్రధాన దేశం బహుశా ఇదే కావొచ్చు. ఇది చాలా మంది ఆందోళనలకు కారణం కావొచ్చు. పోప్ ఆధ్వర్యంలోని వాటికన్ సిటీ స్టేట్ ఆఫ్ రోమ్, దాని రక్షణ దళంగా స్విస్ గార్డ్ అనే చిన్నపాటి లాంఛనప్రాయ విభాగాన్ని మాత్రమే కలిగి ఉంది. ఇది పోప్ వ్యక్తిగత అంగరక్షక దళంగా కూడా పనిచేస్తుంది. పోప్ సాధారణంగా ప్రేమ, కరుణ, ప్రపంచ శాంతిని బోధిస్తారు.

> **ఇరాన్‌ను షియా మత గురువు, అయతొల్లా అలీ ఖమేనీ పాలిస్తున్నారు. షియా ఆధిపత్యాన్ని ఆయన సమర్థిస్తున్నారు. సున్నీ ఇస్లామిక్ వర్గానికి చెందిన పాకిస్తాన్ అణ్వాయుధ దేశంగా మారినప్పటి నుండి షియా ఇరాన్ అణ్వాయుధాలను నిర్మించాలని ఆకాంక్షిస్తున్నట్లు భావిస్తున్నారు. ఇరాన్ ఒక బలమైన మతపరమైన షియా వ్యవస్థను కలిగిన ఇస్లామిక్ గణతంత్రం. అది ప్రపంచ వ్యాప్తంగా షియా దేశాలు, షియాలపై గొప్ప ప్రభావాన్ని చూపుతుంది. దీనికి విరుద్ధంగా, సున్నీ ఇస్లామిక్ ఆలోచన, న్యాయశాస్త్రంలో అత్యున్నత అధికారంగా పరిగణించబడే అల్–అజార్ ప్రస్తుత గ్రాండ్ ఇమామ్ అహ్మద్ ఎల్–తాయెబ్ రాజకీయ వ్యక్తిగా ప్రసిద్ధి చెందలేదు.**

ముస్లిం ప్రపంచంలోని 57 దేశాలలో (ఆర్గనైజేషన్ ఆఫ్ ఇస్లామిక్ కో ఆపరేషన్ సభ్యులు) షియా జనాభా మెజారిటీగా ఉన్నవి కేవలం మూడు దేశాలు మాత్రమే. అయినప్పటికీ, ఎక్కువగా ప్రత్యర్థి సున్నీ వర్గం నాయకత్వంలోని అనేక ఇతర ముస్లిం దేశాలలో ఈ వర్గానికి గణనీయమైన ఉనికి ఉంది. షియా– సున్నీ వైరం ఇరాన్ అణ్వాయుధ దేశంగా ఆవిర్భవించాలనే ఆశయాన్ని ఒక ప్రధాన భౌగోళిక రాజకీయ ఆందోళనగా మారుస్తుంది. ముఖ్యంగా పశ్చిమ, మధ్య ఆసియాలో, అలాగే దక్షిణాసియా, ఆగ్నేయాసియాలో, గణనీయమైన ముస్లిం జనాభా ఉన్న యూరోపియన్ దేశాలలో ఈ ఆందోళన ఉంది. మూడు షియా మెజారిటీ దేశాలు: ఇరాన్, ఇరాక్, అజర్‌బైజాన్. గణనీయమైన షియా సమూహాలు నివసిస్తున్న దేశాలు: బహ్రెయిన్, లెబనాన్, కువైట్, టర్కీ, యెమెన్, సౌదీ అరేబియా, ఆఫ్ఘనిస్తాన్ , భారత ఉపఖండం.

సున్నీ సమూహం నేతృత్వంలోని పాకిస్తాన్ అణు పాటవం పాశ్చాత్య ప్రజాస్వామ్య దేశాలకు, అలాగే భారతదేశానికి ఎల్లప్పుడూ ఒక ప్రధాన ఆందోళనగా ఉంది. 'పాకిస్తాన్ అణు బాంబు పితామహుడు' దివంగత అబ్దుల్ ఖదీర్ ఖాన్, అణు సాంకేతిక పరిజ్ఞానం స్మగ్లింగ్‌లో ప్రసిద్ధి చెందారు. తాను అణు విస్తరణ నెట్‌వర్క్‌ను నడుపుతున్నట్లుగా ఆయన అధికారికంగా అంగీకరించారు. ఇరాన్, లిబియా, ఉత్తర కొరియాకు అణు సాంకేతిక పరిజ్ఞానాన్ని విక్రయించినట్లు అంగీకరించిన తర్వాత ఆయనను మొదట 2004లో గృహ నిర్బంధంలో ఉంచారు. ఆ తర్వాత 2009లో ఎ.క్యు.ఖాన్ విడుదలయ్యారు. ఇరాన్ అణ్వాయుధాలు, సాంకేతిక



పరిజ్ఞానాన్ని ఇతర దేశాలతో లేదా ఉగ్రవాద సమూహాలతో సహా ప్రభుత్వేతర సంస్థలతో పంచుకోవచ్చని ఇప్పటికే ఉన్న అణ్వాయుధ దేశాలు చాలా వరకు భయపడుతున్నాయి. ఇది విస్తృతంగా అణుశక్తి వ్యాప్తికి దారితీస్తుంది.

షియా అత్యున్నత ఆధ్యాత్మిక నాయకుడి నేతృత్వంలో ఇరాన్ ప్రభుత్వ స్వభావం, ఒక ప్రధాన అణుశక్తి ఆవిర్భవించాలనే దాని ఆశ రాజ్యాంగా, ఇస్లామేతర దేశాలకు ప్రధానంగా ఆందోళన కలిగిస్తుంది. ఇజ్రాయెల్ 'నిర్మూలన' అనేది ఇరాన్ అత్యున్నత మత గురువుల ప్రాథమిక ఎజెండా అని చెప్పబడుతున్నందున, చిన్న యూదు దేశమైన ఇజ్రాయెల్ తీవ్ర ఆందోళనలో ఉంది. ఇరాన్ విధ్వంసకర ఆయుధాలైన దీర్ఘశ్రేణి క్షిపణులు, డ్రోన్లు ఒక ఆధ్యాత్మిక మత గురువు చేతిలో ఉన్నందున పాశ్చాత్య ప్రపంచం ఆందోళన చెందుతోంది. పశ్చిమ ఆసియాలో ఇరాన్ అతిపెద్ద, అత్యంత వైవిధ్యమైన బాలిస్టిక్ క్షిపణి నిల్వను కలిగి ఉందని నమ్ముతారు. ఇరాన్ తన సైనిక దాడుల సామర్థ్యాలను ప్రదర్శిస్తోంది. దేశ ఆధ్యాత్మిక అధిపతి, సర్వోన్నత నేత 'నరక ద్వారాలను' తెరవడానికి ప్రతినబూనారు. గత వారం ఎక్కువ భాగం ఇరాన్ క్షిపణులు, డ్రోన్ల దాడులు చిన్న యూదు దేశమైన ఇజ్రాయెల్ ఆకాశాన్ని ప్రకాశవంతం చేశా యి. ఇది ఇరాన్ భౌగోళిక పరిమాణంలో కేవలం 1.33 శాతం మాత్రమే. ఇరాన్ జనాభా 8.7 కోట్లు కాగా ఇజ్రాయెల్ మొత్తం జనాభా సుమారు 98 లక్షలు.

ఇరాన్ అత్యున్నత ఆధ్యాత్మిక నాయకుడి ఆధ్వర్యంలో ఆ దేశం దశాబ్దాలుగా అధునాతన దీర్ఘశ్రేణి క్షిపణులను అభివృద్ధి చేస్తోంది. ప్రారంభం నుండే, చమురు సంపన్న 'ఆధ్యాత్మిక రాజ్యం' ఒక బలమైన సైనిక శక్తిగా ఉండాలని, TimesPrayer.com అంచనా ప్రకారం 204 కోట్ల ప్రపంచ ముస్లిం జనాభాలో దాదాపు 15 శాతం ఉన్న ప్రపంచ షియా సమూహం అతిపెద్ద శక్తిగా కనిపించాలని కోరుకుంది. అచరించేవారి సంఖ్య పరంగా ప్రపంచంలో ఇస్లాం రెండవ అతి పెద్ద మతం. ముస్లిం జనాభా మొత్తం ప్రపంచ జనాభా కంటే వేగంగా పెరుగుతోంది. 2010– 2020 మధ్య ఇతర ప్రపంచ జనాభా పెరుగుదల 10 శాతంతో పోల్చినప్పుడు ముస్లింల సంఖ్యలో 21 శాతం పెరుగుదల ఉంది.

నేడు ఇరాన్ చాలా పెద్ద సంఖ్యలో స్వల్పశ్రేణి రాకెట్లు, హైపర్‌సోనిక్ ఆయుధాలను కలిగి ఉంది. వీటిలో ఎక్కువ భాగం అయతొల్లా ఆశీస్సులతో స్థానికంగా ఉత్పత్తి చేయబడ్డాయి. యుఎస్ ఆఫీస్ ఆఫ్ ది డైరెక్టర్ ఆఫ్ నేషనల్ ఇంటెలిజెన్స్ అంచనాల ప్రకారం, ఇరాన్ సుమారు 3,000 బాలిస్టిక్ క్షిపణులను కలిగి ఉంది. ఈ సంఖ్య ఏ ఇతర ప్రాంతీయ శక్తికంటే కూడా ఎక్కువేనని ఆస్ట్రేలియన్ బ్రాడ్‌క్యాస్టింగ్ కార్పొరేషన్ తెలిపింది. వీటిలో వివిధ శ్రేణులు, రకరకాల క్షిపణులు ఉన్నాయి. ఇవి ప్రాంతంలో ఇరాన్ గణనీయమైన సైనిక బలానికి దోహదం చేస్తాయి.

ఇరాన్ అత్యంత అధునాతన డ్రోన్లను తయారు చేసే, ఎగుమతి చేసే ప్రధాన దేశంగా కూడా ఆవిర్భవించింది. గత సంవత్సరం, యుద్ధ సమయంలో రష్యా 8,000 కంటే ఎక్కువ ఇరాన్ అభివృద్ధి చేసిన డ్రోన్లను ప్రయోగించిందని ఉక్రెయిన్ ప్రభుత్వం పేర్కొంది. ఇరాన్ డ్రోన్ టెక్నాలజీలో, ముఖ్యంగా యుద్ధ డ్రోన్లు, లోయిటరింగ్ మ్యునిషన్స్ (ఆత్మహత్య డ్రోన్లు) వంటి రంగాలలో దాని పురోగతికి గుర్తింపు పొందింది. సుడాన్, సిరియా, ఉక్రెయిన్‌తో సహా వివిధ దేశాలకు డ్రోన్ టెక్నాలజీని ఇరాన్ ఎగుమతి చేస్తోంది. ప్రాంతీయ మిత్రులు, మిలీషియాలకు డ్రోన్లను సరఫరా చేసింది.


ఇరాన్ భారీ డ్రోన్ పరిశ్రమ అభివృద్ధి దేశ ఆధ్యాత్మిక నాయకత్వ ఘనత. అంతర్జాతీయ ఆంక్షల కారణంగా స్వదేశీ ఉత్పత్తిపై ఆధారపడుతోంది. ఇరాన్ డ్రోన్ పరిశ్రమ స్థానిక ఇంజనీరింగ్ , తయారీపై దృష్టి సారించింది. ఇది అబాబిల్, మోహాజెర్, షాహెద్ సిరీస్ వంటి డ్రోన్లను ఉత్పత్తి చేస్తోంది. వీటిలో షాహెద్136 (రష్యాలో గెరాన్2 అని కూడా పిలుస్తారు), కొత్త షాహెద్ 238 ఉన్నాయి. ఇరాన్ కామన్22 డ్రోన్ US MQ9 రీపర్‌ను పోలి ఉంటుంది. ఇరాన్ డ్రోన్లు సంఘర్షణల గతిశీలతను మారుస్తున్నాయి. ముఖ్యంగా పశ్చిమ ఆసియాలో, రష్యా–ఉక్రెయిన్ యుద్ధ సందర్భంలో.

> **పాకిస్తాన్ సున్నీ అణ్వాయుధం కలిగి ఉండటంతో, ఇరాన్ షియా అణు ఆయుధాగారాన్ని అభివృద్ధి చేయటానికి ఎంతో కాలం పట్టదు. అమెరికా–నేతృత్వంలోని పాశ్చాత్య ప్రపంచం, యూదు దేశమైన ఇజ్రాయెల్ ఈ ప్రక్రియను దాదాపు ఆపడం అసాధ్యం. ఇరాన్ అణు ఆశయం పూర్తిగా స్వీయ రక్షణ కోసమైతే పాశ్చాత్య ప్రపంచం, ప్రపంచంలో ఎనిమిదవ అతిపెద్ద అణు శక్తి అయిన ఇజ్రాయెల్ సైతం సాధారణ పరిస్థితులలో అంత ఆందోళన చెందేవి కాదు.**

అయితే, సర్వోన్నత ఆధ్యాత్మిక నాయకుడు అయతొల్లా ఆధ్వర్యంలో ఇరాన్‌ను చాలా పాశ్చాత్య దేశాలు, ముఖ్యంగా అమెరికా తరచుగా 'దూర్త దేశం'గా చూస్తాయి. ప్రధానంగా అమెరికా నేతృత్వంలోని ప్రపంచ క్రమాన్ని ఇరాన్ సవాలు చేయడం, పశ్చిమ ఆసియా ప్రాంతంలో అమెరికన్ ప్రయోజనాలకు వ్యతిరేకంగా ఉన్న సమూహాలకు మద్దతు ఇవ్వడమే ఇందుకు కారణం. ఇరాన్ హిజ్బుల్లా, హమాస్ వంటి సమూహాలకు చురుకుగా మద్దతు ఇస్తుందని అంటారు. వీటిని అమెరికా, దాని మిత్రదేశాలు ఉగ్రవాద సంస్థలుగా పరిగణిస్తాయి. చమురు సంపన్నమైన ఇరాన్ ఒక ప్రధాన అణ్వాయుధ దేశంగా మారడం ఇప్పటికే ఉన్న అధికార సమతుల్యతకు పెద్ద ముప్పుగా పరిగణించబడుతోంది. ఒక సర్వోన్నత మత నాయకుడి చేతుల్లో ప్రభుత్వ యంత్రాంగం నియంత్రణ ఉండటం ఆందోళనకు మరింత కారణమవుతోంది.

# ఆపదలో ఆపన్నహస్తం బీమా

ఎప్పుడు ఏమి జరుగుతుందో తెలియదు. వ్యాధులు వెంటాడవచ్చు, ప్రమాదాలు జరగవచ్చు, ప్రాణాలు సహితం పోవచ్చు. నేడు ఆకస్మికంగా జరిగిన అనర్థానికి మనతో పాటు మన కుటుంబ సభ్యులు బజారున పడే అవకాశాలు ఉండవచ్చు. అనారోగ్యాలు, మరణాలు, ప్రమాద నష్టాలు, విపత్తులు జరిగినపుడు మనకు, మన కుటుంబ సభ్యులకు ఆర్థిక భద్రత ఇవ్వడానికి జీవిత బీమా కంపెనీలు వెసులుబాటు కల్పించడం జరుగుతున్నది. మన ఇంటిని, ప్రధాన వస్తువులను కూడా బీమా చేయించుకునే సదుపాయాలు ఉన్నాయి. రేపటి సురక్ష కోసం నేడు మనం తీసుకునే మంచి నిర్ణయమే జీవిత బీమా. మన ఆదా యం, ఆరోగ్యం, ఆస్తి, ఆర్థికం లాంటి వాటికి నష్టం జరిగినపుడు బీమా మాత్రమే మనకు తక్షణ రక్షణ గొడుగుగా నిలుస్తుంది. అనర్థాలు చెప్పి రావు కాబట్టి అకస్మాత్తుగా జరిగే ప్రమాదాలు, అకాల మరణాలు, అనారోగ్యాలు, ప్రకృతి విపత్తులు, ఆస్తి నష్టాలు జరిగినపుడు మనకు భద్రతను ఇవ్వడానికి జీవిత బీమా పాలసీలు ఉపయోగపడతాయి.



**జాతీయ బీమా అవగాహన దినం:**

మనకు, మనం అమితంగా ప్రేమించే కుటుంబ సభ్యులకు కొండంత ఆర్థిక అండగా నిలిచే బీమా పాలసీల ప్రాధాన్యాన్ని వివరించడానికి ప్రపంచ దేశాలు ప్రతి ఏటా జూన్ 28న జాతీయ బీమా అవగాహన దినం (నేషనల్ ఇన్సురెన్స్ అవేర్‌నెస్ డే) పాటించడం ఆనవాయితీగా మారింది. అనుకోని విధ్వంసం జరిగినపుడు ఆదుకునే ఆపన్నహస్తమే బీమా పాలసీ. ప్రతి ఒక్కరు తమకు అనువైన బీమా పాలసీలను తీసుకొని తమ భవిష్యత్తుకు భద్రత కల్పించుకోవాలి. జీవితాలు, వాహనాలు, గృహాలు, ఆరోగ్యాలు, వరదలు, ఆస్తులు, ప్రధాన వస్తువులను బీమా చేయించుకునే వెసులుబాటు కల్పించబడింది.

**భారత్‌లో జీవిత/జనరల్ బీమా కంపెనీలు:**

భారతదేశవ్యాప్తంగా 24 జీవిత బీమా కంపెనీలు ఉండగా, అందులో లైఫ్ ఇన్సురెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎల్‌ఐసి) మాత్రమే ఏకైక ప్రభుత్వరంగ సంస్థగా పేరుగాంచగా, మిగిలిన 23 కంపెనీలు ప్రైవేట్ యాజమాన్యాలతో నడుస్తున్నాయి. 2025 వివరాల ప్రకారం జీవిత బీమాతో పాటు జనరల్ బీమా కంపెనీలు కలుపుకొని మొత్తం 57 వరకు ఉన్నాయి. వీటిలో 24 జీవిత బీమా కంపెనీలు, 33 జనరల్ బీమా కంపెనీలు ఉన్నాయి. భారత్‌లో ఎల్‌ఐసి కంపెనీ అగ్రగామిగా అత్యధిక పాలసీలను కలిగి ఉండగా, తర్వాత స్థానాల్లో బజాజ్, ఎస్‌బిఐ లైఫ్, హెచ్‌డిఎఫ్‌సి లైఫ్, ఐసిఐసిఐ లోంబార్డ్ లైఫ్, ఐసిఐసిఐ ప్రుడెన్షియల్ లైఫ్, జనరల్ ఇన్సురెన్స్ లాంటి కంపెనీలు మార్కెట్‌లో ముందు వరుసలో ఉన్నాయి. బీమా రంగంలో ఎల్‌ఐసి మార్కెట్ షేర్ తొలి ఏడాది ప్రీమియం ఆదాయం ఆధారంగా 57 శాతం దక్కించుకొని ఇతర కంపెనీలకు అందనంత దూరంలో నిలుస్తూ తన సత్తాను చాటుకుంటున్నది.

నష్టం జరిగిన తర్వాత దుఃఖించడం కన్న సకాలంలో మనకు నచ్చిన బీమా పాలసీలను తీసుకోవడం ఉత్తమ పౌరుల లక్షణమని తెలుసుకోవాలి. ఆకస్మిక విపత్తులు, ప్రమాదాలు, ప్రాణాపాయాలకు తక్షణ రక్షణ గొడుగులుగా బీమా పాలసీలు ఆర్థిక భద్రతను కల్పిస్తాయి. నేడే మనం జీవిత బీమా చేసుకుందాం.

# పండుగల పేరుతో ఆర్భాటాలు వద్దు

పండుగలు మన జీవన విధానంలో ఒక భాగం. పండుగలతో ఆనందం, ఉత్సాహంతో పాటు సామాజిక, సాంఘిక, రాజకీయ సంబంధాలను బలోపేతం చేస్తాయి. అదేవిధంగా భవిష్యత్ తరాలకు సంస్కృతి, సాంప్రదాయాలను వారసత్వ సంపదను అందిస్తాయి. సామూహికంగా జరుపుకునే పండుగలతో, సామూహిక భోజనాలతో మతాలు, కులాల మధ్యన అంతరాలు తగ్గుతాయి. పండుగలు కొన్ని మతపరమైనవి, కులపరమైనవి, ప్రాంతాలపరమైనవి, సంస్కృతిక పరమైనవి, వారసత్వమైన పండుగలు ఉంటాయి. ఒకప్పుడు పండుగలు ఆనందాన్ని మాత్రమే ఇచ్చేవి. ఇప్పుడు పండుగలు అప్పులకు నిలయాలు. నేటి తెలంగాణ సమాజం తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డ తర్వాత అంటే గత పది సంవత్సరాల నుంచి ఎక్కువగా ఖర్చు చేసి పండుగలు చేస్తూ అప్పుల పాలవుతున్నారు.

అంతకంటే ముందు కూడా పండుగలు చేసేవారు. కానీ ఇంత హంగు, ఆర్భాటాలు, ఖర్చులు లేకుండా పండుగలు చేసుకునేవారు. సాంస్కృతికపరమైన పండుగలు బతుకమ్మ, దసరా, దీపావళి, రంజాన్, బక్రీద్, సంక్రాంతి, క్రిస్మస్, ఉగాదిలాంటి పండుగలు ఒకేరోజు అందరూ చేసుకుంటారు. కాబట్టి ఈ పండుగలకు ఖర్చు ఆ కుటుంబం వరకే ఉంటుంది కాబట్టి చాలా తక్కువ ఖర్చుతో ఈ పండుగలు చేసుకుంటారు. జాతీయ పండుగలు స్వాతంత్ర దినోత్సవం, రిపబ్లిక్ దినోత్సవం లాంటి పండుగలకు అసలు ఖర్చు ఉండదు. గత పది సంవత్సరాల నుండి తెలంగాణ రాష్ట్రంలో పట్టణ ప్రాంతాల ప్లాట్లతో పాటు గ్రామీణ ప్రాంతాలలో వ్యవసాయ భూముల ధరలు గణనీయంగా పెరగడం దాంతో రాష్ట్రవ్యాప్తంగా రియల్ ఎస్టేట్ వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగడంతో ఎక్కువ కుటుంబాలలో డబ్బుల వినిమయం పెరగడంతో ప్రతి పండుగను ఎక్కువగా ఖర్చు పెట్టి చేసుకునే సంప్రదాయం మొదలయ్యింది.



తరతరాలుగా వస్తున్న ఆచార సంప్రదాయాలను అనుసరించి పుట్టుకలు, పెళ్లిళ్లు, చావులు వంటి సందర్భాల్లో గ్రామదేవతలకు బోనా లు ఇవి జరుపుకునేవారు. కానీ ఇప్పుడు బర్త్ డేలు, మ్యారేజ్ డేలు వాటితోపాటు ఎండాకాలం వచ్చిందంటే దుర్గమ్మ, పోచమ్మ, పెద్దమ్మ, బీరప్ప, గంగమ్మ ఇతర కులదేవతల, 'బొడ్రాయి' లాంటి పండుగలను ఊరు ఊరంతా పండుగ చేసుకుంటారు. ఈ పండుగలలో మాంసం తినడం గురించి చెప్పనవసరం లేదు. ఈ పండుగలలో మద్యం ఏరులై పారుతుంది. భోజనం ఖర్చు కంటే మద్యం ఖర్చు కుటుంబాలను అప్పుల పాలు చేస్తుంది. ఎంత పెద్ద మొత్తంలో మద్యానికి ఖర్చు పెడితే వారు అంత పెద్దగా పండుగ చేసినట్లుగా, ఆ స్థాయిలో గౌర వం వచ్చినట్లుగా భావిస్తున్నారు. మద్యం ఖర్చు సామాజిక హోదాను సూచిస్తుందని అనుకుంటున్నారు. ఒడిబియ్యం వండుకుంటే కూడా మద్యంతోనే పండుగ ప్రారంభమై, ముగుస్తుంది. ప్రస్తుతం తెలంగాణలో మద్యం లేని పండుగ లేదంటే అతిశయోక్తి కాదు.

**ఉదాహరణకు:**

తెలంగాణ వ్యాప్తంగా కొందరి సంతోషం కోసం పండుగల పేర్లతో వారి వారి స్తోమతకు మించి ఖర్చు పెట్టడంతో అప్పుల బారిన పడి తీర్చే మార్గం లేక నానా అవస్థలు పడుతూ ఆత్మహత్యలు కూడా చేసుకుంటున్నారు. కొందరి కోసం అందరికి అప్పులు, పండుగల పేర్లతో కొత్త పోకడలు పోతూ స్తోమతకు మించి అప్పులు చేసుకోవడం మంచిది కాదని నిపుణులు అంటున్నారు.

**– పులి రాజు**
9908383567

# ఉద్యోగ ప్రకటనలకు నిరుద్యోగుల పోరాటం

నీళ్లు, నిధులు, నియామకాలు.. ఈ మూడు ఎజెండాలతో తెలంగాణ ఉద్యమం జరిగింది. రాష్ట్ర సాధనలో విద్యార్థులు, యువత పాత్ర మరువలేనిది. స్వరాష్ట్రంలో మన ఉద్యోగాలు మనకే వస్తాయని అప్పటి ఉద్యమనేతగా ఉన్న కెసిఆర్ యువతలో భారీగా ఆశలు రేకెత్తించారు. ప్రత్యేక రాష్ట్రం అనంతరం కెసిఆర్ రెండు సార్లు ముఖ్యమంత్రి అయ్యారు. నిరుద్యోగుల పట్ల నిర్లక్ష్య వైఖరి కనబరిచారు. దీంతో బిఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో నిరుద్యోగులు అసంతృప్తికి లోనయ్యారు. ముఖ్యంగా సమయానికి ఉద్యోగ ప్రకటనలు రాకపోవడం, తరుచూ కోర్టు కేసులతో నియామకాలు ఆగిపోవడం, టిఎస్‌పిఎస్‌సి పరీక్ష పేపర్లు లీకేజీలతో యువత ఆగ్రహానికి గురయ్యారు. మరోవైపు ప్రభుత్వ ఉద్యోగ నియామకాలకు గుండెకాయ వంటి టిఎస్‌పిఎస్‌సి పారదర్శకత విషయంలో యువత పెద్ద ఎత్తున ఆందోళన చేసింది. దీంతో నిరుద్యోగులకు, ప్రభుత్వానికి మధ్య అంతరాలు పెరిగాయి. యువత నైరాశంలోకి వెళ్లింది. తెలంగాణ రాజకీయ క్షేత్రంలో నిరుద్యోగులతో పాటు ప్రజలు సైతం మార్పు కావాలని కోరుకున్నారు. అప్పుడు కాంగ్రెస్ పార్టీ నేతగా ఉన్న సీఎం రేవంత్ రెడ్డి బిఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ... వాళ్ళ ఉద్యోగాలు ఊడగొడితే మీకు ఉద్యోగాలు వస్తాయని మాట్లాడారు. అప్పుడు యువత మద్దతుతో బిఆర్‌ఎస్ ప్రభుత్వం పోయి తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింది. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వంలో హాయంలో కూడా నిరుద్యోగుల పరిస్థితి మారలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే సంవత్సరంలోపు రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చింది. కానీ ఇప్పటికి దాదాపు 60 వేల ఉద్యోగాలనే నింపింది. ఇవి కూడా గత ప్రభుత్వం హాయంలో జారీ చేసిన నోటిఫికేషన్లే. కేవలం పరీక్ష నిర్వహించి నియమాక పత్రాలు ఇచ్చారు. ఈ ప్రభుత్వంలో ఇచ్చిన నోటిఫికేషన్లు అంతంత మాత్రమే (12వేలు మాత్రమే అని అంచనా). తెలంగాణ ఆవిర్భావ రోజు అయిన జూన్ 2న ప్రభుత్వం నిరుద్యోగులకు గురించి ఏమి మాట్లాడలేదు. ఎలాంటి ఉద్యోగ ప్రకటన కూడా ఇవ్వలేదు. ఈ నేపథ్యంలో తెలంగాణ రాష్ట్రంలోని నిరుద్యోగ యువత ఆగ్రహం వ్యక్తం చేస్తుంది. ఈ క్రమంలో నిరుద్యోగుల ఇందిరాపార్క్ ధర్నా చౌక్‌లో ఈ నెల 20వ తేదీన విద్యార్థి నిరుద్యోగ మహాగర్జన సభ నిరుద్యోగ జెఏసి ఆధ్వర్యంలో జరిగింది. జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని, క్యాలెండర్ ప్రకారం ఉద్యోగ ఖాళీల భర్తీ చేయాలనే ప్రధాన ఎజెండాగా నిరుద్యోగులు పెద్ద సంఖ్యలో తరలి రావాలని నిరుద్యోగ జెఏసి నేతలు పిలుపునిచ్చారు. అనేకమంది మేధావులు నిరుద్యోగుల పక్షాన నిలబడుతున్నారు. తక్షణం ఉద్యోగ నోటిఫికేషన్ రాకపోతే తెలంగాణలో మరో నిరుద్యోగ పోరాటం చేస్తామని నిరుద్యోగులు హెచ్చరిస్తున్నారు. నిరుద్యోగులు అందరూ సమష్టిగా ఓటు వేసి ఎన్నుకున్న ఈ ప్రభుత్వానికి స్థానిక సంస్థల ఎలక్షన్‌లో తగిన గుణపాఠం చెప్తామంటున్నారు. ఎంతో మంది నిరుద్యోగుల దృష్టిలో, అసంబద్ధమైన జీవోలు తీసుకొచ్చి నిరుద్యోగులను గందరగోళంలోకి నెట్టారు. పోలీస్ నియామకాలలో జిఒ 46 తీసుకువచ్చి గ్రామీణ ప్రాంత అభ్యర్థులకు, గ్రూప్ 1 నియామకాల్లో జిఒ 29తో రూల్ ఆఫ్ రిజర్వేషన్‌ను ఉల్లంఘించి వివిధ సామాజిక వర్గాల వారికి అన్యాయం చేశారు. గ్రూప్1 విషయంలో గత ప్రభుత్వం పేపర్ లీకులతో తప్పులు చేస్తే... ఈ ప్రభుత్వం మెయిన్స్ మూల్యాంకనంలో నిర్లక్ష్యం వహిస్తూ నిరుద్యోగులకు అన్యాయం చేసింది. ఇటీవల గ్రూప్1మెయిన్స్ మూల్యాంకన విషయంలో తెలుగు మీడియా అభ్యర్థులు చాలా నష్టపోయారు. ఈ విషయం పట్ల కోర్టు సైతం ఆగ్రహం వ్యక్తం చేసింది. దీంతో టిజిపిఎస్‌సి పారదర్శకతపై కూడా నమ్మకం సన్నగిల్లుతుంది. ఇదిలా ఉండగా సిఎం గ్రూప్–1 నియామకాలను అడ్డుకుంటున్నారని అనడం విడ్డూరంగా ఉంది. గతేడాది అసెంబ్లీలో జాబ్ క్యాలెండర్ విడుదల చేశారు. ఎస్సీ ఉప వర్గీకరణ కోసం దీన్ని అమలును వాయిదా వేశారు. మరి ఇప్పుడు ఆ సమస్య లేదు. అయినా ఉద్యోగ నోటిఫికేషన్ పట్ల ప్రభుత్వం పెద్దలు రకరకాలగా మాట్లాడుతున్నారు. మరోవైపు త్వరలో ఉద్యోగ నోటిఫికేషన్ అంటూ నిరుద్యోగుల ఓపికను పరీక్షిస్తున్నారు. ఇటీవల ముఖ్యమంత్రి ఓ సభలలో నిరుద్యోగుల గురించి మాట్లాడుతూ... గత ప్రభుత్వంలో ఉద్యోగాల కోసం ధర్నా చేసేవారని, కానీ మా హయాంలో నోటిఫికేషన్లు వద్దని ధర్నాలు చేస్తున్నారని చెప్పడం హాస్యాస్పదం. ఈ వ్యాఖ్యలతో నిరుద్యోగులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే నిరుద్యోగుల వయసు దాటిపోతుంది. ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రతి ఏటా యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు లేక మానవ వనరులు వృధా అయిపోతున్నాయి. కావున వివిధ డిపార్ట్‌మెంట్‌లలో ఖాళీల లెక్కలను తేల్చి వెంటనే నోటిఫికేషన్లు జారీ చేయాలి. మరోవైపు యువతకు నైపుణ్య శిక్షణ ఇచ్చి ప్రైవేట్ రంగంలోకి కూడా వెళ్లే విధంగా ప్రోత్సహించాలి. ఇప్పటికైనా ప్రభుత్వం నిరుద్యోగుల ఆవేదనను అర్థం చేసుకోకపోతే మరో తిరుగుబాటు తప్పదని నిరుద్యోగులు ఐక్య కార్యచరణ సమితి (జెఏసి) హెచ్చరిస్తున్నది.

**– సంపతి రమేష్ మహారాజ్**
7989579428

# రైతు రాజయ్యేదెన్నడు?

రైతు లేనిదే రాజ్యం లేదు, అన్నదాతలే దేశానికి వెన్నెముక. జై కిసాన్ అంటూ జేజేలు పలుకుతూ పల్లకి మోతలే, 'మాటలు కోటలు దాటుతున్నాయి చేతలు తంగేళ్లు దాటడం లేదు' అన్నట్లుగా ఉంది. నిజానికి రైతు శ్రమకు తగ్గ గుర్తింపు, గౌరవం ఇస్తున్నామా! అంటే లేదని చెప్పాల్సి వస్తుంది. ఎందుకంటే?. మన దేశానికి స్వాతంత్ర్యం వచ్చి ఇన్నేళ్లయినా వ్యవసాయ రంగం తీవ్ర ఒడిదుడుకులకు లోనవుతుంది. కానీ పారిశ్రామిక, సాంకేతిక,సేవారంగాలు వేగంగా అభివృద్ధి చెందుతున్నాయి. జాతీయ స్థూల విలువ జోడింపు (జీవివి)లో వ్యవసాయం దాని అనుబంధ రంగాల వాటా తగ్గుతోంది. కృత్రిమ మేధ (ఏఐ)అన్ని రంగాల్లోనూ ప్రవేశించి ప్రగతి పరుగులు పెట్టిస్తుంటే !. వ్యవసాయ రంగం 'ఎక్కడ వేసిన గొంగళి అక్కడే' అన్న చందంగా కునారిల్లుతుంది. రైతు ఆత్మహత్యలను ఆపలేకపోవడం పాలకుల లోపమా?, రైతుల శాపమా!. ఏది ఏమైనా బలిపీఠంపై ఉన్న సాగును బాగుపడేలా చేస్తూ, రైతును రాజును చేసే సంగతేమో కాని కనీసం ఆత్మహత్యలను నివారించాల్సి ఉందనేది కాదనలేని నిజం. అప్పుడే నేటి తరం యువత ఆ రంగంలోకి రాగలరు. ఈమధ్య రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా కల్పించడం అభినందనీయమే. కానీ మన దేశంలో ఎక్కువ మందికి జీవనోపాధి కల్పించే సాగును, దాన్నే నమ్ముకున్న రైతాంగం బాగుపడ్డ రోజే వారి జీవితాల్లో నిజమైన ఆనందం. ఈ సంవత్సరం వర్షాలు జోరుగా కురుస్తాయని, రుతుపవనాలు ముందే వస్తాయని వాతావరణ శాఖ చెప్పింది. అలానే జూన్ మొదట్లో రుతుపవనాలు వచ్చి తొలకరి కురిసి మురిపించింది. ఆ తర్వాత జూన్ నెల చివరకు వస్తున్నా ఆకాశం మేఘావృతమై ఉంటుందే కానీ వర్షాలు పడడం లేదు. తొలకరి వానలకు నాటిన పత్తి తదితర పంటల కోసం రైతులు నొసటిన చేయి పెట్టి ఆకాశం వైపు ఎదురుచూస్తున్న పరిస్థితులు ఇన్నేళ్లైనా మారనేలేదు. మన దేశంలో అన్నదాతలకు ఎంతో ముఖ్యమైన కాలమిది. జాతికి మెతుకు నిచ్చి, బతుకు నిలిపే రైతన్న పుడమినే పుత్తడి (పులకింప) చేసి పూతలు పూయించి కాతలు కాయిస్తు, బురదను మలిచి బువ్వను చేసే పుణ్య పురుషుడు అన్నదాత. తొలకరి వానలకు ముందుగా నాలుగుసార్లు దుక్కి దున్ని విత్తనాలు నాటుతారు. మొక్క మొలకెత్తింది మొదలు దానిని పసి బిడ్డను చూసినట్లు అపురూపంగా చూసుకుంటాడు. కలుపు తీస్తాడు, మందులు వేస్తాడు పంట చేతికందే సరికి అనావృష్టో లేదా అతివృష్టి వలనో ఆ పైరు ఎండిపోవడమో, కొట్టుకపోవడమో జరుగుతుంది. విత్తనాల ఖర్చులు కూడా తిరిగి రాని దయనీయ స్థితి.

**– మేకిరి దామోదర్**
9573666650

# జాతీయం
NATIONAL & GENERAL NEWS

## భారీ ఉగ్ర కుట్రను భగ్నం చేసిన పంజాబ్ పోలీసులు



**చండీగఢ్:** పాకిస్థాన్ ఐఎస్ఐ సహకారంతో భారీ ఉగ్రకుట్రను జరిగిన ప్లాన్‌ను పంజాబ్ పోలీసులు శుక్రవారంనాడు భగ్నం చేశారు. టెర్రర్ మాడ్యూల్ ఆటకట్టించారు. ఉగ్ర కుట్రకు పన్నాగం పన్నిన ఒక మైనర్‌తో సహా ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేశారు. వీరిని బబ్బర్ ఖల్సా ఇంటర్నేషనల్ (బికెఐ)కు చెందిన వారిగా గుర్తించారు. భారీ ఉగ్రకుట్రను భగ్నం చేయడం ద్వారా విలువైన ప్రాణాలను కాపాడగలిగామని డిజిపి గౌరవ్ యాదవ్ తెలిపారు.'ఇంటెలిజెన్స్ సమాచారంతో రాష్ట్ర ప్రత్యేక ఆపరేషన్ సెల్ ఈ ఆపరేషన్ నిర్వహించింది. పాక్ ఐఎస్ఐ సహకారం కలిగిన బబ్బర్ ఖల్సా ఇంటర్నేషనల్ టెర్రర్ మా డ్యూల్‌ను విజయవంతంగా పట్టుకున్నాం. యూకేకు చెందిన నిషాన్ సింగ్, పాకిస్థాన్‌కు చెందిన టెర్రరిస్ట్ హర్విందర్ రిండాలు దీనిని ఆపరేట్ చేస్తున్నారు. బికెఐతో అసోసియేషన్ కలిగిన ఒక జువనైల్, మరో ఇద్దరిని అరెస్టు చేశాం' అని డీజీపీ తెలిపారు.

## అత్యంత వైభవంగా పూరీ జగన్నాథయాత్ర

### తరలివచ్చిన లక్షలాది మంది ప్రజలు



**న్యూఢిల్లీ :** ఒడిశాలోని ప్రసిద్ధ పూరీ జగన్నాథ రథయాత్ర శుక్రవారం అత్యంత వైభవంగా ప్రారంభమైంది. ప్రధాన ఘట్టంలో భాగంగా 12వ శతాబ్దపు మందిరం దగ్గర నుండి శ్రీ గుండిచా ఆలయం వైపు వెళ్లే రోడ్డుపై వేలాది మంది ప్రజలు జగన్నాథుడు, అతని తోబుట్టువుల రథాలను తాళ్లను లాగారు. ఒడిశా గవర్నర్ హరి బాబు కంభంపతి, ముఖ్యమంత్రి మోహన్ చరణ్ , అనేక మంది ప్రముఖులు జగన్నాథుడు, దేవి సుభద్ర, బలభద్రుడి రథాలను లాగారు. జై జగన్నాథ్, హరి బోల్ నినాదాలతో తాళాలు మోగించడం, బాకాలు, శంఖాలు ఊదడం మధ్య, బలభద్రుడి 'తల ద్వాజ' రథం మొదట సాయంత్రం 4.08 గంటలకు ముందుకు కదలడం ప్రారంభమైంది. తర్వాత దేవి సుభద్ర 'దర్పదలన్' రథం, చివరకు జగన్నాథుడి 'నందిఘోష్' రథాలు కదిలాయి. భక్తులు రథాలను లాగుతుండగా, పూజారులు రథాలపై ఉన్న దేవతల వద్ద ఆశీనులయ్యారు. ఊరేగింపు ఈ ఆలయ పట్టణంలోని గ్రాండ్ రోడ్ గుండా వెళుతుంది. వేలాది మంది ప్రజలు రథాలను లాగగా, లక్షలాది మంది ఇతరులు కూడా ఈ ఉత్సవంలో పాల్గొనడానికి సముద్రతీర ఆలయ పట్టణానికి చేరుకున్నారు. వార్షిక రథోత్సవం కోసం సుమారు పది లక్షల మంది భక్తులు హాజరైనట్లు అంచనా వేశారు. పూరి రాజు గజపతి మహారాజు దివ్యసింహ దేబ్ మూడు రథాలపై 'చెరా పహంరా' (రథాలను ఊడ్చడం) చేసిన తర్వాత రథం లాగడం ప్రారంభమైంది. మూడు రథాలపై వివిధ రంగుల చెక్క గుర్రాలను అమర్చారు. అంతకుముందు రెండు గంటలకు పైగా జరిగిన 'పహండి' ఆచారం తర్వాత త్రిమూర్తులు బలభద్రుడు, దేవి సుభద్ర, జగన్నాథుడు వారి వారి రథాలను అధిరోహించారు. పహండి సందర్భంగా, 12వ శతాబ్దపు జగన్నాథ ఆలయం నుండి మూడు చెక్క విగ్రహాలను రథాలకు వద్దకు తీసుకువెళ్లారు. ఒడిస్సీ నృత్యకారులు, జానపద కళాకారులు, సంగీతకారులు, రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అనేక ఇతర బృందాలు విగ్రహాల ముందు ప్రదర్శన ఇచ్చాయి. గోవర్ధన పీఠం శంకరాచార్య స్వామి నిశ్చలానంద సరస్వతి, ఎంపిక చేసిన శిష్యులతో కలిసి, దేవతలను ప్రతిష్టించిన తర్వాత మూడు రథాలను సందర్శించారు. కేంద్ర మంత్రులు ధర్మేంద్ర ప్రధాన్, గజేంద్ర సింగ్ షెఖావత్, పూరి ఎంపి సంబిత్ పాత్ర, ఒడిశా మంత్రులు, అనేక మంది ఇతరులు పూరిలో రథయాత్ర ప్రధాన ఆకర్షణలలో ఒకటైన ఆచార పహండిని వీక్షించారు. ఒడిశా పోలీసులు, కేంద్ర సాయుధ పోలీసు దళం, ఎన్ఎస్‌జి, ఇతరులకు చెందిన దాదాపు 10,000 మంది సిబ్బందితో అపూర్వమైన భద్రతా ఏర్పాట్ల మధ్య ఈ ఉత్సవం జరుగుతోంది. రథయాత్ర సజావుగా నిర్వహించడానికి అన్ని రకాల ఏర్పాట్లు చేసినట్లు డిజిపి వైబి ఖురానియా మీడియాకు వెల్లడించారు. ప్రజలపై నిఘా ఉంచడానికి 275కి పైగా ఎఐ ఎనేబుల్డ్ ఇసిటివి కెమెరాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పహల్గామ్ ఉగ్రవాద దాడి తర్వాత కొంత సమాచారాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ ఏర్పాట్లు చేసినట్లు ఎడిజిపి సంజయ్ కుమార్ తెలిపారు. ఎన్ఎస్‌జి స్నిపర్లు, కోస్ట్ గార్డ్ డ్రోన్లు, యాంటీడ్రోన్ వ్యవస్థలతో సహా అనేక కేంద్ర ప్రభుత్వ సంస్థలు ఒడిశా పోలీసులతో సహకరిస్తున్నాయి. డాగ్‌స్క్వాడ్ బృందాలు, ఒడిశా యాంటీసాబోటేజ్ యూనిట్లు కూడా ఇక్కడ విధుల్లో నిమగ్నమై ఉన్నాయని ఆయన చెప్పారు.

### అహ్మదాబాద్ రథయాత్రలో అపశృతి

గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో జగన్నాథ రథయాత్రలో అపశృతి చోటు చేసుకుంది. ఊరేగింపుగా వచ్చిన మూడు ఏనుగులు బీభత్సం సృష్టించాయి. ఏనుగులు అదుపుతప్పి భక్తులపైకి దూసుకు వచ్చాయి. దీంతో అక్కడ గందరగోళ పరిస్థితి నెలకొంది. ప్రాణాలు కాపాడుకునేందుకు భక్తులు పరుగులు తీశారు. ఈ ఘటనలో పలువురు భక్తులు గాయపడ్డారు. అయితే కొంత సమయానికి పరిస్థితి అదుపుకావడంతో మళ్లీ రథయాత్రను యథావిధిగా జరిపించారు.

## అమర్‌నాథ్ యాత్రకు బహుళంచెల భద్రత



జమ్ము : వార్షిక అమర్‌నాథ్ యాత్ర కోసం బహుళ అంచెల భద్రతా ఏర్పాట్లను చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. జమ్ము ప్రాంతంలో 180 కంపెనీలకు పైగా పారామిలిటరీ దళాలను మోహరించినట్లు అధికారులు తెలిపారు. 38 రోజుల పాటు సాగే ఈ యాత్ర జూలై 3న జంట మార్గాల నుండి ప్రారంభం కానుంది. అనంతనాగ్ జిల్లాలోని సాంప్రదాయ పహల్గామ్ మార్గం, గందర్‌బాల్ జిల్లాలోని 14 కిలోమీటర్ల బాల్తాల్ మార్గం 3,880 మీటర్ల ఎత్తయిన పవిత్ర గుహ మందిరమైన అమర్‌నాథ్‌కు దారితీస్తుంది. యాత్ర ప్రారంభానికి ఒక రోజు ముందు జమ్ములోని భగవతి నగర్ బేస్ క్యాంప్ నుండి యాత్రికుల మొదటి బృందం కాశ్మీర్‌కు బయలుదేరుతుంది. ఈ సంవత్సరం యాత్రను విజయవంతంగా నిర్వహించేందుకు అధికార యంత్రాంగం సిద్ధంగా ఉందని, యాత్ర కోసం జమ్ముకశ్మీర్ పోలీసులు బహుళ అంచెల భద్రతా ఏర్పాట్లు చేసినట్లు జమ్ము జోన్ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (ఐజిపి) భీమ్ సేన్ టుటి మీడియాకు వివరించారు. జమ్ము డివిజనల్ కమిషనర్ రమేష్ కుమార్‌తో కలిసి యాత్రకు సంబంధించిన ఏర్పాట్లను సమీక్షించడానికి ఉన్నత స్థాయి సమావేశానికి అధ్యక్షత వహించిన టుటి మాట్లాడుతూ గత కొన్ని ఏళ్లుగా భద్రతను అందిస్తున్నట్లే, ఈ సంవత్సరం కూడా పారామిలిటరీ దళాల సంఖ్య, సున్నితమైన ప్రాంతాలలో మోహరింపు లేదా సిసిటివి నిఘా పరంగా మరింత మెరుగైన ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు. మునుపటితో పోలిస్తే, మరింత అప్రమత్తంగా, బహుళస్థాయి భద్రతను నిర్ధారించడం జరుగుతోందన్నారు. ఈ ప్రాంతంలో యాత్ర కోసం బలగాల మోహరింపు గురించి అడిగిన ప్రశ్నకు సమాధానమిస్తూ, జమ్ముకశ్మీర్ పోలీసులతో పాటు, యాత్ర కోసం 180కిపైగా పారామిలిటరీ దళాలను మోహరించారన్నారు. జమ్ముకశ్మీర్ జాతీయ రహదారి వెంబడి లఖన్‌పూర్ నుండి బనిహాల్ వరకు భద్రతా దళాలను మోహరించామని ఆయన అన్నారు. రోడ్ ఓపెనింగ్ పార్టీల నుండి సిసిటివి కెమెరాల వరకు, ప్రతిదీ ఏర్పాటు చేశామని, లాంగర్‌లు, లాడ్జింగ్ సెంటర్‌ల వద్ద కూడా భద్రత కల్పించామన్నారు. గత సంవత్సరం లఖన్‌పూర్ నుండి జమ్ము వరకు ఆర్‌ఒపి (రోడ్ ఓపెనింగ్ పార్టీ) ఏర్పాట్లు లేవు, కానీ ఈ సంవత్సరం ఇక్కడ కూడా ఉన్నాయన్నారు. జూలై 2 నుండి ట్రాఫిక్ పోలీసులు రోజువారీ సలహాలు ఇస్తారని ఐజిపి తెలిపారు. యాత్రకు సంబంధించిన అన్ని ప్రదేశాలలో కట్‌ఆఫ్ సమయాలు నిర్ణయించబడతాయని, యాత్రలో పాల్గొనాలనుకునే అన్ని యాత్రికులు ఈ సలహాను పాటిస్తే ఎటువంటి సమస్యలు లేదా అసౌకర్యాలు ఉండవన్నారు. యాత్రికులు ఉదయం 4:00 నుండి 4:30 గంటల మధ్య బయలుదేరే ప్రధాన కాన్వాయ్‌లో చేరాలని సూచించారు. 'వ్యక్తిగతంగా ప్రయాణించడం సముచితం కాదు. అధికారిక కాన్వాయ్‌తో ప్రయాణించే వారికి సురక్షితమైన వాతావరణం కల్పించబడింది. వ్యవస్థీకృత, రక్షిత సెటప్‌లో ప్రయాణించడం సురక్షితం అని ఆయన అన్నారు.

### చెల్లింపుల జాప్యాన్ని పరిష్కరించేందుకు..

## ఆన్‌లైన్ వివాద పరిష్కార పోర్టల్

### రాష్ట్రపతి ద్రౌపది ముర్ము



**న్యూఢిల్లీ :** సూక్ష్మ మరియు చిన్న సంస్థలకు (ఎంఎస్ఎంఇ) చెల్లింపుల జాప్యానికి సంబంధించిన కేసులలో విచారణలు వేగవంతం చేయంలో, నిర్ణయం తీసుకోవడంలో ఈరోజు (శుక్రవారం) ప్రారంభించబడిన ఆన్‌లైన్ వివాద పరిష్కార పోర్టల్ సహాయపడుతుందని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పేర్కొన్నారు. ఆమె ప్రపంచ సూక్ష్మ, చిన్న మరియు మధ్యతరహా సంస్థల (ఎంఎస్ఎంఇ) దినోత్సవం సందర్భంగా ప్రసంగిస్తూ సూక్ష్మ, చిన్న, మధ్యతరహా సంస్థలు ఎదుర్కొంటున్న కీలక సవాళ్లను వివరించారు. ఆర్థిక లభ్యత, పెద్ద సంస్థలతో పోటీ, చెల్లింపులలో జాప్యం వంటి వాటిని కీలక సవాళ్లుగా ఉదహరించారు. ప్రభుత్వం చేస్తోన్న ప్రయత్నాల ఫలితంగా రిజిస్టర్డ్ ఎంఎస్ఎంఇల సంఖ్య వేగంగా పెరిగిందని తెలియజేశారు. ఆలస్యమైన చెల్లింపులకు సంబంధించిన త్వరితమైన విచారణ, నిర్ణయం తీసుకోవడంలో ఆన్‌లైన్ వివాద పరిష్కార పోర్టల్ కీలక ప్రాధాన్యతక కలిగినదిగా నిరూపించబడుతున్నదని రాష్ట్రపతి చెప్పారు. వ్యాపారాలను స్థాపించడానికి, స్వావలంభన పొందడానికి పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఆమె యువతులకు విజ్ఞప్తి చేశారు. ప్రపంచం వాతావరణ మార్పుల వల్ల ఉత్పన్నమైన సవాళ్లను ఎదుర్కొంటూనే సాంకేతికతలో వేగంగా అభివృద్ధి చెందడాన్ని గమనించినట్లు ముర్ము చెప్పారు. వాతావరణ స్థిరత్వ లక్ష్యాలకు భారతదేశం కట్టుబడి ఉందని నొక్కిచెబుతూ సూక్ష్మ, చిన్న, మధ్యతరహా సంస్థలలో గ్రీన్ టెక్నాలజీని ప్రోత్సహించాలని కోరారు. ఈ గ్రీన్ టెక్నాలజీ ఎంఎస్ఎంఇల స్థిరత్వాన్ని, వాటి పోటీతత్వాన్ని మెరుగుపర్చడమే కాకుండా దేశ వాతావరణ లక్ష్యాలను కూడా మెరుగుపరుస్తుందని రాష్ట్రపతి తెలియజేశారు. సూక్ష్మ, చిన్న, మధ్యతరహా సంస్థలు నిలదొక్కుకోవడానికి నవకల్పనలు కీలక పాత్ర పోషిస్తాయని ఆమె నొక్కిచెప్పారు. ప్రభుత్వం అనేక మార్గాలలో స్టార్టప్‌లను ప్రోత్సహిస్తోందని రాష్ట్రపతి ముర్ము వివరించారు. వికసిత్ భారత్ 2047 విజన్ నాటికి కింది స్థాయిలో నవకల్పనలను ప్రోత్సహించాలని సూక్ష్మ, చిన్న, మధ్యతరహా సంస్థలకు పిలుపునిచ్చారు. ఎంఎస్ఎంఇ శాఖ మంత్రి జితన్ రామ్ మాంఝీ మాట్లాడుతూ కేవలం ఎంఎస్ఎంల లోనే దేశవ్యాప్తంగా 34కోట్ల మంది ప్రజలకు ఉపాధి అవకాశాలు కల్పిస్తోందని చెప్పారు. ప్రస్తుతం ఎంఎస్ఎంఇలు, వారి కొనుగోలుదారుల మధ్య వివిదాల సంబంధిత సమస్యలను పరిష్కరించడానికి రాష్ట్ర ప్రభుత్వాలచే స్థాపించబడిన సూక్ష్మ, చిన్న సంస్థల సౌకర్యాల మండలి (ఎంఎస్ఇఎఫ్‌సి) వద్ద రూ.50,000కోట్ల విలువైన కేసులు పెండింగ్‌లో ఉన్నాయని మంత్రి జితన్ రామ్ మాంఝీ వివరించారు. ఆన్‌లైన్ వివాద పరిష్కార పోర్టల్‌ను ఉపయోగించి చెల్లింపులు ఆలస్యమైన సందర్భాలలో సూక్ష్మ, చిన్న సంస్థల వ్యవస్థాపకులు కేసులు దాఖలు చేయవచ్చు. వారు తమ సంస్థ వివరాల కోసం ఉద్యమ్ రిజిస్ట్రేషన్ నంబర్‌ను నమోదు చేయాల్సి ఉంటుంది.

### ఉగ్రవాద ప్రస్తావన లేని ఎస్‌సిఒ ఫలిత పత్రం...

## భారత్‌కు ఆమోదయోగ్యం కాదు

### కేంద్ర విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి ఎస్.జైశంకర్



**న్యూఢిల్లీ :** షాంఘై సహకార సంస్థ (ఎస్‌సిఒ) రక్షణ మంత్రుల సమావేశం ఫలిత పత్రం (ఔట్ కమ్ డాక్యుమెంట్)లో ఉగ్రవాదం గురించి ప్రస్తావించాలని భారతదేశం ఆకాంక్షించిందని, అయితే దానిని ఓ దేశం అంగీకరించనప్పుడు భారతదేశానికి కూడా ఎస్‌సిఒ ఫలితపత్రం ఆమోదయోగ్యం కాదని కేంద్ర విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి ఎస్.జైశంకర్ అన్నారు. ఆయన పాకిస్థాన్‌ను ఉద్దేశించి పరోక్షంగా సూచించారు. ఉగ్రవాదంపై పోరాడటమే షాంఘై సహకారం సంస్థ ప్రధాన లక్ష్యమని, ఈ విషయంలో రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అభిప్రాయమే సరైనదన్నారు. ఉగ్రవాదంపై భారతదేశ ఆందోళనలను ప్రస్తావించకుండా తాను మాత్రం ఫలిత పత్రాన్ని అంగీకరించబోనని విదేశీ వ్యవహారాల మంత్రి జైశంకర్ స్పష్టంచేశారు. పహల్గామ్ ఉగ్రదాడిని విస్మరించిన తర్వాత పాకిస్థాన్ మద్దతు కలిగిన సీమాంతర ఉగ్రవాదంపై భారతదేశం ఆందోళనలను స్పష్టంగా ప్రస్తావించకపోవడంతో గురువారం రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ షాంఘై సహకార సంస్థ ఉమ్మడి ప్రకటనపై సంతకం చేయడానికి నిరాకరించారు.ఎస్‌సిఒ రక్షణ మంత్రుల సమావేశంలో రాజ్‌నాథ్‌సింగ్ ఉగ్రవాద దాడిని ప్రకటనలో చేర్చాలని డిమాండ్ చేశారు. అయితే పాకిస్థాన్ వైపు బలూచిస్థాన్‌లో మిలిటరీ కార్యకలాపాలపై ఒక పేరాగ్రాఫ్ చేర్చాలని ఒత్తిడి చేసింది. ఇది న్యూఢిల్లీని నిందించాలనే ప్రయత్నంలో ఒక భాగమని ఉన్నత స్థాయి అధికారవర్గాలు తెలిపాయి. విలేకరుల సమావేశంలో రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ వైఖరి విషయమై విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి జైశంకర్‌ను ప్రశ్నించగా ఏకాభిప్రాయం ద్వారా నడిచే షాంఘై సహకార సంస్థ లక్ష్యం ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడమే కదా అని జైశంకర్ సమాధానం ఇచ్చారు. ఎస్‌సిఒ ఏకగ్రీవంగా నడుస్తుందని జైశంకర్ చెప్పారు. ఒక దేశం ఉగ్రవాదాన్ని గురించి ప్రస్తావించడాన్ని అంగీకరించనప్పుడు ఫలిత పత్రం భారతదేశానికి కూడా ఆమోదయోగ్యం కాదని రాజ్‌నాథ్ సింగ్ గట్టిగా తేల్చిచెప్పినట్లు జైశంకర్ వివరించారు.

## పంజాబ్‌లో గ్యాంగ్‌స్టర్ తల్లి దారుణ హత్య

న్యూఢిల్లీ : పంజాబ్ కాల్పుల కలకలం రేపింది. గ్యాంగ్‌స్టర్ జగ్గూ భగవాన్ పురియా తల్లి హర్జీత్ కౌర్ దారుణ హత్యకు గురయ్యారు. కారులో ఉన్న ఆమెపై గుర్తు తెలియని వ్యక్తులు కాల్పులు జరిపి అక్కడి నుంచి పరారయ్యారు. బటాలా నగరంలో గురువారం ఈ ఘటన చోటు చేసుకుంది. సివిల్ లైన్స్ ప్రాంతంలోని ఖాడియన్ రోడ్డులో గురువారం రాత్రి 9:30 గంటల ప్రాంతంలో హర్జిత్ కౌర్ కారులో కూర్చొని ఉన్నారు. ఆ సమయంలో బైక్‌పై వచ్చిన ఇద్దరు వ్యక్తులు ఆమెపై కాల్పులు జరిపి అక్కడి నుంచి పరారయ్యారు. వెంటనే ఆమెను అమృత్‌సర్‌లోని ఆసుపత్రికి తరలించగా.. అక్కడ చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోయినట్లు ఓ సీనియర్ పోలీసు అధికారి తెలిపారు.

కాల్పులు జరిపిన ఇద్దరు వ్యక్తుల కోసం గాలింపు చేపడుతున్నట్లు చెప్పారు. ఈ మేరకు ఘటనపై కేసు నమోదు చేసి.. దర్యాప్తు చేపట్టినట్లు వెల్లడించారు. హంతకులను పట్టుకునేందుకు బృందాలను ఏర్పాటు చేసినట్లు పోలీసులు తెలిపారు.

## సిఎం నితీశ్, ప్రధాని మోదీలకు ఓటమి భయం : తేజస్వి యాదవ్



**న్యూఢిల్లీ :** మరో రెండు నెలల్లో బిహార్ అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో ఆ రాష్ట్ర ఓటర్ల జాబితాలో స్పెషల్ రివిజన్ ఉంటుందని కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించింది. ప్రస్తుత ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులు చేసి తుది జాబితాను ప్రకటించనున్నట్లు వెల్లడించింది. అయితే కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటనపై ఆర్‌జెడి ముఖ్య నాయకుడు తేజస్వి యాదవ్ అసహనం వ్యక్తంచేశారు. ప్రస్తుతం 8 కోట్ల మంది బిహారీ ఓటర్లతో ఉన్న జాబితాను పక్కనపెట్టి కొత్త జాబితాను తయారుచేయడం దేనికని ఆయన ప్రశ్నించారు. ఎన్నికల కేవలం రెండు నెలల సమయం మాత్రమే ఉన్నప్పుడు ఈ నిర్ణయం దేనికని నిలదీశారు. కేవలం 25 రోజుల్లో 8 కోట్ల మంది ఓటర్ల పేర్లతో జాబితాను తయారు చేయడం సాధ్యమయ్యే పనేనా అని తేజస్వి విమర్శించారు. ఆర్‌జెడి పక్షాన నిలిచే పేద, బడుగు, బలహీన వర్గాల ఓటర్లను జాబితా నుంచి తొలగించేందుకే ఈ స్పెషల్ రివిజన్ అని ఆయన ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వ కీలుబొమ్మలా ఎన్నికల సంఘం పనిచేస్తోందని మండిపడ్డారు. ఈ విషయమై త్వరలోనే మా పార్టీ బృందం కేంద్ర ఎన్నికల సంఘాన్ని కలిసి మాట్లాడుతుందని తేజస్వి యాదవ్ చెప్పారు. బిహార్ సిఎం నితీశ్ కుమార్, ప్రధాని నరేంద్రమోదీలకు ఈ అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోతామనే భయం పట్టుకుందని, అందుకే ఓటర్ల జాబితాలో సవరణలు చేయించి గెలువాలని కుట్ర చేస్తున్నారని విమర్శించారు. వారు పేదల ఓటు హక్కును బలవంతంగా లాక్కోవాలని చూస్తున్నారని ఆరోపించారు.

## సామాజికంగా గిరిజనులను బలోపేతం చేస్తాం

### కాంగ్రెస్‌లో వారికి సముచిత స్థానంతో రాజకీయంగా సాధికారత కల్పిస్తాం : రాహుల్‌గాంధీ



**న్యూఢిల్లీ :** కాంగ్రెస్ పార్టీ గిరిజన సమాజాన్ని సామాజికంగా బలోపేతం చేయాలని భావిస్తోందని లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ పేర్కొన్నారు. పార్టీలోనే వారికి సముచిత స్థానం, సంపూర్ణ మద్దతు ఇవ్వడం ద్వారా వారికి రాజకీయంగా సాధికారత కల్పించాలని కోరుకుంటున్నట్లు చెప్పారు. కొన్ని రోజుల క్రితం తన నివాసంలో గిరిజన సమాజ ప్రతినిధులతో జరిగిన సమావేశంలో రాహుల్‌గాంధీ వారి సమస్యలను చర్చించారు. ఈ సందర్భంగా వారి మధ్య జరిగిన సంభాషణ వీడియోను రాహుల్‌గాంధీ సామాజిక మాధ్యమంలో పంచుకున్నారు. దేశవ్యాప్తంగా కాంగ్రెస్‌లో గిరిజన నాయకత్వాన్ని అభివృద్ధి చేయాలనుకుంటున్నామని చెప్పారు. తాను గిరిజనులకు సహాయం చేయాలనుకుంటున్నానని, దీని కోసం సమాజం ఐక్యంగా ఉండాలని, గిరిజనుల హక్కుల కోసం నిజంగా పోరాడుతున్న వారు ముందుకు రావాలన్నారు. తాము ఆదివాసీ నాయకులను బలోపేతం చేయాలనుకుంటున్నామని, ప్రతి రాష్ట్రంలో 1015 మంది గిరిజన నాయకులు ఉద్భవించాలని కోరుకుంటున్నట్లు గాంధీ గిరిజన ప్రతినిధులతో అన్నారు. ఈ సమావేశం గురించి మాజీ కాంగ్రెస్ చీఫ్ మాట్లాడుతూ ఈ పోరాటంలో వారితో పాటు ఉన్నానని ప్రతినిధులకు హామీ ఇచ్చానని అన్నారు.

వారికి రాజకీయ అధికారం ఇవ్వడం ద్వారా సామాజికంగా బలోపేతం చేయడమే లక్ష్యమని చెప్పారు. కాంగ్రెస్ పార్టీలో వారికి సముచిత స్థానం, బలమైన గొంతు, మద్దతు ఇవ్వడం ద్వారా ప్రారంభమవుతుందన్నారు. తన వాట్సాప్ ఛానెల్‌లో షేర్ చేసిన పోస్ట్‌లో, 'నీరు, అడవి, భూమి, రాజ్యాంగ హక్కుల కోసం వారి పోరాటం కొనసాగుతోంది. అది సామాజిక అన్యాయం అయినా లేదా డిజిటలైజేషన్ ద్వారా భూమిని లాక్కున్నా, దేశంలోని గిరిజనులు బాధపడుతూనే ఉన్నారు' అని కూడా ఆయన అన్నారు. గిరిజన, బహుజన సమాజం సమ్మిళితత్వం, భాగస్వామ్యాన్ని దృష్టిలో ఉంచుకుని 'సంఘ్టన్ సృజన్ అభియాన్' ద్వారా కొత్త జిల్లా అధ్యక్షులను నియమించే ప్రక్రియను కాంగ్రెస్ ప్రారంభించిందన్నారు. తాము ఈ చొరవను గుజరాత్ నుండి ప్రారంభించామని, కాంగ్రెస్ ప్రతి రాష్ట్రంలోనూ దీనిని అమలు చేస్తుందని స్పష్టం చేశారు. రానున్న కాలంలో, వారి బలమైన, ఐక్య స్వరం ప్రతిధ్వనించినప్పుడు ప్రస్తుత పరిస్థితులలో మార్పును ఎవరూ ఆపలేరన్నారు. జూన్ 23న గాంధీ తన నివాసంలో గిరిజన ప్రతినిధులను కలిశారు. ఆల్ ఇండియా ఆదివాసీ కాంగ్రెస్ చైర్మన్ విక్రాంత్ భూరియా మాట్లాడుతూ, గుజరాత్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, జార్ఖండ్‌లకు చెందిన గిరిజన ప్రతినిధులు సమావేశంలో పాల్గొన్నారని, గిరిజన జిల్లాల్లో పార్టీ టిక్కెట్లలో సమాజానికి, ముఖ్యంగా యువతకు ప్రాధాన్యత లభిస్తుందని గాంధీ హామీ ఇచ్చారని అన్నారు.

### గత మూడు సార్వత్రిక ఎన్నికల్లో

## అక్రమాలపై విచారణకు కమిటీ


### బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వం ప్రకటన



**ఢాకా:** బంగ్లాదేశ్‌లో జరిగిన గత మూడు సార్వత్రిక ఎన్నికల్లో చోటు చేసుకున్న అక్రమాలపై విచారణ జరిపేందుకు అక్కడి తాత్కాలిక ప్రభుత్వం ఒక కమిటీని ఏర్పాటు చేసింది. 2014, 2018, 2024 సంవత్సరాల్లో జరిగిన సాధారణ ఎన్నికల్లో పలు అక్రమాలు జరిగాయన్న విమర్శలు చాలాకాలంగా ఉన్నాయి. అప్పటి ప్రధాని షేక్ హసీనాపై తిరుగుబాటుకు ఇది కూడా ఒక కారణం. హసీనా పదవీచ్యుతురాలైన తర్వాత, బంగ్లాదేశ్‌లో ఏర్పడిన రాజకీయ గందరగోళానికి తెరదించుతూ, మహమ్మద్ యూనస్ నేతృత్వంలో తాత్కాలిక ప్రభుత్వ ఏర్పాటు విషయం తెలిసిందే. షేక్ హసీనా, ఆమె మంత్రివర్గ సహచరులతోపాటు, అప్పట్లో ఆమెకు అనుకూలంగా వ్యవహరించిన అధికారులు, ఆమె నేతృత్వం వహిస్తున్న అవామీ లీగ్ పార్టీకి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలపైన కూడా వివిధ కేసులు నమోదయ్యాయి. హసీనాపై అవినీతి, అక్రమాలు, అధికార దుర్వినియోగం వంటి పలు కేసులు ఉండగా, గత మూడు సార్వత్రిక ఎన్నికల్లో భారీ ఎత్తున అవకతవకలు జరిగాయన్న ఆరోపణలపై తాత్కాలిక ప్రభుత్వం ఏతరగరనర ఉధర్యమతవ కొడిద కమిటీని ఏర్పాటు చేసింది. సెప్టెంబర్ 30వ తేదీలోగా నివేదిక ఇవ్వాలని ఆదేశించింది.


### కల్తీ డీజిల్.. సిఎం కాన్వాయ్‌లోని

## 19 వాహనాలు బ్రేక్‌డౌన్!



**భోపాల్ :** మధ్యప్రదేశ్ రాష్ట్రంలో షాకింగ్ ఘటన చోటు చేసుకుంది. సిఎం కాన్వాయ్ లోని 19 కార్లు ఒకేసారి బ్రేక్‌డౌన్ అయ్యాయి. దీంతో ఏం జరిగిందో అర్థంకాక అధికారులు కాసేపు తలలు పట్టుకున్నారు. అనుమానం వచ్చి డీజిల్ ట్యాంక్‌లను తెరిచి చూడగా.. అందులో నీళ్లు ఉండటంతో షాక్ అయ్యారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. సిఎం మోహన్ యాదవ్ గురువారం రాత్రి రత్లాంకు రోడ్డు మార్గంలో బయల్దేరారు. మార్గం మధ్యలో ఓ పెట్రోల్ బంక్ వద్ద వాహనాలకు డీజిల్ కొట్టించారు. ఆ తర్వాత కొంత దూరం ప్రయాణించిన వాహనాలు.. ఒకదాని తర్వాత ఒకటి తీవ్ర కుదుపులకు గురై ఒక్కసారిగా ఆగిపోయాయి. దీంతో ఏం జరిగిందో అర్థం కాక సిబ్బంది కాసేపు తలలు పట్టుకున్నారు. ఈ ఘటనతో అక్కడ ట్రాఫిక్ సమస్య తలెత్తింది. సిబ్బంది వాహనాలను రోడ్డు పక్కకు తోసుకెళ్లారు. సమాచారం అందుకున్న అధికారులు అక్కడికి చేరుకుని కార్లు ఎందుకు బ్రేక్‌డౌన్ అయ్యాయన్న దానిపై పరిశీలించారు. ఈ క్రమంలో డీజిల్ ట్యాంక్‌లను ఓపెన్ చేసిన చూడగా.. అందులో నీళ్లు ఉన్నట్లు గుర్తించారు. వాహనాల్లోని డీజిల్‌ను బయటకు తీసి చూడగా.. అందులో సగానికి పైగా నీళ్లే ఉన్నట్లు తేలింది. దీంతో అధికారులు సదరు పెట్రోల్ పంప్ వద్దకు వెళ్లి తనిఖీలు చేశారు. కల్తీని నిర్ధారించి ఆ పెట్రోల్ బంక్‌ను సీజ్ చేశారు. ఈ ఘటన రాష్ట్ర వ్యాప్తంగా తీవ్ర కలకలం రేపింది.

## 'మహా' ప్రజలు హిందీ వ్యతిరేకులు కాదు : పవార్



**కొల్హాపూర్ :** మహారాష్ట్ర ప్రజలు హిందీ వ్యతిరేకులు కాదని, కానీ 14 తరగతి విద్యార్థులపై హిందీని రుద్దడం సరైనది కాదని ఎన్‌సిపి (ఎస్‌పి) అధ్యక్షుడు శరద్ పవార్ శుక్రవారం అన్నారు. శుక్రవారం ఆయన కొల్హాపూర్‌లో విలేకరులతో మాట్లాడారు. దేశ జనాభాలో 55 శాతం మంది హిందీ మాట్లాడతారని, దానిని ఎవరూ విస్మరించలేరని అన్నారు. మరాఠీ, ఇంగ్లీష్ మీడియం పాఠశాలల్లో 1 నుండి 5 తరగతుల వరకు విద్యార్థులకు హిందీని సాధారణంగా మూడవ భాషగా బోధించాలని రాష్ట్ర ప్రభుత్వం గత వారం సవరించిన ఉత్తర్వు జారీ చేసిన తర్వాత మహారాష్ట్రలో భాషా వివాదం చెలరేగింది. ఆ ఉత్తర్వుల ప్రకారం... ఒక పాఠశాలలో తరగతికి 20 మంది విద్యార్థులు ఏదైనా ఇతర భారతీయ భాషను నేర్చుకోవాలనుకుంటే వారు హిందీని నిలిపివేయవచ్చు. అలాంటి డిమాండ్ తలెత్తితే, ఒక ఉపాధ్యాయుడిని నియమిస్తారు లేదా ఆ భాషను ఆన్‌లైన్‌లో బోధిస్తారు. కాగా, 1–4 తరగతి విద్యార్థులపై హిందీని రుద్దడం సరైనది కాదని, ఈ యుగంలో మాతృభాష చాలా ముఖ్యమైనదని పవార్ అన్నారు, 5వ తరగతి తర్వాత అది వారి ప్రయోజనానికి ఉపయోగపడుతుందని, ఎందుకంటే భారతదేశంలో 55 శాతం మంది ప్రజలు ఈ భాషను మాట్లాడతారన్నారు. మహారాష్ట్ర ప్రజలు హిందీని వ్యతిరేకించడం లేదన్నారు. శివసేన (యుబిటి) అధినేత ఉద్ధవ్ థాక్రే, మహారాష్ట్ర నవనిర్మాణ సేన (ఎంఎన్ఎస్) అధినేత రాజ్ థాక్రే ప్రకటించిన నిరసనల గురించి అడిగినప్పుడు, పవార్ మాట్లాడుతూ, అన్ని రాజకీయ పార్టీలు నిరసనలలో చేరాలని థాక్రే కోరుకుంటే, ఈ అంశంపై వారి వైఖరి, ఛ్చితమైన ప్రణాళికలను మనం తెలుసుకోవాలన్నారు. గురువారం సేన (యుబిటి), ఎంఎన్ఎస్ రాష్ట్ర విద్యార్థులపై హిందీని రుద్దే అన్ని ప్రయత్నాలను వ్యతిరేకిస్తామని, ఇది 'భాషా అత్యవసర పరిస్థితి'ని విధించడానికి, 'మరాఠీనెస్'ని తొలగించడానికి పాలక వర్గం చేస్తున్న ప్రయత్నమని నొక్కి చెప్పారు. వేర్వేరు విలేకరుల సమావేశాలను ఉద్దేశించి ఉద్ధవ్ థాక్రే, రాజ్ థాక్రే వరుసగా జూలై 7, 5 తేదీలలో నిరసనలను ప్రకటించారు.

## సిఎంఆర్‌ఎఫ్ పేదలకు వరం



**ప్రజాపక్షం/చౌటుప్పల్ :** చౌటుప్పల్ మండలం కొయ్యలగూడెంలో అనారోగ్యంతో భాధపడుతున్న గంజి శివ జ్యోతి వైద్య ఖర్చుల నిమిత్తం సిఎంఆర్‌ఎఫ్ చెక్కును అందజేశారు. ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సహకారంతో సీఎం సహాయ నిధి చెక్కు రూ.51 వేలను శుక్రవారం లక్కారం కాంగ్రెస్ క్యాంపు కార్యాలయంలో మునుగోడు కాంగ్రెస్ సమన్వయ కర్త, ఎన్నికల ఇంచార్జ్ పబ్బు రాజుగౌడ్, మండల అధ్యక్షులు బోయ దేవేందర్, మున్సిపల్ అధ్యక్షులు సుర్వి నర్సింహా గౌడ్ చేతుల మీదుగా లబ్ది దారుని కుటుంబ సభ్యులకుఅందజేశారు. కాంగ్రెస్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు రాచకొండ భార్గవ్, కొయ్యలగూడెం గ్రామ శాఖ అధ్యక్షులు ఎర్రగుంట వెంకటేశం, కొయ్యలగూడెం కాంగ్రెస్ కన్వీనర్ మాచర్ల సంతోష్ కుమార్, ఎర్రగుంట నరసింహా, ఏల మురళి, పొట్ట బత్తిని పురుషోత్తం పాల్గొన్నారు.

## అక్రమ అరెస్టులతో పోరాటాలు ఆగవు



**ప్రజాపక్షం/నాంపల్లి:** గ్రామ పంచాయతీల అక్రమ అరెస్టులు పోరాటాలను ఆపలేవని ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షులు నాంపల్లి చంద్రమౌళి అన్నారు. శుక్రవారం సిఐటియు రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు హైదరాబాద్ కమిషనర్ ఆఫీస్ ముట్టడి సందర్భంగా ఆ సంఘం నాయకుల్ని, గ్రామపంచాయతీ సిబ్బందిని పోలీస్ స్టేషన్ లో అక్రమ అరెస్టు చేసారు. ఆయన మాట్లాడుతూ గ్రామపంచాయతీ కార్మికులు పెండింగ్లో ఉన్న వేతనాలను వెంటనే చెల్లించాలని జీతాలు పెంచి మల్టీపర్పస్ విధానం రద్దు చేయాలని కోరారు. నాడు ప్రభుత్వం కార్మికులకు ఇచ్చిన హామీలను పట్టించుకోవడం లేదని వాపోయారు. గాదెపాక మరియమ్మ, ఎదుల్ల రాములమ్మ, ఈరమ్మ, సులోచన, చంద్రమ్మ, వెంకటయ్య, తేజ ఉన్నారు.

## స్టడీ మెటీరియల్ పంపిణీ



**ప్రజాపక్షం/జోగులాంబ గద్వాల జిల్లా ప్రతినిధిః** విద్యార్థులు కాంపిటేటివ్ ఎగ్జామ్స్‌లో మెరుగైన ఫలితాల కోసం అవసరమైన మెటీరియల్‌ను జిల్లా కేంద్రంలోని విశ్వేశ్వరయ్య మెమోరియల్ హై స్కూల్‌లో పాఠశాల విద్యా కమిటీ ఛైర్మన్ పి.సాయిబాబ, గంజ్ మర్చంట్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఆర్.మహేశ్వర్ రెడ్డి, పాఠశాల విద్యా కమిటీ చేతుల మీదుగా ఉచితంగా పంపిణీ చేయడం జరిగింది. పాఠశాల ఛైర్మన్ పి.సాయిబాబ మాట్లాడుతూ ప్రతి ఒక్క విద్యార్థి కూడా ఈ మెటీరియల్లోని ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా చదివి భవిష్యత్తు పోటీ పరీక్షలు యందు మంచి మార్కులు సాధించడానికి ప్రయత్నం చేయాలని అభిలషించారు. పాఠశాల విద్యాకమిటీ ఛైర్మన్ పి.సాయిబాబ, గద్వాల న్యూగంజ్ మర్చంట్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఆర్.మహేశ్వర్‌రెడ్డి, గంజ్ కమిటీ సభ్యులు వైస్ ఛైర్మన్ బి.జయప్రకాశ్, ప్రధాన కార్యదర్శి జి.విజయ్‌మోహన్, కోశాధికారి కె.తారనాథ్, డైరెక్టర్స్ వి.నర్సింహులు, కె.రాముడు, యన్.భాస్కర్, యన్.రామాంజనేయులు, పాఠశాల ప్రిన్సిపాల్ భారతి, ఫడ్నీస్ , ప్రధానోపాధ్యాయులు ఈ.కిషోర్ కుమార్, ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## హుజూర్‌నగర్ సిఐకి అభినందన



**ప్రజాపక్షం/హుజూర్‌నగర్ః** జైలు శిక్ష అనుభవిస్తూ పెరోల్‌పై బయటకు వచ్చి ఆరు సంవత్సరాలుగా తప్పించుకుని తిరుగుతున్న ఖైదీని అరెస్టు చేసిన కేసులో హుజూర్‌నగర్ సీఐ చరమంద రాజును, మఠంపల్లి పోలీసులను, జిల్లా ఐటి కోర్ సిబ్బందిని సూర్యాపేట జిల్లా ఎస్పీ కె. నరసింహా శుక్రవారం అభినందించారు. ఐజీ కార్యాలయం నుండి వచ్చిన మెరిటోరియస్ సర్వీస్ రివార్డును ఎస్పీ కె. నరసింహా సీఐ చరమందరాజుకు అందించారు.ఎస్పీ మాట్లాడుతూ ఉత్తమంగా విధులు నిర్వర్తించే పోలీస్ సిబ్బందికి అందించే రివార్డులల్లో అత్యుత్తమమైనది మెరిటోరియస్ సర్వీస్ రివార్డు అని తెలిపారు. లా అండ్ ఆర్డర్‌ను కాపాడే ప్రతి పోలీస్‌కు అరుదైన గౌరవం దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ రవీందర్ రెడ్డి,కోదాడ డీఎస్పీ శ్రీధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కొండమల్లేపల్లి సిఐగా నవీన్‌కుమార్

**ప్రజాపక్షం/కొండమల్లేపల్లి:** కొండమల్లేపల్లి సిఐగా నవీన్‌కుమార్ బాధ్యతలు స్వీకరించారు. గతంలో నాంపల్లి సిఐగా పనిచేసిన ఈయన మల్టీజోన్ ఐజీ ఆఫీస్‌కు బదిలీపై వెళ్ళి తాజాగా మళ్ళీ కొండమల్లేపల్లి సిఐగా బాధ్యతలు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ కొండమల్లేపల్లి సర్కిల్ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణకు నిస్వార్థంగా పనిచేస్తానని అన్నారు. ట్రాఫిక్ నియంత్రణ, మాదక ద్రవ్యాల సరఫరాకు అడ్డుకట్ట వేసి, చోరీలపై నిరంతరం నిఘా ఉంచుతామని అన్నారు. శాంతి భద్రతల పరిరక్షణలో మండల ప్రజలు, ప్రజా ప్రతినిధులు పోలీస్ శాఖకు సహకరించాలని కోరారు.

## 30వరకు సన్నబియ్యం : కలెక్టర్

**ప్రజాపక్షం/సూర్యాపేటకలెక్టరేట్:** మూడు నెలల సన్నబియ్యం పంపిణీకి ఈనెల 30 తేదీ వరకే గడువు ఉందని జిల్లా కలెక్టర్ తేజస్‌నంద్‌లాల్ పవార్ ఒక ప్రకటనలో తెలిపారు. లబ్ధిదారులు తమ సమీపంలోని రేషన్‌డీలర్ దుకాణం వద్దకు వెళ్లి మూడు నెలల బియ్యాన్ని తీసుకోవాలని సూచించారు. బియ్యం పంపిణీ విషయంలో పొడగింపు ఉత్తర్వులు ఏమీ లేవని చెప్పారు.

## పోలీస్‌శాఖ గౌరవాన్ని పెంచాలి



**ప్రజాపక్షం/నల్లగొండటౌన్:** పదోన్నతి పొందిన ఎస్.ఐలకు పదవితో పాటు బాధ్యతలు కూడా పెరుగుతాయని క్రమ శిక్షణతో, బాధ్యతగా విధులు నిర్వహించాలని జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవార్ సూచించారు. శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో వివిధ పోలీస్ స్టేషన్లో పనిచేస్తున్న ఆరుగురు ఏఎస్ఐ లకు, ఎస్.ఐలుగా పదోన్నతి పొందిన సందర్భంగా జిల్లా ఎస్పీ స్టార్ లు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదోన్నతితో పాటు బాధ్యతలు కూడా పెరుగుతాయని,పోలీసు స్టేషనుకు వచ్చే పిర్యాదుదారులతో మర్యాదగా మాట్లాడుతూ సమస్యను పరిష్కరించే దిశగా పని చేస్తూ తమకు అప్పగించిన విధులను క్రమ శిక్షణతో బాధ్యతతో పని చేయాలని అన్నారు.అప్పుడే పోలీస్ శాఖకు గౌరవం వస్తుందని అన్నారు.ఈ కార్యక్రమంలో పోలీసు అధికారులు సంఘం అధ్యక్షుడు జయ రాజు పదోన్నతి పొందిన ఎస్.ఐ లు తదితరులున్నారు.

## కార్పొరేట్‌కు దీటుగా.. ప్రభుత్వ కళాశాలలు

### కళాశాల టాపర్‌కు గోల్డ్ మెడల్ ఇస్తా
### భారీ నీటిపారుదల,ఆహార, పౌరసరఫరాల శాఖా మంత్రి నలమాద ఉత్తమ్ కుమార్‌రెడ్డి



**ప్రజాపక్షం/హుజూర్‌నగర్ః** కార్పోరేట్ కళాశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలు,జూనియర్, డిగ్రీ కళాశాలలను ఆధునీకరించడం జరుగుతుందని, విద్యార్థులకు మంచి వసతులతో కూడిన విద్యను అందించడం జరుగుతుందని భారీ నీటి పారుదల,ఆహార,పౌరసరఫరాల శాఖామాత్యులు నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. శుక్రవారం హుజూర్‌నగర్‌లోని ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలల నూతన భవనాల నిర్మాణాలకు మంత్రి శంకుస్థాపనలు చేశారు. ఆయన మాట్లాడుతూ యావత్ తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ కళాశాలలలో విద్యను అభ్యసించే విద్యార్థులకు కావాల్సిన మౌళిక సదుపాయాలను కల్పిస్తున్నామన్నారు. హుజూర్‌నగర్‌లోని ప్రభుత్వ కళాశాలలు శిధిలావస్థకు చేరడంతో నూతన భవనాలకు శంకుస్థాపనలు చేయడం జరిగిందన్నారు. త్వరతగతిన కళాశాలల నిర్మాణాలు పూర్తి చేస్తామన్నారు. అందుకోసమే జూనియర్ కళాశాల నిర్మాణాలకు రూ.7 కోట్ల 20 లక్షలు, డిగ్రీ కళాశాల నిర్మాణాలకు రూ.4 కోట్ల 65 లక్షలను రాష్ట్ర ప్రభుత్వం మంజూరీ చేయడం జరిగిందని తెలియజేశారు. నిరుపేదల కుటుంబాలకు చెందిన పిల్లలే ప్రభుత్వ పాఠశాలలు,కళాశాలల్లో చదువుకుంటారని వారందరికీ నాణ్యమైన విద్యను అందించడమేతెలంగాణ ప్రజా ప్రభుత్వం యొక్క లక్ష్యం అన్నారు. తమ పిల్లలకు సరైన, నాణ్యమైన విద్యను అందించడం ద్వారా వారిని భావి భారత పౌరులుగా తీర్చిదిద్దినట్లేనన్నారు. హుజూర్‌నగర్,కోదాడలలోని ప్రభుత్వ పాఠశాలలు,కళాశాలల్లో కావాల్సిన వసతులు కల్పనే ధ్యేయంగా తాము కృషి చేస్తున్నామని మంత్రి తెలిపారు. అలాగే ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలల్లో ఫైనల్ ఇయర్ టాపర్‌గా నిలిచిన విద్యార్థులకు తమ స్వంత బడ్జెట్ నుండి గోల్డ్ మెడల్ అందిస్తానని విద్యార్థులనుద్దేశించి మంత్రి హామీ ఇచ్చారు. అంతకు ముందు ఎమ్మెల్సీ శంకర్ నాయక్ మాట్లాడుతూ హుజూర్‌నగర్,కోదాడ నియోజకవర్గాలలో ఉత్తమ్ పద్మావతిలు చేసిన అభివృద్ధి పనులను గురించి ఒక్కొక్కటిగా చెబుతూ కొనియాడారు. ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి యరగాని నాగన్న గౌడ్, టీపీసీసీ ప్రధానకార్యదర్శి ఈడ్పుగంటి సుబ్బారావు, రాష్ట్ర నాయకులు సాముల శివారెడ్డి, దొంగరి వెంకటేశ్వర్లు,మార్కెట్ కమిటీ ఛైర్మన్ రాధికా అరుణ్‌కుమార్ ధేశ్‌ముఖ్, మున్సిపల్ మాజీ ఛైర్మన్లు దొంతగాని శ్రీనివాస్‌గౌడ్, గెల్లి అర్చన రవి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు తన్నీరు మల్లిఖార్జున్,ముడెం గోపిరెడ్డి, బెల్లంకొండ గురవయ్య,మేళ్ళచెర్వు ముక్కంటి తదితరులు పాల్గొన్నారు.

## సబ్జెక్టుపై పూర్తి పట్టు ఉంటేనే విషయ పరిజ్ఞానం

### నల్లగొండ కలెక్టర్ ఇలా త్రిపాఠి



**ప్రజాపక్షం/నల్లగొండ :** విద్యార్థులు సబ్జెక్టుపై అవగాహన పెంపొందించుకోవాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి సూచించారు.శుక్రవారం ఆమె కనగల్ మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆకస్మికంగా సందర్శించి ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం సిఈసి తరగతి గదికి వెళ్లి విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడారు .ఎకనామిక్స్ సబ్జెక్టుపై ఆమె మాట్లాడుతూ సబ్జెక్టు విషయాలపై పూర్తిపట్టు ఉన్నప్పుడే పరీక్షల్లో మంచి సమాధానాలు రాయగలుగుతారని, అంతేగాక విషయపరిజ్ఞానం వస్తుందని, పోటీ పరీక్షల సమయంలో సైతం ఇది ఉపయోగపడే అవకాశం ఉంటుందని తెలిపారు .ఈ సందర్భంగా విద్యార్థుల లక్ష్యాలు ,వారి విద్యా సామర్థ్యాలు, తదితర విషయాలను పరిశీలించారు. అడిగిన ప్రశ్నలకు సరైన సమాధానాలు ఇచ్చిన వారికి జిల్లా కలెక్టర్ చాక్లెట్లను పంపిణీ చేశారు.అంతకుముందు జిల్లా కలెక్టర్ కనగల్ వ్యవసాయ మార్కెట్ యార్డ్ ను సందర్శించి మార్కెట్ యార్డ్ అభివృద్ధికి చేపట్టాల్సిన ప్రతిపాదనలు తయారుచేసి ప్రభుత్వానికి పంపించాలని మార్కెటింగ్ శాఖ అధికారులను ఆదేశించారు.జిల్లా కలెక్టర్ వెంట రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, పౌరసరఫరాల జిల్లా మేనేజర్ హరీష్, మార్కెటింగ్ శాఖ ఏడి ఛాయదేవి, జిల్లా పౌర సరఫరాల అధికారి వెంకటేశ్వర్లు ,మార్కెటింగ్ సెక్రటరీ శ్రీధర్ రాజు, తదితరులు ఉన్నారు.

## అవినీతికి తావులేదు.. నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యం

### కోదాడ ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి



**ప్రజాపక్షం/కోదాడ:** కోదాడ నియోజకవర్గ అభివృద్దే తనలక్ష్యమని కోదాడ ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి అన్నారు. శుక్రవారం కోదాడ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. నియోజకవర్గంలో ఎక్కడ కూడా అవినీతికి తావులేద్నన్నారు. గత్తేదారుల పనుల్లో నాణ్యత లోపిస్తే తన దృష్టికి తేవాలన్నారు. 18 నెలల కాలంలో కోదాడ నియోజకవర్గానికి సుమారు రూ.రెండువేల కోట్ల రూపాయలు వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు మంజూరు చేయించామన్నారు. గ్రామీణ అభివృద్ధి రోడ్లు, వ్యవసాయం, నీటిపారుదల, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం, రైతు సంక్షేమానికి పెద్ద పీట వేశామన్నారు. నియోజకవర్గంలో ఏ చిన్న సమస్య వచ్చినా నాదృష్టికి తీసుకరాండి వెంటనే పరిష్కరిస్తానని అన్నారు. ప్రజలకు, ప్రభుత్వానికి వారదులు విలేకరులే అని కితాబిచ్చారు. ఈ విలేకరుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పలువురు జర్నలిస్టులు తమకు ఏళ్ల తరబడి ఇండ్ల స్థలాలు ఇస్తామని హామీలు ఇ చ్చారే తప్ప అమలు చేయడంలేదని ఎమ్మెల్యే దృష్టికి తీసుకరాగా తప్పకుండా విలేకరులందరికి ఇళ్ల స్థలాలు మంజూరు చేయిస్తామన్నారు. సంక్షేమ పథకాల్లో అర్హులైన విలేకరులకు ప్రాధాన్యత కల్పిస్తామని అన్నారు. రాబోయే రోజుల్లో కోదాడ నియోజకవర్గాన్ని మరింత అభివృద్ది పదంలో నడిపించి రాష్ట్రంలో ఆదర్శనియోజకవర్గంగానిలుపుతామని అన్నారు.

## మళ్లీ నేరాలకు పాల్పడితే పూచికత్తు నగదు చెల్లించాల్సిందే : ఎస్‌పి నర్సింహ



**ప్రజాపక్షం/సూర్యాపేట:** నేరస్తులు బైండోవర్ నిబంధనలు ఉల్లంఘించి మళ్లీ నేరాలకు పాల్పడితే పూచికత్తు నగదు చెల్లించాలని జిల్లా ఎస్‌పి కె. నర్సింహా అన్నారు. అలవాటుగా నేరాలకు పాల్పడే వారిని ప్రజలను ఇబ్బందులను గురిచేసే వారిని, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిని, సస్పెక్టడ్ రౌడీషీటర్స్ మళ్లి నేరాలకు పాల్పడితే ఆరు నెలలు, సంవత్సర కాలం పూచికత్తు బైండోవర్ చేయడం జరుగుతుందని జిల్లా ఎస్‌పి కె.నర్సింహా తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించి మళ్లీ నేరాలకు పాల్పడితే మొత్తం రూ. పూచికత్తులు చేపడతారో ఆ డబ్బులు మండల మేజిస్ట్రేట్ (తహసిల్దార్) ఉత్తర్వుల ప్రకారం ప్రభుత్వ ఖాతా నందు జమచేయడం జరుగుతుందని తెలిపారు. గత మార్చినెలలో మిర్యాల గ్రామంలో జరిగిన హత్య కేసులో ప్రధాన నిందితుడు ఏ1 కనకటి వెంకన్న అలియాస్ వెంకటేశ్వర్లు, ఎ2 కనకటి శ్రావణ్ ఈ హత్య జరగడానికి ముందు జామిన్‌గా ఉన్న తగదా విషయంలో 9నెలల క్రితం ఒక్క సంవత్సర కాలానికి నూతన్‌కల్ తహసిల్దార్ వద్ద బైండోవర్ చేయడం జరిగిందన్నారు. వీరిద్దరు బైండోవర్ కాలపరిమితి నిబంధనల ప్రకారం రూ. లక్ష పూచికత్తు ఉన్నాయని చెప్పారు. ప్రభుత్వ ఖాతా నందు ఒక్కొక్కరికి రూ.లక్ష రూపాయలు జమ చేయడం జరిగిందన్నారు. వీరు ఇద్దరు హత్య కేసులో ప్రధాన నిందితులు అని పిడియాక్ట్ నమోదు చేయబడి సెంట్రల్ జైల్లో శిక్ష అనుభవిస్తున్నారని అన్నారు. బైండోవర్ కేసుల్లో ఉల్లంఘనలు అతిక్రమిస్తే ఎంతటివారినైన ఈలాంటి కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు.

## స్థానిక ఎన్నికలపై నిలదీసే హక్కు బిజెపికి లేదు

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** స్థానిక ఎన్నికలు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని అడిగే హక్కు బిజెపికి లేదని బిసి హక్కుల సాధన సమితి తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధూళిపాళ ధనుంజయనాయుడు వ్యాఖ్యానించారు. శుక్రవారం మిర్యాలగూడ పట్టణంలోని బీసీ భవన్‌లో బీసీ హక్కుల సాధన సమితి నియోజకవర్గ నాయకులు చేగొండి మురళీయాదవ్‌తో కలిసి విలేకరులతో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం 2023 డిసెంబర్ 7న ఏర్పడిన తరువాత కులగణన చేపట్టి బీసీలకు స్థానిక సంస్థల్లో 42శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని అసెంబ్లీలో తీర్మాణం చేసి గవర్నర్‌తో ఆమోద ముద్ర వేయించి కేంద్రానికి పంపితే అక్కడ బిల్లు ఆమోదించకుండా కాలయపాన చేస్తున్న బీజేపీ నాయకులకు స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించమని అడిగే హక్కు ఎక్కడిదని ప్రశ్నించారు. తెలంగాణకు చెందిన అఖిల పక్ష బీసీ నాయకులను ప్రధాని వద్దకు తీసుకెళ్లేందుకు కేంద్ర మంత్రులు, బీజేపీ ఎంపీలు ప్రత్యేక చొరవ చూపాలన్నారు. బీసీలకు ప్రధాన శత్రువు బీజేపీ అని అన్నారు. తెలంగాణ ప్రభుత్వం పంపించిన బిల్లును ఆమోదింపజేయాలన్నారు. జూలై 14న తెలంగాణ వ్యాప్తంగా అన్ని జిల్లా కలెక్టర్ కార్యాలయాల ముందు బీసీ హక్కుల సాధన సమితి ఆధ్వర్యంలో4 2 శాతం రిజర్వేషన్లను అమలుచేశాకే స్థానిక సంస్థలకు వెళ్లాలని డిమాండ్‌తో ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు.

## పిల్లలకు అర్థమయ్యేలా బోధన

### యాదాద్రి కలెక్టర్ హనుమంతరావు



**ప్రజాపక్షం/యాదాద్రిః** 2025–2026 విద్యా సంవత్సరానికి గాను ఇంటర్మీడియట్ కళాశాలలో, ప్రభుత్వపాఠశాలలోఎక్కువగాఅడ్మిషన్లు అయ్యేలా చూడాలని, విద్యార్థిని, విద్యార్థుల విద్యా ప్రమాణాలు మెరుగుకై, జూనియర్ కాలేజీ ప్రిన్సిపల్స్, ప్రధానోపాధ్యాయులు, మండల ఎడ్యుకేషన్ అధికారులు నిబద్ధతతో కృషి చేయాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా ఇంటర్మీడియట్, జిల్లా విద్యా శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యత కల్పిస్తునందున అదే దిశగా ఉపాధ్యాయులు నాణ్యమైన విద్యా బోధన చేయాలన్నారు. పిల్లలకు అర్థమయ్యేలా విద్యా బోధన చేయాలన్నారు. గత సంవత్సరం కంటే ఈసారి ఎక్కువ మంది విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించేలాలక్ష్యంతో ముందుకు సాగాలని సూచించారు. విద్యార్థులకు స్పెషల్ క్లాసులు తీసుకోవాలని సూ చించారు. నాణ్యమైన భోజనం అందించాలని ప్రధానోపాధ్యాయులు, కమిటీ సభ్యులు నిరంతర పర్యవేక్షణ చేయాలన్నారు. జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి నాగిరెడ్డి, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి రమణి, జిల్లా విద్యాధికారి సత్యనారాయణ, ప్రిన్సిపాల్‌లు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

## గీత కార్మికులకు వెయ్యి కోట్లతో సంక్షేమనిధి ఏర్పాటేది?

### గీత పనివారల సంఘం రాష్ట్ర కార్యదర్శి పబ్బు వీరస్వామి



**ప్రజాపక్షం/చండూరుః** గీత కార్మికులకు వెయ్యికోట్ల తో సంక్షేమ నిధిని ఏర్పాటు చేయాలని ,మునుగోడు నియోజకవర్గంలో నీరా పరిశ్రమను ఏర్పాటు చేయాలని గీతా పనివారల సంఘం రాష్ట్ర కార్యదర్శి పబ్బు వీరస్వామి ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం చండూరు మండల కేంద్రంలోని సిపిఐ కార్యాలయం మాధగోని నర్సింహ్మా భవనంలో గీతాపనివారల సంఘం మండల 15వ మహాసభ సంఘం మండల అధ్యక్షుడు గంట రమేష్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి గీతా పనివారల సంఘం రాష్ట్ర కార్యదర్శి పబ్బు వీరస్వామి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ గీతా కార్మికుల సంక్షేమం కోసం వెయ్యికోట్ల రూపాయలతో సంక్షేమ నిధిని ఏర్పాటు చేసి గీతాకార్మికులను ఆదుకోవాలని డిమాం డ్ చేశారు. కార్మికులు ప్రమాదవశాత్తు చెట్లపై నుండి పడితే పాతపద్ధతిప్రకారంమెడికల్ సర్టిఫికెట్ ద్వారానే ఎగ్రేషియాను చెల్లించాలనికోరారు. 2022 నుండి రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న13కోట్ల ఎగ్రేషియాను,నల్లగొండ జిల్లాలో 2కోట్ల 25లక్షల ఎగ్రేషియా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. గీతపనివారల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బొడిగె సైదులు మాట్లాడుతూ అర్హులైన ప్రతి గీతాకార్మికుడికి వృత్తి పెన్షన్‌ను మం జూరు చేయాలన్నారు.చండూరు ఎఎంసి డైరెక్టర్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు నల్పరాజు రామలింగయ్య, సిపిఐ మండల కార్యదర్శి నల్పరాజు సతీష్‌కుమార్, గీత పనివారల సంఘం జిల్లా సహాయ కార్యదర్శి పల్లె శంకరయ్య, మండల సహాయ కార్యదర్శి బొడ్డు వెంకటేశ్వర్లు, గీత సనివారల సంఘం మండల అధ్యక్షుడు గంట నగేష్ , బరిగెల వెంకటేష్ , బండమీది వెంకన్న, పాలకూరిసత్తయ్య,గడ్డం నవీన్,పల్లెనర్సింహ్మా,బోయపల్లి అంజయ్య,గుణగంటి యాదయ్య, బోయపల్లి శంకరయ్యఉన్నారు.

# రాములోరి సొమ్ము నాయకుల పాలు


## సిండికేట్ కాకుండా వేలంపాట పాడుతారా? –పక్కదారి పడుతున్న సొమ్మును పసిగట్టిన కలెక్టర్ – 'మిర్యాల' శ్రీరామచంద్రస్వామి కౌలు భూములకు తిరిగి వేలం



**ప్రజాపక్షం/సూర్యాపేటప్రతినిధి: దేవుడి సొమ్ము అంటేనే ఎవ రైనా తినాలంటేనే భయపడతారు. కాని ఈ గ్రామంలో మాత్రం దేవుడి సొమ్మును కాజేసేందుకు రాజకీయ పార్టీ నాయకులు ఏ మాత్రం వెనుకడారు. నేనంటే నేను అంటూ పోటీ పడి మరీ తినేందుకు ముందుకు వస్తారు. నూతన్‌కల్ మండలంలోని మిర్యాలలో ఉన్న శ్రీసీతరామ చంద్రస్వామి దేవాలయ సొమ్ము ప్రతి ఏటా నాయకులపాలు అవుతుంది. దేవాలయానికి 82 ఎకరాల 20 కుంటల భూమి ఉండగా దేవాదాయశాఖవారు వేలంపాట ద్వారా భూములను కౌలు కు ఇవ్వడం అనవాయితీ. గ్రామంలోని నాయకులందరూ సిండికేట్‌గామారి వేలం డబ్బులు పెంచకుండా అతి తక్కువ ధరకు భూములు తీసుకొని దేవుడి ఆదాయానికి గండిపెడుతున్నారు. ఇది పసిగట్టిన కలెక్టర్ తేజస్‌నంద్‌లాల్ పవార్ ఆదాయంపక్కదారి పట్టకుండాఉండేందుకు2ఏప్రిల్ 2025 లో నిర్వహించిన వేలం రద్దైంది. దేవాదాయ అధికారులు 4జూలై 2025న తిరిగి కౌలు భూములకు వేలంపాట నిర్వహించేందుకు ప్రకటన జారీ చేశారు. దీనిపై ప్రత్యేక కథనం.**

తెలంగాణ రాష్ట్రంలో రెండో భద్రాద్రిగా పేరొందిన నూతన్‌కల్ మండలంలోని శ్రీసీతారామచంద్రస్వామి దేవాలయానికి దాదాపు 200 ఎకరాలకు పైగా మాన్యం భూములున్నాయి. గత ప్రభుత్వ హాయంలో గ్రామాభివృద్ధి కోసం చేపట్టిన కొన్ని పనులకు ఈ దేవాలయ భూములను ప్రభుత్వం తీసుకుని పల్లెప్రకృతివనం, హరితహారం నర్సరి, క్రీడాప్రాంగణం, వైకుంఠదామాలతో పాటు మరికొన్నింటికి నిర్మాణం చేయడం జరిగింది. వీటన్నింటికి కేటాయించగా 82 ఎకరాల 20 కుంటల భూమి మిగులు ఉంది. ఇటీవల దేవాదాయశాఖ అధికారులు కూడా సర్వే చేయించగా ఇదే భూమి ఉన్నట్లుగా తేలింది. ఈ దేవాలయ భూమిని అధికారులు, దేవాలయ పాలకవర్గం సభ్యులు ప్రతి సంవత్సరం వేలంపాట నిర్వహించి వచ్చిన ఆదాయంతో స్వామివారి కళ్యాణంతో పాటు ఇతర ఉత్సవాలను నిర్వహిస్తూ రావడం అనవాయితీ. ఆ గ్రామంలో ఉన్న ఆయా రాజకీయ పార్టీల నాయకులందరూ ఏకమై వేలం ఎక్కువ పాటకుండా తక్కువ ధరకు దేవాలయ భూములను దక్కించుకుని ఇతరులకు అధిక కౌలుకు ఇచ్చుకుని ఎక్కువగా లబ్ధిపొందుతున్నారు. ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీ నాయకులదే ఆ గ్రామంలో హవా నడుస్తు వస్తుంది. దేవుడి సొమ్ము పంపకాలు, ఆదిపత్యం కోసం గతంలో గ్రామంలో ఒకరిపై ఒకరు దాడులు చేసుకున్న సంఘటనలు అనేకం ఉన్నాయి. ఈ దాడుల్లో అనేకమంది హత్యకు గురయ్యారు. దేవాలయ కౌలు భూములను దేవాదాయశాఖ అధికారులు 2ఏప్రిల్ 2025న వేలంపాట నిర్వహించారు. ఈ వేలంలో మొత్తం 82 ఎకరాల 20 కుంటల భూమిని అధికార పార్టీకి చెందిన నాయకులు కేవలం రూ. 5 లక్షలకే దక్కించుకున్నారు. గతంలో ఈ భూముల వేలం ద్వారా దేవాలయానికి దాదా పు రూ.10 లక్షలకు పైగా ఆదాయం రావడం జరిగింది.అధికార పార్టీ నాయకులు వేలంలో పాటను పెరగకుండా అడ్డుకుని తక్కువకే తన అనుచరవర్గానికి కట్టబెట్టినట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి.

### పక్కదారిపడుతున్న సొమ్మును పసిగట్టిన కలెక్టర్
### శ్రీరామచంద్ర కౌలు భూములకు తిరిగి వేలం



శ్రీసీతారామచంద్రస్వామి దేవాలయ ఆదాయం పక్కదారి పట్టినట్లు జిల్లా కలెక్టర్ తేజస్‌నంద్‌లాల్ పవార్ పసిగట్టారు. ప్రతిపక్ష పార్టీల నాయకులు కూడా 2ఏప్రిల్ 2025న దేవాలయ భూముల కౌలువేలం నిర్వహించగా గతంకన్నా రూ.5 లక్షలకుపైగా తక్కువకు పాటపాడి భూముల సేద్యం చేసేందుకు హక్కును పొందారు. ఈ వేలంలో అధికార పక్ష నాయకులు ఎవరికి కూడా పాట పాడకుండా అడ్డుకున్నారని ప్రతిపక్ష నాయకులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ముందుగా ఊహించిందే నిజమని తేలడంతో ఆయన దేవాదాయశాఖ కమిషనర్‌కు వేలంలో అవకతవకలు జరిగాయని లేఖ రాశారు. దీంతో స్పందించిన దేవాదాయశాఖ దేవాలయ భూముల వేలం 4 జూలై 2025న తిరిగి నిర్వహించేందుకు ప్రకటనలు జారీ చేశారు. గ్రామంలో ఎకరం మెట్ట భూమికి కౌలు రూ.10వేల నుండి రూ.12 వేల వరకు డిమాండ్ పలుకుతుంది. ఇలా లెక్క చూసుకుంటే మొత్తం భూమికి రూ. 8 లక్షల 20వేల నుండి, రూ.9 లక్షల 90వేలు కౌలు ఆదాయం దేవాలయానికి రావాల్సి ఉంది.శ్రీసీతారామచంద్రస్వామి భూములకు తిరిగి నిర్వహిస్తున్న కౌలువేలంలోనైనా దేవాలయానికి అధిక ఆదాయం వస్తుందా...లేక అధికార, ప్రతిపక్ష పార్టీ నాయకులు ఏకమై దేవుడి ఆదాయానికి గండిపెడతార అన్నది చర్చ సాగుతుంది. ఏదీ ఏమైనా రాజకీయ నాయకుల జోక్యం లేకుండా భూములు వేలం నిర్వహిస్తే స్వామివారి దేవాలయానికి ఆదాయం పెరుగుతుందని ప్రజలు చెబుతున్నారు.

## ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులు పరిశీలన



**ప్రజాపక్షం/నిజాంసాగర్ :** మహ్మద్‌నగర్ మండలకేంద్రంలో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను మండల ప్రత్యేకాధికారి అరుణ, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రవీంధర్‌రెడ్డితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇండ్ల నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని, ఇంటి నిర్మాణ తీరును బట్టి బిల్లులు ఎప్పటికప్పుడు విడుదలవుతాయన్నారు. ఈ పరిశీలన కార్యక్రమంలో మండల యూత్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లయ్యగారి ఆకాష్, ఎంపిడిఒ అనిత, పంచాయతీ కార్యదర్శి ప్రేమ్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా ఆరోగ్య వ్యవస్థపై రాష్ట్ర ఆరోగ్యశాఖ డైరెక్టర్ సమీక్ష



**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** జిల్లా పర్యటనలో భాగంగా నిర్మల్‌కు శుక్రవారం హాజరైన రాష్ట్ర ఆరోగ్య శాఖ డైరెక్టర్ డా.ఆయేషా మస్రత్ ఖానంకు జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్, అదనపు కలెక్టర్ ఛాంబర్‌లో పూలమొక్కలు అందించి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లా ఆరోగ్య వ్యవస్థ, నూతనంగా ప్రారంభించిన ఆరోగ్య కార్యక్రమాలు, ప్రజలకు మెరుగైన వైద్య సేవలు, అలాగే భవిష్యత్‌లో చేపట్టవలసిన అంశాలపై సమీక్ష నిర్వహించారు. ప్రజలకు అందుతున్న వైద్యసేవలపై చర్చించారు.

# అర్హులైన నిరుపేదలకు ఇందిరమ్మ ఇల్లు

### మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్

**ప్రజాపక్షం/మెదక్ ప్రతినిధి :** అర్హులైన నిరుపేదలకు ఇందిరమ్మ ఇల్లు నిర్మించి ఇవ్వాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. శుక్రవారం పెద్ద శంకరంపేట్ మండలం కమలాపూర్ గ్రామంలోని ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఇంటి నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం గ్రామంలో ఫ్రైడే డ్రై డే కార్యక్రమంలో సంబంధిత అధికారులతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 9 వేల ఇందిరమ్మ ఇండ్లు అర్హులయని లబ్ధిదారులకు మంజూరు అయ్యాయని, అందులో 4,500 ఇండ్లు గ్రౌండింగ్ చేయడం జరిగిందని, కొన్ని ఇండ్లు పిల్లర్ల స్థాయిలో ఉన్నాయన్నారు. మండలంలో ఇండ్లనిర్మాణ ప్రక్రియకు లబ్ధిదారులు మొగ్గు చూపుతూ పనులు మొదలు పెడతామని ముందుకు వస్తున్నారన్నారు. బేస్మెంట్ పూర్తయిన ఇందిరమ్మ ఇండ్లకు పంచాయతీ సెక్రెటరీ ద్వారా ఫోటో తీసి పంపిన వారంరోజుల్లోనే లబ్ధిదారుడి అకౌంట్లో లక్ష రూపాయలు జమవుతున్నాయని తెలిపారు. ఇండ్లు నిర్మాణం చేపట్టే లబ్ధిదారులు అనుకున్న రేటులో 5 లక్షల రూపాయలతో పూర్తవుతుందన్నారు. నిస్సాయిత, నిరుపేద, అర్హులైన లబ్ధిదారులకు పక్కా ఇల్లు మంజూరు చేయాలన్న ప్రభుత్వ లక్ష్యం మేరకు పనిచేయాలని కలెక్టర్ అధికారులు ఆదేశించారు. అనంతరం గ్రామంలో డ్రైడే కార్యక్రమాన్ని కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించి, సీజనల్ వ్యాధుల నివారణకు అంకిత భావంతో కృషి చేయాలన్నారు. సీజనల్ వ్యాధులు సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ప్రజలకు వివరిస్తూ అవగాహన కల్పించాలని సూచించారు. పారిశుద్ధ్య కార్యక్రమాలను క్రమం తప్పకుండా నిర్వహించాలని, ఓపెన్ ప్లాట్లు, జనావాసాల మధ్య ఎక్కడైనా నీరు నిల్వ ఉన్నట్లు గమనిస్తే ఆయిల్‌బాల్స్ వేయాలని, గంబూషియా చేప పిల్లలను వదలాలని పిచికారి మందు వేయించాలని, దోమలు వ్యాప్తి చెందకుడా ఫాగింగ్ చేయించాలని తెలిపారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో సీజనల్ వ్యాధుల నివారణకు సంబంధించిన మందులు అందుబాటులో ఉంచాలని, వ్యాధుల పరిస్థితిపై రోజువారిగా నివేదికలు తెప్పించుకుని నిశిత పర్యవేక్షణ జరపాలని సూచించారు. ప్రతీ ఇంటిని ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు సందర్శించాలని, ఇంటి లోపల, పరిసరాల్లో నిల్వ నీరు, చెత్తాచెదారం లేకుండా చూసుకునేలా ప్రజలకు అవగాహన కల్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. డెంగీ, మలేరియా వంటి ప్రమాదకరమైన విషజ్వరాల వల్ల అప్రమత్తంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని వైద్యసిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.





## విద్యార్థులకు కోడిగుడ్డు పెట్టలేం

### ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి ఓమయ్య



**ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి :** జూలై 1 నుంచి పాఠశాల విద్యార్థులకు కోడిగుడ్డు పెట్టలేమని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి ఓమయ్య అన్నారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో డిఇఒ అశోక్‌కు ఎఐటియుసి రాష్ట్ర మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఓమయ్య, ప్రధానకార్యదర్శి చక్రపాణి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత సంవత్సరంకు సంబంధించి మధ్యాహ్న భోజన కార్మికులకు రావల్సిన ఐదు కోట్ల బకాయిలను చెల్లించలేదని ఈ విషయమై గత అకాడమి క్లియర్‌లో ఎన్ని సార్లు ఆందోళన పోరాట కార్యక్రమాలు చేసిన కార్మికులకు సంబంధించిన బిల్లులు చేసి వాటికి సంబంధించిన టోకెన్ నెంబర్లు వచ్చిన తర్వాత కూడా కార్మికుల ఖాతాల్లో డబ్బు జమ కాలేదన్నారు. ప్రస్తుతం పాఠశాల హెడ్మాస్టర్ల ద్వారా మధ్యాహ్న భోజన కార్మికులపై ఒత్తిడి చేస్తూ విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టడంలో భాగంగా రోజుకు రెండు కూరలు, పప్పుచారు, వారానికి మూడు కోడిగుడ్లు పెట్టాలని ఒత్తిడి చేయటం జరుగుతుందన్నారు. ప్రభుత్వం ఇప్పుడు చెల్లిస్తున్న మెనూఛార్జీలు ఏ మాత్రం సరిపోవని, పెరిగిన ధరలకనుగుణంగా ఒక విద్యార్థికి కనీసం 25 రూపాయలు ఛార్జి చెల్లిస్తే తప్ప భోజనం పెట్టలేని పరిస్థితి ఉందన్నారు. కోడిగుడ్డుకు ఆరు రూపాయలు ఇస్తున్నారని బహిరంగ మార్కెట్‌లో ఒక కోడిగుడ్డు ధర 7 నుంచి 8 వరకు ఉందన్నారు. వాటితో పాటు కూరగాయల ధరలు ఆకాశాన్ని అంటుతున్న ఈ పరిస్థితుల్లో గత బిల్లులు రాక అప్పుల ఊబిలో పూరుకుపోయినా మధ్యాహ్న భోజన కార్మికులకు మళ్లీ మెనూ ప్రకారం భోజనం పెట్టాలంటే ఉన్న ఆస్తులు అమ్ముకునే పరిస్థితి ఏర్పడిందన్నారు. ప్రభుత్వం జిల్లాకు రావల్సిన ఐదు కోట్ల రూపాయల బకాయి బిల్లును వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు.


## ఫీజుల నియంత్రణ చట్టాన్ని తీసుకురావాలి : సిపిఐ డిమాండ్



**ప్రజాపక్షం/సంగారెడ్డి ప్రతినిధి :** ప్రైవేట్, కార్పోరేట్ స్కూల్‌లలో విద్య హక్కు చట్టాన్ని అమలు చేయాలని, ఫీజుల నియంత్రణ చట్టాన్ని తీసుకొని రావాలని భారత కమ్యూనిస్టు పార్టీ డిమాండ్ చేశారు. విద్య హక్కు చట్టాన్ని అమలు చేయాలని ప్రైవేటు కార్పోరేట్ స్కూల్లో అక్రమ వసూళ్లను అరికట్టాలని ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన సౌకర్యం కల్పించి ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేయాలని శుక్రవారం సిపిఐ ఆధ్వర్యంలో డిఇఒ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎంఎ రెహమాన్, జిల్లా నాయకులు చింతాగంగయ్య మాట్లాడుతూ జిల్లాలో విద్యా హక్కు చట్టం అమలు చేయకపోవడం వల్ల పేద మద్యతరగతి విద్యార్థులకు విద్య అందని ద్రాక్షలా మారిందన్నారు. స్కూల్ ఫీజుల పేరిట డోనేషన్ల పేరిట యూనిఫారం, షూస్, పాఠ్యపుస్తకాలు తమ స్కూల్లోనే కొనుగోలు చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులపై ఒత్తిడి తెచ్చి వారి నడ్డి విరుస్తున్నారు. లక్షల రూపాయలను తల్లిదండ్రుల దగ్గర నుండి కొల్లగొడుతున్నారు. పేద మద్య తరగతి విద్యార్థులను దృష్టిలో పెట్టుకొని వారికి చదువు అందేలా జిల్లాలో విద్య హక్కు చట్టాన్ని అమలు అయ్యేలా చర్యలు తీసుకోవాలని మాండ్ చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తూ ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేయాలని కోరారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు కాశి , తీరుమలేష్, నరసింహులు , వెంకట్, ఎండి షఫి శ్రీనివాస్ రాజు తదితరలు పాల్గొన్నారు.

## గుడిహత్నూర్ అభివృద్ధికి పోరాటం

### సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి సిర్ర దేవేందర్



**ప్రజాపక్షం/ఆదిలాబాద్ ప్రతినిధి :** గుడిహత్నూర్ మండల అభివృద్ధికి సిపిఐ ఆధ్వర్యంలో పోరాటాలు చేస్తామని సిపిఐ ఆదిలాబాద్ జిల్లా సహాయ కార్యదర్శి సిర్ర దేవేందర్ అన్నారు. గుడిహత్నూర్ మండల కేంద్రంలో శుక్రవారం ఎస్‌కేకె ఉస్మాన్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా దేవేందర్ హాజరయ్యారు. సమావేశంలో సిపిఐ గుడిహత్నూర్ మండల నూతన కార్యవర్గం ఎన్నుకున్నారు. కార్యదర్శిగా ఎస్‌కె ఉస్మాన్, సహాయ కార్యదర్శిగా ఎస్.నరేష్‌లను ఎన్నుకున్నారు. ఎన్నికైన సభ్యులు మాట్లాడుతూ తమపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన పార్టీ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. మండలంలో పార్టీ అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని తెలిపారు.

## తాగునీటి సమస్య పరిష్కరించాలి

### ఎఐటియుసి బ్రాంచ్ సెక్రటరీ ఎస్‌కె బాజీ సైదా



**ప్రజాపక్షం/శ్రీరాంపూర్ :** ఎస్‌ఆర్‌పి 1 గనిలో కార్మికులు తాగునీటి సమస్యను ఎదుర్కొంటున్నారని, వెంటనే యాజమాన్యం స్పందించి పరిష్కరించాలని ఎఐటియుసి బ్రాంచ్ సెక్రటరీ ఎస్‌కె. బాజీ సైదా డిమాండ్ చేశారు. శుక్రవారం అసిస్టెంట్ బ్రాంచ్ కార్యదర్శి మోత్కూరి కొమురయ్యతో కలిసి గనిలోని వివిధ డిపార్ట్మెంట్లలో కార్మికులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాగునీటి కొరతతోపాటు నాసిరకమైన చెమ్మసులు, డ్రిల్ బిట్స్, రాడ్లు సరఫరా కావడం, వెంటిలేషన్ సక్రమంగా లేకపోవడం వంటి సమస్యలు కార్మికులను తీవ్రంగా ఇబ్బందిపెడుతున్నాయని తెలిపారు. నాసిరకమైన టబ్ వీల్స్ వాడటం వల్ల ట్రాక్ లైన్ తప్పుతున్న ఘటనలు జరుగుతున్నాయని వివరించారు. కార్మికుల ఆరోగ్య భద్రతను దృష్టిలో ఉంచుకుని సంబంధిత అధికారులు స్పందించి సమస్యలను పరిష్కరించాలని కోకారు. కార్యక్రమంలో ఫిట్ కార్యదర్శి దాడి రాజయ్య, సహాయక పిట్ కార్యదర్శి పరుశురాం, అనంతరెడ్డి, శ్రీనివాస్, ప్రసాద్, బైరి శ్రీనివాస్ పాల్గొన్నారు.

# ప్రజాసంక్షేమం కాంగ్రెస్‌తోనే సాధ్యం

### మెదక్ ఎమ్మెల్యే రోహిత్‌రావు



**ప్రజాపక్షం/రామాయంపేట :** ప్రజా సంక్షేమం కాంగ్రెస్‌తోనే సాధ్యమవుతుందని మెదక్ ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్‌రావు అన్నారు. శుక్రవారం రామాయంపేట మండలంలోని కళ్యాణలక్ష్మీ లబ్ధిదారులకు మెహెర్ సాయి ఫంక్షన్ హాల్లో చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి నిరంతరం ముఖ్యమంత్రి అట్టడుగు వర్గాల ప్రజల శ్రేయస్సు కోసం అహర్నిశలు కృషి చేస్తున్నాడని తెలిపారు. రైతులకు ఏకకాలంలో రుణాలు మాఫీ చేసిన ఘనత రేవంత్‌రెడ్డికే దక్కిందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ రజనికుమారి, కాంగ్రెస్ నాయకులు చౌదరి సుప్రబాత్‌రావు, రమేష్‌రెడ్డి, సరాపు యాదగిరి, గజవాడ నాగరాజు, దేమె యాదగిరి, చిలుక గంగాదర్, బండారి మహేందర్‌రెడ్డి, కుమార్‌సాగర్, అల్లాడి వెంకటి, చింతల స్వామి, బైరం కుమార్, శివ, పోచమ్మల అశ్విని శ్రీనివాస్, నాగులు పాల్గొన్నారు.

### అక్రమ రిజిస్ట్రేషన్‌లపై చర్యలు తీసుకోవాలని వినతి

రామాయంపేట పట్టణంలోని 1597 సర్వే నంబర్‌లో బీడీ కార్మికులకు ప్రభుత్వం పంపిణీ చేసిన పట్టాలకు అక్రమంగా రిజిస్ట్రేషన్ చేస్తున్న వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎమ్మెల్యే రోహిత్‌రావుకు బాధితులు వినతి పత్రం అందజేశారు. రామాయంపేటలో కల్యాణలక్ష్మీ చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యే వచ్చిన సందర్భంగా బీడీ కార్మికుల కుటుంబాలు, యాదవ సంఘం, ముదిరాజ్ సంఘం సభ్యులు ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. బీడీ కార్మికులకు ప్రభుత్వ స్థలం ఉంటే ఇంటి నిర్మాణం చేసి ఇస్తామంటూ అప్పట్లో ప్రభుత్వం ప్రకటించడంతో శీలం సిద్దారెడ్డి వద్ద రెండు ఎకరాల భూమిని కొనుగోలు చేసి ప్రభుత్వానికి సీలింగ్ చట్టం ప్రకారం అందజేయడం జరిగిందని దీంతో తహసీల్దార్ బీడీ కార్మికులకు పట్టాలు పంపిణీ చేసింది. రెవెన్యూ రికార్డుల్లో అమ్మిన భూమిని తొలగించకపోవడంతో సిద్దారెడ్డితో పాటు అతడి కుమారుడు సుభాష్‌రెడ్డిలు కార్మికులను వేధిస్తూ వారి వద్ద నుండి లక్షలాది రూపాయలు తీసుకొని తిరిగి రిజిస్ట్రేషన్ చేశాడని ఎమ్మెల్యేకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో పాటు మల్లిఖార్జున దేవాలయం, పెద్దమ్మ దేవాలయాలకు విక్రయించిన భూమిపై ఆయా సంఘాల సభ్యులను వేదింపులకు గురిచేస్తున్నాడని తెలిపారు. అక్రమాలకు పాల్పడుతున్న వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. బాధితులకు వినతికి ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి చర్యలు తీసుకుంటామని బాదితులకు హామీ ఇచ్చారు.

## ఎరువులకు బిల్లులు తప్పనిసరి

### జిల్లా వ్యవసాయ అధికారి కల్పన ఆదేశం

**ప్రజాపక్షం/హాజీపూర్ :** రైతులు విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు కొనుగోలు చేసేన దుకాణంలో బిల్లులు తీసుకోవడం తప్పనిసరి అని జిల్లా వ్యవసాయ అధికారి కల్పన తెలిపారు. శుక్రవారం హాజీపూర్ మండలంలోని ఫెర్టిలైజర్ షాపుల్లో జిల్లా వ్యవసాయ అధికారి కల్పన ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు కొనుగోలు చేసిన ప్రతీ వస్తువుకు డీలర్లు బిల్లులు ఇవ్వాలని, రైతులు బిల్లులు తీసుకోవాలని సూచించారు. ఎరువుల పంపిణీ కోసం ఇ పిఓఎస్ మిషన్ ద్వారా రైతుల ఆధార్ కార్డుతో పాటు, వ్యవసాయ పంట విస్తీర్ణాన్ని ఆధారంగా తీసుకుని ఎరువులు ఇవ్వాల్సిందిగా ఫెర్టిలైజర్ డీలర్లకు ఆదేశించారు. నానో యూరియా ప్లస్ లిక్విడ్ ఫెర్టిలైజర్ వాడకం పై రైతులకు అవగాహన కల్పించే బాధ్యత ఫెర్టిలైజర్ షాపుల యాజమాన్యంపై ఉందని చెప్పారు. ప్రభుత్వం ద్వారా వచ్చిన మార్గదర్శకాలను అనుసరించాలని సూచించారు. తనిఖీల్లో కల్పనతో పాటు మండల వ్యవసాయ అధికారి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



## మానవ అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు : ఎఎస్‌పి



**ప్రజాపక్షం/ఆసిఫాబాద్ :** మానవ అక్రమ రవాణా, అసాంఘిక కార్యకలాపాలపై కఠిన చర్యలు తీసుకుంటున్నామని ఎఎస్‌పి చిత్తరంజన్ అన్నారు. కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లాలోని ఆసిఫాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఇటీవల మానవ అక్రమ రవాణా కేసులో 10 మందిపై ఎఫ్ఐఆర్ నమోదు చేయగా, వారిలో 8 మందిని గత వారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని, మిగిలిన ఇద్దరినీ శుక్రవారం ఆసిఫాబాద్ బస్టాండ్ ప్రాంతంలో అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించామని చెప్పారు. ఆసిఫాబాద్ పట్టణంలోని పోలీస్ స్టేషన్లో సిఐ రవీందర్‌తో కలిసి విలేకరులతో మాట్లాడిన సందర్భంగా ఎఎస్‌పి మాట్లాడుతూ వాది గొంది గ్రామానికి చెందిన ఓ యువతి మిస్సింగ్‌గా ఉన్నట్లు రెండువారాల క్రితం వచ్చిన పిటిషన్ ఆధారంగా ఎఫ్ఐఆర్ నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించామని తెలిపారు. దర్యాప్తులో ఆ యువతిని మోసం చేసి మధ్యప్రదేశ్‌కు చెందిన వ్యక్తులకు రూ.2.50 లక్షలకు అమ్మినట్లు, వారు ఆమెను బలవంతంగా తప్పుదారి పట్టించినట్లు బాధితులు వెల్లడించారని వివరించారు. నిందితుల నుంచి ఎనిమిది మొబైల్ ఫోన్లు, రూ.50 వేల నగదు, ఒక ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో సిఐ రవీందర్ పాల్గొన్నారు.

# పెండింగ్ పనులు త్వరగా పూర్తిచేయండి

### ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి




**ప్రజాపక్షం/నందిపేట్ :** నందిపేట్ మండలంలో అన్నిశాఖలలో పనులు పెండింగ్‌లో ఉన్నాయని వాటిని త్వరగా పూర్తిచేయాలని ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. శుక్రవారం మండల కార్యాలయంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో పంచాయతీరాజ్ ఎఇ రాజ్ కుమార్ మండలంలో జరుగుతున్న పనుల గురించి వివరించారు. సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ పనులు నాణ్యతగా ఉండాలని, నిర్ణీత సమయంలో పనులు పూర్తయ్యేలా కాంట్రాక్టర్‌పై ఒత్తిడి తేవాలని, పెండింగ్‌లో ఉండకుండా చూడాలని సూచించారు. అటవీశాఖ అధికారులను నర్సరీలు ఎక్కడ ఉన్నాయని అడిగారు. వర్షాకాలంలో తాగునీరు, పైప్‌లైన్ లీకేజీలు ఉంటే మరమ్మతులు చేయించాలని ప్రజలకు పరిశుభ్రమైన తాగునీరు అందించాలని ఆదేశించారు. భూభారతి సదస్సులో వచ్చిన ఆర్జీలు, కొత్త రేషన్ కార్డులు, రోడ్లు భవనాల శాఖ పనులపై సంబంధిత అధికారులతో మాట్లాడారు. సమావేశంలో మండల అభివృద్ధి అధికారి శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు.

### గురుకుల పాఠశాల స్థల పరిశీలన

నందిపేట్ మండలంలో కుదావంద్ పూర్ గ్రామంలో మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల పాఠశాల భవన నిర్మాణానికి గ్రామస్తులు ఇచ్చిన స్థలాన్ని ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి పరిశీలించారు. గ్రామానికి మంజూరైన గురుకుల పాఠశాలను తాత్కాలికంగా నూత్‌పల్లి వసతిగృహంలో ప్రారంభించారు. ప్రభుత్వం భవన నిర్మాణానికి ఐదు ఎకరాల భూమి చూయిస్తే నిర్మాణ పనులు ప్రారంభిస్తామని చెప్పడంతో ఎమ్మెల్యే స్థల పరిశీలన చేశారు. ఎస్‌సి, బిసి వసతి గృహాలు శిథిలావస్తలో ఉన్నాయని ఎమ్మెల్యే దృష్టికి తేగా ప్రయత్నిస్తానని గ్రామస్తులకు హామీ ఇచ్చారు. ఇల్లులేని అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు అయ్యేలా చూస్తానని ఎమ్మెల్యే అన్నారు. నందపేట్ మండలంలోని ఐలాపూర్ గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం పనులను పరిశీలించారు. గ్రామ కార్యదర్శి సాయికుమార్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. గ్రామానికి 47 ఇళ్ళు మంజూరు కాగా 17 ఇళ్ల పనులు జరుగుతున్నాయని కార్యదర్శి చెప్పారు. ఇందిరమ్మ కాలనీలో ఒక్కొక్క కుటుంబానికి నాలుగైదు ప్లాట్లు ఇచ్చారని దీనిపై విచారణ జరిపి ఇళ్ల స్థలాలు లేని వారికి ఇవ్వాలని ఎమ్మెల్యేను కోరారు. తహసీల్దార్‌ను పంపి విచారణ జరుపుతారని రాకేష్‌రెడ్డి వారికి హామీ ఇచ్చారు. కార్యక్రమం లో మండల అభివృద్ధి అధికారి శ్రీనివాస్‌రావు, లక్ష్మి ప్రసాద్, నాయకులు పిస్క కుశాల్, సిద్దాపూర్ సంజీవ్, ఉప్పరి సాయారెడ్డి, సకినం రమేష్ అధికారులు పాల్గొన్నారు.

# వైద్యశిబిరాలు ఏర్పాటు చేసి వైద్యసేవలు

### జిల్లా వైద్యాధికారి డాక్టర్ హరీష్ రాజ్



**ప్రజాపక్షం/ హాజీపూర్ :** ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలో వైద్య శిబిరాలు నిర్వహించి ప్రజలకు సమగ్ర సేవలు అందించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ హరీష్ రాజ్ సూచించారు. శుక్రవారం హాజీపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డిఎంహెచ్ఒ అకస్మికంగా సందర్శించి, అందిస్తున్న వైద్య సేవలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర పరిధిలోని ప్రభావిత గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించాలని, ఆశా, అంగన్‌వాడీ కేంద్రాల్లో ఓఆర్ఎస్, జింకా సాఫ్ట్ లను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. గర్భిణుల వివరాలు 100 శాతం నమోదు పూర్తవ్వాలన్నారు. పిల్లలకు సకాలంలో టీకాలు వేయాలని, ప్రతి వారంలో రెండు రోజులపాటు డ్రైడే నిర్వహించి ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు. ఆశ కార్యకర్తలు గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లినప్పుడు నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో డాక్టర్ అప్పల ప్రసాద్, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ లహరి, డాక్టర్ శివప్రతాప్, బుక్క వెంకటేశ్వర్, నాందేవ్ (సబ్ రిజిస్ట్రార్), అధికారి హెచ్ఇఒ రఘుపతి, లింగారెడ్డి, సిహెచ్ఒ లక్ష్మణ స్వామి, హెచ్ఇఒ తదితరులు పాల్గొన్నారు.

## బెల్టు షాపులు ఎత్తివేయాలని

# మహిళల నిరసన

**ప్రజాపక్షం/కాగజ్‌నగర్ రూరల్ :** బెల్టు షాపులను ఎత్తివేయడంతో పాటు గుడుంబాను అరికట్టాలని డిమాండ్ చేస్తూ కాగజ్‌నగర్ మండలం చింతగూడ గ్రామ మహిళలు, గ్రామస్థులు శుక్రవారం కాగజ్‌నగర్ ఎక్సైజ్ కార్యాలయం ఎదుట నిరసనకు దిగారు. గ్రామంలో బెల్టు షాపులు విచ్చల విడిగా ఏర్పాటు చేసి మద్యం, గుడుంబా విక్రయిస్తున్నారని వారు ఆరోపించారు. బెల్టు షాపుల నిర్వహణతో గ్రామంలోని యువతతో పాటు పెద్ద వారు కూడా మద్యానికి బానిసై తరచూ గొడవలకు దిగుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం పలువురు మహిళలు మాట్లాడుతూ చింతగూడ గ్రామంలో గుడుంబా, బెల్టు షాపులు అడ్డూ అదుపు లేకుండా కొనసాగుతున్నాయ, దీంతో మద్యానికి బానిసై గ్రామాల్లో కుటుంబాలు ఆర్థికంగా చిన్నాభిన్నం అవుతున్నాయన్నారు. గ్రామంలో గుడుంబా, బెల్టు షాపులు అరికట్టడంలో ఎక్సైజ్ అధికారులు పట్టించుకోవడం లేదని వారు ఆరోపించారు. ఇప్పటికైనా గుడుంబాను పూర్తి స్థాయిలో అరికట్టి, బెల్ట్ షాపులను ఎత్తివేయాలని కోరుతూ ఎక్సైజ్ సిఐకి రవికుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ సిఐ మాట్లాడుతూ గ్రామంలో ఎవరైనా బెల్టుషాపులను నిర్వహించినా, గుడుంబా విక్రయించినా గ్రామస్తులు, మహిళలు తమకు సమాచారం అందించాలని, అలాంటి వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ మహిళలు, గ్రామస్థులు పాల్గొన్నారు.



# ఎమర్జెన్సీ సమయంలో ఆర్టికల్ 352 దుర్వినియోగం

### బిజెఎల్‌పి నేత, ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి



**ప్రజాపక్షం/నిర్మల్ రూరల్ :** కాంగ్రెస్ పార్టీ అంతర్గత కలహాలతో సాకుతో దేశంలో ఎమర్జెన్సీని విధించారని, దీనికి కారణం యుద్ధమో, తిరుగుబాటో కారణం కాదని, మాజీ ప్రధాని ఇందిరాగాంధీ తన ఎన్నిక రద్దయిన తర్వాత అధికారాన్ని నిలబెట్టుకోవాలన్న ఆరాటంతో ఈ ఎమర్జెన్సీని విధించారని బిజెఎల్‌పి నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి నిజామాబాద్ జిల్లా బీజేపీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో అన్నారు. ఈ చీకటి అధ్యాయంలో కాంగ్రెస్ పార్టీ ప్రజాస్వామిక సంస్థలను తుంగలో తొక్కిందని దుయ్యబట్టారు. ఆ సమయంలో పత్రిక స్వేచ్ఛను, న్యాయాన్ని, పౌరుల హక్కులను సైతం అణచివేశారని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ తమ అధికారానికి ముప్పు వాటిల్లినప్పుడల్లా రాజ్యాంగానికి జాతీయ సమైక్యతకు విఘాతం కలిగించడంలో వెనుకాడదని స్పష్టం అవుతోందన్నారు. ఎమర్జెన్సీ సమయంలో ఆర్టికల్ 352 దుర్వినియోగంతో ప్రజాస్వామ్యానికి తూట్లు పొడిచారు. పార్లమెంటును, న్యాయ వ్యవస్థను నిర్వీర్యం చేశారన్నారు. కేవలం ఒక వ్యక్తి అధికారం కోల్పోతాననే భయంతో యావత్ దేశాన్ని అంధకారంలో పెట్టారని అన్నారు. 50ఏళ్ల తర్వాత కూడా కాంగ్రెస్ పార్టీ అదే తీరును కొనసాగించడం సరికాదన్నారు. ఇప్పటికీ కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో ఇదే తరహా పాలన కొనసాగుతున్నట్లు తెలిపారు. ఈ రాష్ట్రంలో సైతం సిఎం రేవంత్ ఢిల్లీలోని కాంగ్రెస్ నాయకులకు సామంతలా వ్యవహరించడం సరికాదన్నారు. సమావేశంలో ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, నిర్మల్ మాజీ ఎమ్మెల్యే నల్ల ఇంద్రకరణ్‌రెడ్డి, నాయకులు రావుల రాంనాథ్, సత్యనారాయణగౌడ్, నిజామాబాద్ జిల్లా నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## నేషనల్ తైక్వాడ పోటీలలో సహస్ర

**ప్రజాపక్షం/సుల్తానాబాద్ :** హైదరాబాద్లోని గచ్చిబౌలిలో నిర్వహించిన నేషనల్ టైక్వాడ్ పోటీలలో సుల్తానాబాద్ మండలంలోని గర్రెపల్లి గ్రామానికి చెందిన పసిడ్ల జయరాజు దంపతుల కూతురు పసిడ్ల సహస్ర సిల్వర్ మెడల్ సాధించారు. పసిడ్ల సహస్ర గతంలో కిల్లి మాంజారో పర్వతాన్ని అధిరోహించి అందరి మన్ననలను పొందారు. శుక్రవారం గచ్చిబౌలిలో నిర్వహించిన నేషనల్ టైక్వాడ పోటీలలో సిల్వర్ మెడల్ సాధించడం వలన గ్రామాల్లోని నేటితరం యువతకు ఆదర్శంగా నిలిచింది. పోటీ ప్రపంచంలో బాలికలు దేనికి తీసి పోరని నిరూపిస్తున్న పసిడ్ల సహస్రను గర్రెపల్లి గ్రామ మత్స్య పారిశ్రామిక సహకార సంఘం చైర్మన్ కుందేళ్ళ శ్రీనివాస్ ప్రత్యేకంగా అభినందించి శుభాకాంక్షలు తెలియజేశారు.



## లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గం ఎన్నిక



**ప్రజాపక్షం/రామడుగు:** లయన్స్ క్లబ్ ఆఫ్ గోపాల్‌రావుపేట ఆధ్వర్యంలో క్లబ్ నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రాంపల్లి శ్రీనివాస్, కార్యదర్శిగా పాకాల మోహన్, కోశాధికారిగా గొడుగు అంజయ్యలు ఎన్నికయ్యారు. ముఖ్య అతిథిగా మోర బద్రేషం, జిల్లా వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్, రీజియన్ చైర్మన్ కొల్లూరి జితేందర్, జోన్ చైర్మన్ కర్ర ప్రభాకర్ రెడ్డి, డిస్ట్రిక్ట్ మైక్రో మెంబర్ గోలి మధుసూధన్ రెడ్డి, ప్రోగ్రాం చైర్మన్ కర్ర శ్యాం సుంధర్ రెడ్డి, ముదుగంటి రాజిరెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, సత్యనారాయణ రెడ్డి, చాడ దామోదర్ రెడ్డి, కోట్ల మల్లేశం, మచ్చ గంగయ్య, మోర కేత, శారద, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

## హోంగార్డ్స్ సిబ్బందికి ఉలెన్ జాకెట్లు, రెయిన్ కోట్లు

### జిల్లా ఎస్పి మహేష్ బి. గితే



**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల ప్రతినిధి :** జిల్లాలో విధులు నిర్వహిస్తున్న హోమ్ గార్డ్స్ పోలీసు శాఖలో అంతర్గత భాగమని,పోలీసులతో పాటే నిరంతరం తమ సేవలను అందిస్తున్నారని జిల్లా ఎస్పి మహేష్ బి. గితే అన్నారు. శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో డిజిపి కార్యాలయం నుండి వచ్చిన ఉలెన్ జాకెట్స్, రెయిన్ కోట్స్‌ను హోంగార్డులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పి మాట్లాడారు. ప్రతి పోలీస్‌స్టేషన్లో పోలీసు సిబ్బందితో బాటు హోంగార్డులు, క్లిష్ట పరిస్థితులలో కూడా వివిధ బందోబస్తుల్లో సమర్థవంతంగా విధులు నిర్వహిస్తున్నారన్నారు. హోమ్ గార్డ్స్ అధికారులు, సిబ్బంది ఎవరికైన సమస్యలు ఉంటే నేరుగా తనని సంప్రదించవచ్చని, రాష్ట్ర పోలీస్ శాఖ సిబ్బంది కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టడం జరిగిందన్నారు. నిరంతరం ఎండనకా, వాననకా రాత్రింబవళ్ళు కష్టపడి పని చేసే సిబ్బందికి అత్యవసరసమయాలలో ఉలెన్‌జాకెట్స్, రెయిన్ కోట్స్ ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. విధినిర్వహణ సమయంలో అప్రమత్తంగా ఉండాలని, క్రమశిక్షణ కలిగిన పోలీస్‌శాఖలో పనిచేస్తూ నిబంధనలు ఉల్లగిస్తే భవిష్యత్తులో శాఖ పరమైన ఇబ్బందులు ఎదురవుతాయని వివరించారు. ఆర్ఐలు యాదగిరి, మధుకర్, హోమ్ హోర్డ్స్ సిబ్బంది పాల్గొన్నారు.

## సిఆర్‌పి విధులను పకడ్బందీగా నిర్వహించాలి

### పెద్దపల్లి కలెక్టర్ కోయ శ్రీ హర్ష



**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి :** సిఆర్‌పి విధులను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు.శుక్రవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సమీకృత జిల్లా కలెక్టరేట్ లో సంబంధిత విద్యా శాఖ అధికారులు, సిఆర్‌పిలతో విద్యా శాఖ వర్క్ అడ్జస్ట్ మెంట్, పాఠశాలల నిర్వహణపై సమీక్షించారు. ఈ సమావేశంలో మాట్లాడుతూ జిల్లా పరిధిలో ప్రభుత్వ పాఠశాలలకు ఉపాధ్యాయుల వర్క్ అడ్జెస్ట్ మెంట్ పారదర్శకంగా జరగాలని ఎటువంటి పైరవీలకు ఆస్కారం లేకుండా పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. పాఠశాలలోని విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయులు అందుబాటులో ఉండాలని, ఉన్నత పాఠశాలలో అన్ని సబ్జెక్టుల టీచర్లు అందుబాటులో ఉండాలని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో బడి బాట కార్యక్రమం ద్వారా పెరిగిన విద్యార్థుల సంఖ్య అనుగుణంగా అదనపు తరగతుల నిర్మాణం కోసం ప్రతిపాదనలు అందించాలని కలెక్టర్ సూచించారు. క్లస్టర్ రిసోర్స్ పర్సన్ (సిఆర్‌పి). నిబంధనల ప్రకారం వారి విధులను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ తెలిపారు. ప్రతి సిఆర్‌పి మూమెంట్ రిజిస్టర్, టూర్ డైరీ మేయింటేన్ చేయాలని అన్నారు. సిఆర్‌పిలు ఇక నుంచి ప్రతి నెలా అడ్వాన్స్ టూర్ డైరీ తయారు చేసుకోవాలని అన్నారు. ప్రతి రోజు కాంప్లెక్స్ పరిధిలో ఏదైనా ఒక పాఠశాలలో ప్రేయర్ టైంలో పాల్గొన్నాలని అన్నారు. యుడిఐడిలలో ప్రభుత్వ పాఠశాలలకు సంబంధించి ఎటువంటి తప్పుడు సమాచారం ఉండకుండా ఎప్పటికప్పుడు వివరాలను 24 గంటల్లో అప్ డేట్ చేయాలని కలెక్టర్ సిఆర్‌పిలను ఆదేశించారు. పాఠశాలలో జరుగుతున్న అభివృద్ధి పనులను సి.ఆర్.పి లు సంబంధిత ఎఇలను ఫాలో అప్ చేస్తూ త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ తెలిపారు. పాఠశాలకు 3 రోజుల కంటే వరుసగా హాజరు కాని విద్యార్థుల జాబితా పాఠశాలల నుంచి తీసుకుంటూ, వారి తల్లి తండ్రులను ఫాలో అప్ చేయాలని అన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలు, పంచాయతీ కార్యదర్శులతో సమయం చేస్తూ పేరెంట్ టీచర్స్ మీటింగ్‌లో కనీసం 60 శాతం కంటే అధికంగా పేరెంట్స్ హాజరయ్యేలా చూడాలని అన్నారు. ప్రభుతో పాఠశాలల్లోని విద్యార్థులకు ఎక్కడైనా పాఠ్యాంశాలు ఏకరూప దుస్తులు లోటు ఉంటే ఆ జాబితా అందించాలని అన్నారు. వారానికి ఒక రోజు విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేసి, భోజన నాణ్యతను పరిశీలించాలని అన్నారు. మండల కేంద్రాల్లో ఉన్న భవిత కేంద్రాలను సైతం సిఆర్‌పిలు తనిఖీ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో జిసిడిఓ కవిత, ఎస్ ఒ మల్లేష్, పిఎం. షేక్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇండ్లు

### కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ



**ప్రజాపక్షం/సిద్దిపేట అర్బన్:** కాంగ్రెస్ అంటేనే పేదల పార్టీ అని, కాంగ్రెస్ ప్రభుత్వంలో అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లను అందిస్తామని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ అన్నారు. శుక్రవారం సిద్దిపేట అర్బన్ మండలం ఎన్సాన్‌పల్లి, సిద్దిపేట రూరల్ మండలంలోని ఇరుకోడు, తోర్నాల, రాంపూర్ గ్రామాలలో ఇందిరమ్మ ఇండ్లకు అధికారులు, నాయకులతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా ఇన్‌చార్జి మంత్రి వివేక్ వెంకటస్వామితో మాట్లాడి మొదటి విడుతలో ఇందిరమ్మ ఇళ్ల లీస్టులో పేరు రాని అర్హులైన ప్రతి ఒక్కరికి, రెండవ విడతలో న్యాయం చేస్తామని తెలిపారు. పేదల సంక్షేమమే లక్ష్యంగా తమ పార్టీ అనేక పథకాలను అమలు చేస్తుందని, 200 యూనిట్ల వరకు ఫ్రీ కరెంట్, 500కే సిలెండర్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం,రైతు భరోసా,రైతులకు ఋణ మాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కుతుందన్నారు. సిద్దిపేట నియోజకవర్గానికి చెందిన 100మంది లబ్ధిదారులకు సిఎంఆర్ఎఫ్ చెక్కులను కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ పూజల హరికృష్ణ చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు బొమ్మల యాదగిరి, కలీమోద్దీన్, ముద్దం లక్ష్మి, భిక్షపతి, సత్యనారాయణ, నవీన్‌గౌడ్, మహేష్, గుర్రం అంజిరెడ్డి, హనుమంత్‌రెడ్డి, ఎల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మా పట్టాలు మాకు ఇప్పించండి

### తహసీల్దార్ కార్యాలయం ఎదుట 9వ ప్యాకేజీ బాధిత రైతుల అందోళన



**ప్రజాపక్షం/వీర్నపల్లి:** మా పట్టాలు మాకు ఇప్పించండి అంటూ మండల కేంద్రంలోని తహసీల్థార్ కార్యలయం ఎదుట శుక్రవారం రోజున 9వ ప్యాకేజీ పైప్‌లైన్ బాధిత రైతులు ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పైప్‌లైన్ పనుల కోసం తమ వద్ద సేకరించిన భూమితో పాటు తమకు ఉన్న మొత్తం భూమి పట్టాలు తొలగించారని అన్నారు. నష్టపోయిన భూమి మాత్రమే పట్టాల నుండి డిలీట్ అవుతుందని చెప్పిన అధికారులు మొత్తం భూమి వివరాలు ఆన్‌లైన్ నుండి తొలగించారని దీని వలన రైతు బంధు నిలిపివేశారని ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు స్పందించి రైతు బంధు డబ్బులు జమ అయ్యేలా చర్యలు తీసుకుని, ఈ సమస్యను వెంటనే పరిష్కరించాలని, లేని ఎడల వివిధ గ్రామాలలో నష్టపోయిన రైతులను కలుపుకొని పెద్ద ఎత్తున కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడి చేస్తాం అని పిలుపునిచ్చారు. రైతులు ప్రకాష్, దర్శనాల లింబాద్రి, అన్నారం జనార్ధన్, లక్ష్మణ్, శేఖర్, మల్లారపు అరుణ్ కుమార్, పిట్ల నాగరాజు, రాజేశం, ప్రవీణ్, దేవయ్య, నర్సయ్య, శంకర్, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

## పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

### సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి



**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి:** పలు అభివృద్ధి పనులకు సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి శంకుస్థాపన చేశారు. సప్తగిరి కాలనీలోని కోదండ రామాలయం పక్కన సప్తగిరి కాలనీ కమ్యూనిటీ భవన నిర్మాణానికి పది లక్షలు కేటాయించి శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారు. కిసాన్‌నగర్‌లోని క్రిస్టియన్ స్మశాన వాటికకు ప్రహారీగోడ నిర్మాణానికి పది లక్షలు మంజూరు చేసి శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ స్థానిక నాయకులు, ప్రజల కోరిక మేరకు నిధులు మంజూరు చేసి అభివృద్ధి పనులు చేపడుతున్నామని, రేవంత్‌రెడ్డి ప్రభుత్వంలో అభివృద్ధి ఒకవైపు సంక్షేమం ఒకవైపు కొనసాగుతోందని, రాబోయే రోజుల్లో ఇంకా నిధులు వెచ్చించి ప్రజల సమస్యలు పరిష్కరిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు చాడ గొండ బుచ్చిరెడ్డి, దిండిగాల మహేష్, తుమ్మల రమేష్‌రెడ్డి, గౌతమ్‌రావు, రామయ్య, కేశవరెడ్డి, రాజిరెడ్డి తదితరులున్నారు.

## కరీంనగర్ వైద్య పితామహుడు డాక్టర్ భూంరెడ్డికి పద్మశ్రీ ఇవ్వాలి

### తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత



**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి:** కరీంనగర్ పర్యటనలో భాగంగా తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, బిఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పలువురి కుటుంబాలను శుక్రవారం పరామర్శించారు. తెలంగాణ జాగృతి నాయకుడు జాడి శ్రీనివాస్ నివాసంలో బిసి సంఘాల నాయకులతో, జాగృతి సభ్యులను కలుసుకున్నారు. అనంతరం డాక్టర్ భూంరెడ్డి నివాసానికి వెళ్లి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కుమారులు డాక్టర్ సూర్యనారాయణరెడ్డి, డాక్టర్ సుధ, డాక్టర్ రమ, డాక్టర్ రవీందర్‌రెడ్డితో కలిసి మీడియాతో మాట్లాడారు. తెలంగాణలోనే మొట్టమొదటి జనరల్ సర్జన్, కరీంనగర్‌కు చెందిన ప్రముఖ వైద్యుడు డాక్టర్ భూంరెడ్డికి పద్మశ్రీ అవార్డు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. దేశ మొదటి ప్రధాని నెహ్రూకు ఢిల్లీ ఎయిమ్స్‌లో చికిత్స చేసిన డాక్టర్ భూంరెడ్డి విదేశాలకు వెళ్లే అవకాశాలు వచ్చినా వదులుకుని కరీంనగర్‌లో వైద్య సేవలు అందించారని గుర్తు చేశారు. అందుకే ఆయనను పేదల డాక్టర్ అంటారని తెలిపారు. వైద్యరంగానికి ఎన్నో సేవలు అందించిన డాక్టర్ భూంరెడ్డిని కేంద్ర ప్రభుత్వం గుర్తించి పద్మశ్రీ అవార్డుతో గౌరవించుకోవాలన్నారు. కరీంనగర్ వైద్య పితామహుడిగా భూంరెడ్డికి పేరుగాంచారన్నారు. ఆయన కరీంనగర్‌కే ఒక ల్యాండ్ మార్క్ అన్నారు. ఆనాడు మారుమూల ప్రాంతంగా ఉన్న కరీంనగర్‌లో యురాలజీ, న్యూరో సర్జరీ సేవలను ఆయన అందుబాటులోకి తెచ్చారన్నారు. కరీంనగర్ ప్రాంత విద్యార్థులకు వైద్య విద్యను అందుబాటులోకి తేవడానికి చల్మెడ వైద్య కళాశాల స్థాపనలోనూ కీలకంగా వ్యవహరించారన్నారు. రేకుర్తి కంటి ఆసుపత్రి, సుశ్రుత క్యాన్సర్ హాస్పిటల్ స్థాపనలో కీలకంగా వ్యవహరించారని తెలిపారు. రెడ్ క్రాస్ సొసైటీ, ఐఎంఏలోనూ విశిష్ట సేవలు అందించారని పేర్కొన్నారు. వైద్యరంగంలో ఆయన సాధించిన కృషికి అనేక బంగారు పతకాలు అందుకున్నారి తెలిపారు. డా.భూంరెడ్డికి పద్మశ్రీ అవార్డు ఇప్పించడానికి స్థానిక ఎంపి, కేంద్ర మంత్రి బండి సంజయ్ కృషి చేయాలని కోరారు. గాండ్ల సంఘం జిల్లా అధ్యక్షుడు జక్కం సంపత్ ఇటీవల మరణించగా వారి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను ఓదార్చారు. బిసి సంఘాలలో చాలా చురుకుగా సంపత్ పాల్గొన్నారని, వారి కుటుంబానికి అండ గా ఉంటానని పేర్కొన్నారు. ఆమె వెంట జగిత్యాల జిల్లా పరిషత్ మాజీ అధ్యక్షురాలు ద్యావ వసంత, బిసి కుల సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు గుంజపడుగు మరిప్రసాద్, జాగృతి నాయకులు జాడి శ్రీనివాస్, తానిపర్తి తిరుపతిరావు, పొన్నం అనిల్ గౌడ్, బిసి సంఘం నాయకులు వారాల శ్రీనివాస్, యాదవ సంఘం జిల్లా అధ్యక్షుడు సత్యం యాదవ్, కుమ్మరి సంఘం జిల్లా అధ్యక్షుడు కనకయ్య, గంటల రేణుక, సత్తు సంతోష్, ఉయ్యాల విష్ణు తదితరులున్నారు.

## స్థానిక సంస్థల ఎన్నికలు జరపాలి

### బిసి విద్యార్థి సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పుప్పాల మహిపాల్



**ప్రజాపక్షం/గొల్లపల్లి :** జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండల కేంద్రంలో శుక్రవారం రోజున బిసి యువజన సంఘం మండల అధ్యక్షులు సిరికొండ తిరుపతి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ముఖ్యఅతిథిగా బిసి విద్యార్థి సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పుప్పాల మహిపాల్ పాల్గొన్నారు. బిసి విద్యార్థి సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పుప్పాల మహిపాల్ తెలంగాణలో త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికకు బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. గ్రామ పంచాయతీలు, మండల పరిషత్తులు,జిల్లా పరిషత్తులు,మున్సిపాలిటీలలో బిసిలకు న్యాయమైన రిజర్వేషన్ విధానం అమలు చేయాలని డిమాండ్ చేశారు.బిసి రిజర్వేషన్లు అమలకు అన్ని రాజకీయ పార్టీలు తమ మద్దతును ప్రకటించాలని కోరారు.వాస్తవంగా 12 నెలల క్రితం జరగవలసిన ఎన్నికలు బిసి రిజర్వేషన్ గురించి వాయిదా మీద వాయిదా పడుతూ జాప్యం జరుగుతుందన్నారు.42 శాతం బిసి రిజర్వేషన్ బిల్లులపై ప్రభుత్వం వెంటనే స్పష్టమైన ప్రకటన చేసి స్థానిక సంస్థల ఎన్నికలు జరపాలని కోరారు.ఈ కార్యక్రమంలో బిసి యువజన సంఘం మండల అధ్యక్షులు సిరికొండ తిరుపతి, కట్కూరి సతీష్, ఒడ్నాల రాజేష్, గంగాధర కుమార్, విలసాగరం వెంకటేష్, సిరికొండ శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

## బైక్ దొంగతనాలకు పాల్పడిన ఆరుగురి అరెస్ట్

### కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం వెల్లడి




**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి:** కరీంనగర్ కమిషనరేట్ పరిధిలో మోటార్ సైకిల్ దొంగతనాలకు పాల్పడిన ఆరుగురు దొంగలను అరెస్ట్ చేసి వారి నుంచి మొత్తం 33 బైక్‌లను స్వాధీనం చేసుకున్నట్లు కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం ఐపిఎస్ శుక్రవారం తెలిపారు. కరీంనగర్ టూ టౌన్ పరిధిలోని పద్మనగర్‌లో టూటౌన్, సిసిఎస్ పోలీసులు సంయుక్తంగా శుక్రవారం ఉదయం వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా రెండు మోటార్ సైకిళ్లపై ట్రిపుల్ రైడింగ్‌లో వెళ్తున్న ఆరుగురు వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించారు. వారిని అదుపులోకి తీసుకుని విచారించగా కరీంనగర్ కమిషనరేట్, సిరిసిల్ల జిల్లా పరిధిలో మొత్తం రూ.12,27,000 విలువగల 33 మోటార్ సైకిళ్లను దొంగిలించినట్లు తేలింది. ఈ దొంగతనాలకు సంబంధించి మొత్తం ఆరు పోలీస్‌స్టేషన్లలో 22 కేసులు నమోదు చేసినట్లు పోలీస్ కమిషనర్ వెల్లడించారు. **పోలీస్‌స్టేషన్ల వారీగా కేసులు:** కరీంనగర్ వన్ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఆరు కేసులలో 11బైక్‌లు స్వాధీనం చేసుకున్నారు. కరీంనగర్ టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో 8కేసులలో 9బైక్‌లు, కరీంనగర్ త్రీటౌన్ పోలీస్‌స్టేషన్‌లో 1కేసులో ఒక బైక్, కరీంనగర్ రూరల్ పోలీస్ స్టేషన్‌లో 2 కేసులలో 2 బైకులు, కరీంనగర్ కొత్తపల్లి పోలీస్‌స్టేషన్‌లో 3 కేసులలో 3 బైకులు స్వాధీనం చేసుకున్నారు. అదే విధంగా రాజన్న సిరిసిల్ల వేములవాడ పోలీస్ స్టేషన్ పరిధిలో 2 కేసులలో 2 బైకులు స్వాధీనం చేసుకున్నారు. సరైన వివరాలు లేని 5 బైక్‌లు స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన నిందితుల్లో మహబూబ్‌నగర్ జిల్లా వెంకిచర్ల నివాసి పంతుల నవీన్(24), కరీంనగర్ జిల్లా గన్నేరువరం మండలం చొక్కారావుపల్లెకు చెందిన పెంటి బాలు(24), సిరిసిల్ల జిల్లా చందుర్తి మండలం మల్యాల నివాసి పెద్ది నాగరాజు(29), ముత్తారం మంథని మండలం కేశినిపల్లికి చెందిన చిందం సాయి ప్రసాద్(24), కరీంనగర్ జిల్లా గంగాధర మండలం లింగంపల్లికి చెందిన తోట మధు (28), సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట నివాసి కుటుంబాల సురేష్ (35)లను అరెస్టులతో మోటార్ సైకిల్ దొంగతనాలకు అడ్డుకట్ట పడిందని తెలిపారు. ప్రజలు తమ వాహానాల భద్రత పట్ల అప్రమత్తంగా ఉండాలని సిపి సూచించారు. ఈ నిందితులను పట్టుకుని, దొంగిలించబడిన 33 బైకులు స్వాధీనం చేయడంలో కృషి చేసిన టౌన్ ఏసిపి వెంకటస్వామి, టూ టౌన్ ఇన్స్‌పెక్టర్ సృజన్ రెడ్డి, సిసిఎస్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, కోటేశ్వర్ వన్ టౌన్, జాన్‌రెడ్డి, త్రీటౌన్, ఇతర సిబ్బందిని పోలీసు కమిషనర్ రివార్డు అందజేసి ప్రత్యేకంగా అభినందించారు.

## పడకేసిన పారిశుద్ధ్యం

### పట్టించుకోని ప్రత్యేక అధికారులు



**ప్రజాపక్షం/ముత్తారం :** పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలంలోని ఖమ్మంపల్లి గ్రామంలో పారిశుద్ధ్యం పడకేసింది. గ్రామంలోని ఎస్‌సి కాలనీ నుండి పంట పొలాల కు వెళ్లే సీసి రోడ్డుపై చెత్త చెదారం వేయడంతో ప్రజలు, రైతులు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు పై చెత్త వేయడంతో అందులో పందులు స్వైర విహారం చేస్తూన్నాయని వాపోతున్నారు. గత పది రోజుల క్రితం ఈ చెత్తను ఇళ్ల ప్రక్కన పడవేయడంతో వ్యాధులు భారిన పడుతున్నామని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఖమ్మంపల్లి గ్రామానికి ప్రత్యేక అధికారిగా ఉన్న తహసీల్దార్ కనీసం ఒక్క రోజు కూడా గ్రామం వైపు కన్నెత్తి చూడడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.పది రోజులగా రోడ్డు పై చెత్తను తొలగించాలని ఏ అధికారికి చెప్పిన పట్టించు కోవడం లేదని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.ఇప్పటి కైనా సంబంధిత అధికారులు స్పందించి చెత్త ను తొలగించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి

**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ :** పెద్దపల్లి మండలం అప్పన్నపేట శివారులో గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి చెందారని పెద్ద పల్లి రూరల్ ఎస్సై బి. మల్లేష్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం పెద్దపల్లి నుంచి గోదావరిఖని వెళ్తున్న బైక్ టిఎస్22 ఎఫ్ 5110 పై వెళ్తున్న సోగాల శ్యామ్ తండ్రిపేరు రవీందర్, ఎస్‌సి మాల, తిలక్ నగర్ గోదావరిఖని, అతని స్నేహితుడు చిలుక చక్రి తండ్రిపేరు వినోద్, ఎస్‌సి మాల, ఎన్‌టిఆర్ నగర్ గోదావరిఖని చెందిన యువకులను గుర్తు తెలియని వాహనం ఢీకొట్టగా ఇద్దరు అక్కడికక్కడే మరణించినట్లు, వారి తండ్రి సోగాల. రవీందర్ ఫిర్యాదు మేరకు ఎస్సై బి.మల్లేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## లారీ, ఆటో ఢీ : ఆటో డ్రైవర్ మృతి

### ఇద్దరు ప్రయాణికులకు తీవ్ర గాయాలు



**ప్రజాపక్షం/గోదావరిఖని :** గోదావరిఖని గంగానగర్ ఫ్లైవంతెనపై ఆగి ఉన్న లారీని వెనుక నుంచి ఆటో ఢీకొన్న సంఘటనలో ఆటోడ్రైవర్ అశోక్ అక్కడికక్కడే శుక్రవారం మృతి చెందాడు. మంచిర్యాల నుంచి గోదావరిఖని వైపుకు ఆటో వస్తుంది. ఆటోలో ప్రయాణిస్తున్న స్వప్న, అజీమ్‌లకు తీవ్రగాయాలయ్యాయి. వీరిని 108 వాహనంలో గోదావరిఖని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. పోలీసులు విచారణ చేపడుత్తున్నారు.


## సింగర్,రచయిత గసికంటి కుమార్‌కు అభినందనల వెల్లువ



**ప్రజాపక్షం/చొప్పదండి:** కరీంనగర్ జిల్లా చొప్పదండి మండలంలోని రాగంపేట గ్రామానికి చెందిన సింగర్, గేయ రచయితగా గసికంటి కుమార్ రాణిస్తున్నారు. అద్భుతంగా గేయాలు రచయిస్తూ పాటలు పాడుతుండడంతో పలువురు ఆయనకు అభినందనలు వెల్లువెత్తిస్తున్నారు. ఈ మేరకు గసికంటి కుమార్ ఇటీవల తాను దేవతమూర్తి మావురాల ఎల్లమ్మ బోనాలపై రచించిన పాటను ప్రముఖ సింగర్ మంగ్లీ చేత అద్భుతంగా పాడించి వీడియో విడుదల చేశారు. ఆమెతోపాటు గసికంటి కుమార్ సైతం అద్భుతంగా పాడి మంగ్లీతో కలిసి వీడియోసాంగ్‌లో నృత్యం చేశారు. ఈ సందర్భంగా చొప్పదండి పట్టణానికి చెందిన సినీ రచయిత ఛత్రపతి, చొప్పదండి ఓంకార్ టిఫిన్ సెంటర్ నిర్వాహకుడు కనకయ్యలు గసికంటి కుమార్‌ను కలిసి ప్రత్యేకంగా అభినందించి సన్మానించారు. ఈ సందర్భంగా సినీ రచయిత ఛత్రపతి మాట్లాడుతూ సింగర్‌గా, గేయ రచయితగా గసికంటి కుమార్ అద్భుతంగా రాణించడం చొప్పదండితో పాటు జిల్లాకు గర్వకారణమన్నారు. కళారంగంలో ఆయన ప్రతిభకు తగిన గుర్తింపు లభిస్తోందన్నారు. మావురాల ఎల్లమ్మ బోనాలపై ఆయన అద్భుతంగా రచించి పాడిన పాట ప్రస్తుతం వైరల్‌గా మారుతోందన్నారు. ప్రముఖ సినీ గాయని మంగ్లీ పాడి నృత్యం చేసిన ఈ వీడియో సాంగ్ ప్రస్తుతం ట్రెండింగ్‌లో ఉందన్నారు. భవిష్యత్తులో కుమార్ మరిన్ని అద్భుతమైన ఎన్నో పాటలు రచిస్తూ పాడి గొప్ప పేరు సాధించాలని ఆకాంక్షించారు. సినీ రంగంలో అడుగుపెట్టి సుస్థిరమైన స్థానం సంపాదించుకోవాలని కోరారు.

## కుంగిపోయిన కునారం రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి

### బల్లార్షా మధ్య రైళ్ల రాకపోకలకు తీవ్ర అంతరాయంవర్ణాతీతమైన ప్రయాణికుల ఇబ్బందులు



**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి :** రైల్వే ట్రాక్‌పై ఏర్పాటుచేసిన గడ్డర్ల క్లస్టర్ విరగడంతో కునారం రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి కుంగి పోయింది. పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని కూనారం రైల్వే గేటు వద్ద నిర్మిస్తున్న ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మాణంలో రైల్వే ట్రాక్‌పై గడ్డర్లు ఏర్పాటు చేసేందుకు నిర్మించిన ఇనుప క్లస్టర్ వెల్డింగ్ ఊడి విరగడంతో బ్రిడ్జి కొంత భాగం రైల్వే ట్రాక్‌పై కుంగడంతో రైల్వే అధికారులు అప్రమత్తమై కాజీపేట బల్లర్ష మార్గంలో పలు రైళ్లను నిలిపివేశారు. ఉదయం నుంచి ఒక్కొక్కరుగా అధికారులు ఆర్‌ఓబి వద్దకు చేరుకొని మరమ్మత్తు పనులను చేపట్టి ఐదు గంటల తర్వాత సింగల్ ట్రాక్ పై రైళ్ల రాకపోకలను పునరుద్ధరించారు. గంటల తరబడి పలు సూపర్ ఫాస్ట్ ఎక్స్ప్రెస్ ప్యాసింజర్ రైళ్లను నిలిపివేయడంతో రాఘవాపూర్ లో భాగ్యనగర్ ఎక్స్ప్రెస్, రామగుండంలో వందే భారత్ సూపర్ ఫాస్ట్ ఎక్స్ప్రెస్, పొత్కపల్లిలో ఎపి సూపర్ ఫాస్ట్ ఎక్స్ప్రెస్, జమ్మికుంటలో తెలంగాణ సూపర్ ఫాస్ట్ ఎక్స్ప్రెస్, ఉప్పల్లో ఇంటర్సిటీ ఎక్స్ప్రెస్ రైళ్లు ఎక్కడికి అక్కడే నిలిచిపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. నిర్మాణంలోనే ఆర్‌ఓబి పనుల నాణ్యత ప్రమాణాలు కొట్టొచ్చినట్టు కనబడుతున్నాయని, క్లస్టర్ పూర్తిగా విరిగితే భారీ ప్రమాదం సంభవించేదని నిర్మాణ పనుల నాణ్యత ప్రమాణాలపై రైల్వే ఉన్నతాధికారులు దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు. పెద్దపల్లి లో జరుగుతున్న పలు రైల్వే అభివృద్ధి పనులు నత్తనడకన నాసిరకంగా జరుగుతున్నాయని కాంట్రాక్టర్లు పైపై మెరుగులు మెరిపిస్తూ తూతూ మంత్రంగా పనులను చేస్తున్నారని ఖచ్చితంగా నాణ్యత ప్రమాణాలు పాటించేలా రైల్వే ఉన్నత అధికారులు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

## చోరీ కేసులో నిందితుడి అరెస్ట్



**ప్రజాపక్షం/గంగాధర:** గంగాధర బస్టాండ్ సమీపంలో ఈ నెల 14న వృద్ధురాలి నుంచి బంగారం, నగదు ఎత్తుకెళ్లిన చోరీ సంఘటనలో నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. వేములవాడ మండలం నమిలిగుండపల్లి గ్రామానికి చెందిన గోలి వజ్రమ్మ (80) అనే వృద్ధురాలికి మాయమాటలు చెప్పి నమ్మించి ఆమె వద్ద గల బంగారం చోరీ చేసిన నిందితుడి ఆచూకీని పోలీసులు సిసి కెమెరాలు, ఆధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి నిందితుడు సిద్దిపేటకు చెందిన అల్లెపు కృష్ణగాగుర్తించారు. తిరిగి శుక్రవారం అదే గంగాధర బస్టాండ్‌లో మరొక మహిళ వద్ద బంగారం చోరీ చేసే ప్రయత్నం చేస్తుండగా పోలీసులు పట్టుకుని అరెస్ట్ చేశారు. నిందితుడిని విచారించగా గంగాధరలోనే కాకుండా బాన్సువాడ, నర్సంపేటలో రాష్ట్రవ్యాప్తంగా 86 కేసులలో నిందితుడిగా ఉన్నట్లు గుర్తించారు. నిందితుని వద్ద నుంచి సుమారు 4 తులాల బంగారం రికవరీ చేవారు. ఈ కేసు దర్యాప్తులో చొప్పదండి సర్కిల్ ఇన్స్‌పెక్టర్ ప్రదీప్ కుమార్, సిసిఎస్ ఇన్స్‌పెక్టర్ శ్రీనివాస గంగాధర ఎస్సై వంశీకృష్ణ, సిసిఎస్ సబ్ ఇన్స్‌పెక్టర్ నాగరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

# క్రీడ



## మూడో సీజన్‌లో చెత్త ప్రదర్శన..

# హెడ్‌కోచ్‌పై వేటు!

మహిళల ప్రీమియర్ లీగ్‌లో ట్రోఫీ కోసం నిరీక్షిస్తున్న యూపీ వారియర్స్ షాకింగ్ నిర్ణయం తీసుకుంది. గత సీజన్‌లో జట్టు ప్రదర్శనతో తీవ్రంగా నిరాశ చెందిన యాజమాన్యం హెడ్‌కోచ్ జాన్ లివిస్‌కు ఉద్వాసన పలికింది. నాలుగో సీజన్‌కు కొత్త కోచ్ ఆధ్వర్యంలో పక్కాగా సన్నద్ధం కావాలనే ఉద్దేశంతో లివిస్‌పై వేటు వేసింది. ఈ విషయాన్ని శుక్రవారం యూపీ యాజమాన్యం ఎక్స్ వేదికగా వెల్లడించింది. 'మొదటి రోజు నుంచి మీరు మమ్మల్ని ఎంతగానో విశ్వసించారు. ఈ క్రమంలో యూపీ వారియర్స్ జట్టు ఎన్నో ఎత్తుపల్లాలు చవిచూసింది. ఫ్రాంచైజీలోని క్రికెటర్లు ఎన్నో విషయాలు నేర్చుకున్నారు. మీరు ప్రశాంతంగా ఉంటూనే జట్టు పురోగతి కోసం మనసుపెట్టి పనిచేశారు. కోచ్ జాన్ లెవిస్ మీ సేవలకు ధన్యవాదాలు. మీరు ఎల్లప్పుడూ యూపీ వారియర్స్ కుటుంబంలో సభ్యులే' అంటూ సోషల్ మీడియా పోస్ట్‌లో రాసుకొచ్చింది యూపీ ఫ్రాంచైజీ.

# డోప్ పరీక్షలో విఫలం

## నిషేధానికి గురైన నేషనల్ ఛాంపియన్!



భారత అథ్లెట్లు వరుసగా డోప్ పరీక్షల్లో దొరికిపోతున్నారు. ఈమధ్యే క్వార్టర్ మిలర్(400 మీటర్ల రన్నర్) స్నేహ కొల్లేరీ నిషేధానికి గురవగా.. తాజాగా జాతీయ స్థాయిలో పలు పతకాలు గెలుపొందిన రన్నర్ ట్వింకిల్ చౌదరీ సైతం డోప్ టెస్టులో పట్టుబడింది. అంతర్జాతీయ టోర్నీల్లో సత్తా చాటుతున్న ఆమె అనూహ్యంగా నిషేధిత డ్రగ్ తీసుకొని బుక్ అయిపోయింది. దాంతో, అథ్లెటిక్స్ ఇంటిగ్రిటీ యూనిట్ ఆమెపై నిషేధం విధించింది. నిరుడు ఉత్తరాఖండ్‌లో జరిగిన 4x400 మీటర్ల రిలే పోటీల్లో స్వర్ణం సాధించిన బృందంలో ట్వింకిల్ సభ్యురాలు. అదే ఈవెంట్లో 4x400 మీటర్ల మిక్స్‌డ్ రిలేలో కాంస్యం గెలుపొందింది అథ్లెట్. కెరియర్‌లో ఒక్కోమెట్టు ఎక్కుతున్న సమయంలోనే ట్వింకిల్ డోప్ పరీక్షలో విఫలమైంది. ఆమె రక్త నమూనాల్లో నిషేధిత మెథైల్‌టెస్టోస్టిరాన్ డ్రగ్ ఉంది. ఇది ఒక అనబాలిక్ స్టిరాయిడ్. డోప్ టెస్టు ఫలితాలు రాగానే ఆమెకు ఏఐయూ నోటీసులు పంపింది. తర్వాతి దశలో ట్వింకిల్ స్వయంగా ఏఐయూ అధికారుల ముందు హాజరై వివరణ ఇవ్వాల్సి ఉంటుంది.

### వెండి పతకంతో..

జలంధర్‌కు చెందిన ట్వింకిల్ చిన్నప్పట్నుంచి ఆటల్లో ముందుండేది. చిరుతలా పరుగెత్తే ఆమె అథ్లెటిక్స్ వైపు మొగ్గు చూపింది. ఈమధ్యే కొచ్చిలో జరిగిన 28వ జాతీయ సమాఖ్య సీనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్స్ పోటీల్లో ట్వింకిల్ సత్తా చాటింది. 800 మీటర్ల పరుగులో 2:00:71 సెకన్లలోనే లక్ష్యాన్ని చేరుకొని రికార్డు నెలకొల్పింది. జూన్‌లో తైవాన్ ఓపెన్‌లోనూ తనకు తిరుగులేదని చాటుతూ వెండి పతకంతో మెరిసింది 28 ఏళ్ల ట్వింకిల్. దక్షిణ కొరియాలో మే నెలలో జరిగిన ఆసియా అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో నాలుగో స్థానంలో నిలిచింది .



# డబ్ల్యుటిసిలో శ్రీలంక జోరు


ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ తొలి సిరీస్‌లో శ్రీలంక విజయం దిశగా సాగుతోంది. కొలంబో వేదికగా జరుగుతున్న రెండో టెస్టులో ఆతిథ్య లంక పట్టుబిగించింది. ధనంజయ డిసిల్వా(213), ప్రభాత్ జయసూర్య(247)ల విజృంభణతో బంగ్లాదేశ్‌ను ఆలౌట్ అంచున నిలిపింది. తొలి ఇన్నింగ్స్‌లో బ్యాట్లెత్తేసిన బంగ్లా ఆటగాళ్లు.. రెండో ఇన్నింగ్స్‌లోనూ అదే తీరు కొనసాగించారు. ఆఖరి సెషన్ చివరి బంతికి మెహిదీ హసన్ మిరాజ్(11)ను రత్ననాయకే ఎల్బీగా వెనక్కి పంపి.. ఆ జట్టును మరింత దెబ్బకొట్టాడు. దాంతో.. మూడోరోజు ఆట ముగిసే సరికి బంగ్లా ఆరు వికెట్ల నష్టానికి 115 రన్స్ చేసింది. ఇంకా 96 పరుగులు వెనకబడి ఉన్న ప్రత్యర్థిని నాలుగో రోజు త్వరగా ఆలౌట్ చేస్తే సిరీస్ లంకకు చిక్కినట్టే.

గాలే టెస్టు డ్రాగా ముగియడంతో నిరాశచెందిన శ్రీలంక.. కొలంబోలో విజయం వాకిట నిలిచింది. తొలి ఇన్నింగ్స్‌లో బంగ్లాదేశ్‌ను ఆలౌట్ చేసిన ఆతిథ్య జట్టు రెండో ఇన్నింగ్స్‌లోనూ చెలరేగింది. కెప్టెన్ ధనంజయ డిసిల్వా(213), ప్రభాత్ జయసూర్య(247)ల విజృంభణతో బంగ్లా బ్యాటర్లు వరుసగా పెవిలియన్‌కు క్యూ కట్టారు. వందకే సగం వికెట్లు కోల్పోయిన జట్టును లిటన్ దాస్ (13 నాటౌట్), మెహిదీ హసన్ మిరాజ్(11)లు ఆదుకునే ప్రయత్నం చేశారు. కానీ, మూడో రోజు ఆట ముగుస్తుండగా బంగ్లాకు షాకిస్తూ మిరాజ్‌ను ఎల్బీగా ఔట్ చేశాడు రత్ననాయకే. దాంతో, పర్యాటక జట్టు 115 వద్ద ఆరో వికెట్ కోల్పోయింది. ఇంకా 96 పరుగులు వెనకబడి ఉన్న బంగ్లా మ్యాచ్ కాపాడుకోవాలంటే నాలుగోరోజు అసాధారణంగా పోరాడాల్సి ఉంది. కానీ, టెయిలెండర్లతో లిటన్ ఎంత వరకూ పోరాడుతాడనేది ఆసక్తికరం.

తొలి ఇన్నింగ్స్‌లో బంగ్లాను సొనాల్ దినుష (3 22), అసితా ఫెర్నాండో (351) దెబ్బతీశారు. ఓపెనర్ షద్మాం ఇస్లాం 46 పరుగులతో టాప్ స్కోరర్ కాగా.. శాంటో బృందం 247కే కుప్పకూలింది. పథుమ్ నిశాంక (158) సెంచరీకి దినేశ్ చండీమాల్(93) అర్ధ శతకం తోడవ్వగా లంక 458 రన్స్ చేసింది. దాంతో, ఆతిథ్య జట్టుకు తొలి ఇన్నింగ్స్‌లో 211 పరుగుల ఆధిక్యం లభించింది.

# ఫోకస్ సైన్స్

## సూర్యుడికి దూరంగా..



ఈ ఏడాది జులై 3వ తేదీకి ఒక ప్రత్యేకత ఉంది. ఆ రోజున సూర్యుడి నుంచి భూమి అత్యంత దూరంగా వెళుతుంది. అంటే, సూర్యుని కేంద్రం నుండి భూమి కేంద్రానికి 152,087,738 కిలోమీటర్లు (94,502,939 మైళ్ళు) దూరంగా ఉంటుంది. దీనిని అఫెలియన్ అని పిలుస్తారు. సూర్యుడికి భూమి ఎంత దూరంలో ఉందో, దాని ఆధారంగానే రుతువులు ఏర్పడతాయనే అభిప్రాయం చాలామందిలో ఉంటుంది. కానీ, అది నిజం కాదు. భూమి వంపు వల్ల రుతువులు ఏర్పడతాయన్నది వాస్తవం. ప్రస్తుతం ఉత్తర అర్ధగోళంలో వేసవి కాలం వస్తుంది. దక్షిణార్ధగోళంలో వర్షాలు ప్రారంభమవుతాయి. రుతువుల ఖచ్చితమైన వ్యవధి సంవత్సరానికి కొద్దిగా మారుతూ ఉంటుంది. అఫెలియన్ కారణంగా ఉత్తరార్ధగోళంలో వేసవి ఎక్కువ కాలం ఉంటుంది. సూర్యుని చుట్టూ భూమి యొక్క దీర్ఘవృత్తాకార మార్గమే దీనికి కారణం. భూమి సూర్యుడి నుండి దూరంగా ఉన్నప్పుడు, అది దాని కక్ష్యలో నెమ్మదిగా కదులుతుంది. అయనాంతం నుండి విషువత్తుకు వెళ్లడానికి ఎక్కువ సమయం పడుతుంది. అయితే, దీనికి విరుద్ధంగా, దక్షిణఅర్ధగోళంలో, వేసవి కాలం జనవరిలో పెరిహెలియన్‌తో సమానంగా ఉంటుంది, అప్పుడు భూమి సూర్యుడికి దగ్గరగా ఉంటుంది. అంతేగాక, మరింత వేగంగా కదులుతుంది. అయనాంతం నుండి విషువత్తుకు వెళ్ళడానికి తక్కువ సమయం పడుతుంది.

# గ్రహశకలాలకూ ఓ రోజు..



గ్రహశకలాలు (ఆస్టరాయిడ్స్)కు కూడా ఓ ప్రత్యేక రోజు ఉంది. ప్రతి సంవత్సరం జూన్ 30న అంతర్జాతీయ గ్రహశకల దినోత్సవాన్ని నిర్వహిస్తారు. గ్రహాల గురించి ప్రజలకు అవగాహన కల్పించడానికి, గ్రహశకలాలపై వివరాలను అందించడానికి ఐక్యరాజ్యసమితి ఆధ్వర్యంతో ఈ దినోత్సవం జరుగుతున్నది. 1908, జూన్ 30న రష్యాలోని సైబీరియా స్టోనీ తుంగుస్కా నది సమీపంలోని భూమిని అతిపెద్ద గ్రహశకలం ఢీకొట్టడంతో దాదాపు 2,072 చ.కి.మీ. విస్తీర్ణంలో అటవీ ప్రాంతం నాశనమైంది. ఆ రోజుకు గుర్తుగా ఐక్యరాజ్య సమితి జూన్ 30ని ఆస్టరాయిడ్ దినోత్సవంగా ప్రకటించింది. ఇంతకీ గ్రహశకలాలు అంటే ఏమిటి? ఈ ప్రశ్నకు '4.6 బిలియన్ సంవత్సరాల క్రితం సౌర వ్యవస్థ ఏర్పడినప్పటి నుండి మిగిలిపోయిన రాతి అవశేషాలు' అని సమాధానం చెప్పవచ్చు. శాస్త్రవేత్తలు ఈ నిర్ధారణకు ఎప్పుడో వచ్చినప్పటికీ, లోతైన పరిశోధనలు కొనసాగుతునే ఉన్నాయి. కాగా, ఒక సిద్ధాంతం ప్రకారం, బిగ్ బ్యాంగ్ తర్వాత, ధూళి కణాలు కలిసి 'అక్రెషన్' అనే ప్రక్రియ ద్వారా ఖగోళ వస్తువులను ఏర్పరుస్తాయి. ఇవి ఇతర చిన్న వస్తువులతో కలిసి పెద్ద అంతరిక్ష శిలలుగా మారుతాయి. ఈ ఖగోళ శిలలలో కొన్ని వాటి స్వంత గురుత్వాకర్షణను అభివృద్ధి చేసుకునేంత పెద్దవిగా ఎదిగి, గ్రహాలుగా మారాయి. అయితే, కొన్ని శిలలు ఈ విధంగా కలిసిపోకుండా గ్రహశకలాలుగా మారాయి. ఇవి కూడా గ్రహాల మాదిరిగానే అవి సూర్యుని చుట్టూ తిరుగుతాయి కాబట్టి, వీటిని 'ప్లానెటాయిడ్లు' లేదా 'చిన్న గ్రహాలు' అని కూడా పిలుస్తారు. మన సౌర వ్యవస్థలో తిరుగుతున్న లక్షలాది గ్రహశకలాలలో ఎక్కువ భాగం అంగారక గ్రహం, బృహస్పతి కక్ష్యల మధ్య ఉన్న ప్రాంతంలో కనిపిస్తాయి. ఈ ప్రాంతాన్ని ఆస్టరాయిడ్ బెల్ట్ అంటారు. ఇది అంతరిక్ష నౌకలను కూల్చివేసే రాళ్లతో కూడిన ఒక చిన్నస్థలంగా సైన్స్ ఫిక్షన్ నవలలు, చిత్రాల్లో కనిపిస్తుంది. కానీ, నిజానికి ఇది చాలా ఒంటరి ప్రదేశం. ఆస్టరాయిడ్ బెల్ట్‌లోని రెండు గ్రహశకలాల మధ్య సగటు దూరం దాదాపు 600,000 మైళ్ళు (966,000 కి.మీ) అని ఖగోళ శాస్త్రవేత్తల అంచనా. ఇది భూమి నుంచి చంద్రునికి మధ్య ఉన్న దూరం కంటే దాదాపు 2.5 రెట్లు ఎక్కువ. దీనిని బట్టి ఆస్టరాయిడ్ బెల్ట్ ఎంత విస్తారమైనదో, అక్కడ గ్రహశకలాలు ఎంత ఒంటరిగా ఉంటాయో ఊహించుకోవచ్చు. మనకు తెలిసిన చాలా గ్రహశకలాలు ఆస్టరాయిడ్ బెల్ట్‌లో ఉన్నప్పటికీ, ఈ బెల్ట్ వెలుపల సూర్యుని చుట్టూ తిరుగుతున్న అనేక గ్రహశకలాలు ఉన్నాయి. 2010లో శాస్త్రవేత్తలు భూమి యొక్క కక్ష్యను అనుసరించే మొదటి 'ట్రోజన్ ఆస్టరాయిడ్ 2010 టికె7'ను కనుగొన్నారు.

## కొన్ని అడుగుల నుంచి వందల మైళ్ల వరకూ..

గ్రహశకలాలు కొన్ని అడుగుల నుండి అనేక వందల మైళ్ల వ్యాసం కలిగి ఉంటాయి. మానవునికి తెలిసిన అతిపెద్ద గ్రహశకలం సెరెస్. దాదాపు 590 మైళ్లు (950 కి.మీ) వ్యాసం కలిగి ఉంటుంది. సౌర వ్యవస్థలోని అన్ని గ్రహశకలాలను కలిపితే, ఫలితంగా వచ్చే శిల పరిమాణం మన చంద్రుడి కంటే చాలా చిన్నదిగా ఉంటుందని ఖగోళ శాస్త్రవేత్తలు అభిప్రాయపడుతున్నారు. నేడు దాదాపు 150 గ్రహశకలాలు వాటి చుట్టూ ఒకటి లేదా అంతకంటే ఎక్కువ చంద్రులు తిరుగుతున్నట్లు అధ్యయనాలు చెప్తున్నాయి. వీటిలో అత్యంత ప్రసిద్ధమైనది డాక్టైల్. ఇది 'ఇడా' చుట్టూ తిరుగుతున్న ఒక చిన్న చంద్రుడు లేదా ఆస్టరాయిడ్‌లోని గ్రహశకలం. చాలా గ్రహశకలాలు వాటి కూర్పు ఆధారంగా, 'సి', 'ఎస్', 'ఎం' అనే మూడు సమూహాలలో ఏదైనా ఒకదానిలోకి వస్తాయి. ఆ గ్రహశకలం ఏర్పడిన సమయంలో సూర్యుడి నుండి ఎంత దూరంలో ఉందో దాని కూర్పును నిర్ధారిస్తారు.



మొత్తం గ్రహశకలాలలో మూడింట రెండు వంతులు 'సి' రకంగా భావిస్తున్నారు. ఈ గ్రహశకలాలు చాలా చీకటిగా ఉంటాయి. ఇవి బంకమట్టి, సిలికేట్ రాళ్లను కలిగి ఉంటాయని భావిస్తున్నారు. వీటిని గ్రహశకలం బెల్ట్ బయటి ప్రాంతాలలో చూడవచ్చు. కాగా, 'ఎస్' రకం గ్రహశకలాలు సగటున 0.16 ఆల్బెడోతో చాలా ప్రకాశవంతంగా ఉంటాయి. ఈ గ్రహశకలాలు సాధారణంగా ఆస్టరాయిడ్ బెల్ట్ లోపలి ప్రాంతాలలో కనిపిస్తాయి. ఇనుము, మెగ్నీషియం సిలికేట్లతో కూడి ఉంటాయి. ఇక 'ఎం' రకం గ్రహశకలాలు ఆస్టరాయిడ్ బెల్ట్ మధ్యలో కనిపిస్తాయి. సగటు ఆల్బెడో 0.19 కంటే చాలా ప్రకాశవంతంగా ఉంటాయి. ఇవి ఎక్కువగా ఇనుముతో కూడి ఉంటాయి. ఈ బెల్ట్‌లోని నాలుగు అతిపెద్ద గ్రహశకలాలను సెరెస్, వెస్టా, పల్లాస్ మరియు హైజియా అని పిలుస్తారు. ఈ పెద్ద గ్రహశకలాలు మొత్తం గ్రహశకల పట్టీ ద్రవ్యరాశిలో సగం వరకు ఉంటాయి. ఈ రాతి గ్రహశకలాలన్నింటినీ కలిపితే, భూమి చంద్రుడి కంటే ఒక గ్రహం కొంచెం చిన్నదిగా అవుతుందని శాస్త్రవేత్తలు చెప్పడానికి ఇష్టపడతారు.



# పెట్టుబడిదారులకు కొమ్ముకాస్తున్న కేంద్ర ప్రభుత్వం

- జిల్లాలో సిపిఐ పార్టీని బలోపేతం చేయాలి
- నక్సలైట్లపై హత్యాకాండను ఆపాలి
- సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఇటి నరసింహ్మా

**ప్రజాపక్షం/నర్సాపూర్ :** కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం పెట్టుబడిదారులకు కొమ్ముకాస్తుందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఇటి నర్సింహ్మా అన్నారు. నర్సాపూర్ పట్టణంలోని సిపిఐ కార్యాలయంలో మెదక్ జిల్లా సిపిఐ 25వ మహాసభలను నిర్వహించారు. దీనికి ముఖ్యఅతిథిగా నర్సింలు హాజరై మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా చట్టాలను తయారు చేస్తుందన్నారు. పేద ప్రజలను మాత్రం బిజెపి ప్రభుత్వం పట్టించుకోవడంలేదని అన్నారు. బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి మతోన్మాదం పేరట దళితులపై మైనారిటీలపై దాడులు ఎక్కువ అయ్యాయాన్ని అన్నారు. ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్న కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు ప్రజలు సిద్ధంగా ఉండాలన్నారు. అనంతరం సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మంద పవన్ మాట్లాడుతూ ఒకప్పుడు నర్సాపూర్ సిపిఐకి కంచుకోట అని, పార్టీ నుంచి 5 సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన చిలుముల విఠల్ రెడ్డి ఈ ప్రాంతంలోని ప్రజలకు ఎన్నో భూములు పంచారని గుర్తు చేశారు. సిపిఐ పార్టీని మెదక్ జిల్లాలో బలోపేతం చేసేందుకు ప్రతి కార్యకర్త సైనికుడిలా పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి మెదక్ జిల్లా కార్యదర్శులు ప్రకాష్ రావు, దయానంద రెడ్డి, సిపిఐ జిల్లా కార్యదర్శి ఖాలెక్, రాజా గౌడ్, నందం తదితరులు పాల్గొన్నారు.

## రాచకొండలో రిజర్వాయర్ ఏర్పాటు చేసి

# కృష్ణా నీటిని అందించాలి

● ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం ● లెఫ్ట్ పార్టీలు ఒకటి కావాలి : సిపిఐ యాదాద్రి జిల్లా కార్యదర్శి గోదా శ్రీరాములు



**ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం :** మండల కేంద్రం రాఘవేంద్ర ఫంక్షన్‌లో సిపిఐ 15 వ మహాసభకు ముఖ్యఅతిథిగా హాజరైన సిపిఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం మహాసభ సందర్భంగా అరుణ పతాకాన్ని ఎగురవేసి అమరవీరుల స్థూపం వద్ద నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిండి లిఫ్ట్ ఇరిగేషన్‌లో భాగంగా శివన్నగూడెంలో నిర్మించిన చర్లగూడెం ప్రాజెక్టు నుండి లిఫ్ట్ ద్వారా రాచకొండలో రిజర్వాయర్ ఏర్పాటుచేసి సంస్థాన్ నారాయణపురం, చౌటుప్పల్ మండలాలకు సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా దోపిడీకి, భూస్వాములకు వ్యతిరేకంగా పోరాడింది కమ్యూనిస్టులేనని ఎర్రజెండా పేద ప్రజలకు ఎల్లప్పుడూ అండగా ఉంటుందన్నారు. అదేవిధంగా యాదాద్రి భువనగిరి జిల్లా కార్యదర్శి గోదా శ్రీరాములు మాట్లాడుతూ చంద్రబాబు, నితీష్ మద్దతుతోనే బిజెపి ప్రభుత్వం కేంద్రంలో అధికారంలోకి వచ్చిందని అన్నారు. అధికారం కోసం పార్టీలు మారుతున్నారని ఆయన గుర్తుచేశారు. లెఫ్ట్ పార్టీలు కలిసి ఒకే జెండా ఒకే గుర్తుతో ముందుకు పోవాలని అభిప్రాయపడ్డారు. కమ్యూనిస్టులు ఐక్యం ఐతే ప్రజలు అంతా మన వైపు ఉండే అవకాశం ఉందని అన్నారు. ప్రపంచ దేశాలలో కమ్యూనిస్టులే కీలంకంగా ఉన్నారని గుర్తు చేశారు. ప్రజావిశ్వాసం పొందెందుకు కమ్యూనిస్టులు అంత ఏకం కావాలని పిలుపునిచ్చారు. ఆయుధాలు వదిలి నక్సలైట్లు జనంలోకి వచ్చి పోరాడాలని పిలుపునిచ్చారు. వామపక్ష పార్టీల ఐక్యత కోసం నక్సలైట్లు పని చేయాలన్నారు. అధికారంలోకి వచ్చిన బిజెపి చరిత్ర లేని పార్టీ అని విమర్శించారు. మావోయిస్టుల ఏరివేత లక్ష్యంగా బిజెపి ప్రభుత్వం క్రూరంగా వ్యవహరిస్తుందని చనిపోయిన నక్సలైట్ల శవాలను కూడా కుటుంబ సభ్యులకు ఇవ్వకుండా రాక్షసంగా ప్రవర్తిస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను నెరవేర్చే బాధ్యత ఆ ప్రభుత్వంపై ఉందని, ఇచ్చిన హామీలను అమలు చేయకపోతే టిఆర్ఎస్ ప్రభుత్వం చెప్పినట్లే ప్రజలు బుద్ధి చెప్తారని అన్నారు. ఈ మహాసభలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి, బొలగాని సత్యనారాయణ, కార్యవర్గ సభ్యులు బచ్చనగోని గాలయ్య, ఎండి ఇమ్రాన్, ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షుడు కే.శ్రీనివాస్, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు జక్క దయాకర్ రెడ్డి, మండల కార్యదర్శి దుబ్బాక భాస్కర్, పొట్ట శంకరయ్య, కలకొండ సంజీవ, కందుల లింగమ్మ, ప్రజానాట్యమండలి నల్గొండ జిల్లా అధ్యక్షుడు జగన్, సిపిఐ సీనియర్ నాయకులు దేశిడి నరేందర్ రెడ్డి, రుద్ర రాములు, పల్లె మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## మహిళలపై దాడులు అరికట్టడంలో

# ప్రభుత్వాలు విఫలం

ఎన్‌ఎఫ్ఐడబ్ల్యు జిల్లా కార్యదర్శి కొరిమి సుగుణ

**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి :** మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు, దాడులను అరికట్టాలని భారత జాతీయ మహిళా సమాఖ్య (ఎన్‌ఎఫ్ఐడబ్ల్యు) జిల్లా కార్యదర్శి కొరిమి సుగుణ డిమాండ్ చేశారు. శుక్రవారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని రావినారాయణరెడ్డి భవన్‌లో ఎన్ఎఫ్ఐ డబ్ల్యు నిర్మాణ మహాసభలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కొరిమి సుగుణ హాజరై మాట్లాడుతూ, దేశం, రాష్ట్రంలో జరుగుతున్న మహిళలపై అనేక హత్యాచారాలు దాడులు జరుగుతున్నాయని ఈ ప్రభుత్వాలు వాటిని అరికట్టడంలో విఫలమయ్యాయని ఆరోపించారు. మహిళలపై జరుగుతున్న అత్యాచార దాడులను అరికట్టేందుకు దేశంలో నూతన చట్టాలు తేవాలని తెలిపారు. మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని, మహిళలకు చట్టసభల్లో రిజర్వేషన్లు కల్పించి మహిళలు రాజకీయాల్లో రాణించే విధంగా అవకాశాలు కల్పించాలన్నారు. మహిళల అభివృద్ధికి ప్రభుత్వాలు తోడ్పాటున అందించాలని కోరారు. మహిళ హక్కులను సాధించుకోవడంలో మహిళలంతా సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలని సుగుణ పిలుపునిచ్చారు. మహాసభల అనంతరం జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో గోలి లావణ్య, పెద్దమామల సంధ్య, క్యాథరాజు అనూష, పల్లెల రజిత, గడ్డం స్వరూప, కటకోల్ల భారతి, ఇటుకల శ్రీలత, నజియా తదితరులు పాల్గొన్నారు.

## కార్మిక వ్యతిరేక విధానాతో తీవ్ర అన్యాయం

జూలై 9న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె : గన్నారపు రమేష్

**ప్రజాపక్షం/ వరంగల్ ప్రతినిధి :** జూలై 9న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి గన్నారపు రమేష్, సిఐటియు జిల్లా కార్యదర్శి అరూరి కుమార్, ఐఎఫ్‌టియు జిల్లా అధ్యక్షులు గంగుల దయాకర్, ఎఐసిటియు జిల్లా నాయకులు నర్ర ప్రతాప్, ఎఐసిసిటియు జిల్లా కార్యదర్శి అక్కెనపల్లి యాదగిరిలు కోరారు. ఆల్ యూనియన్ ఆధ్వర్యంలో వరంగల్ శివనగర్ తమ్మెర భవన్‌లో ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు కందికచెర్ల కేశవులు, ఐఎన్‌టియుసి జిల్లా అధ్యక్షులు పాశం రవి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడుతూ పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను హక్కులను బిజెపి ప్రభుత్వం కాలరాస్తూ 29 కార్మిక చట్టాలను రద్దుకు పోనుకుంటూ నాలుగు లేబర్ కోడ్స్‌గా బడా బూర్జువా పెట్టుబడిదారి యాజమాన్యాలకు అనుకూలంగా చట్టాలను తయారు చేస్తుందన్నారు. కార్మికులు చాలి చాలని వేతనాలతో దుర్భరమైన జీవితాలు గడుపుతూ అతి తక్కువ వేతనాలు తీసుకొని పనిచేస్తూ వారికి బోనసు సర్వీసు, ఇఎస్ఐపిఎఫ్ పనిభద్రత లాంటి సౌకర్యములు వర్తించడం లేదన్నారు. బిజెపి ప్రభుత్వం తీసుకున్న కార్మిక వ్యతిరేక విధానాలు అమలు అయితే కార్మికులకు అన్యాయమే జరుగుతుందన్నారు. కావున చట్టాలను రక్షించుకోవాలంటే జులై 9న దేశవ్యాప్తంగా జరుగు సార్వత్క సమ్మెలో కార్మికులు సమ్మెలో పాల్గొనాలని సమ్మెను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా సహాయ కార్యదర్శి ఎండి యాకోబ్, రవి తదితరులు పాల్గొన్నారు.




# మావోయిస్టులపై మారణహోమాన్ని వెంటనే ఆపాలి

సిపిఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్



**ప్రజాపక్షం /కాసిపేట :** మావోయిస్టులపై కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కాగర్ పేరుతో కొనసాగిస్తున్న మారణహోమా న్ని వెంటనే రద్దు చేయాలని, వారితో శాంతి చర్చలు జరిపి మానవ హక్కులను కాపాడాలని సిపిఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్ అన్నారు. శుక్రవారం కాసిపేట మండల కేంద్రంలోని అంగడి బజార్‌లో భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) నూతన కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన రామడుగు లక్ష్మణ్ మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను చిత్తశుద్ధితో అమలు చేయాలన్నారు. గిరిజనులు వ్యవసాయం చేసుకుంటున్న పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని, పేదలకు కొత్త రేషన్ కార్డులను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కార్పొరేషన్ పరిధిలో ఉన్న బొగ్గు గనుల ఉద్యోగులకు కేంద్ర ప్రభుత్వ హామీ మేరకు ఇంటికి రాయి యాజమాన్యం చెల్లించాలని, రెండు గుంటల భూమికి సంబంధించిన బడ్జెట్ సపోర్ట్‌ను అందించాలని అన్నారు. మంచిర్యాల జిల్లాలో పార్టీ బలమైన నిర్మాణం కలిగి ఉన్న నేపథ్యంలో, జిల్లా కేంద్రంలో సిపిఐ కార్యాలయం నిర్మాణానికి ఒక ఎకరం భూమిని కేటాయించాలని కోరారు. 2024–25 సంవత్సరానికి సంబంధించిన సింగరేణి లాభాల్లో గణి కార్మికులకు 40 శాతం వాటా ప్రకటించాలని, నూతన బొగ్గు బ్లాకులను కేటాయించాలన్నారు. కాజీపేట మండలంలోని చెరువుల కింద ఉన్న భూములకు సాగు నీరు అందించాలని, దేవాపూర్ గ్రామ పంచాయతీలో ఓరియంట్ సిమెంట్ కంపెనీ భూములు కోల్పోయిన ఆదివాసులకు ఉద్యోగాలు కల్పించి నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. సిమెంట్ కంపెనీ వల్ల పరిసర గ్రామాల్లో పంట నష్టం, పర్యావరణ హాని ఏర్పడిన నేపథ్యంలో, విద్య, వైద్యం, రోడ్లు తదితర వసతులను యాజమాన్యమే కల్పించాలన్నారు. కాసిపేట పట్టణ సమితి ఆధ్వర్యంలో రామడుగు లక్ష్మణ్‌ను శాలువా, పూలదండలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి దాగం మల్లేష్, జాడి పోషం, దాడి గట్టయ్య, గట్టు సర్వేశం, దుర్గం సుధాకర్, శంకర్, రాయలింగు, సత్తయ్య, రాజన్న, గోలేటి రాజకుమార్, విజయ రాయలింగు తదితరులు పాల్గొన్నారు.

## ప్రైవేట్ ఎలక్ట్రికల్ బస్సు కన్సల్టెన్సీల

# కార్మిక దోపిడీ అరికట్టాలి

ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి సమ్మయ్య



**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి :** జెబిఎం ఎలక్ట్రికల్ బస్సులు కన్సల్టెన్సీలు శ్రీబాలాజీ, సిల్‌కాన్‌కు చెందిన వారు బస్సులపై ఆధారపడి పనిచేస్తున్న కార్మికుల జీతాల నుంచి పిఎఫ్ డబ్బులు రికవరీ చేసుకుని ఐదు నెలలుగా ఆడబ్బును పిఎఫ్‌లో జమ చేయకుండా తమ సొంతానికి వాడుకోవడం అన్యాయమని ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి టేకుమల్ల సమ్మయ్య అన్నారు. వెంటనే ఆ డబ్బును వారి పిఎఫ్ ట్రస్ట్‌లో జమ చేయాలని డిమాండ్ చేశారు. గత 5 నెలల నుంచి జెబిఎం బస్సులపై పనిచేసే సిబ్బంది జీతాల నుంచి పిఎఫ్ పేరుతో నెలకు రూ.3 వేలు కట్ చేసుకుని అట్టి డబ్బులను పిఎఫ్‌లో జమ చేయకపోవడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఈ ఘటన వల్ల జెబిఎం యాజమాన్యం, ఆర్‌టిసి యాజమాన్యం వెంటనే స్పందించి కార్మికుల పిఎఫ్ డబ్బులను కాజేసిన వారిపై వెంటనే తగిన చర్యలు తీసుకోవాలన్నారు. కార్మికుల డబ్బులను పిఎఫ్ ఖాతాలో జమ చేపించాలని, లేని పక్షంలో జెబిఎం బస్సులపై పనిచేసే సిబ్బందికి ఎఐటియుసి అండగా నిలిచి వారి సమస్యల కోసం పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఇప్పటికైనా జెబిఎం, విద్యుత్ బస్సులలో పనిచేసే కార్మికులు యాజమాన్యాలకు భయపడకుండా సంఘటితం కావాలని, సమస్యల పరిష్కారం కోసం పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.



# స్థానికం REGIONAL NEWS
ఖమ్మం భద్రాద్రి కొత్తగూడెం

## స్పోర్ట్స్‌లో ప్రతిభ కనబరుస్తున్న చిన్నారి



**ప్రజాపక్షం/ఆళ్లపల్లి :** మండల కేంద్రానికి చెందిన పరమ సునీల్ సంగీత దంపతుల కుమార్తె దీప్సిక(డింపు) స్థానిక శాంతి విద్యానికేతన్ పాఠశాలలో మూడవ తరగతి చదువుతూ కొత్తగూడెంలో జరిగిన తెలంగాణ క్రీడా విభాగంలో జిల్లా స్థాయిలో అత్యంత ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయిలో జరిగే క్రీడల్లో పాల్గొని అవకాశాన్ని సాధించింది. రాష్ట్ర స్థాయిలో జరిగే ఈ క్రీడా పోటీల్లో విజయం సాధిస్తే తెలంగాణ ప్రభుత్వ క్రీడా పాఠశాలలో ప్రవేశం లభిస్తుంది. ఈ పాఠశాలలో అనేక క్రీడా విభాగాలతో పాటు విద్య అలాగే నేషనల్ లెవెల్‌లో సత్తా చాటే విధంగా విక్షణను అందించడం జరుగుతుందని ఆల్లపల్లి మండలం నుండి అత్యంత చిన్న వయసులో స్పోర్ట్స్‌లో రాణిస్తున్న చిన్నారి దీప్సిక(డింపు)ను పలువురు అభినందిస్తున్నారు.

## మూడోసారి సిపిఐ మండల కార్యదర్శిగా సుధాకర్



ఖమ్మంరూరల్ మండలం, ఏదులాపురం మున్సిపాలిటీ కమిటీలు ఏకగ్రీవ ఎన్నిక

**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఖమ్మం రూరల్ మండలం, ఏదులాపురంమున్సిపాలిటీకి కలిపి గూడూరుపాడుకు చెందిన పుచ్చకాయల సుధాకర్ మూడోసారి కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అలాగే సహాయ కార్యదర్శులుగా ఉన్న రంగారావు (మద్దులపల్లి), చెరుకుపల్లి భాస్కర్ (ఏదులాపురం), కలింగి మోహన్‌రావు (కామంచికల్), బానోత్ రామ్మూర్తి (కస్నా తండా) ఎన్నికయ్యారు. గురువారం నిర్వహించిన సిపిఐ 14వ మండల మహాసభలో ఈ మేరకు నాయకత్వం నిర్ణయం తీసుకుంది. తొలుత ఖమ్మం రూరల్ మండలం, ఏదులాపురం మున్సిపాలిటీ బాడీని ఎన్నుకున్నారు. వారి ప్రతిపాదన మేరకు మండల కార్యదర్శి, సహాయ కార్యదర్శులు నియామకమయ్యారు. నూతనంగా ఏర్పాటైన బాడీ మూడు సంవత్సరాలు కొనసాగనుంది.

## 'కెటిపిఎస్'లో ప్రమాదం

* ఆర్టిజన్ కార్మికుడు మృతి
* కోటి ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి - ఎఐటియుసి



**ప్రజాపక్షం/పాల్వంచ :** పాల్వంచ కెటిపిఎస్ కర్మాగారంలో ప్రమాదం సంభవించి ఓ ఆర్టిజన్ కార్మికుడు మృతి చెందిన సంఘటన శుక్రవారం జరిగింది. ప్రశాంత్‌నగర్‌కు చెందిన ముద్రబోయిన సుబ్బారావు కెటిపిఎస్ ఐదవ దశలో ఆర్టిజన్ ఫోర్త్ గ్రేడ్ కార్మికుడిగా పనిచేస్తున్నాడు. తొమ్మిదవ యూనిట్ టర్బైన్‌లో మెయింటెన్స్‌లో విధులు నిర్వహించే క్రమంలో కెమికల్ సిలిండర్ వాల్వ్ ఒక్కసారిగా ఊడిపోయి ప్రమాదం సంభవించింది. దీనితో తీవ్ర గాయాలపాలైన సుబ్బారావును హుటాహుటిన సింగరేణి ఆసుపత్రికి తరలించారు. చికిత్స అందిస్తుండగా ఆరోగ్య పరిస్థితి విషమించి మృతి చెందాడు.

**కోటి ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలి :** మృతి చెందిన కార్మికుడి కుటుంబానికి కోటి ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని ఎఐటియుసి ఆర్టిజన్ విభాగం స్టేట్ జనరల్ సెక్రటరి శంకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.




## ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని ఉద్యమకారుల ఫోరం ఉమ్మడి ఖమ్మం జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరుతూ తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఉమ్మడి ఖమ్మం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం ఖమ్మం మయూరి సెంటర్‌లో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఫోరం కమిటీ బాధ్యులు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో ఆరవ హామీ అయిన ఉద్యమకారులకు 250 గజాల స్థలం, రూ.10లక్షల ఇంటి నిర్మాణానికి ఆర్థిక సాయం, పెన్షన్, హెల్త్ కార్డులు ఇస్తామని హామీ ఇచ్చిందన్నారు. రెండేళ్లు కావస్తున్నా ఇచ్చిన హామీని నెరవేర్చలేదన్నారు. వెంటనే ఇచ్చిన హామీలను నెరవేర్చాలని లేనిపక్షంలో తగిన బుద్ధి చెబుతామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఫోరం రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ కెవి.కృష్ణారావు, జిల్లా అధ్యక్షుడు పసుపులేటి నాసరయ్య, అర్వపల్లి విద్యాసాగర్, సిపిఐ నాయకులు శింగు నర్సింహారావు, మేకల శ్రీనివాస్, సిహెచ్.సీతామహాలక్ష్మి, గాదె లక్ష్మీనారాయణ, ఎస్‌కె.సైదా, విజయ్, పగడాల నరేందర్, లింగనబోయిన సతీష్, వెంకటేశ్వర్లు, నెల్లూరి అత్యుతరావు, పద్మాచారి, పాలకుర్తి కృష్ణ, విజయ్, జిల్లా మహిళా అధ్యక్షురాలు రెడ్డిబోయిన వరలక్ష్మి పలువురు నాయకులు పాల్గొన్నారు.



## అనాథ మృతదేహాలకు అంత్యక్రియలు

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** గుర్తు తెలియని రెండు అనాథ మృతదేహాలకు అన్నం ఫౌండేషన్ ఆధ్వర్యంలో అంత్యక్రియలు నిర్వహించారు. ఖమ్మం ప్రభుత్వ వైద్యశాలలో గుర్తు తెలియని ఓ మహిళ, గుర్తు తెలియని మరో వ్యక్తి చికిత్స పొందుతూ 10 రోజుల క్రితం చనిపోయారు. వైద్య సిబ్బంది మార్చురీలో మృతదేహాలను భద్రపరిచారు. ఇప్పటి వరకు ఆ మృతదేహాల కోసం ఎవరూ రాకపోవడంతో పోలీసులు, వైద్య సిబ్బంది అన్నం ఫౌండేషన్ బాధ్యులకు సమాచారం అందించారు. పోలీసుల సూచనల మేరకు అన్నం ఫౌండేషన్ బాధ్యులు అన్నం శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మృతదేహాలను స్వాధీనం చేసుకుని బల్లేపల్లి వైకుంఠధామంలో దహన సంస్కారం చేశారు. అన్నం ఫౌండేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఏదులాపురం మున్సిపాలిటీని సందర్శించిన కమిషనర్ అగస్త్యా

**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఖమ్మం రూరల్ మండలం ఏదులాపురంమున్సిపాలిటీ స్పెషల్ ఆఫీసర్, ఖమ్మం కమిషనర్ అభిషేక్ అగస్త్యా పెద్దతండలోని కార్యాలయాన్ని శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీ అధికారులతో పలు అంశాలపై చర్చించారు. కమిషనర్ ఆళ్ల శ్రీనివాస్‌రెడ్డిని చేపట్టాల్సిన పలు అభివృద్ధి పనులు, పలు సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు అవసరమైన పనులపై కమిషనర్‌కు పలు సూచనలు చేశారు. శానిటేషన్ సమస్య లేకుండా.. జవాన్లను ఒక్కో గ్రూపుకి 10మందిగా విభజించి, ట్రాక్టర్ల ద్వారా చెత్తను సేకరించి దానవాయిగూడెం డంపింగ్ యార్డుకు తరలించాల్సిందిగా సూచించారు. భూవన్ సర్వేని నిర్వహించి అందులో ఇండ్లను పొందుపరచేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఒక్కో బిల్ కలెక్టర్ రోజుకు 25ట్రేడ్ లైసెన్స్ ఇవ్వాలని ఆదేశించారు. మున్సిపాలిటీకి ఆదాయం వచ్చేలా ఎడ్వర్టైజ్‌మెంట్ల కోసం హోర్డింగ్లు ఏర్పాటు చేయాలన్నారు. కార్యాలయానికి వచ్చే ప్రజల సౌకర్యార్థం ఇందిరమ్మ క్యాంటీన్‌తో పాటు మీసేవ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలన్నారు. అలాగే వాటర్‌పంప్‌లైన్లన్నింటినీ ఆన్‌లైన్ చేయాలన్నారు. రూ.5కోట్ల అంచనతో కూడిన ప్రతిపాదనలు పంపించాలని కమిషనర్‌కు సూచించారు. అనంతరం అక్కడ నూతనంగా మున్సిపాలిటీ అవసరాల కోసం ఎస్‌టి కమ్యూనిటీ భవన్‌లో ఏర్పాటు చేసిన కార్యాలయ విభాగాలను పరిశీలించారు.

## సుజాతనగర్ మండలంలో
# అభివృద్ధి పనుల మహోత్సవం

రూ.1.30కోట్ల అభివృద్ధి పనులు ప్రారంభించిన కూనంనేని

రూ.1.87 కోట్ల పనులకు శంకుస్థాపన





**ప్రజాపక్షం/సుజాతనగర్ :** మండల పరిధిలో అభివృద్ధి పనుల మహోత్సవం శుక్రవారం అట్టహాసంగా జరిగింది. స్థానిక శాసన సభ్యుడు కూనంనేని సాంబశివరావు శుక్రవారం ఎనిమిది పంచాయతీల పరిధిలో పూర్తయిన 18 అభివృద్ధి పనులను ప్రారంభించారు. మరో 14 అభివృద్ధి పనులకు ఒక్కరోజే శంకుస్థాపన చేశారు. సర్వారం, కోయగూడెం, బేతంపూడి, జామ్లా తండా, పాత అంజనాపురం, కొత్త అంజనాపురం, నర్సింహ సాగర్, సింగభూపాలెం పంచాయతీల పరిధిలో రూ.1.30కోట్లతో పూర్తయిన రోడ్లు, డ్రైనేజీలు, కల్వర్టులను ప్రారంభించారు. మరో రూ.1.87కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. వివిధ గ్రామాల్లో జరిగిన అభివృద్ధి పనుల శంకుస్థాపన, ప్రారంభోత్సవ సభల్లో కూనంనేని మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో సుదీర్ఘకాలంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి ప్రాధాన్యతా క్రమంలో వాటి పరిష్కారంకోసం కృషి చేస్తున్నామని, ఇప్పటికే 70శాతం మేర గ్రామీణ ప్రధాన రహదారులు, అంతర్గత రహదారులు పూర్తిచేశామని తెలిపారు.

మండలంలో తాగునీటి సమస్య పరిష్కారం కోసం మూడు ప్రాంతాల్లో రూ.1.38కోట్లతో నిర్మించనున్న సంపు, పంపు హౌస్ నిర్మాణాలకు శంకుస్థాపన చేశామని, మరో రూ.30లక్షలతో పైపు లైన్ల నిర్మాణం, పునర్నిర్మాణం చేపడుతున్నామన్నారు. టిపిసిసి జనరల్ సెక్రెటరీ నాగ సీతారాములు, పిఎసిఎస్ చైర్మన్ మండే హనుమంతరావు, తహశీల్దార్ కృష్ణప్రసాద్, ఎంపిడిఒ బి.భారతి, సిఐ రాయల వెంకటేశ్వర్లు, ఎఒ నర్మ, ఎలక్ట్రికల్ ఆర్‌డబ్ల్యూఎస్ డిఇ శివయ్య, ఎఇ గుగులోత్ కిషన్, ఎఒ నర్మద, సిపిఐ జిల్లా సమితి సభ్యుడు భూక్యదస్రు, కుమారి హనుమంతరావు, జక్కుల రాములు, పొదల శ్రీను, రైతు సంఘం అధ్యక్షుడు తాళ్లూరు పాపారావు, ధర్మారావు ఎఐటియుసి అధ్యక్షుడు వీర్ల మల్లేష్, వీర్ల దుర్గాప్రసాద్, సిపిఐ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

### రూ.45లక్షలతో పంప్‌హౌజ్ నిర్మాణానికి శంకుస్థాపన

**ప్రజాపక్షం/పాల్వంచ :** ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కరించడమే తన బాధ్యత అని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. మండల పరిధి కారెగట్టు సమీపంలో రూ.45 లక్షలతో 90కెఎల్ పంప్‌హౌజ్ నిర్మాణ పనులకు గురువారం రాత్రి శంకుస్థాపన చేశారు. దీనితో కారెగట్టు, సారెకల్లు గ్రామాలకు శాశ్వత మంచినీటి సమస్యకు చెక్ పడింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ... మండలంలో మిషన్ భగీరథ ద్వారా మంచినీటి సమస్యకు పరిష్కారం జరిగిందన్నారు. వర్షాలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎంపిడిఒ కె.విజయ భాస్కర్ రెడ్డి, మిషన్ భగీరథ డిఇ సత్యసాయి, సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుడు ముత్యాల విశ్వనాథం, మండల, పట్టణ కార్యదర్శులు వీసంశెట్టి పూర్ణచందర్ రావు, అడుసుమిల్లి సాయిబాబ, కాంగ్రెస్ నాయకులు ఎర్రంశెట్టి మధు, ఎఐటియుసి నాయకులు దుగ్గిరాల సుధాకర్, నిమ్మల రాంబాబు, అన్నారపు వెంకటేశ్వర్లు, శనగారపు శ్రీనివాసరావు, కొంగర అప్పారావు,



## అంగన్వాడీ భవనానికి ఎమ్మెల్యే జారే శంకుస్థాపన

**ప్రజాపక్షం/అన్నపురెడ్డిపల్లి :** మండల కేంద్రంలో అంగన్వాడీ భవనానికి అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ శంకుస్థాపన చేశారు. మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో ఎస్సీ 1 అంగన్వాడీ సెంటర్‌కు పాత భవనం శిథిలం కావడంతో చాలా సంవత్సరాలుగా పక్కా భవనం లేకుండా పోయింది. అద్దె ఇంట్లో అంగన్వాడీ సెంటర్‌ను నిర్వహించడం జరుగుతుంది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మాత శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసూరి అనసూర్య(సీతక్క) చొరవతో రాష్ట్రంలో చాలా అంగన్వాడీ కేంద్రాలకు నూతన భవనాల నిర్మాణం కొరకు నిధులను కేటాయించారు. దీనిలో భాగంగా ఎన్‌ఆర్‌ఇజిఎస్ నిధులతో సుమారు 8లక్షల రూపాయల వ్యయంతో పక్కా భవనాన్ని నిర్మించుటకు అన్నపురెడ్డిపల్లి ఎస్సీ కాలనీ నందు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం పేద ప్రజల అభివృద్ధికి ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెడుతుందని, ఎన్నో ఏళ్లుగా లేనటువంటి అంగన్వాడీ పిల్లలకు ప్రత్యేక పక్కా భవనాన్ని నిర్మించడం కోసం రాష్ట్రంలో పెద్ద ఎత్తున ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలందరూ సద్వినియోగంపరచుకోవాలని తెలిపారు. ఈకార్యక్రమంలో ఎంపిఒ షభాన, చంద్రుగొండ ప్రాజెక్ట్ సూపర్వైజర్ అరుణ, అంగన్వాడీ కార్యకర్తలు శివకుమారి, వెంకటలక్ష్మి, పరసా కుమారి, లావణ్య, పార్వతి, విజయ, మండల కాంగ్రెస్ అధ్యక్షులు వనమా గాంధీ, జిల్లా నాయకులు పరసా వెంకటేశ్వర్లు, బోడ పద్మ, శ్రీను, రాజా, పూర్ణ, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## అమరుల ఆశయ సాధనకు పునరంకితంకండి

ప్రకాశరావు సేవలు అజరామరం

తూము ప్రకాశరావు వర్ధంతి సభలో బాగం



**ప్రజాపక్షం/ఖమ్మం :** అమరుల ఆశయ సాధనకు పునరంకితం కావాలని, ప్రజా సమస్యల పరిష్కారమే ఎజెండాగా కార్యాచరణ రూపొందించుకోవాలని సిపిఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు పిలుపునిచ్చారు. తుదిశ్వాస వరకు పేదల అభ్యున్నతే లక్ష్యంగా తూము ప్రకాశరావు పని చేశారని ఆయన సేవలు అజరామరమని సూర్యచంద్రులు ఉన్నంత కాలం ప్రకాశరావు పేరు చిరస్థాయిగా నిలిచిపోతుందన్నారు. సిపిఐ జిల్లా నాయకుడు తూము ప్రకాశరావు 42వ వర్ధంతి కార్యక్రమాన్ని శుక్రవారం బోనకల్ మండల పరిధిలోని రాయన్నపేట, కలకోట గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. రాయన్నపేటలోని సిపిఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రకాశరావు కాంస్య విగ్రహానికి బాగం హేమంతరావు పూలమాలలు వేసి నివాళులర్పించగా, పార్టీ పతాకాన్ని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్ ఆవిష్కరించారు. కలకోట గ్రామంలో తూము ప్రకాశరావు సహచరుడు, మాజీ సర్పంచ్ వెంగళ రాములు స్మారక స్తూపం వద్ద పార్టీ పతాకాన్ని రాష్ట్ర సమితి సభ్యులు జమ్ముల జితేందర్‌రెడ్డి ఆవిష్కరించారు. పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు తోట రామాంజనేయులు, తూము రోషన్‌కుమార్, మండల కార్యదర్శి యంగళ ఆనందరావు, మండల నాయకులు బొమ్మినేని నాగేశ్వరరావు, బొమ్మినేని హన్మంతరావు, బత్తినేని చారిటబుల్ ట్రస్టు అధ్యక్షులు బత్తినేని నాగప్రసాద్, జక్కుల రామారావు, ఆకెన పవన్, యంగళ పెద్ద రమేష్, పూర్ణచంద్, తోటపల్లి ఆనందరావు, ఏలూరి రమేష్, మడుపల్లి వెంకటేశ్వర్లు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## జై భీం – జై బాపు – జై సంవిధాన్ ముమ్మరంచేసేందుకు కృషి

కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** జిల్లా వ్యాప్తంగా జై భీమ్ జై బాపు జై సంవిధాన్ కార్యక్రమాన్ని ముమ్మరం చేయాలని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ తెలిపారు. శుక్రవారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయం సంజీవరెడ్డి భవన్‌లో జిల్లా అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ అధ్యక్షతన జిల్లా, మండల, పట్టణ అధ్యక్షులతో, జై సంవిధాన్ అభియాన్ మండల కోఆర్డినేటర్లతో ఖమ్మం నగరంలోని డివిజన్ ఇన్‌చార్జిలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పువ్వాళ్ల దుర్గాప్రసాద్ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని మండలాల్లో జై బాపు జై భీమ్ జై సంవిధాన్ కార్యక్రమాన్ని ముమ్మరం చేయాలన్నారు. ఇంకా నిర్వహించని ప్రాంతాల్లో యుద్ధ ప్రాతిపదికన నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమాన్ని సజావుగా నిర్వహించేందుకు మండల కోఆర్డినేటర్లు మండల అధ్యక్షులతో సమన్వయం చేసుకుని పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పిసిసి ప్రధాన కార్యదర్శి నూతి సత్యనారాయణ, మేయర్ పునుకొల్లు నీరజ, అనుబంధాల జిల్లా అధ్యక్షుడు కొత్తా సీతారాములు, దొబ్బల సౌజన్య, ముజాహిద్ హుస్సేన్, సయ్యద్ గౌస్, మొక్కా శేఖర్‌గౌడ్, బొడ్డు బొందయ్య, పిసిసి సభ్యులు వడ్డే నారాయణరావు, బ్లాక్, మండల, పట్టణ అధ్యక్షులు, కోఆర్డినేటర్లు, డివిజన్ ఇన్‌చార్జిలు తదితరులు పాల్గొన్నారు.

## నాలుగు లేబర్ కోడ్‌లను ఉపసంహరించుకోవాలి

కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య డిమాండ్

**ప్రజాపక్షం/కొత్తగూడెం టౌన్ :** కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ జులై 9వ తేదీన జరగనున్న ఒక్కరోజు సార్వత్రిక సమ్మెలో సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులు పాల్గొనాలని, కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాల స్థానంలో తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను ఉపసంహరించుకోవాలని డిమాండ్‌తో ఈ సమ్మె జరుగుతుందని, సింగరేణి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి ఆధ్వర్యంలో శుక్రవారం నాడు కొత్తగూడెం సింగరేణి ప్రధాన కార్యాలయంలో జనరల్ మేనేజర్ పర్సనల్ ఐఆర్ అండ్ పిఎం ఎ.కవిత నాయుడు కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య ఆధ్వర్యంలో సమ్మె నోటీసును సమర్పించడం జరిగింది. ఈ సందర్భంగా వాసిరెడ్డి సీతారామయ్య కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి అక్బర్ ఆలీ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వ రంగాన్ని నిర్వీర్యం చేస్తూ ప్రజాధనాన్ని, ప్రభుత్వరంగ సంస్థలను బడా కార్పొరేట్ కంపెనీలకు అప్పజెప్పే ప్రయత్నాలు తీవ్రతరం అయ్యాయని విమర్శించారు. సంపద పోగుపడటానికి కారణమైన కార్మికవర్గ హక్కులను హరించే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఈ ప్రభుత్వ దుర్మార్గాన్ని తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి నాయకులు మడ్డి ఎల్లా గౌడ్, కొత్తగూడెం రీజియన్ కార్యదర్శి యర్రగాని కృష్ణయ్య, ఉపాధ్యక్షుడు కేడబ్ల్యా క్రిస్టఫర్, ఎం.చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## నారాయణ విద్యా సంస్థలను సీజ్ చేయాలి

డిఇఒ చాంబర్ ఎదుట ఎఐఎస్ఎఫ్ ధర్నా



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** అనుమతులు లేకున్నా ఉన్నట్లు చూపిస్తూ అధికారులను తప్పుదోవ పట్టిస్తున్న నారాయణ విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఇటికాల రామకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం ఎఐఎస్ఎఫ్ ఖమ్మం జిల్లా సమితి ఆధ్వర్యంలో జిల్లా విద్యాశాఖాధికారి సత్యనారాయణ చాంబర్ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం డిఇఒ కార్యాలయ సూపరింటెండెంట్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఇటికాల రామకృష్ణ మాట్లాడుతూ ఖమ్మం నగరంలోని జమ్మిబండ ఏరియాలో నడుస్తున్న నారాయణ పాఠశాలలో ఫైర్ సేఫ్టీ, శానిటరీ, క్రీడా మైదానాలు వంటి సౌకర్యాలు లేకుండానే పాఠశాల నిర్వహణకు రెన్యువల్ పర్మిషన్ పొందారన్నారు. ఇది విద్యాశాఖ నియమనిబంధనలకు విరుద్ధంగా ఉన్నాయన్నారు. తప్పనిసరిగా ఫైర్ సేఫ్టీ ఆ భవనంలో ఉంటేనే అనుమతి ఇవ్వాలని, లేకుండా ఎలా ఇచ్చారని వారు అధికారులను ప్రశ్నించారు. పారిశుధ్యానికి సంబంధించి, మున్సిపల్ అధికారుల నుంచి ఎటువంటి అనుమతులు పొందలేదన్నారు. విద్యార్థులకు క్రీడా మైదానం లేదన్నారు. జిల్లా అధికారులు తక్షణమే తనిఖీలు నిర్వహించి స్కూల్ రెన్యువల్ పర్మిషన్ రద్దు చేయాలన్నారు. అదేవిధంగా కవిరాజ్ నగర్‌లో నడుస్తున్న మరో నారాయణ పాఠశాలలో క్రీడా మైదానం లేకుండానే అనుమతులు పొందారన్నారు. ఈ పాఠశాల కూడా విద్యాశాఖ నియమనిబంధనలకు విరుద్ధంగా ఉందన్నారు. ఫైర్ సేఫ్టీ, శానిటరీ అనుమతులు లేకుండానే పాఠశాలలు నిర్వహిస్తున్నారన్నారు. ఇక్కడ కూడా తనిఖీలు నిర్వహించి అనుమతులు రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ రెండు పాఠశాలలకు సంబంధించి బుక్స్ గోడౌన్ ఏర్పాటు చేసి పుస్తకాలు, యూనిఫాం, షూ, టై, బెల్ట్‌లు ఇంకా ఇతర వస్తువులు తమ పాఠశాలలో కొనుగోలు చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులను ఆదేశిస్తూ అధిక ధరలకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారన్నారు. ఇటీవల అధికారులు గోడౌన్స్ సీజ్ చేసిన మరల దొడ్డిదారిన విక్రయాలు జరుపుతున్నా విద్యాశాఖాధికారులు చోద్యం చూస్తున్నారన్నారు. వెంటనే నారాయణ విద్యా సంస్థల అనుమతులను రద్దు చేసి యజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. లేని యెడల ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ప్రత్యక్ష ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు మడుపల్లి లక్ష్మణ్, జిల్లా సహాయ కార్యదర్శి శివనాయక్, వంశీ, మనోజ్, పవన్, గోపి, రాహుల్, లక్ష్మణ్, సాయి, నరేందర్, మహేష్, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

## వనం లక్ష్మమ్మకు టియుడబ్ల్యూజె నేతల నివాళి



ఐజెయు జిల్లా అధ్యక్షుడు వనంకు పలువురి పరామర్శ

**ప్రజాపక్షం/ఖమ్మం :** ఇటీవల మరణించిన వనం లక్ష్మమ్మకు టియుడబ్ల్యూజె (ఐజెయు) నేతలు ఘనంగా నివాళులర్పించారు. టియుడబ్ల్యూజె (ఐజెయు) జిల్లా అధ్యక్షుడు వనం వెంకటేశ్వర్లు మాతృమూర్తి వనం లక్ష్మమ్మ ఈనెల 22న అనారోగ్యంతో నల్లగొండలో మరణించారు. శుక్రవారం ఖమ్మంలోని వనం వెంకటేశ్వర్లు ఇంటికి వెళ్లి లక్ష్మమ్మ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టియుడబ్ల్యూజె (ఐజెయు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రాంనారాయణ, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మాటేటి వేణుగోపాల్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు సామినేని మురారి, సీనియర్ జర్నలిస్టు, ఆంధ్రజ్యోతి బ్యూరో ఇన్‌చార్జి నలజాల వెంకట్రావు, జర్నలిస్టు హౌజింగ్ సొసైటీ అధ్యక్షుడు కనకం సైదులు, ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా ఉపాధ్యక్షుడు మామిడాల భూపాల్, ఐజెయు నగర కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు మైసా పాపారావు, చెరుకుపల్లి శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్‌కె మోయిద్దీన్, వీడియో జర్నలిస్టు అసోసియేషన్ నాయకుడు ఆలస్యం అప్పారావు, యూనియన్‌జిల్లా నాయకులు తాళ్లూరి మురళికృష్ణ, పసుపులేటి సత్యనారాయణ, మహేందర్, జనార్థనాచారి, నామ పురుషోత్తం, రమేష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## పారదర్శకంగా ఇసుక కేటాయింపు

స్వశక్తి మహిళా సంఘాలకు ఇసుక రీచ్‌ల నిర్వహణ

ప్రతి ట్రాక్టర్ ఇసుకకు రూ.200 చెల్లించాలి

ఇసుక సరఫరాపై సమీక్షించిన అదనపు కలెక్టర్




**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** పారదర్శకంగా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి అవసరమైన ఇసుక కేటాయించాలని అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి తెలిపారు. అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి అవసరమైన ఇసుక సరఫరాపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి ఇసుక సమస్య రాకుండా మండలాల వారీగా ఎక్కడి నుంచి ఇసుక తీసుకోవాలో ప్రభుత్వం నిర్ణయించి ఇసుక రీచ్‌లను కేటాయించిందన్నారు. మండలాల్లో ఎక్కడైనా ఇసుక తరలించే పాయింట్ అందుబాటులో ఉంటే ఆ వివరాలను తహసీల్దార్ అందించాలని అదనపు కలెక్టర్ సూచించారు. ప్రతి ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారునికి హౌజింగ్ శాఖ ఎఇ నుంచి ఏ సమయంలో ఎన్ని ట్రాక్టర్ల ఇసుక అవసరం ఉంటుందో వివరాలతో లేఖ అందించాలన్నారు. ఎఇ అందించిన లేఖ ఆధారంగా తహసీల్దార్ కూపన్ జారీ చేస్తారని కూపన్‌తో మూడు రోజులు సంబంధిత మండలానికి కేటాయించిన ఇసుక రీచ్ నుంచి ఇసుక తెచ్చుకోవాల్సి ఉంటుందన్నారు. పంచాయతీ కార్యదర్శుల ఆధ్వర్యంలో అవసరమైన వాహనాలు అందుబాటులో ఉంటాయని, స్వశక్తి మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఇసుక రీచ్‌లు నిర్వహిస్తున్నామని, ప్రతి ట్రాక్టర్ లోడు ఇసుకకు రూ.200 తహసీల్దార్ కార్యాలయం వద్ద చెల్లించాల్సి ఉంటుందన్నారు.

**విపత్తు నిర్వహణకు అవసరమైన సామగ్రి ఏర్పాటు :** విపత్తు నిర్వహణ కోసం అవసరమైన పరికరాలు అందుబాటులో పెట్టేందుకు చర్యలు తీసుకుంటున్నామని అదనపు కలెక్టర్ తెలిపారు. డిఆర్‌డివో సన్యాసయ్య, హౌజింగ్ పిడి భూక్యా శ్రీనివాస్, జిల్లా పంచాయతీ అధికారి ఆశాలత, జిల్లా మైనింగ్ అధికారిణి సాయినాథ్, ఆర్డీవోలు నర్సింహారావు, రాజేందర్, డిఎల్‌పివో రాంబాబు, తహసీల్దార్లు, ఎంపిడివోలు, ఎంపివోలు, హౌజింగ్ ఏఈలు, అధికారులు పాల్గొన్నారు.



# స్థానికం
REGIONAL NEWS
వరంగల్, హన్మకొండ, జనగాం, భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్

## రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన

**ప్రజాపక్షం/హనుమకొండ :** పశ్చిమ నియోజకవర్గ అభివృద్ధి లో భాగంగా శుక్రవారం వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి, నగర మేయర్ గుండు సుధారాణి,గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ తో కలిసి 31 వ డివిజన్ హంటర్ రోడ్డులో వాసవి కాలనీ, గాయత్రి కాలనీ లలో రూ.88.73 లక్షలతో నూతన అంతర్గత రోడ్లు నిర్మాణ పనులకు. శంకుస్థాపన చేశారు.తొలుత ఎస్సీ కాలనీలో మంజూరు చేసిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. గతంలో కూడా ఎన్నికల ముందు, ఎన్నికల తరువాత పర్యటించిన క్రమంలో తన దృష్టికి వచ్చిన అంతర్గత రోడ్లు, సైడ్ డ్రైనేజీ, విద్యుత్తు సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు. నగరాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు అధికార యంత్రాంగం కలిసి కట్టుగా ముందుకు వెళ్తుందని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అట్టడుగు వర్గాలకు అండగా ఉండాలని అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంల్లో రాజు యాదవ్, సురేందర్, రమేష్, కృష్ణ, రాజు, రమేష్ , సురేష్ కాలనీ వాసులు పాల్గొన్నారు.

## కార్మికోద్యమ నేత ఆకుల పెంటయ్య ఆశయాలను కొనసాగించాలి



**ప్రజాపక్షం/జనగామప్రతినిధి:** కార్మికోద్యమ నాయకుడు ఆకుల పెంటయ్య ఆశయాలను కొనసాగించాలని జనగామ మాజీ ఎమ్మెల్యే, ఎఐటియుసి జిల్లా గౌరవాధ్యక్షులు సిహెచ్ రాజారెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం షాప్స్ అండ్ గ్రేన్ మార్కెట్ హమాలీ యూనియన్ వ్యవస్థాపకులు ఆకుల పెంటయ్య 13వ వర్ధంతి షాప్స్ అంగ్ గ్రేన్ మార్కెట్ హమాలీ యూనియన్ కార్యాలయంలో జరిగింది. వర్ధంతి కార్యక్రమానికి యూనియన్ అధ్యక్షులు మేటే శ్రీశైలం అధ్యక్షత వహించగా రాజారెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని ఆకుల పెంటయ్య చిత్ర పటానికి పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. ఆయన పోరాటాల స్మృతులతో కార్మిక సమస్యలపై మరిన్ని పోరాటాలు చేయాలన్నారు.

**జులై 9న సార్వత్రిక కమ్మెనె జయప్రదం చేయాలి**

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా జులై 9న దేశ వ్యాప్తంగా జరిగే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకుల శ్రీనివాస్ పిలుపునిచ్చారు. కేంద్రం కార్మిక హక్కుల్ని పూర్తిగా హరిస్తుందని, 44 చట్టాలను 4 కోడ్‌లుగా విభజిస్తుందన్నారు. అనేక పోరాటాల ఫలితంగా సాధించుకున్న హక్కుల్ని హరిస్తున్న పాలకులకు బుద్ధి చెప్పే విధంగా ఈ సమ్మె జరగనుందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పట్టణ కార్యదర్శి చొప్పరి సోమయ్య, యూనియన్ కార్యదర్శి చామకూర యాకూబ్, కోశాధికారి దాయ నగేష్, యూనియన్ నాయకులు బుడిగ వీరస్వామి, చామకూర తిరుమలేష్, బిక్షపతి, పుప్పాల ఐలయ్య, సుదర్శనం, శ్రీధర్‌రెడ్డి, బ్రహ్మంతో పాటు పలువురు పాల్గొన్నారు.

## గుడుంబా కేంద్రాలపై దాడులు



**ప్రజాపక్షం/గూడూరు:** మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం ఎక్సైజ్ స్టేషన్ పరిదిలోని కేసుద్రం మండలంలోని పెనుగోండ గ్రామంలో వరంగల్ టాస్క్ ఫోర్స్ మరియు గూడూరు ఎక్సైజ్ స్టేషన్ సిబ్బంది గుడుంబా అమ్మక కేంద్రాలపై దాడులు నిర్వహించారు.దాడులు నిర్వహించి నిందితులపై నాలుగు కేసులు నమోదు చేయగా పదిమందిని అదుపులో తీసుకున్నారు. ఈ దాడుల్లో 40 లీటర్ల నాటుసారా ఐదు సెల్‌ఫోన్లను స్వాదీనం చేసేకోవడం జరిగిందని కేసముద్రం తాహసిల్దార్ ముందు నిందుతులను బైండవర్ చేయడం జరిగిందని అన్నానరు.పట్టుబడిన వారిలో పిల్లలమర్రి సక్కుబాయి గడిపెల్లి లక్ష్మి పెండ్యాల వీరయ్య నల్ల మాస లక్ష్మి తాడిపెల్లి కౌసల్య గాడి పెల్లి లక్ష్మి షేక్ ఖాజాబి ఆడేపు విజయ బెజ్జం వీరస్వామి లాక రామసరసమ్మ లు ఉన్నట్లు వరంగల్ ఎన్ఫోర్స్మెంట్ సీఐ నాగయ్య లెలిపారు.ఈదాడులోపాల్గోన్నవారు ఎస్సై రజిత టాస్కఫోర్స్ ఎస్సై కీరీట గూడూరు సిఐ బిక్షపతి ఎస్సై రాజేశ్వరి వరంగల్ ఎన్ఫోర్స్మెంట్ సిబ్బంది మహబూబాబాద్ టాస్కోఫ్సర్స్ సిబ్బంది మూడు ఎక్సైజ్ సేషన్ సిబ్బంది పాల్గోన్నారు. ఈసందర్బంగా గూడూరు ఎక్సైజ సీఐ బిక్షపతి మాట్లాడుతూ నాటు పారా కేంద్రాలపై నాటుసార ముడి సరకు రహణా పై నిఘూ పెంచామని నాటు సారా తయారుచేసిన అమ్మిన కోనిన రవాణా చేసిన నాటుసార తయారీకి ఉపయోగించిన పట్టిక బెల్లం నిల్వచేసిన చట్టపరంగా చర్యలు తీసుకుంటామని సిఐ బిక్షపతి హెచ్చరించారు.

## గ్రామపంచాయతీ సిబ్బందిని అరెస్ట్ చేసిన పోలీసులు



**ప్రజాపక్షం/గూడూరు:** మహబూబాబాద్ జిల్లా గూడూరు మండల కేంద్రంలో తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ నిబంధన సంఘాలు తల పెట్టిన చలో హైదరాబాద్ కమిషనర్ కార్యాలయం ముట్టడికి వెళ్లన్న గ్రామ పంచాయతీ సిబ్బందిని పోలీసులు ఎక్కడికి అక్కడ అరెస్టు చేయడం జరిగింది ఈసందర్బంగా పెండింగ్ వేతనాలు మరియు మూడు నెలల నుండి జీతాలు లేక గ్రా పంచాయతీ కార్మికులు ఇబ్బందులు పడుతున్న రెండు నెలల క్రీతం గ్రీన్ చానల్ ద్వారా వేతనాలు వేస్తామని చెప్పిన రాష్ట్ర ప్రభుత్వం స్కీన్ ఛానల్ ద్వారా వేతనాలు వేయలేదని ఉద్యోగ భద్రత కల్పించలేదని జీవో నెంబర్ 51 సవరించాలని డిమాండ్ చేమడం జరిందని అన్నారు. ఇప్పటివరకు ఈ ప్రభుత్వం గ్రామపంచాయతీ సిద్దం దిని పట్టించుకున్న పాపన పోలేదని పంచాయతీరాజ్ కమిషనర్ కార్యాలయం ముట్టడి కార్యాక్రమం ఇందుకోసం తల పెట్టడం జరిగిందని అన్నారు. ఈకార్యాక్రమానికి వెళ్లకుండా మహబూబాబాద్ జిల్లా అధ్యక్షుడు మోయనుద్దీన్ అదువిధంగా గూడూరు మండల గ్రామపంచాయతీ కార్మికులందరినీ ముందస్లు అరెస్టు చేయడం హేయమైన చర్య అని అన్నారు.

## సొంతింటి కల నెరవేర్చిన కాంగ్రెస్ ప్రభుత్వం



**ప్రజాపక్షం/గూడూరు:** పేదప్రజల సోంతింటికలను తెలంగాణలో పెరవేర్చిన ఏకైక ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వమని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వాంకుడోత్ కొమ్మాలు నాయక్ బీరం శ్రీపాల్‌రెడ్డి పేర్కోన్నారు.మానుకోట నిమోజకవర్గంలోని గూడూరు మండల కేంద్రంలోని శుక్రవారం ఇందిరమ్మ ఇండ్ల ప్రోసీడింగ్ పత్రాలను పంపిణి చేసి ఇండ్లు ముగ్గు పోసి భూమి పూజ చేశారు.ఈసందర్బంగా వారు మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల ముగ్గు పూజలో పాల్గోనడం అనందంగా ఉందన్నారు.గూడూరు గ్రామపంచాయితీ పరిదిలో ఎవరు మొదటగా ఇందిరమ్మ ఇల్లు పూర్తి చేస్తారో వారికి స్వయంగా తాను కోంత నగదు బహుమతి అందిస్తానని ప్రకటించారు. ఈకార్యక్రమంలో ఇందిరమ్మ కమిటి సభ్యులు చంటి స్వామి రసూల్ చంద్‌పాషా నాయకులు పాల్గోన్నారు.

# అర్హులందరికీ ఇండ్లు మంజూరు చేస్తాం

ములుగు ప్రజల రుణం తీర్చుకుంటాం
అభివృద్ధి చేయడమే లక్ష్యం
మంత్రి సీతక్క






**ప్రజాపక్షం/ములుగు ప్రతినిధి:** ములుగు నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేసి ప్రజల రుణం తీర్చుకుంటామని, అర్హులందరికి ఖచ్చితంగా ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేస్తామని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమశాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క అన్నారు. శుక్రవారం ములుగు మండల కేంద్రం నుండి జీవంతరావుపల్లి గ్రామం మీదుగా గణేష్‌పల్లి వరకు మూడు కోట్ల యాభై లక్షల రూపాయలతో ఏర్పాటు చేయనున్న రోడ్డు విస్తరణ పనులు, డివైడర్, సెంట్రల్ లైటింగ్ పనులను మహబూబాబాద్ పార్లమెంట్ సభ్యులు పోరిక బలరాం నాయక్, జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచంద్రలతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రజా ప్రభుత్వం అర్హులైన పేదలందరికి ఇండ్లు నిర్మించి ఇవ్వాలనే ఉద్దేశ్యంతో మొదటి దఫాగా ప్రతి నియోజకవర్గానికి ఐదు వేల ఇండ్లను కేటాయించి పనులు ప్రారంభించడం జరిగిందని, ములుగు నియోజకవర్గానికి సంబంధిత మంత్రి మరో వెయ్యి ఇండ్లను అదనంగా కేటాయించనున్నారని వివరించారు. ఎక్కడ అభివృద్ధి చెందని ప్రాంతాలను గుర్తించి దశలవారీగా అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టడం జరుగుతుందని, ప్రతి గ్రామానికి రోడ్లు వేయడం, రోడ్ల విస్తరణ పనులు చేపట్టడం ముఖ్య మంత్రి ఆదేశాలతో జరుగుతున్నాయని తెలిపారు. తాము ఇచ్చిన హామీ మేరకు ములుగును మున్సిపాలిటీగా, మల్లంపల్లి గ్రామాన్ని జేడి మల్లంపల్లి మండలంగా ఏర్పాటు చేశామని అన్నారు. తాము అధికారికంగా ఆమోదం పొంది ఇచ్చిన హామీలను చూపిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సంపత్, పంచాయతీరాజ్ ఈ ఈ అజయ్ కుమార్, ప్రజా ప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

**వైద్యులు మెరుగైన వైద్య సేవలు అందించాలి**
**రహదారులు మెరుగుతో రాకపోకలలో సౌలభ్యం**

ఎన్ని ఇబ్బందులు ఎదురైనా పేదల అభ్యున్నతే ధ్యేయంగా రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం సంక్షేమ పథకాలను నిరంతరంగా కొనసాగిస్తుందని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా సంక్షేమశాఖ మంత్రి సీతక్క అన్నారు. శుక్రవారం మంగపేట మండలంలోని బ్రహ్మణపల్లి, ఎకె మల్లారామ్ గ్రామాల్లో ఇందిరమ్మ ఇండ్ల భూమి పూజ నిర్మాణ పనులను, ఎకె మల్లారామ్ గ్రామంలో ఎస్‌జి కాలనీలో అంతర్గత రహదారుల నిర్మాణం, అకినేపల్లి మల్లారం రూ.15లక్షలు, సి/ఓ అకినేపల్లి మల్లారాంలో 4/5 కిలోమీటర్లు వద్ద తక్కువ స్థాయి కారణ మార్గం రూ.242లక్షలు, ఎస్/ఆర్ నుండి ఆర్/ఎఫ్, ఆర్అండ్‌బి రోడ్డు, అకినెపల్లి మల్లారామ్ కిమీ 2/0 నుండి 4/0 వరకు రూ.200లక్షల నిధులతో రోడ్డు నిర్మాణ పనులను రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి ధనసరి సీతక్క, మహబూబాబాద్ పార్లమెంట్ సభ్యులు బలరాం నాయక్, జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, ఎస్‌పి శబరీష్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ రవిచందర్‌లతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉప వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ విపిన్ కుమార్, ఐటిడిఏ డిప్యూటీ డిఎంహెచ్ఓ డాక్టర్ క్రాంతి కుమార్, జిల్లా కీటకజనిత నియంత్రణాధికారి డాక్టర్ చంద్రకాంత్, ప్రజా ప్రతినిధులు, రైతులు, మండల అధికారులు, ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారులు, సంబంధిత అధికారులు, వైద్య సిబ్బంది, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

## రవి కుటుంబాన్ని పరామర్శ

సిపిఐ జిల్లా నాయకులు



**ప్రజాపక్షం/టేకుమట్ల:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అల్లూరి సీతారామరాజు జిల్లా మారేడుమిల్లి అడువుల్లో ఇటివల జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన గాజర్ల రవి అలియాస్ గణేష్ అలియాస్ ఉదయ్ కుటుంబ సభ్యులను సిపిఐ సీనియర్ నాయకులు మామిడాల సమ్మిరెడ్డి,జయశంకర్ భూపాలపల్లి జిల్లా సహాయ కార్యదర్శి పైళ్ల శాంతి కుమార్ గాజర్ల రవి చిత్ర పటానికి పూలమాల వేసి కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా శంతి కుమార్ మాట్లాడుతూ పీడిత తాడిత ప్రజల కోసం బూర్జవ వ్యవస్థకు వ్యతిరేకంగా ఆదివాసుల హక్కుల పరిరక్షణ కోసం ప్రభుత్వ నిరంకుశ విధానాలకు వ్యతిరేకంగా చదువుకునే రోజుల్లోనే మవోయిస్టు పార్టీకి ఆకర్షితుడై ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం అనేక పోరాటాలు నిర్వహించి భూస్వాముల గుండెల్లో సింహ సప్నమైన్నాడు. రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు అన్నారపు రాజేందర్, సిపిఐ రేగొండ మండల కార్యదర్శి పెంట రవి పాల్గోన్నారు.

## నల్ల బెల్లం, పటిక పట్టివేత

**ప్రజాపక్షం/వరంగల్ క్రైమ్ :** గుడుంబా తయారీకి ఉపయోగపడే నల్ల బెల్లం పటికను అక్రమంగా మహారాష్ట్ర నుండి తరలిస్తున్న వ్యక్తిని హనుమకొండ బస్టాండ్ లో అదుపులోకి తీసుకొవడం జరిగింది.గూడూరు మండలం ఇప్పల తండాకు చెందిన ధరావత్ లచ్చిరామ్ అనే అతను అక్రమంగా గుడుంబా తయారు చేస్తూ తన ఊర్లో అమ్ముతున్నాడు. అదే క్రమంలో శుక్రవారం మహారాష్ట్ర నుండి పదివేల రూపాయల విలువ గల నల్ల బెల్లం, పట్టికను తరలిస్తుండగా హనుమకొండ పోలీస్ వారు పట్టుకొని కేసు నమోదు చేయడం జరిగింది. ఇతని పట్టుకున్న ఎస్సై కిషోర్, ఏఎస్ఐ రఘునారెడ్డి, కానిస్టేబుల్ కర్ణాకర్ ను సిఐ అభినందించారు.

## విద్యాభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం కృషి

ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి



**ప్రజాపక్షం/హనుమకొండ:** విద్యాభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తున్నదని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు ప్రభుత్వ వృత్తి విద్యా జూనియర్ కళాశాలలో నిర్వహించిన ఉద్యోగ మేళాను శుక్రవారం ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముందుగా కళాశాలలో ఆఫీస్ అసిస్టన్షిప్ (ఓఏ) కోర్సు కోసం దాతల సహాయంతో ఏర్పాటు చేసిన కంప్యూటర్ ల్యాబ్‌ను ప్రారంభించారు. ల్యాబ్ ద్వారా విద్యార్థులకు కంప్యూటర్ నైపుణ్యాలు అభివృద్ధి చెందే అవకాశముంటుందని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి ఎమ్మెల్యే నాయిని మాట్లాడుతూ విద్య అనేది వ్యక్తిత్వ వికాసానికి మెట్టు అని అన్నారు. విద్యతో పాటు మంచి లక్షణాలు, క్రమశిక్షణ, నైతికత వంటివి యువతలో ఉండాలని పిలుపునిచ్చారు. ఉద్యోగాలు సాధించడంలో నిరంతరం శ్రమించాలన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్యా రంగాన్ని బలోపేతం చేయడానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో పలు సంస్కరణలు చేపడుతోందని తెలిపారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో యంగ్ ఇండియ ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్, రాష్ట్రవ్యాప్తంగా 570 కొత్త ప్రభుత్వ పాఠశాలలు ఏర్పాటు, విద్యా బడ్జెట్‌ను 7 శాతం నుండి 15 శాతం వరకు పెంపు, వసతి, విద్యార్థుల నిత్యావసరాలు, ఆరోగ్య భద్రత కోసం ప్రభుత్వం ఈ చర్యలు తీసుకుందని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నేతలు తోట పవన్, హనుమకొండలోని డీఐఈవో గోపాల్,కళాశాల ప్రిన్సిపాల్ శ్రీధర్, ఆర్డీఎస్డీఈ పర్యవేక్షకులు చందర్, కో ఎడ్యుకేషన్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్ రావు, డీఐఈవో వరంగల్ ఇంచార్జ్ మాధవ రావు,ప్రిన్సిపాల్ లు సంపత్ కుమార్, రాజిరెడ్డి, శరత్భతి, భగవద్గీత, శ్రీనివాస్ రెడ్డి , కళాశాల సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణ స్థలం పరిశీలన



**ప్రజాపక్షం/ఖానాపూర్:** మండలంలోని అశోక్ నగర్ గ్రామంలో అధునాతనమైన హంగులతో విశాలవంతమైన వాతావరణంలో 30 ఎకరాలలో 200 కోట్ల రూపాయలతో నిర్మించబోయే యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణానికి స్థల సేకరణ నేడు నర్సంపేట ఎంఎల్‌ఏ దొంతి మాధవరెడ్డి అధికారులతో కలిసి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఏ మాట్లాడుతూ నర్సంపేట నియోజకవర్గానికి రూ.200 కోట్ల నిధులతో ఆధునిక సదుపాయాలతో కూడిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్‌ను రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిందని నర్సంపేట నియజకవర్గం విద్యారంగ అభివృద్ధిలో ఇది కీలక మైలురాయని, మన నియోజకవర్గ పిల్లలు ఒక మెట్రో స్థాయి వసతులతో కూడిన పాఠశాలలో చదివే అవకాశం పొందారన్నారు.ఈ ప్రాజెక్టు రాష్ట్రానికి ముఖ్యంగా మన నియోజకవర్గానికి రావడం గర్వకారణమన్నారు. ఈ ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ మంజూరుకు సహకరించిన రాష్ట్ర ప్రభుత్వానిక నర్సంపేట నియోజకవర్గ ప్రజల తరుపున కృతజ్ఞతలు తెలిపారు. ఈ పాఠశాల ద్వారా గ్రామీణ విద్యార్థులకు సైతం నాణ్యమైన విద్యను సులభంగా పొందగలగడం విశేషమని, ఇది మన నియోజకవర్గ భవిష్యత్ తరాల విద్యాభివృద్ధికి బలమైన పునాది కానుందని పేర్కొన్నారు. ఎంఎల్‌ఏ వెంట ఆర్‌డిఓ ఉమారాణి, నర్సంపేట వ్యవసాయ మార్కెట్ చైర్మన్ పాల్వాయి శ్రీనివాస్, నర్సంపేట మార్కెట్ వైస్ చైర్మన్ శాఖమూరి హరిబాబు, ఓర్సు తిరుపతి, మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఎస్‌కె ముస్తఫా, తదితరులు పాల్గొన్నారు.

## ఆసుపత్రులు, వైద్య విద్య వసతుల సౌకర్యాలపై నివేదిక

రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ డా. సంగీత సత్యనారాయణ



**ప్రజాపక్షం/హనుమకొండ ప్రతినిధి :** ప్రభుత్వ ఆసుపత్రులతో పాటు వైద్య విద్య కళాశాలలకు ఎన్ఎంసి నిబంధనల మేరకు సౌకర్యాలను కల్పించేందుకు ప్రభుత్వానికి నివేదికను సమర్పించనున్నట్లు రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్, తెలంగాణ ప్రభుత్వం నియమించిన కేఎంసి,నర్సంపేట,జనగామ వైద్య కళాశాలల పర్యవేక్షణ కమిటీ చైర్ పర్సన్ డాక్టర్ సంగీత సత్యనారాయణ అన్నారు. శుక్రవారం వరంగల్ కాకతీయ మెడికల్ కళాశాలలో హనుమకొండ, వరంగల్ జిల్లాల కలెక్టర్లు స్నేహ శబరీష్, డాక్టర్ సత్య శారద లతో కాకతీయ మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రామ్ కుమార్ రెడ్డి, కోఆర్డినేటర్ డాక్టర్ మోహన్ దాస్, వివిధ విభాగాధిపతులు, హనుమకొండ వరంగల్ జిల్లాల్లోని అనుబంధ ప్రభుత్వ ఆస్పత్రుల సూపరింటెండెంట్లతో ప్రభుత్వ ఆసుపత్రులలో వసతుల కల్పనకు కావలసిన వివిధ అంశాలపై కమిషనర్ డాక్టర్ సంగీత సత్యనారాయణ సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు.ముందుగా కాకతీయ మెడికల్ కళాశాలలో బోధన, బోధనేతర, ల్యాబ్, సిబ్బంది, కావాల్సిన వసతులపై సమీక్షించారు. కేఎంసి లోని హెమటాలజి విభాగాన్ని, వైద్య విద్యార్థుల వసతి గృహాన్ని క్షేత్రస్థాయిలో సందర్శించి వాటిని గురించిన వివరాలను ప్రిన్సిపల్ రామ్ కుమార్ రెడ్డిని కమిషనర్ అడిగి తెలుసుకున్నారు. హనుమకొండలోని ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రిని సందర్శించి ఓపి విభాగం, ఆరోగ్యశ్రీ, లేబర్ రూమ్, నియోనాటల్ వార్డ్ ల ను కమిషనర్ సందర్శించి ఆయా వార్డుల వివరాలు, ఓపి సేవలు, రిఫరల్స్, ఫాలో అప్, ప్రసూతి సేవలను గురించి, వైద్యులు సిబ్బంది, తదితర వివరాలను వైద్యాధికారులను కమిషనర్ డాక్టర్ సంగీత సత్యనారాయణ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ అప్పయ్య, డాక్టర్ సాంబశివ రావు, టీజీఎంఐడిసి ఈఈ ప్రసాద్, కేఎంసి ఏడి రమేష్, ప్రసాద్, ఎంజీఎం సూపరింటెండెంట్ డాక్టర్ కిషోర్ కుమార్, ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాజేశ్వరి, సికేఎం ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ షర్మిల, పాల్గొన్నారు.

## నిరుపేదలకు మెరుగైన వైద్యం

కలెక్టర్ రిజ్వాన్ బాష షేక్



**ప్రజాపక్షం/జనగామ ప్రతినిధి:** నిరుపేదలకు మెరుగైన వైద్యం అందించాలని జనగామ జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాష షేక్ ఆదేశించారు. డాక్టర్లు నిత్యం అందుబాటులో ఉంటూ ప్రజలకు వైద్య సేవలు అందింస్తూ నిత్యం పర్యవేక్షించాలన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ హాస్పటిల్‌ను ఇజల్లా కలెక్టర్ సందర్శించి పరిశీలించారు. ఆస్పటల్‌లో ఏర్పాటు చేసిన సిటి స్కానింగ్ సెంటర్ పనితీరును పర్యవేక్షించి డెమో ద్వారా పరిశీలించారు. వారం రోజుల్లో ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. ఫిజియో థెరఫీ విభాగం సేవల గురించి డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. బ్లడ్ నిల్వ కేంద్రం నిర్వాహణపై అప్రమత్తంగా ఉండాలని, ఆకస్మాత్తుగా రక్తం సరఫరా చేసేందుకు సరిపడా యూనిట్‌లను సిద్దంగా ఉంచుకోవాలన్నారు. వైద్యం కోసం వచ్చిన మహిళలలో మాట్లాడారు. కొడకండ్ల మండలం మొండ్రాయి గ్రామానికి చెందిన పేషంట్ దరావత్ మంజులను ఆస్పటల్‌లో అందుతున్నవైద్యసేవల గురించి అడిగారు. పాము కరిచి హాస్పటల్‌కు రాగా వైద్య సేవలు అందించారన్నారు. డయాలసిస్ విభాగాన్ని కలెక్టర్ సందర్శించగా రఘునాథపల్లి మండలం నవాబుపేట గ్రామానికి చెందిన బూడిద మేఘన వారానికి రెండు సార్లు డయాలసిస్ చేయించుకునట్లు తెలిపారు. కలెక్టర్ వెంట మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ గోపాల్‌రావు, ఆర్ఎంఓ లక్ష్మి నారాయణ, డాక్టర్లు అనురాధ, శంకర్, పద్మ, ప్రభ తదితరులు పాల్గొన్నారు.

**ముగిసిన మూడు రోజుల పరిశీలన**

భూగర్భ జల సంరక్షణ తీరుపై పర్యవేక్షణ బృందం సంతృప్తి వ్యక్తం చేసింది. మూడు రోజుల పర్యవేక్షణ అనంతరం కేంద్ర బృందం శుక్రవారం జిల్లా కలెక్టర్‌ను కలిశారు. జలశక్తి అభియాన్ కింద నేషనల్ వాటర్ అవార్డులో భాగంగా క్షేత్ర స్థాయి పరిశీలనపై వచ్చిన కేంద్ర బృందం పర్యటన శుక్రవారం ముగిసింది. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పింకేష్‌కుమార్, డిఆర్‌డిఓ వసంత పాల్గొన్నారు.

## ఆర్గనైజ్డ్ క్రైమ్స్‌పై దృష్టి పెట్టండి

పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్



**ప్రజాపక్షం/వరంగల్ క్రైమ్ :** ఆర్గనైజింగ్ క్రైమ్స్ కు పాల్పడే వారిని ఎట్టి పరిస్థితి వదలొద్దని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ టాస్క్ ఫోర్స్ పోలీసులను అదేశించారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ శుక్రవారం టాస్క్ ఫోర్స్ కార్యాలయాన్ని తొలి సారిగా సందర్శించారు. టాస్క్ ఫోర్స్ కార్యాలయమునకు చేరుకున్న సీపీకి టాస్క్ ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ మొక్కను అందజేసి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సీపీ మొదటగా టాస్క్ ఫోర్స్ కార్యాలయం పరిసరాలను పరిశీలించిన అనంతరం ఇక్కడ విధులు నిర్వహిస్తున్న అధికారులు, సిబ్బంది వివరాలను అడిగి తెలుసుకోవడంతో పాటు టాస్క్ ఫోర్స్ అధికారులు ఎలాంటి విధులు నిర్వహిస్తున్నారు. ఇప్పటికి వరకు ఎలాంటి నేరగాళ్ళ పట్టుకున్నారు మొదలైన వివరాలను పోలీస్ కమిషనర్ ఆరా తీశారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ చట్టావ్యతిరేక చర్యలకు పాల్పడే వ్యక్తుల సమాచారం కోసం బలమైన ఇన్ఫార్మర్ వ్యవస్థ ను ఏర్పాటు చేసుకోవడంతో పాటు క్షేత్ర స్థాయిలో సమాచారాన్ని సేకరించాలని. టాస్క్ ఫోర్స్ లో క్వాలిటీ వర్క్ కావాలని, నేరానికి సంబందించి మూలలకు వెళ్ళి నేరస్తులను పట్టుకోవాలని, అలాగే టాస్క్ ఫోర్స్ కీర్తి ప్రతిష్టలకు భంగం కలిగించే రీతిలో వ్యవహరించవద్దని అలాంటి చర్యలకు పాల్పడితే సహించేది లేదని పోలీస్ కమిషనర్ అధికారులకు సూచించారు.

## నర్సింహుడిని దర్శించుకున్న బలరాం నాయక్




**ప్రజాపక్షం/మంగపేట:** తెలంగాణాలో రెండవ యాదగిరిగుట్టగా పిలుచుకునే మల్లూరులో స్వయంబుగా వెలసిన శ్రీ హేమాచల శ్రీ లక్ష్మీనృసింహస్వామి చెంచు లక్ష్మి ఆదిలక్ష్మి అమ్మవార్లను మహబూబాబాద్ పార్లమెంట్ సభ్యులు పోరిక బాలరామ్ నాయక్ దర్శించుకున్నారు. ఆయనకు ముందుగా అలయ అర్చకులు స్వాగతం పలికారు తరువాత గర్బగుడిలో స్వామి వారికి వారి పేరు మీద అర్చన చేసి స్వామి వారి విశిష్టత గుడి పురాణం చింతామణి జలపాతం గురించి వివరించి ఏంపి బలరాం నాయక్ కు శేషావస్త్రాలు తీర్థప్రసాదాలు అందచేసారు ఈ కార్యక్రమంలో దేవస్థానం అర్చకులు ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

# రీల్

## ఏషియన్ 'కూలీ' హక్కులు



సూపర్ స్టార్ రజనీకాంత్ హీరోగా వస్తున్న 'కూలీ' సినిమాకు లోకేష్ కనగరాజ్ దర్శకత్వం వహిస్తున్నారు. సన్ పిక్చర్స్ బ్యానర్ పై నిర్మిస్తున్న ఈ సినిమాలో నాగార్జున కీలక పాత్రలో నటిస్తున్నారు. ప్రముఖ నిర్మాత డి.సురేష్ బాబు, సునీల్ నారంగ్, దిల్ రాజు యాజమాన్యంలోని ప్రముఖ డిస్ట్రిబ్యూషన్ సంస్థ ఏషియన్ మల్టీప్లెక్స్ ప్రైవేట్ లిమిటెడ్ కూలీ మూవీ తెలుగు థియేట్రికల్ హక్కులను భారీ ధరకు సొంతం చేసుకున్నారు. రజనీకాంత్, నాగార్జునలతో పాటు సత్యరాజ్, సౌబిన్ షాహిర్, ఉపేంద్ర, శ్రుతీ హాసన్, మహేంద్రన్ వంటి ప్రముఖులు ఇందులో కీలమైన పాత్రల్లో కనిపిస్తారు. ఈ సినిమాను ఏషియన్ సురేష్ ఎంటర్‌టైన్‌మెంట్స్ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో విడుదల చేయనుంది. ఇప్పటికే విడుదలైన ఫస్ట్‌లుక్ పోస్టర్లు, టీజర్లు సినిమాపై భారీ అంచనాలను పెంచేశాయి.



## 'మైసా' ఫస్ట్ లుక్ రిలీజ్

నేషనల్ క్రష్ రష్మిక మందన్న ప్రధాన పాత్రలో చేస్తున్న హర్రర్ సినిమా మైసా. అన్‌ఫార్ములా ఫిలమ్స్ నిర్మిస్తున్న ఈ హీరోయిన్ ఓరియెంటెడ్ సినిమా ద్వారా సక్సెస్ ఫుల్ డైరెక్టర్ హను రాఘవపూడి శిష్యుడు రవీంద్ర పుల్లె డైరెక్టర్‌గా పరిచయం అవుతున్నారు. అజయ్, అనిల్ సయ్యపు రెడ్డి ఈ చిత్రాన్ని పాన్ ఇండియా స్థాయిలో హై బడ్జెట్‌తో నిర్మించనున్నారు. సాయి గోపా సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. రష్మిక మందన్న కొలిగ్స్ సినిమా టైటిల్, ఫస్ట్ లుక్‌ను రిలీజ్ చేశారు. దర్శకుడు హను రాఘవపూడి తెలుగు లుక్, పోస్టర్‌ను లాంచ్ చేశారు. 'కుబేర' కో యాక్టర్ ధనుష్ తమిళ్ పోస్టర్, 'చావా' కో యాక్టర్ విక్కీ కౌశల్ హిందీ పోస్టర్‌ను విడుదల చేశారు. దుల్కర్ సల్మాన్ మలయాళ పోస్టర్‌ను, శివరాజ్ కుమార్ కన్నడ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ చిత్రానికి 'మైసా' అనే పవర్ ఫుల్ టైటిల్‌ను ఖరారు చేశారు. ఈ పోస్టర్ 'ఇంతకు ముందు ఎప్పుడూ చూడనిది' అనే పదానికి నిర్వచనంలా వుంది. రష్మిక ఇంటెన్స్ లుక్ కట్టిపడేసింది. సాంప్రదాయ చీరలో, ముక్కుపుడక, ఆభరణాలతో రష్మిక ఆదివాసీ మహిళగా కనిపించారు. ఆమె ఇంటెన్స్ లుక్, రక్తపు మరకలున్న రూపం, ఆమె చేతిలో గట్టిగా పట్టుకున్న వెపన్ అన్నీ ఒక పవర్ ఫుల్ పాత్రను తెలియజేస్తున్నాయి. టైటిల్, ఫస్ట్ లుక్ అందరిలోనూ ఆసక్తిని రేపాయి. 'మైసా అనేది రెండు సంవత్సరాల కష్టం ఫలితం. కథ, ప్రపంచం, కళా దృక్పథం, పాత్రలు – ప్రతీ అంశాన్ని అద్భుతంగా తీర్చిదిద్దాం. ఇప్పుడు ఈ కథను ప్రపంచానికి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నాం' అని దర్శకుడు రవీంద్ర పుల్లె తెలిపారు. ఈ సినిమా ఆదివాసీ తెగల ప్రపంచాన్ని ఆధారంగా చేసుకుని రూపొందిన అద్భుతమైన ఎమోషనల్ యాక్షన్ థ్రిల్లర్‌గా వుండబోతోందని దర్శకుడు చెప్పారు. 'ఓర్పు ఆమె ఆయుధం. ఆమె గర్జన వినిపించేందుకు కాదు.. భయపడించేందుకు! రష్మిక మందన్నను మైసా పాత్రలో చూడండి, ఆమె అవాతర్ ఇదే' అని నిర్మాణ సంస్థ సోషల్ మీడియా వేదికగా పోస్ట్ చేసింది.




## కల్కికి ఏడాది

ప్రభాస్, అమితా బచ్చన్, కమల్ హాసన్, దీపికా పదుకోన్ ప్రధాన పాత్రలో నాగ్ అశ్విన్ దర్శకత్వంలో తెరకెక్కిన సినిమా కల్కి2898ఏడీ. పాన్ ఇండియాగా తెరకెక్కిన ఈ సినిమా పాన్ వరల్డ్ కలెక్షన్లను సొంతం చేసుకుంది. ప్రముఖ నిర్మాత సి. అశ్విని దత్ నిర్మించిన ఈ సినిమా 27 జూన్ 2024లో థియేటర్లలో విడుదలైంది. ఇటీవల ఈ సినిమా దర్శకుడు నాగ్ అశ్విన్‌కు తెలంగాణ గద్దర్ ఫిలిం అవార్డుతో ఉత్తమ దర్శకుడి అవార్డు లభించింది. కల్కి సినిమా పార్ట్ 2 ఇంకా రావలసి ఉంది. కల్కి సినిమా విడుదలై ఏడాది అవుతున్న సందర్భంగా కల్కి సినిమా పోస్టర్ సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. సినిమాకు సంబధించిన పలువురు కల్కి ఏడాది అయిన సందర్భంగా ఈ పోస్టర్ ను తమ సోషల్ మీడియాలో షేర్ చేశారు.

## జూలై 4న ఫీనిక్స్



మక్కల్ సెల్వన్ విజయ్ సేతుపతి కుమారుడు సూర్య సేతుపతి హీరోగా పరిచయమవుతున్న చిత్రం 'ఫీనిక్స్'. ఏకే బ్రేవ్ మ్యాన్ పిక్చర్స్ ఈ సినిమాని సమర్పిస్తోంది. జూలై 4న ఈ చిత్రం థియేటర్ లో విడుదల కానుంది. ప్రముఖ స్టంట్ మాస్టర్ అనల్ అరసు దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రం యాక్షన్‌తో పాటు భావోద్వేగాలను మిళితం చేస్తూ, కొత్త హీరోకి సరైన లాంచింగ్ మూవీగా తెరక్కించారు. .ఈ సినిమాకి సామ్ సిఎస్ సంగీతాన్ని అందిస్తుండగా, వెల్‌రాజ్ సినిమాటోగ్రఫీ, ప్రవీణ్ కెఎల్ ఎడిటర్ అందిస్తున్నారు.ఇది సూర్య సేతుపతి పూర్తి స్థాయిలో హీరోగా నటిస్తున్న తొలి చిత్రం కాగా, గతంలో నానుమ్ రౌడీ ధాన్, సింధుబాద్ వంటి చిత్రాల్లో సూర్య సేతుపతి చిన్న చిన్న పాత్రల్లో కనిపించాడు. ఫీనిక్స్‌తో పూర్తి స్థాయి హీరోగా పరిచయం అవుతున్నారు. ఈ సినిమాలోని ఇంధ వంగికో, పాటను విడుదల చేశారు.




## 'లవ్ జాతర' ఫస్ట్ లుక్

అంకిత్ కొయ్య, మానస చౌదరి హీరో హీరోయిన్లుగా యూజీ క్రియేషన్స్ బ్యానర్ లో 'సమ్మతమే' ఫేమ్ డైరెక్టర్ గోపీనాథ్ రెడ్డి రూపొందిస్తున్న చిత్రానికి 'లవ్ జాతర' టైటిల్ ఖరారు చేశారు. ప్రొడ్యూసర్ కంకణాల ప్రవీణ నిర్మిస్తున్న ఈ చిత్ర టైటిల్ అనౌన్స్ మెంట్ తో పాటు ఫస్ట్ లుక్ పోస్టర్‌ను రిలీజ్ చేశారు. ఫస్ట్ లుక్ పోస్టర్ చూస్తుంటే టైటిల్‌కు తగినట్లే పూర్తిగా లవ్ ఎంటర్ టైనర్‌గా 'లవ్ జాతర' సినిమాను తెరకెక్కిస్తున్నారు. ఈ చిత్రానికి చేతన్ భరద్వాజ్ సంగీతం అందిస్తుండగా, సుజాత సిద్ధార్థ్ డీవోపీగా వ్యవహరిస్తున్నారు. 'లవ్ జాతర'కు సంబంధించిన మరిన్ని అప్డేట్స్ త్వరలోనే తెలియజేస్తామని నీరంతా ప్రవీణ్ అన్నారు.

## 'కిల్లర్'గా ఎస్‌జె సూర్య

మల్టీ టాలెంటెడ్ యాక్టర్ ఎస్‌జె సూర్య పది ఏళ్ల విరామం తర్వాత మళ్లీ దర్శకునిగా రీఎంట్రీ ఇవ్వడానికి సిద్ధమయ్యారు. ఆయన దర్శకత్వంలో రూపొందుతున్న భారీ పాన్ ఇండియా చిత్రానికి 'కిల్లర్'గా టైటిల్ నిర్ణయించారు. ఈ ప్రతిష్టాత్మక చిత్రంలో ఎస్‌జె సూర్య హీరోగానే కాకుండా, కథ, స్క్రీన్‌ప్లే, డైలాగ్స్ కూడా తానే సమకూరుస్తున్నారు. ఈ చిత్రం ప్రముఖ నిర్మాణ సంస్థ శ్రీ గొకులం మూవీస్ అధినేత గోకులం గోపాలన్ నేతృత్వంలో ఎస్‌జె సూర్యా సొంత నిర్మాణ సంస్థ ఏంజెల్ స్టూడియోస్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. తెలుగు, మలయాళ, కన్నడ తదితర భాషలలో విజయవంతమైన చిత్రాలను నిర్మించిన గొకులం మూవీస్, ఈ సినిమాతో తమిళ సినీ రంగంలో కూడా తన సత్త చాటనున్నారు. ఈ చిత్రానికి సహ నిర్మాతలు వి.సి. ప్రవీణ్, బైజు గోపాలన్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్‌గా కృష్ణమూర్తి వ్యవహరిస్తున్నారు. అజిత్ తో 'వాలి', పవన్ కళ్యాణ్ తో 'ఖుషీ', 'న్యూ' వంటి క్లాసిక్ హిట్ చిత్రాలకు దర్శకత్వం వహించిన ఎస్‌జె సూర్య, ఈ సినిమా భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. ఈ చిత్రం ఐదు భాషలలో విడుదల కానుంది. .'కిల్లర్ ద్వారా దేశవ్యాప్తంగా ప్రేక్షకుల్ని ఆకట్టుకునే స్థాయి సినిమా ఇవ్వాలనే సంకల్పంతో ముందుకు వెళ్తున్నాం. దేశవ్యాప్తంగా ప్రతిభ గల నటులు, సాంకేతిక నిపుణుల భాగస్వామ్యంతో ప్రేక్షకుల హృదయాల్లో నిలిచిపోయే చిత్రంగా రూపొందించబోతున్నాం' అని గోకులన్ గోపాలన్ తెలిపారు. త్వరలోనే ఈ చిత్ర తారాగణం, సాంకేతిక బృందం కథా నేపథ్యం వంటి మరిన్ని ఆసక్తికరమైన విషయాలు వెల్లడించనున్నారు.



## సోషియోఫాంటసీగా 'దీర్ఘాయుష్మాన్ భవ'



ప్రేమకథా చిత్రాలకు భిన్నంగా సోషియో ఫాంటసీ ప్రేమకథతో తెరకెక్కిస్తున్న సినిమా 'దీర్ఘాయుష్మాన్ భవ'. కార్తీక్‌రాజు, మిస్తి చక్రవర్తి హీరో హీరోయిన్లు. ఎం.పూర్ణానంద్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రం త్రిపుర క్రియేషన్స్ పతాకంపై వంకాయలపాటి మురళీకృష్ణ నిర్మించారు. సెన్సార్ కార్యక్రమాలను సైతం పూర్తి చేసుకున్న ఈ చిత్రాన్ని జులై 11న విడుదల చేయబోతున్నట్లు నిర్మాత వంకాయలపాటి మురళీకృష్ణ తెలిపారు. చక్కటి ఫ్యామిలీ కథాశంతో రెండున్నర గంటలపాటు వినోద భరితంగా ఈ సినేమా నిర్మించామన్నారు. సోషియో ఫాంటసీ కావడంతో గ్రాఫిక్స్ కు ప్రాధాన్యం ఇచ్చాం. ఏ పాటకు ఆ పాట ఆహ్లాదభరితంగా ఉంటుందని అన్నారు. యూత్ తో పాటు అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకునేలా రూపొందించామని చెప్పారు.

## 'ఉప్పు కప్పురంబు' మ్యూజిక్ ఆల్బమ్ విడుదల

భారత దేశంలో ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫామ్ అయిన ప్రైమ్ వీడియో, తాజా తెలుగు ఒరిజినల్ సినిమా 'ఉప్పు కప్పురంబు' సినిమా మ్యూజిక్ ఆల్బమ్‌ను మార్కెట్ లో విడుదల చేసింది. బిలీవ్ ఇండియా లేబుల్ ద్వారా విడుదలైన ఈ ఆల్బమ్‌లో మూడు ప్రత్యేకమైన పాటలు ఉన్నాయి. ఈ పాటలు చిత్రంలో చూపించే చిన్న పట్టణ జీవితం, హాస్యం, భావోద్వేగాలు అన్నింటినీ మనస్సుకు హత్తుకునేలా ఆలపించారు. ఈ చిత్రానికి స్వీకార్ అగస్తి సంగీతం అందించగా, రవికృష్ణ విస్సాప్రగడ, ఎస్. అత్తావుర్ రహీం, రఘురాం ద్రోణావజ్జల పాటలు రాశారు. సీన్ రోల్డన్, అనురాగ్ కులకర్ణి, ఆంటోని దాసన్, గానంతో పాటలు ఇంకా హృద్యంగా మారాయి.ఒకవైపు నోమిలాలా అనే పాట ఉత్సవాన్ని పాడుతుంటే, యాడున్నావో అనే పాట ఒక తల్లి, బిడ్డ మధ్య సెంటిమెంట్ ను తెలియజేస్తుంది.




# పాత ఫోన్‌లను ఎవరికైనా ఇస్తున్నారా జాగ్రత్త!

### రీసైకిల్ ఫోన్‌లు.. రీసైకిల్ నేరాలు..!

**ప్రజాపక్షం/హైదరాబాద్:** పాత ఫోన్‌లతో సైబర్ నేరాగాళ్లు మాయాజాలం ప్రదర్శిస్తున్నారు. పాత మొబైల్‌లు, పలు కారణాల చేత ఫెయిలైన పరికరాలను నిందితులు సైబర్ నేరాలాకు ఆయుధాలుగా ఉపయోగిస్తున్నారు. పాత యజమానుల డేటాను వాడి బ్యాంకు ఖాతాలు ఖాళీ చేయడమే కాకుండా, వ్యక్తిగత సమాచారం బ్లాక్‌మెయిల్‌కు కూడా వారు ఉపయోగిస్తున్నారు. కొన్ని వందల రూపాయలకే సొంతమవుతున్న ఈ పరికరాల్లో పాత డేటా డిలీట్ కాకపోవడం వల్ల కీలక సమాచారాన్ని నేరగాళ్లు సులభంగా బయటకు లాగేస్తున్నారు. వాటితో బ్యాంకింగ్ మోసాలు, మౌలిక డాక్యుమెంట్ల ఫేకింగ్, ఫోన్ నంబర్ల దుర్వినియోగం జరుగుతోంది. ఆన్‌లైన్‌లో అమ్ముతున్న పాత ఫోన్లు ఇప్పుడు సైబర్ నేరగాళ్లకు పక్కా పరికరాలుగా మారుతున్నాయి. ఆదిలాబాద్‌లో తాజాగా వెలుగులోకి వచ్చిన కేసుల్లో, చౌరస్తాల్లో అమ్ముతున్న సెల్ ఫోన్లను ఉపయోగించి ఓ నేరగాడు ఏకంగా పది మందికి పైగా బ్యాంకు ఖాతాల నుండి డబ్బు మాయం చేశాడు.ఆదిలాబాద్‌లో ఇటీవల పోలీసులకు పట్టుబడ్డ ఈ కేసులో, బీహార్ రాష్ట్రానికి చెందిన ఇంటర్‌స్టేట్ సైబర్ నేరగాళ్ల గ్యాంగ్ గుట్టురట్టయ్యింది.. ఈ గ్యాంగ్ ఉద్దేశపూర్వకంగా పాత సెల్‌ఫోన్లను, సిమ్ కార్డులు, బ్యాటరీలను సేకరించి క్రిమినల్ కార్యకలాపాలకు ఉపయోగించిందని పోలీసుల విచారణలో తేలింది. ఆదిలాబాద్ టూటౌన్ పోలీస్ స్టేషన్ వెలుగు చూసిన ఈ కేసులో బీహార్‌కు చెందిన ఐదుగురిని అరెస్టు చేయగా గ్యాంగ్ నేత తబారక్ ఇంకా పరారీలో ఉన్నారు. ఈ కేసులో నిందితుల నుంచి 2,125 పాత సెల్ ఫోన్‌లు, 107 సిమ్ కార్డులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. తమిళనాడు, కర్ణాటకలో కూడా ఇలాంటి మోసాలకు పాల్పడిన ఉదంతాలు కూడా వెలుగు చూ శాయి. ఇక్కడ సుమారు పది వేల ఫోన్‌లను పోలీసులు సీజ్ చేశారు. పాడైపోయిన మన పాత ఫోన్‌లను ఎవరికి విక్రయించవద్దని పోలీసులు విజ్ఞప్తి చేస్తున్నారు.

### గ్యాంగ్ పని విధానం

నిందితులు పథకం ప్రకారం గ్రామాలలో బైక్‌లపై తిరుగుతూ..పాడైన, పగిలిపోయిన సెల్‌ఫోన్‌లను తీసుకుంటామని చెబుతారు. వాటి స్థానంలో డబ్బయిన, స్టీల్ సామానులైన ఇస్తామంటారు. ఇలా బైక్‌లతో గ్రామాల నుండి సేకరించిన పాత ఫోన్‌లకు స్థానిక ప్రజలకు ప్లాస్టిక్ బాక్స్‌లు లేదా చిన్న వస్తువులుగా బదిలీ చేశారు. సేకరించిన టిఒడిఒఎస్ ఫోన్‌లు బీహార్‌కి పంపి, అక్కడి నుంచే స్కామ్ కాల్స్ చేస్తున్నారు.

### ప్రజల కోసం హెచ్చరికలు

**టిజిసిఎస్‌బి డైరెక్టర్ శిఖాగోయల్**



- స్పష్టంగా తెలియని వ్యక్తులకు పాత ఫోన్లు సిమ్ ఇవ్వవద్దు.
- ఎవరైనా బ్యాంక్ అధికారులమని ఫోన్ చేస్తే అప్రమత్తంగా ఉండండి.
- ఒటిపి కోడ్స్ దయ చేసి బయట ఇవ్వవద్దు.. ఎప్పుడైతే వాస్తవంగా అవసరం ఉంటేనే చేయండి.
- మీరు బాధితులైతే వెంటనే 1930 (నేషనల్ సైబర్ హెల్ప్‌లైన్) లేదా స్థానిక పోలీస్ స్టేషన్‌ను సంప్రదించండి.. డబ్బులు కొంత మేరకు తిరిగి పొందడానికి సహాయం పొందవచ్చు.
- పాత ఫోన్లు అమ్మేముందు పూర్తి డేటా డిలీట్ చేయండి ఫ్యాక్టరీ రీసెట్ చేయడం మర్చిపోవద్దు.

# నెల రోజుల పాటు 'ఆపరేషన్ ముస్కాన్'

### పోస్టర్ ఆవిష్కరించిన సిఐడి ఎడిజి చారుసిన్హా



**ప్రజాపక్షం/హైదరాబాద్:** తప్పిపోయిన, అనాథలైన, అక్రమ రవాణా చేయబడుతున్న పిల్లలను గుర్తించి, రక్షించి, వారికి పునరావాసం కల్పించడమే లక్ష్యంగా భారత ప్రభుత్వ హోం మంత్రిత్వ శాఖ చేపట్టిన నెలరోజుల జాతీయ కార్యక్రమమైన ఆపరేషన్ ముస్కాన్11 తెలంగాణ రాష్ట్రంలో జూలై 1 నుండి జూలై 31, 2025 వరకు నిర్వహించనున్నామని సిఐడి అదనపు డిజి చారుసిన్హా తెలిపారు. ఈ మేరకు 'ఆపరేషన్ ముస్కాన్' పోస్టర్‌ను శుక్రవారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ ఆపరేషన్‌కు మహిళా భద్రతా విభాగం అదనపు డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ చారు సిన్హా, నేతృత్వం వహిస్తూ నోడల్ ఏజెన్సీగా వ్యవహరిస్తోంది. ఈ కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా సమర్థవంతంగా అమలు చేయడానికి 706 మంది పోలీసు సిబ్బందితో కూడిన 121 సబ్‌డివిజనల్ పోలీసు బృందాలను ఏర్పాటు చేమని చారుసిన్హా తెలిపారు. ఈ బృందాలు మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ, కార్మిక శాఖ, ఆరోగ్య శాఖ, జిల్లా శిశు సంరక్షణ యూ నిట్లు, శిశు సంక్షేమ కమిటీలు, వివిధ స్వచ్ఛంద సంస్థలతో సమన్వయంతో పని చేస్తాయని తెలిపారు. సరైన కార్యాచరణ, సమన్వయం కోసం చారు సిన్హా అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో తెలంగాణ రాష్ట్ర బాలల హక్కుల రక్షణ కమిషన్, తెలంగాణ న్యాయ సేవాధికారం, కార్మిక శాఖ, విద్యా శాఖ, ప్రజారోగ్యం కుటుంబ సంక్షేమ శాఖ, బాలల గృహాలు, సెల్, బాలల రక్షణ నిపుణులు, అంతర్జాతీయ జస్టిస్ మిషన్, దివ్య దిశ, మై ఛాయిసెస్ ఫౌండేషన్, స్పెషల్ జువెనైల్ పోలీస్ యూనిట్లు మానవ అక్రమ రవాణా నిరోధక బృందాలు, సబ్‌డివిజనల్ ముస్కాన్ బృందాల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఈ సమావేశంలో బాల కార్మికులు, బాల భిక్షాటన వంటి సమస్యలపై చర్చించారు. బాలల రక్షణ మరియు పునరావాసానికి సంబంధించి ఇంటర్‌ఏజెన్సీ సమన్వయం, రెస్క్యూ ప్రోటోకాల్‌లు, చట్టపరమైన పునరావాస ప్రక్రియలు, డేటా నిర్వహణ తదితర అంశాలను పరిశీలించారు.

# మొబైల్ ఫోన్ యాప్ ద్వారా ఓటింగ్..

**పాట్నా:** మొబైల్ ఫోన్ యాప్ ద్వారా ప్రజలు తొలిసారి ఓటు వేయనున్నారు. ఈ విధానానికి అనుమతి ఇచ్చిన తొలి రాష్ట్రంగా బిహార్ నిలిచింది. ఆ రాష్ట్ర ఎన్నికల కమిషనర్ దీపక్ ప్రసాద్ ఈ విషయాన్ని శుక్రవారం తెలిపారు. మూడు జిల్లాల్లోని ఆరు మున్సిపల్ కౌన్సిల్ పదవులకు శనివారం పోలింగ్ జరుగనున్నది. పోలింగ్ బూత్‌కు వెళ్లలేని వారికి ఈ కొత్త ఓటింగ్ సౌకర్యం అందుబాటులో ఉంటుందని దీపక్ ప్రసాద్ చెప్పారు. ఫోన్‌లో ఇన్‌స్టాల్ చేసిన యాప్ ద్వారా ఓటు వేయవచ్చన్నారు. వృద్ధులు, వికలాంగులు, గర్భిణీలు, వలస ఓటర్లు, శారీరక లేదా ఇతర కారణాల వల్ల పోలింగ్ కేంద్రానికి చేరుకోలేని వారు ఈ సౌకర్యాన్ని వినియోగించుకుని ఓటు వేయవచ్చని వివరించారు. మొబైల్ ఫోన్ యాప్ ద్వారా ఓటింగ్ గురించి జూన్ 10 నుంచి 22 వరకు అవగాహన ప్రచారం నిర్వహించినట్లు వెల్లడించారు. కాగా, ఈఓటింగ్ కోసం నమోదు చేసుకోవాలనుకునే ఓటర్లు తమ మొబైల్‌లో eSECBHR యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ దీపక్ ప్రసాద్ తెలిపారు. ఈ యాప్ ప్రస్తుతం ఆండ్రాయిడ్ ఫోన్‌లకు మాత్రమే అనుకూలంగా ఉంటుందని చెప్పారు. ఓటర్ల జాబితాలో ఇప్పటికే పేరు నమోదు చేసుకున్న ఫోన్ నంబర్‌కు ఈ యాప్‌ను లింక్ చేయాలని అన్నారు.

# ఎప్పుడూ అంగీకరించలేదు

(మొదటి పేజీ తరువాయి)

ప్రధాన కార్యదర్శి జైరాం రమేష్ మాట్లాడుతూ ఆర్ఎస్ఎస్ భారత రాజ్యాంగాన్ని ఎప్పుడూ అంగీకరించలేదన్నారు. నవంబర్ 30, 1949 నుండి రాజ్యాంగ రూపకల్పనలో పాల్గొన్న డాక్టర్ అంబేద్కర్, నెహ్రూ, ఇతరులపై దాడి ఆర్ఎస్ఎస్ చేసిందన్నారు. రాజ్యాంగం మనుస్మృతి నుండి ప్రేరణ పొందలేదని ఆర్ఎస్ఎస్ వాఖ్యానించిందని జైరామ్ ఎక్స్‌లో పోస్ట్‌లో చేశారు. ఆర్ఎస్ఎస్, బిజెపి పదే పదే కొత్త రాజ్యాంగం కోసం పిలుపునిచ్చాయని దుయ్యబట్టారు. ఇది 2024 లోక్‌సభ ఎన్నికల సమయంలో మిస్టర్ (నరేంద్ర) మోడీ ప్రచార నినాదం కూడా అని అన్నారు. భారత ప్రజలు ఈ నినాదాన్ని నిర్ణయాత్మకంగా తిరస్కరించారని గుర్తుచేశారు. అయినప్పటికీ రాజ్యాంగం ప్రాథమిక నిర్మాణాన్ని మార్చాలనే డిమాండ్లను ఆర్ఎస్ఎస్ పర్యావరణ వ్యవస్థ చేస్తూనే ఉందని రమేష్ పేర్కొన్నారు. ప్రముఖ ఆర్ఎస్ఎస్ కార్యకర్త లేవనెత్తిన అంశంపై భారత ప్రధాన న్యాయమూర్తి నవంబర్ 25, 2024న స్వయంగా తీర్పు ఇచ్చారని ఆయన అన్నారు. దీనిని చదవడానికి ఇబ్బంది పడమని ఆయనను అభ్యర్థించడం చాలా కష్టమవుతుందా? రమేష్ అన్నారు. ఆ తీర్పు కాపీని కూడా ఎక్స్‌ల పంచుకున్నారు. ఆర్ఎస్ఎస్, బిజెపి భావజాలం భారత రాజ్యాంగానికి ప్రత్యక్ష వ్యతిరేకం అని కాంగ్రెస్ ఆరోపించింది.

'సోషలిస్ట్, లౌకిక అనే పదాలను ప్రవేశిక నుండి తొలగించాలని ఆర్ఎస్ఎస్ ప్రధాన కార్యదర్శి దత్తాత్రేయ హోసబాలే బహిరంగంగా పిలుపునిచ్చారు. ఇది కేవలం సూచన కాదు, ఇది మన రాజ్యాంగం ఆత్మపై ఉద్దేశపూర్వకంగా దాడి చేయడం' అని కాంగ్రెస్ పేర్కొంది. రాజ్యాంగాన్ని బలహీనపరిచే ఏ ప్రయత్నానికైనా కాంగ్రెస్ అడ్డు గోడగా నిలుస్తుంది, జై సంవిధాన్ అని పార్టీ పేర్కొంది.

### ఆర్ఎస్ఎస్‌పై లాలూ ప్రసాద్ విమర్శలు

రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్)పై ఆర్‌జెడి అధ్యక్షుడు లాలూ ప్రసాద్ యాదవ్ విమర్శించారు. సామాజిక న్యాయం, మత సామరస్యం తనకు మార్గదర్శక సూత్రాలని చెప్పే బిహార్ మాజీ ముఖ్యమంత్రి లాలూ ఆర్ఎస్ఎస్‌ను కులతత్వ సంస్థగా అభివర్ణిస్తూ ఎక్స్‌లో తన బాధను వ్యక్తం చేశారు. అత్యవసర పరిస్థితి సమయంలో ఇందిరా గాంధీ ప్రభుత్వం 'సోషలిస్టు, లౌకిక' పదాలను ప్రవేశికలో చేర్చినందున, ఆర్ఎస్ఎస్ 'సర్కార్యవా' హోసబాలే ఈ రెండు పదాలను తొలగించాలని సూచించిన వార్తల క్లిప్పింగ్‌ను ఆయన సామాజిక మాధ్యమంలో పంచుకున్నారు. దీనిపై లాలూ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తూ 'దేశంలోని అత్యంత కులతత్వ, ద్వేషపూరిత సంస్థ ఆర్ఎస్ఎస్ రాజ్యాంగాన్ని మార్చాలని పిలుపునిచ్చింది' అని ఆరోపించారు. బిజెపి, ఆర్ఎస్ఎస్‌కు రాజ్యాంగం, అందులో పేర్కొన్న రిజర్వేషన్లపై దృష్టి పెట్టే ధైర్యం లేదని మండిపడ్డారు.

# ఇప్పట్లో ఉండవు

(మొదటి పేజీ తరువాయి)

ప్రకారం ఇరాన్ తన అణు అభివృద్ధి కార్యకలాపాలను పరిమితం చేయాలి. యురేనియం శుద్ధి స్థాయిని తగ్గించాలి. అంతర్జాతీయ అణు శక్తి సంస్థ (ఐఎఇఎ) తన యంత్రాంగాన్ని తనిఖీలకు అనుమతించాలి. అందుకు ప్రతిగా ఇరాన్‌పై విధించిన ఆంక్షలను అమెరికా, ఐరోపా దేశాలు తొలగించాయి. ఇరాన్ ఆర్థికంగా ఊపిరి పీల్చుకోగలిగింది. అయితే, డొనాల్డ్ ట్రంప్ 2018లో తొలిసారి అమెరికా అధ్యక్షుడిగా ఎన్నికైనప్పుడు జెసిపిఒఎ నుంచి వైదొలిగారు. 'అత్యధిక ఒత్తిడి' పదేరుతో ఇరాన్‌పై మళ్లీ కఠినమైన ఆర్థిక ఆంక్షలు విధించారు. ట్రంప్ తీసుకున్న ఈ నిర్ణయాలతో జెసిపిఒఎకి విలువలేకుండాపోయింది. ఇప్పుడు మరోసారి చర్చల పేరుతో ట్రంప్ హడావుడి చేస్తుండగా, అమెరికా వైకరిని ఇరాన్ నమ్మడం లేదు. అమెరికా ఒప్పందం నుంచి వెనక్కి తగ్గిన విధానం ద్వారా అగ్రరాజ్యంపై ఇరాన్ పెట్టుకున్న నమ్మకానికి పెద్ద దెబ్బ తగిలిందనేది వాస్తవం. అందుకే, ఇప్పుడు ఏదైనా కొత్త ఒప్పందంపై ఇరాన్ అప్రమత్తంగా ఉంది. అణు చర్చలు ఇప్పట్లో జరగవని స్పష్టం చేయడం వెనుక బలమైన కారణం ఉంది. అమెరికా విశ్వసనీయతను కోల్పోయింది. ఏకపక్ష నిర్ణయాలతో ఒప్పందాలను నిర్లక్ష్యం చేస్తున్నది. అణ్వాయుధాల తయారీ జరుగుతున్నదని ఆరోపిస్తూ, ఇరాన్‌పై ఇజ్రాయెల్ చేసిన దాడులకు మద్దతనివ్వడం, స్వయంగా అమెరికా యుద్ధ విమానాలు ఇరాన్‌పై బాంబుల వర్షం కురిపించడం వంటి చర్యలు ఇరాన్ సహా అనేక దేశాలను అప్రమత్తం చేశాయి. ఇజ్రాయెల్ దాడులు, ఆ వెంటనే అమెరికా బాంబుల వర్షం వంటి పరిణామాలు ఎంత హఠాత్తుగా చోటు చేసుకున్నాయో, అంతే హఠాత్తుగా ట్రంప్ శాంతి మంత్రం జరిపించడం ప్రారంభించారు. ఇరాన్‌తో అణు చర్చలు తిరిగి ప్రారంభమవుతాయని ప్రకటించారు. దీనికి ఇరాన్ దీటుగానే స్పందించింది. ఇజ్రాయెల్‌తో జరిగిన యుద్ధంలో తమనే విజయమని ప్రకటించిన ఇరాన్ సుప్రీం లీడర్ అయొతుల్లా ఖమేనీ, అమెరికాపైన కూడా విమర్శలు కురిపించారు. అమెరికాకు చెంపెట్టు సమాధానం ఇచ్చామని వ్యాఖ్యానించారు. ట్రంప్ ఆర్భాటంగా చేస్తున్న ప్రకటనలు వాస్తవ రూపం దాల్చే అవకాశాలు ఇప్పట్లో లేవని ఇరాన్ మంత్రి అబ్బాస్ చేసిన ప్రకటన స్పష్టం చేస్తున్నది.

# రూ.59,884 కోట్లు

(మొదటి పేజీ తరువాయి)

పెరగగా ఇది 2023–24లో రూ.20,339 కోట్లకు, 2024–25లో రూ.20,569 కోట్లకు గణనీయంగా వృద్ధి చెందిందని అన్నారు. అలాగే సరుకు రవాణా లోడింగ్, 2022–23లో 131.8 మిలియన్ టన్నులు, 2023–24లో 141.1 మిలియన్ టన్నులు, 2024–25లో 144.1 మిలియన్ టన్నుల గరిష్ట స్థాయికి చేరుకుని నూతన రికార్డులు సృష్టించదని అన్నారు.

### 960 కి.మీ ట్రాక్‌ను జోడించాం..

ఇక తాను పదవి బాధ్యతలు చేపట్టిన ఈ మూడేళ్ల కాలంలో కొత్త లైన్లు, డబ్లింగ్, ట్రిప్లింగ్ మొదలైన వాటి రూపంలో మొత్తం 960 కిలోమీటర్ల ట్రాక్‌ను జోడించడం ద్వారా జోన్ నెట్‌వర్క్ విస్తరణలో గణనీయమైన పురోగతిని సాధించిందన్నారు. ఇంజనీరింగ్ రంగంలో, దక్షిణ మధ్య రైల్వే దాని అత్యంత ముఖ్యమైన ప్రాజెక్టులలో కొన్నింటిని అమలు చేసింది. వీటిలో గూడూరు సమీపంలో జోన్ యొక్క పొడవైన 2.2 కిలోమీటర్ల రైలు ఫ్లైఓవర్ నిర్మాణం మరియు కాజీ పేట బైపాస్ ప్రాజెక్ట్‌లో భాగంగా కాజీపేట సమీపంలో దాని మొట్టమొదటి రైలు అండర్‌రైలు నిర్మాణాన్ని ప్రారంభించడం జరిగింది. మూలధన వ్యయం కూడా మూడు సంవత్సరాలలో మొత్తం రూ.47,050 కోట్ల రికార్డు స్థాయికి చేరుకుంది.

### రూ.6,500 కోట్లతో 119 స్టేషన్ల పునరాభివృద్ధి

దక్షిణ మధ్య రైల్వే జోన్ వ్యాప్తంగా అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద రూ.6,500 కోట్ల అంచనా వ్యయంతో 119 స్టేషన్లను సమగ్ర పునరాభివృద్ధి కోసం గుర్తించింది. ఈ పరివర్తన చొరవలో భాగంగా సికింద్రాబాద్, తిరుపతి, నెల్లూరు, హైదరాబాద్, విజయవాడ, కాచిగూడ, నాందేడ ఔరంగాబాద్ మరియు జల్నా వంటి ప్రముఖ స్టేషన్లలో పునరాభివృద్ధి పనులు పురోగతిలోఉన్నాయన్నారు. బేగంపేట, కరీంనగర్ మరియు వరంగల్ వంటి మూడు అమృత్ స్టేషన్లు ఇప్పటికే పునరాభివృద్ధి చేయబడి ప్రారంభించబడ్డాయి. ఈ స్టేషన్లు అత్యాధునిక ప్రయాణీకుల సౌకర్యాలు మరియు మెరుగైన వసతులు అందిస్తున్నాయి. సరుకు రవాణా మరియు మల్టీమోడల్ లాజిస్టిక్స్ సామర్థ్యాలను మరింత మెరుగుపరిచే పదమూడు గతి శక్తి కార్గో టెర్మినల్స్ ప్రారంభించబడ్డాయన్నారు. మూడేళ్లలో 396 ఎలక్ట్రిక్ లోకోమోటివ్‌లను ప్రారంభించడంతో దక్షిణ మధ్య రైల్వే దేశంలో రెండవ అతిపెద్ద ఎలక్ట్రిక్ లోకోలు గల జోన్‌గా నిలిచిందన్నారు. భద్రతను మెరుగు పరిచే దిశగా , జోన్‌లో 234 మానవసహిత లెవల్ క్రాసింగ్‌లను తొలగించి, 32 రోడ్ ఓవర్ బ్రిడ్జిలు, 204 రోడ్ అండర్ బ్రిడ్జిలను నిర్మించామన్నారు. వేగాన్ని గంటకు 130 కిలోమీటర్లకి పెంచామని సిగ్నలింగ్ వ్యవస్థల ఆధునీకరణ మరొక ప్రధాన అంశం. ఈ రంగంలో 289 రూట్ కిలోమీటర్లను ఆటోమేటిక్ బ్లాక్ సిగ్నలింగ్ కిందకు తీసుకువచ్చామన్నారు. 128 స్టేషన్లలో ఆధునిక ఎలక్ట్రానిక్ ఇంటర్‌లాకింగ్‌ను ప్రారంభించారు. అలాగే గత మూడేళ్లలో 8,800 కోచ్‌లు, 20,000 వ్యాగన్‌ల పి.ఓ.ఎచ్ అవుట్‌టర్న్‌ను సాధించామన్నారు. స్క్రాప్ డిస్పోజల్ ద్వారా వచ్చే ఆదాయం2022–23లో రూ.391 కోట్లు, 2023–24లో రూ.451 కోట్లు, 2024–25లో రూ.501 కోట్లతో స్థిరమైన పెరుగుదలను నమోదుచేశామని తెలిపారు.. ఇది జోన్ ప్రారంభం నుండి ఇప్పటివరకు అత్యధికంగా నమోదైంది.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Plot No 302, Venkata Sai Towers, Nehrunagar, KHAMMAM - 507 002 Telangana State. RNI TELTEL /2018/76759, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com